


మృత్యుకెరటం
మంజరి

**మృత్యు కెరటం**

రచన : మంజరి

సాగర్ ప్రచురణలు, విజయనగరం

మొదటి ముద్రణ : ఎమెస్కో మాసపత్రిక

ధర : **రూ. 80/-**

చిరునామా : **జి. ఎన్. రావ్**
2-102, కామాక్షి నగర్
కంటోన్‌మెంట్
విజయనగరం - 535003
**సెల్ : 9441571994**

# మృత్యు కెరటం

**– మంజరి**

చల్లటి గాలితెర విసురుగా వీచింది.

సాయంకాలం ఐదు గంటలు అయింది సమయం. ఉదయం నుండి తన ప్రతాపం చూపిన సూర్యుడు అస్తమించటానికి ఆయత్తమవుతున్నాడు. వాతావరణంలో మార్పువచ్చి చల్లబడింది.

నెమ్మదిగా కళ్ళు తెరిచాడు చంద్రం. అప్పటివరకూ ఫుట్‌పాత్ మీద పడుకునివున్నాడు. అతనికి పది సంవత్సరాల వయస్సు వుంటుంది. నిక్కరు, షర్టు అతని దుస్తులు. జుట్టు చెదరి దుమ్ముకొట్టుకుపోయింది. మురికిపట్టి శరీరం అసహ్యంగా కనిపిస్తోంది.

వూహ తెలిసిన దగ్గిర నుండి వెంటవున్న తల్లి యిప్పుడు లేదు. నాలుగు రోజుల నుండి తిండి లేదు.

తల్లి శవాన్ని మున్సిపాల్టీవాళ్ళు, గుడిసెలోని సామాను చుట్టుప్రక్కలవాళ్ళు తీసుకుపోయారు. ఇప్పుడు ప్రపంచంలో అతనికి ఎవరూ లేరు. పది రోజుల క్రితం సాఫీగా సాగిపోతున్న జీవితం ఒక్కసారి తారుమారయింది. ప్రస్తుతం అతను ఒక నిర్భాగ్యుడు.

ఆకలితో కడుపు కాలిపోతోంది. ఆకలి వేసినప్పుడు అమ్మను అడిగి తినటం మాత్రమే తెలుసు. ఇప్పుడు తన ఆకలి తనే తీర్చుకోవాలనే విషయం ఆ కుర్రాడికి స్పష్టంగానే బోధపడింది.

నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. ముందు కడుపులోకి ఏదో ఆహారం కావాలనేది నిజం. గత ఆరు గంటల నుండి పడివున్న ప్రదేశాన్ని వదిలిపెట్టి నడిచాడు. దారిలో ఒకచోట కుళాయి కనిపించింది. కడుపునిండా నీళ్ళు త్రాగాడు.

కడుపు నిండినట్టయింది. ఒక రాయిమీద కూర్చుని ఆలోచించటం ప్రారంభించాడు. ముందుగా తల్లి గుర్తుకువచ్చింది. కాసేపు మౌనంగా ఏడ్చాడు. అరగంట తరువాత కళ్ళు తుడుచుకున్నాడు. తను ఏడవకూడదు పెరిగి పెద్దకావాలి. తన తల్లి కళ్ళల్లో కదలాడిన నిస్సహాయతకి సమాధానం చెప్పాలి.

అవును గుణపాఠం నేర్పాలి!

ఆ కుర్రవాడికి ఇప్పుడున్న వూరు గురించి అసలు తెలియదు. ఎటువైపు వెళ్ళాలన్నా అయోమయంగా వుంది. పెద్ద పెద్ద బిల్డింగులు కనిపిస్తున్నాయి. కార్లు బస్సులు బారులుతీరి వెళుతున్నాయి. అది ఖచ్చితంగా తన వూరుకంటే పెద్దదని మాత్రం వూహించాడు.

అతని గురించి ఏమాత్రం తెలియని జనం తమ తమ పనులమీద సాగిపోతున్నారు. దయతో సాటి మనిషి గురించి తెలుసుకునే మనుష్యుల్లేని సంఘజీవితం డబ్బుని చూసి తెచ్చిపెట్టుకున్న అభిమానం ప్రదర్శించే మనుషులతో నిండిన సమాజం బలవంతుడ్ని చూసి లొంగుతారు. దాసోహ మంటారు. ప్రస్తుతం బ్రతకటానికి డబ్బు కావాలి లేదా నలుగుర్ని తన్నగలిగే బలం కావాలి.

ఒక నిర్ణయానికొచ్చి లేచి నడవసాగేడు చంద్రం.

ఒక షాపు ముందు జనం సామాన్లు కొంటున్నారు. ముందుభాగంలో షోకేస్ పైన ఎత్తుగా పేర్చి వున్నాయి బ్రెడ్ పాకెట్స్. ఒక్క క్షణం వాటివైపు చూశాడు. ఎవరి ధోరణిలో వాళ్ళు వున్నారు. ఆ కుర్రవాడిని ఎవరూ పట్టించుకోవటంలేదు.

నెమ్మదిగా చంద్రంలో చిన్న కదలిక ప్రారంభమయింది. తల్లి చెప్పిన హితవచనాలు తండ్రి రక్తంలోని నిజాయితీ ఆ సమయంలో అతడ్ని ఆపలేకపోయాయి. షాపు దగ్గరికి చేరటం ఒక బ్రెడ్ అందుకుని కన్ను మూసి తెరిచేంతలో లేడిలా పరిగెత్తడం జరిగిపోయింది.

కొద్ది సెకన్ల తేడాలో వెంటపడ్డారు జనం!

లేడిలా పరిగెత్తుతున్నాడు చంద్రం. అలా పరుగెత్తాలని మనసులో అనుకున్నాడు కానీ రెండు నిముషాలకి మించి పరిగెత్తలేకపోయాడు. ఆపైన అతని కాళ్ళు సహకరించలేదు. కళ్ళు తిరిగి కాళ్ళు మెలికపడి క్రింద పడిపోయాడు.

నాలుగు రోజుల నుండి తిండి లేదు మరి!

వెంటపడిన గుంపు చంద్రాన్ని సమీపించి చుట్టుముట్టింది.

దేవాలయపు హుండీలో రెండు లక్షల రూపాయల నోట్లకట్ట వెయ్యగలిగిన మనిషి సాటిమనిషికి తిండి పెట్టలేడు. పెడితే రెండు లక్షలు సంపాదించలేడు. ఇది కళ్ళముందు కనిపించే వాస్తవ సమాజం.

◆ ◆ ◆

ఉన్ని కృష్ణన్ కార్డ్స్ పంచి మిగిలిన కార్డ్స్ టేబుల్‌మీద వుంచాడు.

అతను గత పాతిక సంవత్సరాల నుండి ఆ క్లబ్‌లో పేక ఆడుతున్నాడు. అన్ని సంవత్సరాల్లోను మూడుసార్లు తప్ప ఏనాడూ

డబ్బులు పోగొట్టుకోలేదు. ఆ రెండు మూడుసార్లు మనశ్శాంతి లేకపోవడంవల్ల అలా జరిగేది. తను ఎవరికోసం బ్రతకాలనే భావం ఎప్పుడోగాని మనసులో కలగదు. సరిగ్గా అప్పుడే పేకాటలో డబ్బులు పోతాయి. ప్రతిరోజూ డబ్బులు గెలవకపోయినా, పోగొట్టుకోడు. అది అతని ప్రత్యేకత.

చాలామంది పిచ్చిగా పేక ఆడుతారు. గెలుపు ఓటమిలకు లొంగిపోతారు. అతను ఖచ్చితంగా దానికి విరుద్ధం.

ప్రతిదినం సరదాకోసం క్లబ్‌కి వస్తాడు. కాలక్షేపంకోసం మాత్రమే పేకాటలో కూర్చుంటాడు. కూర్చున్న తరువాత మనసంతా ఆటమీద కేంద్రీకరించి వుంచుతాడు. తోటి ఆటగాళ్ళు తీసుకునే కార్డులు పడేసే కార్డులు అతని మస్తిష్కంలో ముద్రించుకుపోతాయి. అన్నిటికంటే ముఖ్యంగా కార్డులు తీసుకోవటం, పడేయటం మధ్య ఆటగాని మొహంలో కదలాడే భావాలు ఉన్ని కృష్ణన్ కళ్ళు పసికట్టేస్తాయి. అది అతనికి వృత్తిపరంగా వచ్చిన అలవాటు. స్పష్టంగా చెప్పాలంటే తన ఆటమీద ఎంత శ్రద్ధ చూపుతాడో మిగతావాళ్ళ ఆటమీద అంతే శ్రద్ధ చూపుతాడు. అందుకే ఎవరివద్ద ఏ కార్డులు వున్నాయో, ఎవరికి షో అయిపోతుందో అతనికి తెలుస్తుంది. ఆమాత్రం ముందుచూపు చాలు పేకాటలో జాగ్రత్తపడటానికి.

వృత్తిపరంగా అతను అక్కడివాళ్ళకి పరిచయం లేదు. కేవలం ఒక క్లబ్ మెంబరుగా మాత్రమే తెలుసు. అతని వృత్తి గురించి అక్కడవాళ్ళకి తెలిసే అవకాశం లేదు, అవసరం లేదు.

ముప్పై ఐదు సంవత్సరాల క్రితం మద్రాసు నుంచి వచ్చి స్థిరపడ్డాడు. అతనికి భార్యా పిల్లలు లేరు. ఇప్పుడు అతనికి యాభై సంవత్సరాలు దాటింది వయసు.

మామూలుగా రాత్రి తొమ్మిది గంటలకి ఆట ముగించి లేచాడు. చివరలో డబ్బులు లెక్క చూసుకున్నాడు. ఆరు రూపాయలు ఎక్కువగా వున్నాయి. సంతోషం విచారం వంటి భావాలు మనసులో తప్ప మొహంలో కనిపించవు. అది అతనికి జీవితం నేర్పిన గొప్ప అలవాటు.

నెమ్మదిగా యింటివైపు నడవడం ప్రారంభించాడు.

అతను ఆరితేరిన దొంగ. ఎన్ని దొంగతనాలు చేసినా ఎప్పుడూ పట్టుబడలేదు. దానికి కారణం అతను తీసుకునే జాగ్రత్తలు. దొంగతనం చెయ్యాల్సిన మనిషిని లేదా యింటిని ఎన్నుకోవటానికి ఎక్కువ సమయం తీసుకుంటాడు. అతను ఎన్నుకునేవాళ్ళు డబ్బు పోయినా గొడవ చెయ్యనివాళ్ళు. తన ఇంటికి దగ్గర వున్న ఒక గుమాస్తా ఇంటిలో రెండుసార్లు దొంగతనం చేసాడు. అయినా అతను పోలీస్ రిపోర్ట్ యివ్వలేదు. ఆ గుమాస్తా నెల సంపాదన జీతానికి పది రెట్లు వుంటుంది. ఒకసారి రిపోర్టు ఇస్తే తీగ కదులుతుందేమోనని భయం.

ఉన్ని కృష్ణన్ డబ్బు సంపాదించాలనే ఆశ లేదు. బ్రతకడంకోసం మాత్రమే అతను దొంగతనం చేస్తాడు. ఒకసారి దొంగతనం చేస్తే మూడు నాలుగు నెలలు గడిచిపోతాయి. ఆ తరువాతే దొంగతనం చెయ్యాలనే ఆలోచన వచ్చేది.

"అమ్మా..." అంటూ వినిపించిందో మూలుగు.

తల తిప్పి చూసాడు. చీకట్లో ఒక ఆకారం లీలగా కదిలినట్లయింది. అటువైపు గబగబా నడిచాడు.

అక్కడ ఒక కుర్రవాడు పడివున్నాడు. ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూసాడు. ఊపిరి బలహీనంగా కొట్టుకొంటోంది. తలక్రింద చెయ్యి వేసి లేపి కూర్చోబెట్టాడు. తల వాల్చి మళ్ళీ క్రిందికి జారిపోయాడు.

అతను చంద్రం!

యాభై అయిదు సంవత్సరాల ఉన్ని కృష్ణన్ క్షణకాలం మాత్రమే ఆలోచించాడు. ఆ కుర్రవాడిని భుజాని కెత్తుకుని కదిలాడు అక్కడనుంచి.

# 2

ఎదురుగా నిలుచున్న చంద్రాన్ని ఆసాంతం పరీక్షగా చూసాడు ఉన్ని కృష్ణన్. సన్నటి శరీరం మొహంమీద పడుతున్న జుట్టు, చురుకైన కళ్ళు, ఇంకా పసితనం పోని నునుపైన బుగ్గలతో ఆ మొహంలో సూదిగా పొడవుగా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది ముక్కు. ఆజానుబాహువు కావటానికి అనుకూలమైన శరీర నిర్మాణం.

"అటు చూడు..." చూపించాడు ఉన్ని కృష్ణన్.

అక్కడ పది నుండి పన్నెండు అడుగుల ఎత్తులో వుంది గోడ. కొండరాళ్ళతో కొద్ది రోజులు క్రితం నిర్మించినట్టు అక్కడక్కడా పచ్చిగా కనిపిస్తున్న మట్టిగోడ అది.

చంద్రం దానిని పరీక్షగా చూడటం గమనించి చెప్పాడు "అది ఎక్కి అక్కడ నుండి క్రిందకు దూకాలి. దూకగలవా?"

తల ఊపాడు చంద్రం అడ్డంగా.

"మొదట పాఠం గుర్తుంచుకో. మనిషి చెయ్యలేని పని అంటూ ఏదీ లేదు. చెయ్యలేననే అపనమ్మకమే దెబ్బతీస్తుంది మనిషిని. ఏది చెయ్యటానికైనా మనసు నిగ్రహించుకుని పనిమీద కేంద్రీకరించాలి. దీన్ని నేను దూకి చూపిస్తాను" అంటూ గోడ దగ్గరకి చకచకా నడిచాడు. ముసలితనం రూపంలో తప్ప ప్రవర్తనలో కనిపించటంలేదు.

గోడకి పది గజాల దూరంలో ఎదురుగా నిలుచున్నాడు. అక్కడ నుంచి గోడవైపు నెమ్మదిగా కదిలి మూడు, నాలుగు అడుగుల తర్వాత వేగం పెంచి గోడ ప్రక్క నిలబెట్టివున్న రాయిమీద నైపుణ్యంగా అడుగువేసి రెండో అడుగు గోడకి సపోర్ట్‌గా వుంచి చేతుల్తో గోడ అంచును పట్టుకుని ఆశ్చర్యం కలిగించేవిధంగా గోడ ఎక్కేసాడు. ఎంతో అనుభవం వుంటే తప్ప సాధ్యం కాదు. గోడ మీదనుంచి చంద్రం వంక చూశాడు.

చంద్రం కళ్ళు అప్పగించి చూస్తున్నాడు. ఉన్ని కృష్ణన్ చూపులో తన చర్యల్ని జాగ్రత్తగా గమనించమనే హెచ్చరిక వుంది. తన వృత్తికి సంబంధించిన శిక్షణ ఆ కుర్రవాడికి యివ్వాలని వారం రోజుల క్రితం నిర్ణయించుకుని ఆరోజు ప్రారంభించాడు.

తన కళ్ళముందు నిలుచున్న కుర్రవాడు పది సంవత్సరాలు కూడా నిండని పసివాడని ఉన్ని కృష్ణన్ వుద్దేశ్యం. కాని తన జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని దానికోసం ప్రాణాలను సహితం వదులుకునే మనస్తత్వం గలవాడని మాత్రం ఉన్ని కృష్ణన్‌కి తెలియదు.

"ముందుకి రా..." చెప్పాడు ఉన్ని కృష్ణన్.

చంద్రం ముందుకి వచ్చి నిలుచున్నాడు.

"నన్ను జాగ్రత్తగా గమనించు..." అని రెండు చేతులు గోడమీద ఆన్చి నడుం వంచి, ఒక కాలు మడచి, చంద్రం వంక ఒకమారు చూసి క్రిందకి దూకాడు పడినవాడు పడినట్టే స్ప్రింగ్‌లా లేచి నిలుచున్నాడు.

"ఏమాత్రం ఏమరుపాటుగా దూకినా కాలు విరుగుతుంది..." చెప్పాడు చంద్రంతో.

తెల్లవారుఝామున నాలుగు గంటలకి లేపి సుమారు మూడు కిలోమీటర్లు దూరం పరిగెత్తించాడు. అలా పరిగెత్తటం కష్టమనిపించింది. చంద్రానికి కాని తనతోపాటు ఉన్ని కృష్ణన్ కూడా వెంట పరిగెత్తటంవల్ల ఏమీ మాట్లాడలేకపోయాడు. మరోప్రక్క యాభై దాటిన ముసలివాడు పరిగెత్తుతుంటే తను పరుగెత్తలేనా అనే ఆలోచన వుంది.

చంద్రం జీవితంలో క్రొత్త క్రొత్త విషయాలు తెలుసుకోవడం ప్రారంభించాడు. స్కూల్లో చెప్పినా, ఇంట్లో తలిదండ్రులు చెప్పినా నీతి వాక్యాలు మాత్రమే అంతవరకూ తెలుసుకున్నాడు మనిషి బ్రతకడానికి ఒక మార్గాన్ని ఎంచుకుని అందులో సాధించిన విజయాలు, వయసు ధారపోసి సంపాదించిన నైపుణ్యం, అనుభవం చంద్రానికి యిప్పుడు స్కూలు పాఠాలు. చదువు జ్ఞానాన్ని నేర్పుతుంది తప్ప బ్రతకటానికి ఖచ్చితమైన మార్గం చూపించే సాధనం కాదు.

ఒకరోజు పూర్తయింది. రాత్రి పడుకున్న తరువాత అనుకున్నాడు చంద్రం ప్రతిరోజూ ఉన్ని కృష్ణన్‌తో పాటు లేచి ఈరోజు చేసిన పనులే చేయాల్సి వుంటుందని దానికి చాలా కష్టపడాల్సి వుంటుందని.

నిజం కూడా అంతే!

ఏ వ్యక్తీ రాత్రికి రాత్రి గొప్పవాడు కాలేదు. దానికి ఎంతో శ్రమించాలి. అదృష్టం కల్సివచ్చి ఒక్క రోజులో తాము గొప్పవాళ్ళం కావాలని చాలామంది ఆశిస్తూ వుంటారు. కాని ప్రతి గొప్పవాడి వెనుక పరోక్షంగా పట్టుదల, కృషి దాగివుంటాయి. అది ఏ రంగంలోనయినా!

చంద్రానికి చాలా ఆశ్చర్యంగా వుంటుంది ఉన్ని కృష్ణన్‌ని చూస్తుంటే.

అతను ఉదయాన్నే నిద్రలేచి ఒక యంత్రంలా చకచకా పనులు చేసుకుంటూపోతాడు. ప్రతి పనిని క్రమబద్ధంగా చేస్తాడు. ఒక యింట్లో దొంగతనం చెయ్యడానికి వెళ్ళినపుడు కూడా అతనిలో ఎటువంటి అలజడి కనిపించదు. వీసమంత అలసినట్టు కనిపించడు.

ఉన్ని కృష్ణన్ దగ్గిర రకరకాల తాళంకప్పలు వున్నాయి. వాటి లోపల నిర్మాణం గురించి అది ఏ విధంగా పనిచేస్తుందో వివరంగా చంద్రానికి బోధించడం ప్రారంభించాడు. తన దగ్గిర వున్న తాళపుచెవులను వుపయోగించి వాటిని ఎలా తెరవాలో చూపించాడు. అతి సాధారణంగా కనిపించే ఉన్ని కృష్ణన్ దగ్గిర అంత గొప్ప విద్య వుండటం విచిత్రమేమీ కాదు. దాదాపు ముప్ఫై సంవత్సరాలకు పైగా అందులో చేసిన కృషి, గడించిన అనుభవం అపారమైనది. తన అనుభవంతో చంద్రాన్ని ఒక శక్తిగా తయారుచెయ్యడం ప్రారంభించాడు.

ఉన్ని కృష్ణన్ నేర్పుతున్న విద్యలు చంద్రానికి తెలివితేటలు సమకూర్చిపెట్టాయి. కొంతకాలం ఉన్ని కృష్ణన్ వద్ద పెరిగిన తరువాత మనిషికి పట్టుదల కృషి వుంటే సాధించలేనిది వుండదని గుర్తించాడు. ఉన్ని కృష్ణన్ నేర్పుతున్న విద్యలతోపాటు తనకి కొంత విజ్ఞానం అవసరమని తెలుసుకున్నాడు. అనితరసాధ్యమైన తన కార్యం పూర్తి చెయ్యాలంటే ఎంతో కృషి చెయ్యాల్సి వుంటుందని గ్రహించడంలోనే చంద్రం గొప్పతనం వుంది. అదే అతనొక మారణహోమం పూర్తి చెయ్యడానికి కారణమైంది.

తెల్లవారుఝామున నిద్రలేచిన ఉన్ని కృష్ణన్ తిరిగి రాత్రి పది గంటలకి నిద్రపోతాడు. నిద్రపోయిన తరువాత మధ్యలో లేచే అలవాటు అతనికి లేదు. సాయంకాలం ఆరు గంటలకి క్లబ్‌కి వెళ్ళి తిరిగి తొమ్మిది గంటలకు వస్తాడు ఉన్ని కృష్ణన్. ఆ సమయంలో ప్రాక్టీస్ చేస్తాడు చంద్రం. పది గంటలకి అతను నిద్రపోయిన తరువాత లైబ్రరీ నుంచి తెచ్చుకున్న పుస్తకాలు చదువుకుంటాడు.

ప్రాక్టీస్ చేసుకోవడానికి అతనికి గురువు లేడు. అంతా అతని ఆలోచనాశక్తిమీద ఆధారపడి వుంటుంది. పట్టుదల, ఏకాగ్రతే అతనికి గురువులు. పెరట్లో తనకి కావాల్సిన విధంగా కొన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు చంద్రం. గోడమీద నాలుగడుగుల ఎత్తులో మసిబొగ్గుతో గుండ్రటి గీత గీచి వుంటుంది దానిముందు నిలుచుని కుడికాలితో ఆ వృత్తంలో గోడని తంతాడు. ఆ కాలు క్రిందకి దిగిన మరుక్షణం ఎడమకాలితో తంతాడు. కొంతకాలం అలా చేసిన తరువాత ఆ గీతని మరికొంచెం పైకి జరుపుతాడు. ఆ సమయంలో ఒక మనిషి మీద తను దాడి చేస్తున్నట్టు వూహించుకుంటాడు. ఎదుట మనిషి ఏ విధంగా కదులుతాడో ఆలోచించి దానికి అనుగుణంగా కదులుతాడు.

మామిడిచెట్టు ముందు నిలబడి, తనముందు శత్రువు వున్నాడనే భావంతో రకరకాల పద్ధతులతో చెట్టు మొదలుని దెబ్బతీస్తూవుంటాడు. అప్పుడు తన గురించి ఏమీ గుర్తుండదు. అనుకున్న వ్యక్తిని చంపాలి. ఆరేడు అడుగుల దూరంనుంచి పరిగెత్తుకుంటూ వచ్చి ఎగిరి చెట్టుని తంతాడు. వెంటనే ఎదుటివాడు ఆ దెబ్బ నుండి తప్పించుకున్నట్టు నేలమీద నడుముతో కదులుతూ ఒక కాలు విసురుతాడు. ఆ మూడు గంటలూ అదో లోకంలో విహరిస్తాడు. మామూలు సమయాల్లో ఏమాత్రం చురుకుదనం కనిపించని చంద్రం అక్కడమాత్రం మెరుపులా కదులుతాడు.

ప్రతిరోజూ పన్నెండు గంటల తరువాత నిద్రపోవడంవల్ల ఉదయం ఉన్ని కృష్ణన్ లేపితే తప్ప మెలుకువ రాదు.

ఎంత ప్రయత్నించినా ఉన్ని కృష్ణన్‌కి తన వివరాలు చెప్పలేదు చంద్రం. ఏదో టూకీగా చెప్పి వూరుకున్నాడు. అది కూడా అబద్ధమే. తన గురించి ఎవరికీ చెప్పడం అతనికి ఇష్టంలేదు. అప్పటివరకూ ఒంటరిగా జీవించిన ఉన్ని కృష్ణన్ చంద్రం రాకతో తన ఒంటరితనాన్ని మర్చిపోయాడు. అతను ఎంత ప్రేమగా చూసినా తనతో కూడా తక్కువగా మాట్లాడటం గుర్తించాడు ఉన్ని కృష్ణన్.

ఎన్ని రోజులు గడిచినా వాళ్ళ దినచర్యలో ఎటువంటి మార్పు లేదు. ఒకసారి ఉన్ని కృష్ణన్ తనతోపాటు చంద్రాన్ని దొంగతనానికి తీసుకెళ్ళాలని నిర్ణయించుకున్నాడు.

అది ఒక డాబా ఇల్లు. దాని యజమాని ఒక ప్రభుత్వోద్యోగి. పైకి మాములుగా కనిపిస్తున్న డాబా లోపల ఖరీదైన నిర్మాణం. దాదాపు పది లక్షల రూపాయిల వరకూ ఖర్చుపెట్టి కట్టించుకున్నాడా ఉద్యోగి. అతని ఇంట్లోని సగానికి పైగా వస్తువులు విదేశాలకి చెందినవి. తను అడ్డదారిలో సంపాదిస్తున్న ధనాన్ని అతనావిధంగా ఖర్చుపెడుతున్నాడు. సరిగ్గా రెండు నెలలు కష్టపడి అతని వివరాలు సంపాదించాడు ఉన్ని కృష్ణన్. వాటితోపాటు డాబా ప్లాను కూడా సంపాదించాడు.

ఆ ఉద్యోగి ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఇనుప బీరువా వుంది. అందులో వుంటుంది బంగారం, కేష్. నాలుగు రోజుల క్రితం ఇంట్లోవాళ్ళు మొత్తం తిరుపతి వెళ్ళారు. ఒక్క యజమాని మాత్రం వుండిపోయాడు.

అదొక అవకాశంగా భావించాడు ఉన్ని కృష్ణన్!

"రాత్రి పన్నెండు దాటిన తరువాత ఒక ఉద్యోగిని సరిచెయ్యడానికి వెళదాం... నిద్రపోకు" చెప్పాడు క్లబ్‌కు వెళుతూ ఉన్ని కృష్ణన్. రాత్రిపూట చంద్రం తనతోపాటు నిద్రపోతాడని అతని వుద్దేశ్యం. నిద్రవచ్చి ముందుగా నిద్రపోతాడేమోనని ఆ మాటలు చెప్పాడు.

తల వూపాడు చంద్రం.

రాత్రి పన్నెండు తరువాత ఇద్దరూ దొంగతనం చెయ్యాల్సిన ఇంటి సమీపానికి చేరారు. ఆ సందు మొత్తం నిర్మానుష్యంగా వుంది. చుట్టూ కాంపౌండ్ వాల్‌తో వున్న ఆ డాబా చీకటిలో మునిగి వుంది. ప్రహరీ గేటు సమీపించి దానిని పరీక్షించాడు ఉన్ని కృష్ణన్. గేటు లోపలిప్రక్క తాళంవేసి వుంది. కళ్ళు చిట్లించి దాని వంక చూశాడు. బజారులో పది రూపాయలకు దొరికే ఒకమాదిరి తాళం అది.

ఉన్ని కృష్ణన్ జేబులోంచి తాళాలగుత్తి తీసి అందులోంచి ఒక తాళం తీసి ఇనుపవూచల నందులోంచి చేతులు లోపలకి దూర్చాడు. కీ హోల్ దొరకడం కష్టమయింది. అది దొరికిన తరువాత అతని చేతులు చురుగ్గా పనిచేశాయి. తాళం వూడిపోయింది. తాళంకప్పని ప్రహరీ గోడమీద పెట్టి ఇంటిని సమీపించి తలుపు నెట్టి చూశాడు. అది లోపలిప్రక్క గడియ పెట్టబడివుంది. ఒకపక్కగా నడిచాడు చూసుకుంటూ. అతనికొక కిటికీ కనిపించింది.

దానిముందు నిలబడి తను తెచ్చిన సంచి కిందపెట్టి అందులోంచి పనిముట్లు బయటకి తీశాడు ఉన్ని కృష్ణన్. చంద్రం అతని చర్యలు జాగ్రత్తగా గమనిస్తున్నాడు. పెన్ టార్చ్‌కి చెయ్యి అడ్డుపెట్టి సన్నటి కాంతి పడేటట్టుచేస్తూ, పది నిమిషాలు కష్టపడిన తరువాత మొదటి స్క్రూ వూడిపోయింది. దానిని సంచిలో పడేశాడు. మరో పది నిమిషాలలకి రెండ స్క్రూతో పాటు కిటికీ రెక్క వూడిపోయింది. ఈసారి రెండవ రెక్క తేలిగ్గా వూడివచ్చేసింది. లోపల ఇనుపచట్రం బిగించివుంది. స్క్రూడ్రైవర్‌తో ఒకప్రక్క సిమెంట్ పెళ్ళగించి కన్నం చేశాడు. అందులో చెయ్యిపెట్టి లాగి చూశాడు. చాలా గట్టిగా వుంది. గోడకి కాలు తన్నిపెట్టి బలం మొత్తం ఉపయోగించి లాగాడు. చట్రం

మొత్తం వూడి చేతిలోకి వచ్చింది. దానిని గోడకి జారవేసి పనిముట్లు సంచిలో పడేసుకున్నాడు. ఒకసారి లోపలికి తొంగిచూసి కిటికీలోంచి శబ్దం చెయ్యకుండా ప్రవేశించాడు. అతని వెనుక చంద్రం దిగాడు. ముందే ఇంటి ప్లాను తెలిసివుండటంతో తిన్నగా బెడ్‌రూమ్ సమీపించాడు. ఆ రూమ్ తలుపు మూసి వుంది. తలుపుకి చెవి ఆనించి కొన్ని నిముషాలు విన్నాడు ఉన్ని కృష్ణన్. ఎటువంటి శబ్ధమూ వినిపించలేదు లోపలనుంచి.

తిరిగి తన పనిముట్లు బయటకి తీసాడు. చంద్రం మొదటిసారి ఉన్ని కృష్ణన్‌తో రావటంవల్ల అతని పనులు చాలా ఆసక్తిగా గమనిస్తున్నాడతను. అదో అద్భుతంలా కనిపిస్తోంది కంటికి. పెన్‌టార్చ్ పట్టుకుని ఉన్ని కృష్ణన్‌కి సహాయం చేస్తున్నాడు. ఉన్ని కృష్ణన్‌కి అటువంటి తలుపులు తెరవడం మంచినీళ్ళప్రాయం. ఏ ఇంటికైనా ముందు తలుపులు గట్టిగా వుండేటట్లు చూసుకుంటారు. దానిమీద చూపించిన శ్రద్ధ మిగతా గది తలుపులమీద చూపించరు. అందుకే ముందు తలుపులు తెరవడానికి ప్రయత్నించకుండా కిటికీ మొత్తాన్ని లేపి పారేశాడు. బెడ్‌రూమ్ తలుపుకి రెండువైపులూ వేసుకునే తాళం అమర్చివుంది. ఐదు నిమిషాల్లో క్లిక్‌మంటూ శబ్దం వచ్చింది.

నాబ్ తిప్పి నెమ్మదిగా తలుపు కొద్దిగా త్రోసాడు. లోపల అంతా చీకటిగా వుంది. కనీసం బెడ్‌లైట్ కూడా వెలగడంలేదు. చంద్రం చేతిలోని పెన్‌టార్చ్ అందుకుని సన్నటి కాంతిరేఖ లోపల పడేటట్టు చేసి గదిని పరిశీలించాడు. ఎదురుగా మంచం ఖాళీగా కనిపించింది. గదిని కూడా అదే కాంతిలో పరీక్షించాడు. ఒకప్రక్క నిలబెట్టి వుంది నిలువెత్తు ఇనుప బీరువా. గదిలో ఎవరూ లేరు. గదిలో వుండాల్సిన మనిషి ఎక్కడకి వెళ్ళాడు? కొన్ని క్షణాలు ఆలోచించాడు. ఇంట్లో ఎక్కడైనా వున్నాడా? చంద్రం చెవి దగ్గర నెమ్మదిగా చెప్పాడు.

"ఇంట్లో ఎవరైనా వున్నారేమో చూసిరా..."

చంద్రం నెమ్మదిగా లోపలికి నడిచాడు. ఉన్ని కృష్ణన్ గదిలోకి ప్రవేశించి బీరువా దగ్గిరకి నడిచాడు. పెన్‌టార్చ్ వెలుగులో బీరువాని పరీక్షించడం ప్రారంభించాడు. అలా కొన్ని నిమిషాలు పరీక్షిస్తూ వుండిపోయాడు. పూర్తి ఏకాగ్రతతో బీరువాని పరీక్షిస్తూ వుండటంవల్ల అతను కాసేపు పరిసరాలను మర్చిపోయాడు. చంద్రం తిరిగొచ్చేలోపు దానిని పరీక్షించి అతను వచ్చిన తరువాత పని ప్రారంభించాలని అతని ఆలోచన.

చిన్నగా అతని ఏకాగ్రతకి భంగం కలిగింది. ఏదో ప్రమాదం ముంచుకు రాబోతున్నదన్న ఆలోచన మనసులో ప్రవేశించింది. చురుగ్గా వెనక్కి తిరగబోయాడు.

అదే సమయంలో...

గదిలో లైటు వెలిగింది. దానితోపాటు వినిపించింది.

"చేతులు పైకెత్తు..."

ఆ కాంతికి కళ్ళు మూసి తెరిచాడు ఉన్ని కృష్ణన్. ఎదురుగా గుమ్మంలో ఒక భారీ ఆకారం నిలబడి వుంది. అతని చేతిలో పిస్టల్ వుంది. అది ఉన్ని కృష్ణన్‌కి గురిపెట్టాడు అతను. అప్పటివరకూ అతను డాబామీద కూర్చుని అంతకుముందే తిరిగొచ్చాడు. అప్పుడు ఉన్ని కృష్ణన్ తాళం తెరవడానికి ప్రయత్నిస్తున్నాడు. వెంటనే నిశ్శబ్దంగా ప్రక్కకి తప్పుకుని పిస్టల్ పట్టుకుని వచ్చాడు. అప్పటికి చంద్రం గదులు పరీక్షించడానికి మరోవైపు వెళ్ళాడు.

"చేతులు పైకెత్తు" అన్న మాట వినపడగానే చివరిగదిని పరీక్షించే ప్రయత్నం చేస్తున్న చంద్రం ఆగి నిటారుగా నిలుచున్నాడు. అతని శరీరం మీదున్న వెంట్రుకలు లేచి నిలుచున్నాయి. నెమ్మదిగా బెడ్‌రూమ్ దగ్గిరకి వచ్చాడు. గది తలుపు బార్లా తెరిచివుంది. లోపల లైట్లు వెలుగుతున్నాయి.

"నీతో వచ్చిన వాడేడీ?" అతను అడుగుతున్నాడు బెడ్‌మీద కూర్చుని. బీరువా దగ్గిర చేతులు ఎత్తి నిలుచున్నాడు ఉన్ని కృష్ణన్. ఎదురైన పరిస్థితి నుండి ఎలా బయట పడాలా అని అతను తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తను ఊహించిన దానికంటే ఆ ఇంటి యజమాని బలవంతుడని అర్థమయింది ఉన్ని కృష్ణన్‌కి.

తన గురువుని ఎలా రక్షించాలి? ఆలోచిస్తున్నాడు చంద్రం గదిలోని కాంతి తనమీద పడకుండా ప్రక్కకి తప్పుకుని. కొన్ని క్షణాలు ఆలోచించిన తరువాత ఒక నిర్ణయానికొచ్చినట్టు తిన్నగా వచ్చి గుమ్మంలో నిలుచున్నాడు చంద్రం ఇంటి యజమానికి కనిపించే విధంగా.

"లోపలికి రా..." చెప్పాడు పిస్టల్ పట్టుకున్న వ్యక్తి సన్నగా నవ్వుతూ.

ఉన్ని కృష్ణన్ పళ్ళు పటపట కొరికాడు. ఆ యజమాని మాటలు బయటకి వినిపిస్తున్నాయి. అలాంటప్పుడు తప్పించుకుని పోకుండా తిన్నగా లోపలికి వచ్చాడు. ఇప్పుడు చంద్రాన్ని కూడా తప్పించాలంటే సాధ్యమయ్యే పనికాదు. అతన్ని తన వెంట తీసుకొచ్చినందుకు తనని మనసులోనే నిందించుకున్నాడు. విపరీతమైన చికాకు ప్రవేశించింది అతనిలో.

"మేము తప్పించుకుని పోతున్నాం..." చెప్పాడు చంద్రం అతని వంక నిర్వికారంగా చూస్తూ

ఒక్కసారి ఉలిక్కిపడి అనుమానంగా చూశాడు చంద్రం వంక. పన్నెండు సంవత్సరాల ఆ కుర్రాడిలో ఎటువంటి ప్రత్యేకత కనిపించలేదు కంటికి. అతని దగ్గిర ఆయుధాలు లేవు. తన చేతిలో పిస్టల్ వుంది. బహుశా పిస్టల్ గొప్పదనం అతనికి తెలిసివుండదు.

తెలిసి కూడా మాట్లాడివుంటే అతనికి పిచ్చి పట్టివుండాలి. ఇద్దరూ తనకి ఎదురుగా వున్నారు. ఎలా తప్పించుకుంటారు? అనుకుంటూ ఉన్ని కృష్ణన్ వంక చూశాడు.

అదే అతను చేసిన తప్పు.

చంద్రం కదిలాడు విడిచిన బాణంలా మెరుపువేగంతో, కొంత దూరం పరిగెత్తి అప్పుడు లేచాడు గాలిలో. సరిగ్గా మామిడిచెట్టు మొదల్ని తన్నినట్టుగా తన్నాడు అతని తలని. ఆ దెబ్బకి అతను విరుచుకు పడిపోయాడు.

గురిపెట్టి పిస్టల్ కాల్చాలంటే కొంత ఏకాగ్రత కావాలి. కాల్చాలనుకున్న మనిషికి కొంత ఆందోళ కలిగిస్తే అతను అనుకున్నవిధంగా ఫైర్ చెయ్యలేడు. ముందు చంద్రం మాటలు పిచ్చి వాగుడుగా భావించాడు ఉన్ని కృష్ణన్ కూడా. అందుకే చంద్ర వంక నిశితంగా చూస్తూ నిలుచున్నాడు. తన కళ్ళని తనే నమ్మలేని పరిస్థితి కొన్ని క్షణాలు ఉన్ని కృష్ణన్‌ని చుట్టుముట్టింది. అతను ఆశ్చర్యపోవడంలో ఎంతమాత్రం తప్పులేదు. చంద్రం చూపిన కదలికలో శతృవు మీదకి దాడిచేస్తున్న చిరుతపులి వేగం వుంది. చంద్రంలోనే కాదు, ఆ వయసు కుర్రవాళ్ళల్లో అటువంటి వేగం వుంటుందని ఊహించి కూడా ఎరుగడు.

కొన్ని క్షణాల్లో తేరుకుని గబగబా మంచం దగ్గిరకి వచ్చాడు. అప్పటికే ఆ వ్యక్తి స్పృహ తప్పి వున్నాడు. చంద్రం మామూలుగా నిలబడి చూస్తున్నాడు ఏమీ ఎరగనట్టు. ఉన్ని కృష్ణన్ తన దృష్టిని చంద్రం మీదనుంచి మరల్చి బీరువా సమీపించాడు. చకచకా దాని తాళం తీసి తమకి కావాల్సిన వస్తువులు తీసుకుని బయటికి వచ్చారు.

అప్పుడు కూడా ఉన్ని కృష్ణన్ ఆశ్చర్యం నుండి తేరుకోలేదు.

అతనికి తెలియని విషయమొకటి వుంది.

చట్టం, న్యాయం, ధర్మం, దేవుడు మనిషి వ్యక్తిత్వం మీద తమ ప్రభావాల్ని చూపిస్తాయి. వాటి ప్రభావం నుండి బైటపడి ఆలోచించే మనిషి రాక్షసుడుగా మారతాడు. చంద్రం వాటి ప్రభావానికి అతీతంగా ఆలోచిస్తున్నాడు.

# 3

ఉన్ని కృష్ణన్ తన పని చాలా కామ్‌గా పూర్తిచేస్తాడు. అతనికి ఎటువంటి అల్లరి ఇష్టం వుండదు. అందుకే ఒకచోట దొంగతనం చెయ్యటానికి చాలా సమయం తీసుకుంటాడు. అన్నీ సరిచూసుకుని తృప్తిచెందిన తరువాత రంగంలోకి దిగుతాడు.

అతను గత పది సంవత్సరాలుగా చంద్రాన్ని తన వెంట తిప్పుకుంటున్నాడు. చంద్రానికి చిన్న చిన్న పనులు పురమాయించటం తప్ప పెద్ద పనులు ఎప్పుడూ అప్పగించలేదు. అటువంటి అవసరం రాలేదు కూడా!

చంద్రం మాత్రం ఉన్ని కృష్ణన్ వద్ద మెలుకువలన్నీ నేర్చుకున్నాడు. ప్రత్యేకంగా ఉన్ని కృష్ణన్‌కి తెలియకుండా తన బాడీని తనకి అనుకూలంగా తయారుచేసుకున్నాడు. రాత్రిపూట పుస్తకాలు తెచ్చుకొని చదువుకునేవాడు. ప్రతిదాన్ని నిశితంగా పరిశీలించి తెలుసుకునేవాడు. అతనికి విశ్రాంతి అవసరం లేదు. ఎన్ని పనులు చేసినా అతని ఆలోచన ఒక్కటే!

తను అనుకున్న పని సాధించితీరాలి!

చంద్రాన్ని చూస్తే అతనిలో ఎటువంటి ప్రత్యేకతలు కనిపించవు. సాధారణమైన బట్టలు ధరించి కాస్త పరీక్షగా చూసినవాళ్ళకి అమాయకంగా కనిపిస్తాడు. అతని కళ్ళ వంక నిశితంగా చూడగలిగితే వాటిలో ఒక రకమైన పట్టుదల తొంగి చూస్తుంటుంది. మరికొంత జాగ్రత్తగా గమనిస్తే అతని ప్రతి కదలికలోను ఒక రకమైన పర్‌ఫెక్ట్‌నెస్ గుర్తించవచ్చు.

ఒకరోజు చంద్రంతోపాటు బజారులో నడుస్తూ అన్నాడు ఉన్ని కృష్ణన్.

"చిన్నా ఒక పని చెబుతాను. చేస్తావా?"

చంద్రం నవ్వాడు చిన్నగా. అరవై సంవత్సరాల వయసు దాటి, శరీరం మీద వెంట్రుకలన్నీ తెల్లబడిపోయినా, ఒంటిలో మాత్రం చురుకుదనం తగ్గని ఉన్ని కృష్ణన్ వంక చూసి. ఆ నవ్వులో ఏమైనా చెయ్యగలననే ధీమా వుంది.

ఒక బంగారం కొట్టు వంక చూపించి చెప్పాడు.

"అది సేట్ చమన్ లాల్ షాపు. సుమారు పదిహేను సంవత్సరాల క్రితం ఒక గొలుసు అమ్మటానికి తీసుకువెళ్ళాను. దాన్ని తీసుకొని నాకు డబ్బు ఇచ్చాడు. అవి దొంగనోట్లు..."

చంద్రం సాలోచనగా తల వూపి అడిగాడు. "నువ్వు చూసుకోలేదా?"

"తరువాత చూసి వెళ్ళి అడిగాను... మెడ పట్టుకుని బైటికి గెంటుతానని అన్నాడు"

"ఊఁ..." అన్నాడు ఆలోచిస్తూ.

"షాపు కట్టేసి రాత్రి పది గంటలకి ఇంటికి బయలుదేరతాడు. అతనితోపాటు ఒక తోలు బ్యాగ్ వుంటుంది. అందులో డబ్బు

వుంటుంది. కారులో ఇంటికి వెళతాడు. వాడితోపాటు నలుగురు కొడుకులు ఉంటారు"

"చమన్ లాల్ ఇంటికి వెళ్ళటానికి ఇంకా నాలుగు గంటల టైమ్ వుంది. నువ్వు క్లబ్‌కి వెళ్ళి ఇంటికి రా. నేను పని చూసుకుని వస్తాను..." చెప్పాడు చమన్ లాల్ షాపు వంక, షాపు ముందు నిలబెట్టి వున్న నల్లని కారు వంక తదేకంగా చూస్తూ. చంద్రం మెదడు చకచకా ఆలోచిస్తున్నది.

"జాగ్రత్త...." చెప్పి అక్కడనుండి కదిలాడు ఉన్ని కృష్ణన్. వృత్తిపరమైన విషయాలు పది సంవత్సరాలు చంద్రానికి నేర్పాడు. అతనిలోని పనితనం తెలుసుకునే అవకాశం అంతవరకూ లభించలేదు. మొదటిసారి చంద్రం నైపుణ్యం చూడాలనే ఆలోచనతో చమన్ లాల్ విషయం చెప్పాడు. ఫలానా పని చెయ్యమని కూడా చెప్పలేదు. అతను చేసే పనిమీద ఆధారపడి వుంటుంది అతని సామర్థ్యం.

సరిగ్గా చమన్ లాల్ షాపుకి ఎదురుగా వున్న ఫ్యాన్సీ షాపులోకి ప్రవేశించాడు చంద్రం తనకి కావలసిన ఒక వస్తువు కొనటానికి.

◆ ◆ ◆

షాపులో జనం లేరు. చివరలో ఒకే ఒక వ్యక్తి మిగిలాడు. అతను చమన్ లాల్ ముందు కూర్చునివున్నాడు. చమన్ లాల్ కొడుకులు వస్తువులు సర్దుతున్నారు.

"ఇకనుంచి పర్సంటేజ్ తగ్గించారు..." అతను చెప్పాడు చమన్ లాల్‌తో.

"ఎంత?" అడిగాడు కంగారుగా.

"రెండు శాతం"

"ఎందుకు?"

"వాళ్ళ బిజినెస్ అనుకున్న దానికంటే బాగుంది"

ముందున్న పేపర్‌ని దగ్గరకి లాక్కుని దానిమీద కొన్ని అంకెలు వేశాడు చమన్ లాల్.

"లక్షకి ఇరవై తగ్గిపోతుంది" చెప్పాడు.

"అవును. ఎల్లుండి రాత్రికి ఇంటికి తెచ్చి సరుకు ఇచ్చినపుడు గట్టిగా అడుగు" చెప్పాడు. రెండు శాతం తగ్గించడంవల్ల అతనికి కూడా నష్టమే.

చమన్ లాల్‌కి మతిమరుపు ఎక్కువ. అందువల్ల ముఖ్యమైన విషయాలు చిన్న కొడుక్కి అప్పగిస్తాడు. షాపులోకి చూశాడు. చిన్న కొడుకు అందుబాటులో కనిపించలేదు. తను అంకెలు వేసిన కాగితంమీద ఎల్లుండి విషయం వ్రాసుకుని దాన్ని తన తోలుసంచిలో పెట్టుకున్నాడు. చమన్ లాల్‌తో మాట్లాడిన వ్యక్తి వెళ్ళిపోయాడు.

కొద్ది సమయం గడిచిన తరువాత షాపు కట్టేశారు.

చమన్ లాల్ మరోమారు తాళంకప్పలు లాగి చూసి తృప్తిగా తలాడించాడు. అంతకుముందు చమన్ లాల్ కొడుకులే ఆ తాళంకప్పలు వేసివచ్చారు. అయినా చివరగా తను పరీక్షించిగాని తృప్తిపడడు. వ్యాపారపరంగా అతను ఎవరినీ నమ్మడు. చివరికి కొడుకులను కూడా. వాళ్ళు కూడా దానిని పట్టించుకోరు.

తోలుసంచితో ముందుసీట్లో డ్రైవర్ ప్రక్కన కూర్చున్నాడు చమన్ లాల్. అతని ప్రక్కన పెద్ద కొడుకు మిగతావాళ్ళు వెనుక సీట్లలో కూర్చున్నారు. కారు ఇంటివైపు బయలుదేరింది.

విశాలమైన భవనం ముందు ఆగింది కారు. అక్కడ ఆగకుండా లోపలికి వెళ్ళిపోయేదే. కాని గేటు దగ్గిర ఉండాల్సిన ఘూర్కా లేడు. అందువల్ల కారు గేటుముందు ఆగిపోయింది.

"డ్రైవర్! దిగి గేటు తెరు..." అని చెప్పి తల వెనక్కి తిప్పి చెప్పాడు. "రేపు గుర్తుచెయ్యి ఘూర్కాని మార్చేద్దాం..."

చిన్న కొడుకు వెంటనే ఆ విషయం మనసులో గుర్తుపెట్టుకున్నాడు.

డ్రైవర్ కారు డోర్ తెరచి క్రిందకు దిగి గేటువైపు నడిచాడు.

కాంపౌండ్ వాల్ ప్రక్క క్రీనీడలోంచి ఒక ఆకారం కారువైపు వచ్చింది. చేతిలోని పిస్టల్ చమన్ లాల్‌కి గురిపెట్టి చెప్పింది కటువుగా.

"ఎవరూ కదలొద్దు. నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తాను... చమన్ లాల్! ఆ బ్యాగ్ ఇటు ఇవ్వు..."

భయంతో ఒడిలోని తోలుసంచీని మరింత గట్టిగా పట్టుకుంది చమన్ లాల్ చెయ్యి.

గేటు దగ్గరికి వెళుతున్న డ్రైవర్ ఆ మాటలకి వెనక్కి తిరిగాడు. ఒక్క క్షణం ఏం చెయ్యాలో అతనికి తోచలేదు.

"బ్యాగ్ ఇవ్వు..." మరోమారు ఖంగుమంది గొంతు. ఆలోచించే వ్యవధి లేకపోయింది చమన్ లాల్‌కి. జీవితంలో అతనికి అటువంటి

పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. నెమ్మదిగా బ్యాగ్ అందించాడు రాక్షసుని మాదిరి పిస్టల్ పట్టుకున్న వ్యక్తిని చూసి.

అతను బ్యాగ్ అందుకుని డోర్ విసురుగా మూశాడు. చురుగ్గా వెనక్కి తిరుగుతూ పిస్టల్ పట్టుకున్న చెయ్యి బలంగా విసిరాడు. చప్పుడు చెయ్యకుండా మీదకి దూకిన డ్రైవర్ పొట్టలో తగిలి ఎడిగిపడ్డాడు.

అతను చీకటిలోకి పరిగెత్తాడు.

కారులోంచి అందరూ కంగారుగా దిగారు. చమన్ లాల్ కొడుకులు చీకట్లోకి గుడ్డిగా పరిగెత్తారు. రెండు నిమిషాల తరువాత వినిపించింది మోటార్ సైకిల్ స్టార్ట్ అయిన శబ్దం.

అయినా వాళ్ళు వెదుకుతూనే వున్నారు.

ఆరోజు రాత్రి అన్నం తినలేదు చమన్ లాల్. బ్యాగ్‌లో వుంచిన కాగితం గురించి పెట్టిన క్షణంలోనే మర్చిపోయాడు. బ్యాగ్ తెరిచి చూస్తే తప్ప అది గుర్తురాదు.

ఆ బ్యాగ్‌లో ఒక ప్రముఖ వ్యక్తి ప్రాణాలు దాగి వున్నాయని ఎవరు మాత్రం ఊహించగలరు.

# 4

ఉన్ని కృష్ణన్ క్లబ్ నుండి వచ్చిన చాలాసేపటికి వచ్చాడు చంద్రం. తనతోపాటు తెచ్చిన బ్యాగ్ ఉన్ని కృష్ణన్‌కి ఇచ్చి చెప్పాడు.

"చమన్ లాల్ బ్యాగ్..."

ఆశ్చర్యంతో చంద్రాన్ని పైనుంచి క్రిందకు ఒకమారు పరీక్షగా చూశాడు. ఎప్పటిలానే వున్నాడు. ఎక్కడా దెబ్బలు తగిలినట్టు లేదు. ఉన్ని కృష్ణన్ కళ్ళల్లో క్షణకాలంపాటు సంతోషం మెరిసి మాయమయింది. చెట్టుకు నీరు పోసి పెంచి, అది పుష్పించి కాయలు కాసిన తరువాత దానివంక యజమాని చూసిన చూపులాంటి కల్తీ చూపు కాదు. ప్రయోజకుడయిన కొడుకును చూసి తండ్రి మనసులో ఉప్పొంగిన పుత్రవాత్సల్యం తాలూకు నిర్మలమైన చూపు.

వారిద్దరు ఒకరికొకరు తప్ప వారికెవ్వరూ లేరు.

"చమన్ లాల్ కొడుకులవల్ల ఎటువంటి ప్రమాదమూ జరగలేదు కదా!" మరోమారు చంద్రాన్ని పరీక్షగా చూసి అడిగాడు.

"లేదు. పావు లీటరు పెట్రోలు, రెండు రూపాయలు ఖర్చు" చెప్పాడు మామూలుగా మంచంమీద కూర్చుంటూ.

"రెండు రూపాయలా?"

"అవును... పిస్టల్ కొనటానికి" అంటూ జేబులోంచి తీసి చూపించాడు. దీపావళి సీజన్‌లో పిల్లలు బాగా ఇష్టపడి కొనుక్కునే బొమ్మ పిస్టల్ అది.

ఆనందంగా చూశాడు చంద్రం వంక. అది జీవితంలో గొప్ప విజయం సాధించిన తరువాత కలిగే ఆనందం వంటిది. చిరకాలవాంఛ తీరింది. పదిహేను సంవత్సరాల నుండి ఎదురుచూసినా చమన్ లాల్‌ని దోచుకోవటానికి ఎటువంటి అవకాశమూ లభించలేదు.

రాత్రి రెండు గంటలయింది సరిగ్గా.

పక్కమీద బాధగా కదిలాడు ఉన్ని కృష్ణన్. గుండెలు చేత్తో బలంగా అదుముకున్నాడు. ఆయాసంతో ఛాతీ ఎగిరెగిరి పడుతోంది. శరీరం నిండా చెమట పట్టింది.

"చంద్రం..." పిలిచాడు బరువుగా.

"చిన్నా!" మరోమారు పిలిచాడు ఊపిరి బిగపట్టి.

చప్పున లేచి కూర్చున్నాడు చంద్రం. గబగబా ఉన్ని కృష్ణన్ మంచం వద్దకు వచ్చాడు.

"ఏమిటి బాబా?" అడిగాడు కంగారుగా.

బాధగా కదిలాడు జవాబు చెప్పకుండా.

క్షణంలో గ్రహించాడు పరిస్థితి. తలుపు తెరుచుకుని బయటికి పరిగెత్తాడు. సెంటర్‌లో వరుసగా నిలబెట్టి వున్నాయి ఆటోలు. డ్రైవర్లు వాటిలో పడుకొని వున్నారు.

ఒక డ్రైవర్‌ని తట్టిలేపాడు. అతను విసుగ్గా లేచి "ఏమిటి?" అడిగాడు చురుగ్గా.

"అర్జంట్‌గా హాస్పటల్‌కి వెళ్ళాలి" చెప్పాడు ఆతృతగా.

"రాను..." అన్నాడు. అతని ఆతృతతో తనకి ఎంతమాత్రం సంబంధం లేనట్టు తిరిగి నిద్రపోవటానికి సీటుమీద ఒరిగాడు.

ఆ డ్రైవర్ కాలర్ పట్టుకొని పైకి లేపి గుద్దాడు మెడక్రింద.

నిన్నటి బడలిక, రాత్రి తాగిన సారామత్తు వదిలిపోయింది. భయంగా చూశాడు చంద్రంవంక.

"ముందు ఆటో స్టార్ట్‌చెయ్యి..." చెప్పాడు కటువుగా. కాదంటే చంపి పారేసేటంత ఉద్రేకంలో ఉన్నాడు చంద్రం. ఆ విషయం డ్రైవర్ గ్రహించాడు. మత్తు వదిలిపోవటంతో పరిస్థితి చప్పున అర్థమయింది. సీటుమీద పడుకోవటానికి పరిచిన టవల్ కూడా తియ్యకుండా ఆటో స్టార్ట్‌చేశాడు.

ఒక గంట కాలం కాలగర్భంలో కలిసిపోయింది.

బెడ్‌మీద అచేతనంగా పడివున్న శరీరం వంక నిర్వికారంగా చూశాడు చంద్రం. కళ్ళు మూసుకుని వుంది. గత పది సంవత్సరాలుగా తనని ఆప్యాయంగా చూసిన కళ్ళు మరి తెరుచుకోవు. ఆ చేతులు తనకి అన్నం తినిపించిన రోజులు వున్నాయి. వాటికి ఇప్పుడు చలనం లేదు. తనకి ఎవరూ లేకపోయినా కొండంత అండ వుందని మురిసిపోయాడు. తను బాబా అంటూ చనువుగా పిలుచుకొనే మనిషి మరి లేడు, ఇక రాడు. తనంత దురదృష్టవంతుడు ప్రపంచంలో మరొకడు వుండడు.

అక్కడినుండి చకచకా టాయిలెట్ రూమ్‌లోకి ప్రవేశించాడు. తలుపుకి బోల్ట్ బిగించి రెండు చేతుల్తో మొహం కప్పుకుని మోకాళ్ళమీదకు జారిపోయి ఏడవడం ప్రారంభించాడు.

మామూలుగా ఏడవడం కాదు!

కొద్ది గంటల క్రితం నవ్వుతూ మాట్లాడిన తండ్రిలాంటివాడిని పోగొట్టుకుని, ఇక ప్రపంచంలో తనకి ఎవరూ లేరన్న నిరాశ మనసులో పేరుకుపోయి, తల్లి పోయిన దగ్గరనుండి ఉన్ని కృష్ణన్ సాహచర్యంవల్ల మనసులో దాక్కున్న దుఃఖం ఒక్కసారి ప్రేగులు చీల్చి కట్టలు త్రెంచుకుని వచ్చిన ఏడుపు.

టాయిలెట్ రూమ్‌లోని గాలి స్తంభించిపోయింది. శబ్దం బయటకి రాకుండా ఏడుస్తున్న అతన్ని నిశ్శబ్దం మౌనంగా పరికిస్తోంది.

కొద్ది నిమిషాలు భారంగా గడిచాయి.

ఆ స్థితినుండి చంద్రం తొందరగానే తేరుకున్నాడు. మొహం కడుక్కుని కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు. అద్దంలో మొహం చూచుకున్నాడు. కళ్ళు కొద్దిగా ఉబ్బివున్నాయి. తలుపు తెరిచి బయటికి వచ్చి ఉన్ని కృష్ణన్ బాడీ వున్న గదిలోకి ప్రవేశించాడు.

అంతవరకూ అక్కడే వేచివున్న నర్సు ఆ ఇరవై సంవత్సరాల కుర్రవాడి వంక చూసి ఆశ్చర్యపోయింది. తన సర్వీస్‌లో చాలా చావుల్ని చూసింది. తమ మనిషి చచ్చిపోయాడంటే ఎవరూ నిగ్రహంగా నిలబడలేరు, కాని ఆ కుర్రవాడిలో ఎక్కడా నిగ్రహం కోల్పోయిన చిహ్నాలు కనిపించడంలేదు.

"అతను మీకేమవుతాడు?" అడిగింది కాస్త అనుమానంగా.

ఉన్ని కృష్ణన్ శరీరం వంక చూస్తున్న చంద్రం నెమ్మదిగా తల తిప్పి నర్సు వంక చూసి చెప్పాడు. "చాలా..." తిరిగి ఉన్ని కృష్ణన్ శవం వైపు చూసి దానికి ఒక వాక్యం కలిపాడు. "కన్న తండ్రికంటే ఎక్కువ..."

చంద్రం తన జీవితంలో సాధించాల్సిన ఒక కార్యం అప్పటివరకూ వాయిదాపడుతూ వచ్చింది. ఉన్ని కృష్ణన్ చనిపోవడంతో ఇప్పుడు చంద్రం బోను నుండి బయటికి వచ్చిన పులి. జంతువుల్ని చంపి తినే మామూలు పులి కాదు.

మనిషి రక్తం రుచి చూడాలనుకునే పెద్దపులి!

◆ ◆ ◆

చంద్రం విచారంగా కూర్చుని వున్నాడు. ఆరోజు చెయ్యాల్సిన కార్యక్రమాలు పూర్తిచేశాడు. బాబా చనిపోయాడనే విషయం కలగా వుండిపోయింది. అది నిజమని నమ్మలేకపోతున్నాడు. ఒంటరిగా కూర్చుంటే ఏమీ తోచటంలేదు. బాబా జ్ఞాపకాలు వేటాడుతున్నాయి. ఒక్కరోజుకే జబ్బుపడిన మనిషిలా తయారయ్యాడు.

ఉన్ని కృష్ణన్‌కి చుట్టుప్రక్కలవాళ్ళతో మంచి స్నేహ సంబంధాలున్నాయి. ఎవరూ పిలవకపోయినా శవ దహనానికి చాలామంది వచ్చారు. చంద్రాన్ని ఓదార్చటానికి కొంతమంది ప్రయత్నించారు. అతను మాత్రం దుఃఖానికి అతీతంగా యంత్రంలా పనులు చేసుకుంటూపోయాడు. మనసులో ఏదో వెలితి. జీవితంలో ఎప్పటికీ పూరించలేనిది.

రెండవరోజు ఊరంతా పిచ్చిపట్టినట్టు తిరిగి రాత్రి ఎనిమిది గంటలకి వచ్చాడు. ఎక్కడా కాలు నిలవటంలేదు. ఏం చెయ్యాలన్నా మనసు సహకరించటంలేదు.

మంచంమీద పడుకుని గోడకి తగిలించివున్న ఉన్ని కృష్ణన్ ఫోటోవంక చూశాడు. చిరునవ్వు వెదజల్లుతున్న మొహం. బ్రతకటంకోసం దొంగతనాలు చేసినా అతను చాలా మంచివాడు. ఎవరైనా కష్టాలలో వుంటే సహించలేకపోయేవాడు. ఏదోవిధంగా సహాయపడేవాడు. ఎంతటివాడైనా కాలప్రవాహంలో కొట్టుకుపోవాల్సిందే!

సరిగ్గా ఉన్ని కృష్ణన్ ఫోటోకి క్రింద అల్మారాలో వున్న నల్లటి బ్యాగ్‌మీద చంద్రం దృష్టి పడింది. వెంటనే ఉన్ని కృష్ణన్ చెప్పిన మాటలు చెవుల్లో మారుమ్రోగాయి.

"రేపు బ్యాగ్ తెరిచి అందులో కాగితాలు షాపు ఎడ్రసుకి పంపించేయ్..."

అదేరోజు ఉన్ని కృష్ణన్ చనిపోవడంతో పనుల ఒత్తిడివల్ల తను పట్టించుకోలేదు. మనసులో అనుకుని లేచి బ్యాగ్ తెచ్చి దానిని ఓపెన్‌చేశాడు. అందులోని వస్తువులు బయటికి తీసాడు. లోపల డబ్బు,కాగితాలు, ఒక టాబ్లెట్ సీసా వున్నాయి.

డబ్బు మొత్తం లెక్కబెట్టాడు. ముప్పై వేల రూపాయలు మరికొంత చిల్లర వుంది. వందనోట్లు ఒక్కొక్కటి పరీక్షించటం ప్రారంభించాడు. అలా పరీక్షించి కొన్ని నోట్లు ప్రక్కకి తీసాడు. అవి తొంభై రెండు వున్నాయి.

దొంగనోట్లు!

చంద్రం ఆలోచనలో పడ్డాడు. చమన్ లాల్ తెలివిగా వ్యాపారంలో దొంగనోట్లు చలామణి చేస్తున్నాడు. లక్షలమీద వ్యాపారంచేసే చమన్ లాల్‌కి అవి మార్చటం పెద్ద కష్టం కాదు. దొంగనోట్లు విడిగా వుంచాడు.

కాగితాలు తెరచి చూడటం ప్రారంభించాడు. రసీదులు, జమలకి సంబంధించి వ్రాసిపెట్టుకున్న వివరాలు. కొన్న బంగారం లెక్కలు వ్రాసిన కాగితాలు వున్నాయి. మొత్తం కాగితాలు వాటికి సంబంధించినవే! చివరగా ఒక కాగితం మిగిలింది. అది కూడా వాటికి చెందిందే అయివుంటుందని దాన్ని తెరచి చూడటం అనవసరం అనుకుంటూ చూసిన కాగితాలలో పడేశాడు. మొత్తం రేపు పోస్టు చెయ్యాలి అనుకుంటూ నిస్సారంగా వెనక్కి వాలాడు.

చమన్ లాల్‌కి దొంగనోట్లు ఎక్కడివి? అతనే ప్రింట్ చేస్తున్నాడా? లేక ఏదైనా ముఠా నుండి తీసుకుంటున్నాడా? ముందు దానిగురించి తెలుసుకోవాలి. అది పూర్తయిన వెంటనే తన పని ప్రారంభించాలి. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. చమన్ లాల్ గురించి ఎలా తెల్సుకోవటం? అతని గురించి తెలుసుకోవాలనుకుంటున్నప్పుడు బ్యాగ్‌లోని కాగితాలు జాగ్రత్తగా పరీక్షిస్తే ఏదైనా సమాచారం దొరకవచ్చు కదా! ఇటువంటి విషయాల్లో బాబా ఏం చెప్పాడు?

"చిన్నా! నీ ముందు ఒక ప్రదేశాన్ని పరీక్షించదల్చుకుంటే ముందు కాలి బొటనవ్రేలు దగ్గరనుండి చూడటం మొదలుపెట్టు..."

ఎంతో అనుభవంతో చెప్పిన మాటలు తను ఎందుకు ఆచరించలేదు? అప్పుడే తనలో నిర్లక్ష్యం ప్రవేశించిందన్నమాట! ఇటువంటి విషయాలలో పద్ధతిప్రకారం పని చెయ్యకపోతే కష్టసాధ్యమైన తన పని ఎలా చెయ్యగలుగుతాడు? తనని తానే హెచ్చరించుకుని లేచాడు.

తిరిగి కాగితాలు తీసి జాగ్రత్తగా చూడటం ప్రారంభించాడు. చకచకా కాలం గడిచిపోతోంది. ఒక కాగితం తీసి చూశాడు. అందులో నిలువెత్తు ఫోటో ముద్రించి వుంది. ఒకప్రక్క అందమైన అక్షరాలతో ప్రకటన వుంది. ఒక డాక్టరు విదేశాలనుండి స్వదేశానికి వచ్చి హాస్పిటల్ ప్రారంభించిన సందర్భంలో ప్రచారం నిమిత్తం ముద్రించిన కరపత్రం అది. అందులోని ఫోటో మరోమారు పరీక్షగా చూశాడు. పెదవులమీద సన్నపాటి నవ్వు కదలాడింది.

ఆ కాగితంలో ముద్రించి వున్న అక్షరాల క్రింద పెన్‌తో కొన్ని అంకెలు వేసి వాటి ప్రక్క ఒక వాక్యం వ్రాసివుంది.

ఎల్లుండి రాత్రి సరుకు వచ్చినప్పుడు పర్సంటేజీ గురించి అడగాలి.

ఎల్లుండి!

అంటే జరిగిపోయిన రోజా! ఈరోజా? మొన్న బ్యాగ్ దొంగిలించి తెచ్చాడు. ఆ లెక్కన ఈరోజు కావాలి. లేకపోతే నిన్న కూడా కావచ్చు. అది పనికిరాని కాగితం కావటానికి వీలులేదు. చమన్ లాల్ వంటి వ్యాపారస్తుడు పనికిరాని కాగితం తన బ్యాగ్‌లో భద్రంగా వుంచుకుంటాడా? దానికి చాలా ప్రాముఖ్యత వుండివుండాలి. ఎల్లుండి సరుకు రావటమంటే ఏ సరుకు?

ఆలోచనలతో అరగంట గడిచింది.

జరిగిపోయిన రోజయితే ప్రస్తుతం చెయ్యగలిగింది ఏమీ లేదు. మొన్న బ్యాగ్ తెచ్చాడు కనుక ఈరోజు కావటానికి అవకాశం ఎక్కువగా వుంది. రాత్రి అంటే ఎన్ని గంటలకి? సామాన్యంగా పది గంటల తరువాత చమన్ లాల్ ఇంటికి వెళతాడు. ఆ తరువాతే అయివుండాలి.

మరో పావుగంట గడిచింది.

రాత్రి ఎనిమిదిన్నర దాటింది సమయం.

ఇన్‌స్పెక్టర్ సుధీర్ కుర్చీలో వెనక్కి వాలి ఒళ్ళు విరుచుకున్నాడు. తెల్లవారితే డి.ఐ.జి. ఇన్‌స్పెక్షన్ వుంది. ఒకచోట హత్య లేక దోపిడీ జరిగినా హడావిడి చూపించని డిపార్ట్‌మెంట్‌కి ఇన్‌స్పెక్షన్ అంటే నిద్ర వుండదు. ఆ సమయంలో ఏమాత్రం తీరిక వుండదు. పై ఆఫీసర్‌పట్ల ప్రదర్శించే శ్రద్ధ, వినయం, కర్తవ్యంమీద కనిపించదు.

ఉదయంనుంచీ కష్టపడితే స్టేషన్ పనులు అప్పటికి పూర్తయ్యాయి. మొత్తం రికార్డులు బీరువాలో అందంగా కనిపిస్తున్నాయి.

స్టేషన్‌లో వస్తువులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సర్దినట్లు నీట్‌గా వున్నాయి. స్టేషన్‌ని పరీక్షగా చూసి అనుకున్నాడు సుధీర్. ఇప్పుడు ఇంటికి వెళ్ళి యూనిఫాం తయారయిందో లేదో చూసుకోవాలి.

లేచి క్యాప్ అందుకుని చెప్పాడు. "నేను గెస్ట్‌హౌస్‌కి వెళ్ళి ఇంటికి వెళతాను. మొత్తం స్టాఫ్‌ని ఉదయం పెరేడ్‌కి రమ్మని చెప్పావా?"

"చెప్పాను సార్!" రైటర వినయంగా సమాధానం ఇచ్చాడు కుర్చీ నుండి లేచి నిలబడి.

"నేను ఐదు గంటలకల్లా స్టేషన్‌లో వుంటాను" చెప్పి అక్కడనుంచి నాలుగడుగులు వేశాడు.

ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్...

ఫోన్ రింగయింది.

వెళుతున్న సుధీర వెనక్కి తిరిగి ఫోన్ వంక చూసి "అవసరమైతే తప్ప నా దగ్గిరికి రాకు..." చెప్పి కదిలాడు. రైటర్ ఫోన్ అందుకున్నాడు.

సుధీర్ మోటార్ సైకిల్ స్టాండ్ తీసి కిక్ కొట్టాడు. స్టార్ట్ కాలేదు.

సుడిగాలిలా పరిగెత్తుకువచ్చాడు రైటర్ 'సార్! డి.ఐ.జి.గారు లైనులో వున్నారు" చెప్పాడు కంగారుగా. అతని మొహానికి చెమట పట్టింది. ఆయాసంతో ఛాతి ఎగిరెగిరి పడుతోంది.

మనసులో భరించలేని విసుగు ప్రవేశించినా, పళ్ళ బిగువున అణచుకుని చకచకా వచ్చి ఫోన్ అందుకున్నాడు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అదే గొప్పతనం. ఎంత విసుగు ఏర్పడినా అణిచిపెట్టుకుంటారు. అందుకే వాళ్ళల్లో శాడిస్ట్ మెంటాల్టీ ఏర్పడుతుంది.

ఇది వ్యక్తి తప్పు కాదు, వ్యవస్థది!

"నమస్తే ఇన్‌స్పెక్టర్ సుధీర్!" అటునుంచి వినిపించింది. రిసీవర్ మీద ఇన్‌స్పెక్టర్ పిడికిలి బిగుసుకుంది.

"మీరెవరు?" అడిగాడు పళ్ళు కొరుకుతూ. సుధీర్ సూటిగా రైటర్ కళ్ళల్లోకి చూశాడు. ఫోన్‌లో మాట్లాడేది డి.ఐ.జి. కాదనేది నిర్వివాదాంశం. మామూలుగా పనిచేసే మెదడు ఆఫీసర్ పేరు చెబితే పనిచెయ్యదు.

"దేశ పౌరుడ్ని, ఈ వూరి నివాసిని..."

"ఏం కావాలి?"

"కొద్దిసేపట్లో జరుగుతున్న నేరాన్ని మీరు అరికట్టాలి..."

"చూడు మిస్టర్! నాకు అర్జంట్ పని వుంది. రెండు రోజులు ఆగి ఫోన్ చెయ్యి..."

"ఈరోజు రాత్రికి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో మీ డి.ఐ.జి. వస్తున్నాడు. ఆయనకోసం నువ్వు బుక్‌చేసిన గెస్ట్‌హౌస్‌లో కర్టెన్లకి, బెడ్‌కి సెంట్ వ్రాసారా లేదా అనే విషయం పరీక్షించటానికి బయలుదేరావ్. నిజానికి ఒక హత్యా స్థలాన్ని ఇంత జాగ్రత్తగా పరీక్షిస్తావా?"

అదిరిపడ్డాడు ఇన్‌స్పెక్టర్. ఇప్పుడు తను గెస్ట్‌హౌస్‌కి వెళుతున్నట్లు అతనికి ఎలా తెలిసింది?

"షటప్"

"గొడవ పెంచుకోవడం నా ఉద్దేశ్యం కాదు..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు అటునుండి మాట్లాడుతున్న వ్యక్తి. ఫోన్ పెట్టేయడమంత మంచిపని మరోటి లేదనే ఆలోచన సరిగ్గా అప్పుడే సుధీర్ బుర్రలో ప్రవేశించింది.

".... ఫోన్ పెట్టేయాలనుకుంటే పెట్టేయ్. ఒక విషయం మాత్రం గుర్తుంచుకో. నేను తలుచుకుంటే ఈ రాత్రి పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి నిద్ర లేకుండా చేస్తాను..." తాపీగా వినిపించింది.

అవతల వ్యక్తి గురించి అంచనా వెయ్యలేనంత తెలివితక్కువవాడు కాదు సుధీర్. ఆ వ్యక్తి కంఠంలో ధ్వనిస్తున్న ఆత్మవిశ్వాసం గుర్తించాడు. అందుకే ఫోన్ కట్‌చెయ్యలేకపోయాడు.

"ఈరోజు రాత్రి పది గంటలకి నీ బలగంతో ఫోన్ దగ్గి ఎదురుచూడు. ఒక దొంగనోట్ల ముఠా గురించి సమాచారం చెబుతాను..." డిస్‌కనెక్ట్ అయింది ఫోన్.

ఫోన్ పెట్టేసి నీరసంగా కుర్చీలో కూర్చుండిపోయాడు సుధీర్.

అదే స్టేషన్‌కి ఇరవై గజాల దూరంలోని పబ్లిక్ టెలిఫోన్ బూత్‌నుండి బయటకి వచ్చాడు చంద్రం. తనకి తెలిసిన ఒక మనిషి ఇంటివైపు బయలుదేరాడు.

◆ ◆ ◆

సుధీర్ వాచీ చూసుకున్నాడు. పదిన్నర దాటింది సమయం.

తనకి వచ్చిన ఫోన్ కాల్‌మీద నమ్మకం లేకపోయినా ఎదురుచూడక తప్పలేదు. ఒక్కొక్క నిముషం గడిచేకొలది అనుమానం పెరిగిపోతున్నది. తనని ఎవరైనా ఫూల్‌ని చెయ్యటానికి ఫోన్ చేసారేమోనని, నిజమైన ఇన్‌ఫర్‌మేషన్ అయితే బాధలేదు. ఫాల్స్ అయితే తనకి అక్షింతలు తప్పవు. తనతోపాటు ఆరుగురు జవాన్లని కూడా స్టేషన్‌లో వుంచుకున్నాడు. ఇన్‌స్పెక్షన్ పెరేడ్‌కి మొత్తం గైరుహాజరు క్రింద లెక్క. ఇది తన ప్రమోషన్‌మీద ప్రభావం చూపించదు కదా! ఆలోచనల్లో మునిగిపోయాడు.

స్టేషన్ ముందు జీప్ రెడీగా వుంది. జవానులు వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళకి మాత్రం దిగులుగా వుంది. తెల్లవారుఝూమున పెరేడ్‌కి రమ్మంటారేమోనని.

ఇన్‌స్పెక్టర్ అసహనంగా కుర్చీలో కదిలి సిగరెట్ వెలిగించుకున్నాడు. మొదట దమ్ము పీల్చబోతున్నాడు.

ట్రింగ్... ట్రింగ్...

“ఇన్‌స్పెక్టర్ సుధీర్ హియర్...” రిసీవర్ అందుకుని సిగరెట్ తీసి యాష్‌ట్రేమీద పెట్టి చెప్పాడు.

“ఐదు నిమిషాల క్రితం ఏ.ఏ.జడ్ 6542 నెంబర్ గల కారు గాంధీనగర్‌లోని రాజా మేడకి ఎదురుగా ఉన్న బిల్డింగు కాంపౌండులోకి వెళ్ళింది. కారులో డ్రైవరు కాక ఇద్దరు వున్నారు...”

“కారు రంగు ఏమిటి?”

“వైట్ కలరు అంబాసిడర్”

“అందులో దొంగనోట్లు వున్నాయా?”

“లేవు. కారులో వచ్చిన ఇద్దరు లోపలికి వెళ్ళారు. ఒకతని చేతిలో సూట్‌కేస్ వుంది. అందులో వుంటాయి. ఆ బిల్డింగ్ సేట్ చమన్ లాల్‌ది. వాళ్ళు లోపల మరో పది నిమిషాలు వుంటారు...”

“నీ పేరు?”

“వెళ్ళేటప్పుడు ఒక విషయం మర్చిపోకు”

“ఏమిటి?”

“యాష్‌ట్రేమీద పెట్టిన సిగరెట్ తీసుకోవటం...” ఫోన్ డిస్‌కనెక్ట్ అయింది.

సేఫ్టీ పిన్ తీసేసిన గ్రెనేడ్ జేబులో పెట్టుకున్నట్టు అదిరిపడ్డాడు సుధీర్. ఎన్నో అనుమానాలు ఆలోచించటానికి వ్యవధి లేదు. యాష్‌ట్రేమీద సిగరెట్ అందుకుని కదిలాడు వేగంగా. క్షణాల్లో స్టేషన్ వదిలి దూసుకుపోయింది జీప్. చమన్ లాల్ బిల్డింగ్ చేరటానికి ఐదు నిమిషాలు పట్టింది.

ముందు వాచ్‌మాన్‌ని, కారు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నాడు. క్షణాలమీద మిగతావాళ్ళని అరెస్టుచేశాడు. ఫోన్‌చేసి వ్యాన్ రప్పించాడు. తను అరెస్టుచేసిన తొమ్మిది మందిని వ్యాన్ ఎక్కించాడు. సూట్‌కేస్‌తో సుధీర్ జీప్‌వైపు వెళుతున్నాడు. అతనికి సంతోషంగా వుంది. ప్రమోషన్ చాలా తొందరగా వస్తుందని.

ఆ దారిన వెళుతున్న మోటార్ సైకిల్ జీప్ వద్ద ఆగింది.

“ఏం జరిగింది సార్?” అడిగాడు మోటార్ సైకిల్‌మీద కూర్చున్న యువకుడు. అతను స్టూడెంట్ మాదిరి కనిపించటంతో వచ్చిన కోపాన్ని పళ్ళ బిగువున అదిమిపట్టుకొని,

“రేపు పేపరులో చదువు...” అన్నాడు.

ఆ యువకుడు మాట్లాడకుండా మోటార్ సైకిల్ పోనిచ్చాడు. అతను చిన్నగా నవ్వుకోవడం ఇన్‌స్పెక్టర్ గమనించలేదు.

పనిలేని ప్రతివాడూ ప్రశ్నించేవాడే అని మనసులో అనుకున్నాడు. ఆ యువకుడే తనకి ఫోన్ చేసినవాడని తెలియదు. జరిగిన సంఘటనలు ఒకదానితో మరోటి సంబంధం లేకపోవడంవల్ల గుర్తుపట్టే అవకాశం లేకపోయింది.

ముందు వ్యాన్ వెనుక జీప్ బయలుదేరాయి.

అప్పటికి మోటార్ సైకిల్ సందు మలుపు తిరిగింది. మోటార్ సైకిల్ మీదున్న చంద్రం మనసులో అనుకుంటున్నాడు. చమన్ లాల్ పని పూర్తయినట్టే ఇక తన పని ప్రారంభించాలి. తరువాత చెయ్యాల్సిన దానిగురించి పథకం అతని మనసులో రూపుదిద్దుకుంటున్నది.

## 5

మోటార్ సైకిల్ దూసుకొచ్చి పొదల ప్రక్కన ఆగింది. దాని మీదనుండి చంద్రం దిగి చుట్టూ పరిశీలనగా చూశాడు. ఆ ప్రదేశంలో పెద్ద మార్పు కనిపించలేదు అతని కంటికి. దూరంగా ఒక ఫ్యాక్టరీ కనిపిస్తోంది. ఫ్యాక్టరీ గొట్టంనుండి పొగ బయటకి వచ్చి గాలిలో

కలసిపోతున్నది. అంటే లాస్ట్ షిఫ్ట్ ప్రారంభమయిందన్నమాట.

ఆ ఫ్యాక్టరీ ఇరవై నాలుగ్గంటలూ పనిచేస్తుంది. మూడు షిఫ్ట్‌లుగా వర్కర్లు అందులో పనిచేస్తారు. అందులోనే పనిచేస్తున్న ఒక వ్యక్తి చంద్రానికి కావాలి. అతను ఏ షిఫ్ట్‌లో వుంటాడో తెలియదు. కాని అతను సామాన్యంగా చివరి షిఫ్ట్ పనికి వెళ్ళడు. ఆ సమయంలో ఇంట్లోనే వుండొచ్చు. ఆలోచిస్తూ ఒక ప్రక్కకి చూసాడు. దూరంగా పల్లంలో ఊరు కనిపిస్తోంది చీకట్లో మసగ్గా. ఊరు కొంచెం పెద్దదయినట్లు తోచింది అతనికి. ఊరు మొత్తం ఐదు వీధుల సముదాయం. అందులో నివసించే ప్రజల్లో తొంభై శాతం ఫ్యాక్టరీ వర్కర్లే.

అటువైపు నడిచాడు చంద్రం. అతను నడుస్తున్న దారి తిన్నగా ఊరులోకి వెళుతుంది. ఊరులోకి ప్రవేశించిన తరువాత చుట్టుప్రక్కల ముళ్ళని చూసుకుంటూ నడిచాడు. ఒకచోట పెద్ద స్థలంలో చిన్న పాక కనిపించింది. అది స్కూలనే విషయం తెలియపరుస్తూ శిథిలావస్థలో వేలాడుతున్నదో బోర్డు. దాని ముందు నిలుచున్నాడు కాసేపు. అక్కడనుంచి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ సందు చివర వరకూ నడిచి పక్క సందులోకి తిరిగాడు. అతను ప్రతి ఇంటిని పరీక్షగా చూస్తూ నడుస్తున్నాడు. లాస్ట్ షిఫ్ట్ తరువాత ఆ ఊరులో జనసంచారం వుండదు. అందుకే ఆ సమయాన్ని ఎన్నుకున్నాడు చంద్రం.

ఒక ఇంటి ముందు ఆగాడు.

కాసేపు ఆ ఇంటిని పరీక్షగా చూసి మెట్లెక్కాడు. కాస్త టెన్షన్ మొదలయింది అతని మనసులో. ఒకసారి బలంగా ఊపిరి పీల్చి వదిలాడు. చేత్తో తలుపు తట్టాడు.

ఎటువంటి రెస్పాన్సు రాలేదు.

మరోసారి తట్టాడు.

కొంతసేపు నిరీక్షించి ఈసారి గట్టిగా తట్టాడు.

“ఎవరూ?” అంటూ వినిపించిందో పురుష కంఠం లోపలనుంచి. ఆ కంఠంలో నిర్లక్ష్యం ధ్వనిస్తోంది.

“నేను...” చెప్పాడు చంద్రం. అదో విచిత్రమైన సమాధానం. లోపలనుంచి ప్రశ్నించిన వాళ్ళకి జవాబులా వుంటుంది కాని అది జవాబు మాత్రం కాదు.

కొన్ని క్షణాల తరువాత తలుపు తెరుచుకుంది. గుమ్మం అవతల ఒక వ్యక్తి నిలబడివున్నాడు. లోపలప్రక్క లైటు వెలుగుతున్నా అతని మొహం స్పష్టంగా కనిపించడంలేదు. ఆ గదిలో ఎవరూ లేరని గ్రహించాడు చంగ్ర అతని వెనుకనుండి లోపలికి చూసి.

“ఎవరు కావాలి?” అడిగాడా వ్యక్తి అసహనంగా.

“ఏసుపాదం” చెప్పాడు చంద్రం నిర్వికారంగా శూన్యంలోకి చూస్తున్నట్టు.

“నేనే... ఏం కావాలి?” అడిగాడు విసుగ్గా.

మరోమారు అతని వంక పరీక్షగా చూసి పిడికిలి బిగించి గుద్దాడు మొహంమీద. ఆ దెబ్బకి అతను వెనక్కి తూలాడు. ఏం జరుగుతున్నదో ఒక్క క్షణం అతనికి అర్థంకాలేదు. అర్థం చేసుకునేలోగా చంద్రం కుడికాలు విసురుగా తగిలింది మెడమీద. అదిరిపడ్డాడు ఏసుపాదం. అతని మెదడు మొద్దుబారిపోయింది. గట్టిగా అరవాలనే ఆలోచన కూడా అతనికి రాలేదు. లేవడానికి ప్రయత్నిస్తున్న ఏసుపాదం మొహంమీద మరోమారు తన్నాడు. చంద్రం మెరుపులా కదులుతున్నాడు ఏసుపాదానికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా. ఏసుపాదం తల గచ్చుకి గుద్దుకుంది. అప్పుడొచ్చింది అరవాలనే ఆలోచన, అయితే అప్పటికే ఆలస్యం జరిగిపోయింది. నిర్జీవంగా తల వాల్చేసాడు. అతనికి స్పృహ తప్పింది.

ఏసుపాదానికి భార్య లేదు. అతని ఇద్దరు పిల్లలూ విదేశాల్లో చదువుతున్నారు. ఫ్యాక్టరీ కార్మికుల యూనియన్‌కి అతను నాయకుడు. ఆ పదవిలో అతను బాగా సంపాదించాడు. అందుకే మిగతా కార్మికులకంటే మంచి ఇల్లు కట్టుకోగలిగాడు. అప్పుడప్పుడు ఆడవాళ్ళని తెచ్చుకుని శారీరక అవసరాలు తీర్చుకుంటూవుంటాడు. వంటమనిషి రెండు పూటలకూ కలిపి ఒకేసారి వండిపెట్టి వెళ్ళిపోతుంది. అందుకే అతని ఇంట్లో మనుషులు లేరు.

ఏసుపాదాన్ని బుజానికెత్తుకుని తీసుకెళ్ళి గదిలో మంచంమీద పడేశాడు. మొల చుట్టూ ఫాంట్‌మీద చుట్టుకున్న తాడు విప్పి దానిని నాలుగు ముక్కలు చేసాడు. ఏసుపాదం కాళ్ళు చేతులు కదలకుండా నాలుగుప్రక్కలా కట్టాడు. తరువాత ఆ ఇంటిని పరిశీలించడం మొదలుపెట్టాడు. వంటింట్లో అతనికి గ్యాస్ స్టౌవ్ కనిపించింది. దానిని చూడగానే ఫ్లాష్‌లాంటి ఆలోచన వచ్చింది చంద్రానికి.

స్టౌవ్‌కి కనెక్ట్ చేసివున్న రబ్బరు గొట్టాన్ని పీకేసి సిలెండర్ మోసుకొచ్చి ఏసుపాదాన్ని కట్టేసిన మంచానికి అయిదడుగుల దూరంలో అతనికి కనిపించే విధంగా వుంచాడు. తెరచివున్న తలుపులు మొత్తం మూసేసి బాత్‌రూమ్ తలుపు మాత్రం తెరచివుంచాడు. మరోసారి ఓపిగ్గా వెదకడం ప్రారంభించాడు గదులన్నీ. అరగంట తరువాత దొరికాయి అతనికి కావాల్సిన వస్తువులు.

అవి క్రొవ్వొత్తి, దారపు రీలు!

అవి తీసుకుని బయటకెళ్ళి చిన్న రాయి పట్టుకొచ్చాడు. అది యాభై గ్రాముల బరువు వుంటుంది. గది నిర్మాణాన్ని మరోమారు పరీక్షించాడు. ఆ సమయంలో అతను నిశితంగా ఆలోచిస్తూ, చకచకా తనకి కావాల్సిన వస్తువులు సమకూర్చుకుంటున్నాడు. టేబుల్ ఫ్యాన్ వైరు పట్టుకుని లాగి చూసాడు. అది రాలేదు. ఒక కాలుతో ఫ్యాన్‌ని తొక్కిపట్టి వైరు తెంపాడు. దానిని టేబుల్ లైట్ వైరుకి కలిపాడు. టేబుల్‌ని ఏసుపాదానికి ఎదురుగా లాగి దానిమీద లైటు వుంచాడు. ప్లగ్ పెట్టి లైటు వెలిగించి చూసాడు.

లైటు వెలిగింది.

దారానికి చివర రాయి కట్టి టేబుల్ లైట్ స్విచ్‌కి ఎదురుగా కొంత ఎత్తులో పట్టుకుని క్రిందకి వదిలాడు. రాయి తిన్నగా స్విచ్‌మీద పడింది. అనుకున్న ఫలితం రాలేదు. రాయిని కాస్త ప్రక్కకి జరిపి మరోమారు వదిలాడు. అది స్విచ్‌కి ఒక చివర పడి లైట్ వెలిగింది. తృప్తిగా తలాడించి, టేబుల్ లైట్ ఆర్పేశాడు. ఈసారి రాయిని లైటు మీదనుంచి వ్రేలాడేటట్టు పట్టుకుని కొంతదూరం దారం పట్టుకుని వెళ్ళి అక్కడ నిలబడి దారాన్ని వదిలాడు. రాయి పడి స్విచ్ ఆన్ అయి మళ్ళీ లైట్ వెలిగింది. లైట్ ఆర్పి రాయి అదే పద్ధతిలో వుండే విధంగా జాగ్రత్తపడుతూ దారం తీసుకుని బాత్‌రూమ్ దగ్గరికి వెళ్ళి దారాన్ని తలుపు మీదనుంచి బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్ళాడు. దారాన్ని క్రొవ్వొత్తికి ముడివేసి దానిని వెలిగించి బాత్‌రూమ్‌లో బకెట్ మీద నిలబెట్టాడు. దారం కదలకుండా తలుపు మూసి బెడ్‌లైట్ దగ్గిరికి వచ్చి ఆ ఏర్పాటుని పరీక్షించి చూసుకున్నాడు.

ఏసుపాదం దగ్గరికి వచ్చి అతని మొహంమీద నీరు జల్లాడు. కళ్ళు తెరిచిన వెంటనే గింజుకున్నాడు అతను. తను కదలలేనని గ్రహించి భయంగా చంద్రం వంక చూశాడు.

“ఎవరు నువ్వు?” అడిగాడు వణుకుతున్న కంఠంతో.

“నీ పాలిట మృత్యువుని. నా తండ్రి అసంపూర్తిగా వదిలిపెట్టి కార్యాన్ని పూర్తి చెయ్యడానికి వచ్చాను” చెప్పాడు ఏసుపాదం మొహంలోకి చూస్తూ. అప్పుడు చంద్రం కళ్ళు కోపంతో ఎరుపురంగు పులుముకున్నాయి. చెమట పట్టిన అతని మొహం కందిపోయి మృత్యువులా కనిపిస్తున్నాడు.

“నీకేం అన్యాయం చేశాను? నన్ను వదిలిపెట్టు…”

“ఒక మనిషిని క్రూరంగా చంపడానికి వెనుకాడని మీలాంటి మృగాలకి మీ వెనుక ఒక తరం వుందనే విషయం గుర్తుండదురా! ఈ దీపం మీదినుండి వ్రేలాడుతున్న రాయిని చూడు. అదే నీ ప్రాణం. దానిమీదే ఆధారపడి వుంది నీ బ్రతుకు. నేను ఇక్కడ నుంచి వెళ్ళేముందు గ్యాస్ ఓపెన్ చేస్తాను. కొన్ని నిమిషాల్లో గదంతా గ్యాస్‌తో నిండిపోతుంది. సరిగ్గా పది నిమిషాల సమయంలో క్రొవ్వొత్తి అరంగుళం కాలుతుంది. బాత్‌రూమ్‌లో వెలుగుతున్న క్రొవ్వొత్తికి కట్టిన దారం కాలి తెగిపోతుంది. అప్పుడు ఆ రాయి తిన్నగా స్విచ్‌మీద పడుతుంది. లైట్ వెలిగి ఒక్కసారి గది పేలిపోతుంది అన్యాయంతో నీవు పెంచుకున్న నీ భవిష్యత్తు గాలిలో కలిసిపోతుంది. నీ శరీరం ముక్కలు ముక్కలుగా విడిపోయి ప్రొద్దుట కుక్కలకి ఆహారంగా మారుతుంది” చెప్పాడు కటువుగా.

“వద్దు… వద్దు… నన్ను వదిలేయ్. నీకు ఆజన్మాంతం ఋణపడివుంటాను” చెప్పాడు వణికిపోతూ. అప్పటికే అతని శరీరం స్నానం చేసినట్టు చెమటతో తడిసిపోయింది.

ఒక మనిషిని నడిరోడ్డుమీద నలుగురు పట్టుకుని వుండగా వికటంగా నవ్వుతూ కత్తితో పొట్టలో పొడిచినపుడు నీకు కలుగలేదురా బాధ!”

ఒక్కసారిగా నోరు తెరిచాడు ఏసుపాదం అరవడానికి. చటుక్కున కదిలి అతని నోటికి అడ్డుగా ఒక చెయ్యి వుంచాడు చంద్రం. ఏసుపాదం పళ్ళు చేతిలోకి బలంగా దిగేయ్. అతను కసిగా కొరికాడు. దానిగురించి పట్టించుకోకుండా దుప్పటి లాగి కొంతభాగం నోటిలో కుక్కుతూ చెయ్యి వెనక్కి లాక్కున్నాడు. పళ్ళు దిగి మాంసం తప్పుకుని ఎముక కనిపిస్తోంది తెల్లగా బయటకి. ఆ తెల్లటి భాగాన్ని రక్తం ఆక్రమించుకుంటోంది. గది తలుపు తెరిచి హాలులోని లైటు వెలిగించి వచ్చి మరోసారి గదిని పరీక్షించి ఆ గదిలోని లైట్ ఆర్పేశాడు. హాలులో వెలుగుతున్న దీపంకాంతి తలుపు తెరిచి వుండటంవల్ల ఈ గదిలో పడుతోంది. సిలెండర్ దగ్గిరికి వచ్చి దాన్ని ఆన్‌లో వుంచాడు. రెగ్యులేటర్ హోల్ నుంచి ‘ఉస్’మనే శబ్దంతో గ్యాస్ బయటికి రావడం ప్రారంభించింది.

“నిన్ను చంపడం చాలా తేలిక ఏసుపాదం! చావుని భరించడం కూడా తేలికే! కాని చావుకోసం గ్యాస్ నిండిన గదిలో పది నిమిషాలు గడవడమే కష్టం. గడుస్తున్న ప్రతి సెకను నిన్ను మృత్యువుకి దగ్గరగా తీసుకెళుతుంటే ఆ ఆలోచన నిన్ను చిత్రవధ చెయ్యడం గొప్ప అనుభూతి. వస్తాను…” చెప్పి తలుపు మూసి వడివడిగా నడుచుకుంటూ బయటికి వచ్చాడు. రెండు సందులు దాటి ఒక సందులో ప్రవేశించాడు. ఒకచోట చిన్న ఖాళీ స్థలముంది. అది చెత్తా చెదారంతో నిండిపోయి వుంది. దానిముందు నిలుచున్నాడు చంద్రం.

అతని కళ్ళనుండి రెండు కన్నీటి బొట్లు రాలి క్రింద పడ్డాయి. దాని వంక చూస్తూ శిలలా వుండిపోయాడు. ఆ స్థలంలో ఒక ఇల్లు వుండేదన్న దానికి గుర్తులేమీ లేకుండా చెత్తకుప్పలు ఎత్తుగా వున్నాయి. ఒక వ్యక్తి నిస్వార్థసేవకి మెచ్చి ఇచ్చిన కానుకలవి. చెత్తని తప్పించి చూస్తే అందులో ఒక ఇంటి శిథిలాలు కనిపిస్తాయి.

ఒక్కసారిగా ఆకాశం పెటేలున బ్రద్దలైన శబ్దం. తల ఎత్తి చూశాడు చంద్రం. పెద్ద మంటతోపాటు తునాతునకలైన డాబా భాగాలు కనిపిస్తున్నాయి. ఏసుపాదం శరీరం ఛిన్నాభిన్నమై వాటిలో కలసిపోయివుంటుంది. చిన్న చిన్న మాంసపు ముక్కలు తప్ప శవం కనిపించదు.

చంద్రం ఒక నిట్టూర్పు విడిచి అక్కడనుంచి కదిలాడు అతి కష్టంమీద.

మొదటిగా ఆ సందులో ఒక ఇంటి తలుపు తెరుచుకుని బయటకొచ్చాడో వ్యక్తి. వెళుతున్న చంద్రాన్ని చూసి అడిగాడు.

"ఏదో పేలిన శబ్దం వినిపించింది... ఏం జరిగింది?"

"యూనియన్ నాయకుడు ఏసుపాదం ఇల్లు పేలిపోయింది" చెప్పాడు నిర్లిప్తంగా ఆగకుండా వెళ్ళిపోతూ.

అది అతను జీర్ణించుకునేసరికి మరికొంతమంది బయటికి వచ్చారు. చంద్రంతో మాట్లాడిన వ్యక్తి తనకి సమాధానం చెప్పిన మనిషికోసం చూశాడు.

అప్పటికే చంద్రం దూరంగా చీకటిలో కలిసిపోయాడు.

◆ ◆ ◆

డాక్టర్ జీవన్ ప్రకాష్.

నలభై సంవత్సరాల వయసు వుంటుంది. ఆరడుగుల ఎత్తుతో ఎర్రగా వుంటాడు. విశాలమైన నుదురు, విజ్ఞానంతో తీక్షణంగా కనిపించే కళ్ళు వాటి వెనక డబ్బు సంపాదించాలనే కాంక్ష కనిపిస్తుంది.

అతను నాలుగు నెలల క్రితం విదేశాలలో డిగ్రీ తీసుకుని ఇండియా వచ్చాడు. జిల్లా మొత్తంలో అతనికి సాటి రాగల డాక్టర్ లేడు. అతని కన్సల్టింగ్ ఫీజు సామాన్య మానవునికి అందుబాటులో వుండదు. నెలకి నాలుగు అంకెల సంపాదన గలవాళ్ళు మాత్రం అతని దగ్గరకు వస్తారు.

డాక్టర్ జీవన్ ప్రకాష్ ఒక అధునాతనమైన హాస్పిటల్ కట్టించాడు. మామూలు ప్రజలకి ఊహలో కూడా ప్రవేశం దొరకని హాస్పిటల్ అది. మొత్తం హాస్పిటల్ ఎయిర్ కండీషన్డ్ చేయించబడింది. విదేశాల నుండి దిగుమతి చేసుకున్న పరికరాలతో హాస్పిటల్ తీర్చిదిద్దాడు.

విశాలమైన స్థలంలో నిర్మించబడిందా హాస్పిటల్. దాని చుట్టూ ఎత్తయిన కాంపౌండ్ వాల్ కట్టబడివుంది. అందులో లేబరేటరీ, ఎక్స్‌రే క్లినిక్, మెడికల్ షాప్ వున్నాయి. వచ్చిన పేషెంట్లు బయటికి వెళ్ళవలసిన అవసరం లేదు. ఆ హాస్పిటల్‌ని జాగ్రత్తగా పరీక్షిస్తే ఒక వ్యాపారస్తునికి వుండవల్సిన తెలివితేటలు డాక్టర్ జీవన్ ప్రకాష్‌కి వున్నాయని అర్థమవుతుంది. అతను డబ్బు ఖర్చుపెట్టి చదువుకున్నాడు. డబ్బు సంపాదించటం అతని లక్ష్యం.

సరిగ్గా తొమ్మిది గంటలకి డాక్టర్ జీవన్ ప్రకాష్ హాస్పటల్‌కి వచ్చాడు. అతన్ని చూసి ఒకరిద్దరు పేషెంట్లు సోఫాల్లోంచి లేచి నమస్కారం చేశారు. తల ఊపుతూ తన రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

సోఫాలో కూర్చున్న చంద్రం తన చేతిలోని టోకెన్ వంక చూసాడు. అంతకుముందే కన్సల్టింగ్ ఫీజు చెల్లించి దాన్ని తీసుకున్నాడు. టోకెన్ నెంబర్ త్రీ. ముందు ఇద్దర్ని చూసి తరువాత తనని చూస్తాడు. లేచి బయటికి నడిచాడు. అలా వస్తున్నప్పుడు కాలింగ్ బెల్ మ్రోగటం మొదటి పేషెంటు లోపలికి వెళ్ళటం గమనించాడు. ఒక్క పేషెంట్ మాత్రమే వున్నాడు. చంద్రం తొందరగా బయటకి వచ్చాడు.

పబ్లిక్ టెలిఫోన్ బూత్‌కి వెళ్ళి ఒక నంబరు తిప్పాడు. అవతల ఫోన్ తీసిన శబ్దం విని చెప్పాడు.

"డాక్టర్ జీవన్ ప్రకాష్?"

"యస్" వినిపించింది.

"ఐదు నిమిషాల్లో నువ్వు చావబోతున్నావ్!"

"ఎవరు నువ్వు?"

"నీకోసమే పెరిగిన మృత్యువుని"

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్?"

"సెన్స్‌తో చెబుతున్నాను డాక్టర్! కొద్ది నిముషాలు మాత్రమే నువ్వు బ్రతికి వుంటావ్" చెప్పి ఫోన్ పెట్టేసి హాస్పటల్ వైపు నడిచాడు చంద్రం.

డాక్టర్ ప్రకాష్ ఒక నెంబరు తిప్పి "హల్లో" అన్నాడు.

"స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ని మాట్లాడుతున్నాను..."

"నేను డాక్టర్ జీవన్ ప్రకాష్‌ని. ఒకసారి అర్జంటుగా హాస్పటల్ రాగలరా?"

"తప్పకుండా..."

"వెంటనే బయలుదేరాలి" చెప్పాడు.

స్టేషన్‌లో యస్.ఐ. ఫోన్ పెట్టేసి, "రైటర్! మోటార్ సైకిల్ వచ్చిందా?" అడిగాడు.

అంతుకముందు పెట్రోలుకోసం పంపించాడు మోటార్ సైకిల్‌ని. దానిని తీసుకెళ్ళిన కానిస్టేబుల్ ఒక హోటల్ ముందు బండి ఆపి లోపలికి వెళ్ళి టిఫిన్ తింటున్నాడు అదే సమయానికి.

చంద్రం వచ్చి సోఫాలో కూర్చున్నాడు. అతని మొహం భావరహితంగా వుంది.

మరోసారి కాలింగ్ బెల్ మ్రోగింది. రెండవ పేషెంట్ లోపలికి వెళ్ళాడు. మొదటి పేషెంటు మెడికల్ షాపువైపు నడిచాడు. డాక్టర్ విదేశాల నుండి వచ్చినందువల్ల కాబోలు డిసిప్లిన్ మెయింటెయిన్ చేస్తాడు. అతని అనుమతి లేకుండా ఎవరూ లోపలికి ప్రవేశించకూడదు. అవసరమైతే ఇంటర్‌కమ్‌లో చెప్పాలి.

మరో పావుగంటకి కాలింగ్ బెల్ మ్రోగింది.

చంద్రం లోపలికి ప్రవేశించాడు.

డాక్టర్ చిరునవ్వుతో చెప్పాడు, "కూర్చోండి..."

చంద్రం కూర్చుని "గత కొద్ది రోజులుగా కడుపులో నొప్పి వస్తోంది..." చెప్పాడు.

పేరు, వయసు కనుక్కుని చీటీమీద వ్రాసాడు.

"భోజనం చేసిన తరువాతా, ముందా?" అడిగాడు పరీక్షగా చూస్తూ.

"అన్నివేళలా వుంటుంది... ఇప్పుడు కూడా!"

"షర్టు తీసేసి బల్లమీద పడుకోండి" చెప్పి ఎగ్జామ్ రూమ్ వంక చూపించాడు.

చంద్రం లోపలికి వెళ్ళి షర్టు విప్పాడు. ఒక నిమిషం తరువాత డాక్టర్ లోపలికి ప్రవేశించి తలుపు మూసాడు.

డాక్టర్ మొహం వంక నిదానంగా చూసి, "మీకు విశాలి గుర్తుందా?" అడిగాడు చంద్రం.

"ఏ విశాలి?" అడిగాడు బల్ల దగ్గిరకి వెళుతూ.

"జీవితంలో జరిగిన ముఖ్య సంఘటనలు గుర్తుపెట్టుకోవాలి డాక్టర్!"

గిరుక్కున వెనక్కి తిరిగాడు. ఎదురుగా నాలుగడుగుల దూరంలో నిలుచున్న వ్యక్తి కళ్ళ వంక పరీక్షగా చూశాడు. ఆ కళ్ళల్లో ఎటువంటి భావమూ కనిపించకపోయినా ఎన్ని అవాంతరాలు వచ్చినా తను చెయ్యదల్చుకున్న పనిని చెయ్యగలనన్న ధీమా మొహంలో కనిపిస్తోంది.

డాక్టర మనసు ప్రమాదాన్ని పసిగట్టింది. అతని చెయ్యి తొందరగా కాలింగ్ బటన్ వైపు కదిలింది.

చంద్రం చురుగ్గా కదిలి పిడికిలి బిగించి గుద్దాడు దవడమీద. అటువంటి అవసరంకోసమే గత పది సంవత్సరాలుగా ప్రాక్టీసు చేసిన దెబ్బ. డాక్టర్ జీవన్ ప్రకాష్ గోడకి గుద్దుకొని క్రింద పడ్డాడు.

ఒక అడుగు ముందుకి వేసి లేవబోతున్న డాక్టర్ మెడక్రింద తన్నాడు కుడికాలుతో. మరోసారి గుద్దుకున్నాడు గోడకి. అటువంటి దెబ్బలు అలవాటు లేకపోవడంవల్ల కళ్ళు బైర్లుక్రమ్మాయి.

చంద్రం తన నడుము చుట్టూ చుట్టుకున్న వైరుని బయటకి తీసి డాక్టర్ దగ్గిరకి నడిచాడు. ఆ వైరపు డాక్టర్ మెడకి తగిలించి రెండు చేతుల్తో బిగించాడు. డాక్టర్ తన రెండు చేతులతో వైరు పట్టుకుని విడిపించుకోవాలని గట్టిగా లాగాడు. చంద్రం చేతులు ఒక అంగుళం కూడా కదలలేదు. ఊపిరి ఆడక డాక్టర్ నోరు తెరిచాడు. అతని శరీరం గింజుకుంటున్నది. క్రమేపి అతని శరీరంలో చలనం ఆగిపోయింది.

మెడనుంచి వైరు తప్పించి తిరిగి మొలకి చుట్టుకున్నాడు. షర్టు అందుకుని తొడుక్కున్నాడు. కన్సల్టింగ్ రూమ్‌లోకి వచ్చి టేబుల్‌మీద వున్న డాక్టర్ డైరీని తీసుకున్నాడు. రెండు క్షణాలు గదిని పరిశీలించి మరోవైపు కనిపించిన తలుపు చూసి అటు నడిచాడు.

చంద్రం వార్డ్‌లోకి ప్రవేశించి అక్కడనుండి కన్సల్టింగ్ రూమ్ ముందునుంచి నడుస్తూ కన్సల్టింగ్ రూమ్ ముందు కనిపించిన దృశ్యం చూసి ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు.

కన్సల్టింగ్ రూమ్ ముందు యూనిఫారంలో వున్న ఒక యస్.ఐ. వార్డుబోయ్‌తో మాట్లాడుతున్నాడు.

"పేషెంట్‌ని చూస్తున్నారు. అది అయిన వెంటనే చెబుతాను. మీరు అంతవరకూ కూర్చోండి..." చెప్పాడు వార్డ్‌బోయ్.

యస్.ఐ. సోఫాలో కూర్చున్నాడు.

చంద్రం తల వంచుకుని సీరియస్‌గా యస్.ఐ. ముందునుంచి బయటకి వచ్చాడు. అతన్ని సబ్ ఇన్‌స్పెక్టర్ గాని వార్డ్ బోయ్ గాని గమనించలేదు.

చంద్రం చకచకా నడుచుకుంటూ హాస్పటల్‌కి కొద్ది దూరంలోని సందులోకి తిరిగి అక్కడ నిలబెట్టి వున్న మోటార్ సైకిల్ స్టార్ట్‌చేసి వాచీ చూసుకున్నాడు. ట్రైన్ కదలటానికి మూడు నిమిషాలు మాత్రమే వుందని మనసులో అనుకుని వేగంగా పోనిచ్చాడు. రైల్వే స్టేషన్ చేరటానికి రెండు నిమిషాలు పట్టింది. పార్కింగ్ ప్లేస్‌లో మోటార్ సైకిల్ వుంచి, కౌంటర్‌లో టిక్కెట్ తీసుకుని కూతపెట్టి నెమ్మదిగా కదిలిన ట్రైన్ ఎక్కి కూర్చున్నాడు.

ఒక వ్యక్తి పార్కింగ్ ప్లేస్‌కి వచ్చి జేబులోంచి కీ తీసి, చంద్రం వదిలిన మోటార్ సైకిల్ స్టార్ట్‌చేశాడు.

ట్రైన్ వేగం పుంజుకుంది.

మోటార్ సైకిల్ బయలుదేరింది.

అన్నీ చంద్రం అనుకున్నట్టుగానే జరిగాయి.

ఒక్కటే తేడా!

వూహించని విధంగా యస్.ఐ. ప్రవేశించటం!

# 6

"వెంకట్రావుగారున్నారా?" అడిగాడతను.

నాలుగు సంవత్సరాల పాపముందు మోకాళ్ళమీద కూర్చుని పలకపైన అక్షరాలు దిద్దుస్తున్న వ్యక్తి తల యెత్తి కళ్ళజోడులోంచి చూశాడు. అతనికి నలభై సంవత్సరాల లోపు వుంటుంది వయసు. కళ్ళల్లో శాంతం, మొహంలో సాధుస్వభావం గోచరిస్తున్నాయి.

అది క్లాస్ రూమ్. సుమారు పాతికమంది బాలబాలికలు ఉన్నారు. అందరూ ఐదు సంవత్సరాల లోపువారే. ఆ ప్రాంతంలో పిల్లల అల్లరి తాలూకు సవ్వడి ఎగసిపడుతోంది.

"నేనే! మీ రెవరు?" అడిగాడు అతను కూర్చున్న చోటునుంచి లేచి దగ్గరకి వస్తూ.

"మీతో మాట్లాడాలి"

"రండి! కూర్చుని మాట్లాడుకుందాం"

"పర్సనల్‌గా మాట్లాడాలి" నిలుచ్చు చోటునుండి కదలకుండా అన్నాడు.

"పర్సనల్‌గానా..." అని కొన్ని క్షణాలు ఆలోచించి, "క్లాస్ పూర్తవకుండా బయటికి రావడం ధర్మంకాదు. మీరు శ్రమ అనుకోకుండా అక్కడ కనిపిస్తున్న ఇంటికి వెళ్ళి నా స్నేహితుడ్నని చెప్పండి. అక్కడ మీరు విశ్రాంతి తీసుకుంటే ఒక గంటలో నేను వస్తాను..." చెప్పాడు. వచ్చిన మనిషిని గౌరవించే సంస్కారం వుంది అతని మాటల్లో.

"అయిదు నిముషాలే కదా!" అన్నాడతను, వచ్చిన పని పూర్తిచేసుకుని పోవాలనే తొందరలో.

"మీ బోటివారికి అయిదు నిముషాలు పెద్ద విశేషం కాదు. జీవితంలో నిజాయితీగా బ్రతకాలనుకునే మాలాంటివాళ్ళకి, జీవితానికి పునాది వెయ్యబడే అటువంటి బాలలకి ప్రతిక్షణం విలువైనదే"

అతను మాట్లాడకుండా వెంకట్రావ్ చూపించిన ఇంటివైపు నడిచాడు. భుజాల చుట్టూ పైట కప్పుకుని వెంకట్రావ్ భార్య బయటకి వచ్చింది. ఆమె మొహం చూసి ఉలిక్కిపడ్డాడు అతను. పుట్టిన తరువాత అంత నిర్మలంగా వున్న మొహాన్ని తల్లిలో తప్ప మరెవరిలోనూ చూడలేదు. ఎవరినైనా ఒక్కలాగే చూడగల నిర్మలమైన చూపు జీవితాన్ని శాసించటంవల్ల వచ్చిన తేజస్సు కావచ్చు ఆమె మొహంలోని కాంతి.

అక్కడ నిరాడంబరమైన ప్రశాంతత గోచరిస్తోంది. ఇంటిముందు తులసి మొక్క, రెండు పెద్ద పెద్ద వేపచెట్లు, గెలలు దిగి నిండుగా కనిపిస్తున్న కొబ్బరి మొక్కలు, చల్లని వాతావరణం వాళ్ళ అభిరుచికి చిహ్నాలుగా కనిపిస్తున్నాయి.

విషయం తెలుసుకుని ఆమె కుర్చీ తెచ్చి చెట్టుక్రింద వేసింది. అడక్కుండానే మంచినీళ్ళు తెచ్చిఇచ్చి లోపలికి వెళ్ళి మరో ఐదు నిముషాలకి కాఫీతో వచ్చింది. కాఫీ త్రాగిన తరువాత గ్లాసులు తీసుకుని వెళ్ళిపోయింది.

అక్కడ ఏదో అపశృతి వున్నట్టు అతనికి తోచింది. వెంకట్రావ్ సంస్కారవంతమైన మాటల్లో, అతని భార్య నుదుట రూపాయి కాసంత కుంకుమ బొట్టులో, చక్కగా నిర్మించుకున్న తాటాకుల ఇంటి పరిసరాల్లో ఏదో అపశృతి అక్కడ ముళ్ళమీద కూర్చున్నట్టుగా వుంది అతనికి.

అందమైన పుష్పాన్ని వాసనచూసి నలిపి పడేసే వ్యక్తికి దానిని పూజకి ఉపయోగించటంలోని పవిత్రత అర్థంకాకపోగా అందులో అపశృతి కనిపిస్తుంది. ఒక దురదృష్టకరమైన ఆలోచనతో వచ్చిన అతనికి పరిసర వాతావరణం వ్యక్తుల ప్రవర్తనలోని సంస్కారం ఇబ్బందిగా కనిపించటంలో ఆశ్చర్యంలేదు.

కుర్చీలో కూర్చుని ఎడమచేతి క్రింద ప్రక్కటెముకల వద్ద కుడిచేతితో తడిమాడు. బుల్లెట్స్ నింపిన రివాల్వర్ చేతికి తగిలింది. కుడికాలి ఫాంట్ పైకితీసి బూట్ జిప్ క్రిందికి లాగాడు. లోపల అరలో అరంగుళాల నైఫ్ భద్రంగా కనిపించింది.

"గుడ్ మార్నింగ్ అంకుల్! మై నేమీజ్ రాజ్ కుమార్. వాటీజ్ యువర్ గుడ్ నేమ్?"

ఉలిక్కిపడి తిరిగి చూసాడు చేత్తో పాంట్‌ని క్రిందకి లాగుతూ. రెండడుగుల దూరంలో నాలుగైదు సంవత్సరాల మధ్య వయసు గల పిల్లవాడు నిలబడివున్నాడు. మెరుస్తున్న కళ్ళతో, మొహంమీద పడుతున్న జుట్టుతో, నవ్వు మొహంతో – పొట్టి లాగు, చొక్కా తొడుక్కుని వున్నాడు. ఆ కుర్రవాడు ముద్దొస్తున్నాడు. తన వంక ఆసక్తిగా చూడటం గమనించాడు అతను. అంతవరకూ అతని మనసులో కదలాడిన ఆలోచనల్లకి తాత్కాలికంగా తెరపడింది.

"మై నేమీజ్ చంద్రం..." చెప్పాడు నవ్వుతూ.

అంతే!

తేనెపట్టు కదిలి ఈగలు ముసిరినట్టు తనకి వచ్చీరాని మాటలతో చంద్రాన్ని ముంచెత్తాడు కబుర్లు చెప్పి. పిల్లల్ని చూసి తల్లిదండ్రుల్ని అంచనా వెయ్యటం చాలా తేలిక. వాళ్ళు పిల్లలపట్ల తీసుకునే శ్రద్ధ, నేర్పే విషయాలనుబట్టి వాళ్ళ ప్రవర్తన ఆధారపడివుంటుంది. ఆ పిల్లవాడిని తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా పెంచుతున్నారనే విషయం చంద్రానికి తేలిగ్గానే అర్థమైంది.

"అంకుల్! రాత్రి నాన్నగారు నన్ను ఒక ప్రశ్న అడిగారు. ఎంత ఆలోచించినా నాకు తెలియలేదు. నువ్వు చెప్పవా?" అడిగాడు గోముగా. అప్పటికే చంద్రానికి చేరువుగా వచ్చాడు రాజ్ కుమార్. ఆ కుర్రవాడి నడుం చుట్టూ చెయ్యి వేశాడు చంద్రం. తను మాట్లాడుతున్న వ్యక్తి హంతకుడని, తన తండ్రిని చంపటానికి వచ్చాడని ఆ కుర్రవాడికి తెలిస్తే?

"చెప్పు..." ముసురుతున్న ఆలోచనల్లని దూరంగా నెడుతూ అడిగాడు చంద్రం.

"ఒకచోట ఇద్దరు మిత్రులు కలుసుకున్నారు. ఒకతని చొక్కా లూజుగా, మరొకతని చొక్కా బిగుతుగా వున్నాయి. వాళ్ళిద్దరూ బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుని తమ చొక్కాలు మార్చుకున్నారు. అయినా అవి ఎప్పటిలానే వున్నాయి. ఎందుకు?"

"నీకు తెలియలేదా?" నవ్వుతూ అడిగాడు.

"లేదంకుల్! ఇప్పుడు భోజనానికి వచ్చినపుడు అడుగుతారు..."

ఇంతలో వెంకట్రావ్ వచ్చాడు. చంద్రం వంక నవ్వుతూ చూసి, "మావాడు మీకు బోర్ కొట్టిస్తున్నాడా?" అడిగాడు.

సమాధానంగా నవ్వాడు చంద్రం.

"కుమార్! అంకుల్‌కి, నాకు భోజనం వడ్డించమని చెప్పు..."

ఆ మాటలు వినడమే తడవుగా ఇంట్లోకి రాకెట్ మాదిరి దూసుకుపోయాడు.

"భోజనం వద్దు... పని చూసుకుని వెళ్ళిపోతాను" చెప్పాడు కంగారుగా.

ఎదుటి వ్యక్తిని దోచుకోవటానికి అతన్ని ఏ విధంగా అంచనా వెయ్యాలనే విషయాలు మాత్రమే ఉన్ని కృష్ణన్ నేర్పాడు. వాటి గురించి అధ్యయనం చేసాడు. గౌరవప్రదమైన కుటుంబం ఆప్యాయంగా ఆదరిస్తే దానికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అతనికి తెలియదు.

"నాకోసం వచ్చారు. నాతో మాటలు పూర్తయ్యేసరికి భోజన సమయం దాటిపోతుంది. పాతిక మైళ్ల లోపు మీకు భోజనం దొరకదు. ఇంటికి వచ్చిన మనిషిని భోజనం పెట్టకుండా పంపటం గృహధర్మానికి విరుద్ధం..."

ఆ ఊరులో అడుగుపెట్టిన తరువాత ప్రతి విషయం తనకి వ్యతిరేకంగా జరుగుతున్నదని గుర్తించాడు చంద్రం.

"మీ స్నేహితుడు మోహన్ ఎక్కడ వుంటున్నాడు?" అడిగాడు చంద్రం.

రెండు క్షణాలు మౌనంగా వుండి చెప్పాడు. వాడి జీవితం అన్యాయమైపోయింది. ఇప్పుడు వాడు ఎక్కడ వున్నాడో కూడా నాకు తెలియదు. ఎప్పుడో నాలుగు సంవత్సరాల క్రితం కాబోలు ఉత్తరం రాసాడు. వాడి గురించి మీకెలా తెలుసు?"

అతనికి యల్.ఐ.సి. తరఫున కొంత డబ్బు వచ్చింది. అతని గురించి తెలుసుకుని అందజెయ్యాలి. మోహన్ గురించి మీకు నిజంగా తెలియదా?"

"ఇందులో అబద్ధం చెప్పవలసిన అవసరం ఏముంది?"

"మోహన్ జీవితంలో స్థిరపడలేదా?"

"ఇదమిద్ధంగా ఏమీ చెప్పలేం. నాకు ఉత్తరం వచ్చినపుడు మాత్రం వాడు ఒకచోట పనిచేస్తున్నాడు"

"ఎక్కడ?"

"నక్సలైట్ గ్రూప్‌లో"

చంద్రం షాక్‌తిన్నాడు. కొద్దిసేపు విరామం తరువాత "అతను వ్రాసిన ఉత్తరం ఒకమారు చూపిస్తారా?" అని అడిగాడు.

"తప్పకుండా..." అంటూ ఇంకా ఏదో అనబోయాడు. మధ్యలో వినిపించింది ఆయన భార్య గొంతు.

"భోజనం చేసి మాట్లాడుకోండి"

ఇద్దరూ భోజనాలకి లేచారు. పది నిమిషాలు పట్టింది భోజనం అయ్యేసరికి. వెంకట్రావ్ భార్య సిగ్గుపడుతున్న చంద్రానికి కొసరి కొసరి వడ్డించింది. చక్కని వారి సంసారం, ప్రవర్తన చంద్రం హృదయంలో హత్తుకుపోయాయి. చిన్నదైనా చక్కటి సంసారంలో వున్న తృప్తి కోట్లు సంపాదిస్తే వస్తుందా?

భోజనాలు పూర్తయిన తరువాత వెంకట్రావ్ ఉత్తరం తెచ్చి ఇచ్చాడు.

"మీకు పిల్లలు ఎంతమంది?" ఉత్తరం అందుకుని అడిగాడు చంద్రం.

"ఒక్కడే!"

"ఒక్కడితో  వూరుకున్నారేం?"

"పెళ్ళయిన మూడు సంవత్సరాల వరకూ పిల్లలు వద్దనుకున్నాం. కొడుకు పుట్టిన ఐదు సంవత్సరాల వరకూ మరొక సంతానం గురించి ఆలోచించదల్చుకోలేదు. రాజ్ కుమార్‌కి ఐదు సంవత్సరాలు పూర్తికావటానికి ఇంకా రెండు నెలలు వుంది"

"ఇది దేశంకోసమా?"

"దేశంకోసమని చెబితే ఆత్మవంచన అవుతుంది. నా కుటుంబం ఎంతవరకూ వుండాలనే విషయంమీద సరియైన అవగాహన వున్నపుడు దేశంకోసమని చెప్పటంలో ఔచిత్యం లేదు. ప్రతి మనిషి తన గురించి తనే ఆలోచించగలిగితే జనాభా పెరుగుదల దానికి అదే కంట్రోల్ అవుతుంది. దురదృష్టం ఏమిటంటే మన దేశంలో వివాహం చేసుకునే యువతీ యువకుల్లో సగానికి పైగా కుటుంబం పట్ల అవగాహన లేనివాళ్ళే. అందుకే ప్రాథమిక విద్యా బోధనతో పాటు కుటుంబం అంటే ఏమిటి? దాన్ని ఎలా కంట్రోల్ చెయ్యాలి? అని విషయాలమీద బోధన చాలా అవసరం అనుకుంటున్నాను. కులం, మతం వంటి పనికిరాని విషయాలను పుట్టుకతో బుర్రలో ఎక్కించే బదులు వాస్తవ జీవితానికి కావాల్సిన సమాచారం పిల్లలకి అందించటం చాలా అవసరం. మనిషి అనుకుంటాడు దేశం చెడిపోయిందని. అది చాలా తప్పు. తను చెడిపోవడం ద్వారా దేశాన్ని చెడగొడుతున్నాడు మానవుడు"

వెంకట్రావ్ మాటల్లోని నిజం చంద్రం గ్రహించాడు. అయితే అతనికి అటువంటి వాస్తవ విషయాలు అవసరంలేదు. అందుకే ఉత్తరం చూడటంలో మునిగిపోయాడు.

ఆ ఉత్తరంలో గుర్తుపెట్టుకోవాల్సిన విషయాలేమీ లేవు. కనీసం తారీఖు కూడా వేసిలేదు. ఉత్తరంమీద పోస్టల్ ముద్రలని పరీక్షించాడు. అవి అలుక్కుపోయి వున్నాయి. మరింత జాగ్రత్తగా చూసాడు. KAN అనే ఇంగ్లీషు అక్షరాలు అతి కష్టంమీద గుర్తుపట్టగలిగాడు. పోస్టల్ స్టాంపు మధ్యభాగంలో తారీఖు కనిపించటంలేదు. తారీఖు వుండాల్సిన చోటు క్రింద 11 అనే అంకె వుంది. ఉత్తరం చూడటం పూర్తిచేసి వెంకట్రావ్‌కి తిరిగి ఇచ్చేసాడు.

"నేను వెళతాను..." చెప్పాడు చంద్రం.

"ఉండండి వచ్చి బస్సు ఎక్కిస్తాను..." అంటూ సమాధానంకోసం ఎదురుచూడకుండా లోపలికి వెళ్ళి చెప్పులు వేసుకుని వచ్చాడు.

"వస్తానమ్మా!" అన్నాడు జీవితంలో మొట్టమొదటిసారి రెండు చేతులు ఎత్తి వెంకట్రావ్ భార్యకి నమస్కారం చేస్తూ.

రాజ్ కుమార్‌ని దగ్గరికి లాక్కుని బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు.

"మీకు విశాలి తెలుసా?"

"ఏ విశాలి?" అడిగాడు యధాలాపంగా.

"మీకు ఎంతమంది విశాలులు తెలుసు?" చురుగ్గా ప్రశ్నించాడు. ఆ క్షణంలోనే అతని మొహంలో మార్పు వచ్చింది.

తను మాట్లాడిన మాటలోని తప్పు అర్థం చేసుకుని "తెలుసు..." అని "ఆమె గురించి మీకెలా తెలుసు?" అడిగాడు.

"మోహన్ గురించి తెలుసుకునే ప్రయత్నంలో డాక్టర్ జీవన్ ప్రకాష్ వద్దకు వెళ్ళాను. మాటల సందర్భంలో విశాలి గురించి చెప్పాడు..." అన్నాడు వెంకట్రావ్‌కి జీవన్ ప్రకాష్ చనిపోయిన విషయం తెలియదనే నమ్మకంతో.

అతను అక్కడే దెబ్బతిన్నాడు.

వెంకట్రావ్ నాలుగు రోజుల క్రితం జీవన్ ప్రకాష్ హత్యావార్త పేపరులో చదివాడు. తన ప్రక్కన నడుస్తున్న వ్యక్తి ఎవరో స్పష్టంగా తెలియకపోయినా అతను ప్రమాదకరమైన వాడని వూహించాడు.

"విశాలి కొడుకు మీ వద్దకు వచ్చి మిమ్మల్ని సంజాయిషీ అడిగితే మీరేం సమాధానం చెబుతారు?"

వెంకట్రావ్ మొహం పాలిపోయింది. దీర్ఘంగా శ్వాస వదిలి, "ఆరోజు జరిగినదాంట్లో నా ప్రమేయం ఏమీ లేదు. అయినా అందులో నా బాధ్యత ఏమీ లేదని చెప్పను. నాకు మోహన్‌తో స్నేహం ఎక్కువ. పదే పదే జరిగిన దానిగురించి మేము చర్చించుకునేవాళ్ళం. నేను జీవితంలో స్థిరపడిన తరువాత ముందుగా నా భార్యకి జరిగిన విషయం చెప్పాను. ఆమె సలహామీద ప్రతివారం గుడికి నా కుటుంబంతో వెళ్ళి విశాలి పేరుమీద అర్చన చేయిస్తున్నాం. నాకు కూతురు పుడితే విశాలి పేరు పెట్టాలని అనుకున్నాం కాని కొడుకు పుట్టాడు. అందుకే విశాలి భర్త పేరు పెట్టాను నా కొడుక్కి"

చంద్రం మాట్లాడలేదు. వెంకట్రావ్ కళ్ళల్లో నీళ్ళు తిరగటాన్ని గమనించాడు.

"ఈరోజు నీ ఆయుషు మూడింది. ఇంటికి వచ్చిన మృత్యువు వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నది. నీ కుమారుడు రాజ్ కుమార్ నన్ను కలవకుండావుంటే ఈపాటికి శవంగా మారి వుందువు. చెప్పుకో నీ కొడుక్కి కృతజ్ఞతలు" వెంకట్రావ్ మొహం వంక చూస్తూ మనసులో అనుకున్నాడు చంద్రం.

బస్సు వచ్చింది. జనం దిగుతున్నారు. దిగుతున్న ప్రయాణీకుల్లో ఒక వ్యక్తిని చూసి చంద్రం కొద్దిగా ఉలిక్కిపడ్డాడు. జనం దిగిపోయారు. చంద్రం బస్సు ఎక్కి కూర్చున్నాడు.

కిటికీ వద్ద నిలబడి అడిగాడు వెంకట్రావ్. "మీరు విశాలికి ఏమవుతారు?"

"మీ ప్రశ్నకి సమాధానం ఆశించకండి. కొన్ని ప్రశ్నలు వెయ్యకుండా వుంటేనే బాగుంటుంది." ఆ మాటలు బస్సు శబ్దంలో కలిసిపోయాయి.

బస్సు దిగిన వ్యక్తి వెంకట్రావ్ స్కూల్ వున్న గ్రామం దారిలో నడవడం చంద్రం గమనించాడు.

అతను జీవన్ ప్రకాష్ కన్సల్టింగ్ రూమ్ ముందు చంద్రం చూసి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్.

అక్కడనుండి మరో నాలుగు గంటల వరకూ బస్సు లేదు.

# 7

బస్సు వేగంగా వెళుతోంది. ఎండ ఎక్కువగా వుండడంతో వేడిగాలి కిటికీల నుండి విసురుగా వస్తోంది. బస్సులోని మొత్తం ప్రయాణీకులు ఆ వాతావరణానికి చికాకుపడుతున్నా చంద్రం మాత్రం నిర్లిప్తంగా కిటికీ నుంచి బయటికి చూస్తున్నాడు.

రోడ్డు ప్రక్కనున్న చెట్లు ఎలక్ట్రిక్ స్తంబాలు వేగంగా వెనక్కి పరుగెడుతున్నాయి. అతని మస్తిష్కంలో ఆలోచనలు అంతకంటే వేగంగా కదులుతున్నాయి. మోహన్‌ని పట్టుకోవడం ఎలా? నక్సలైట్‌గా అడవుల్లో తిరిగే వ్యక్తిని పట్టుకోవడం సాధ్యమా? పోలీసులకి దొరక్కుండా ప్రాణాలు పోగొట్టుకోకుండా బ్రతికివున్నాడా? అతని గురించి ఎలా తెలుసుకోవడం?

వీటికి సమాధానం కావాలంటే ముందుగా మోహన్ ఎక్కడనుంచి ఉత్తరం రాసాడో కనుక్కోవాలి.

జవాబు దొరకని ప్రశ్నలు మెదడుని కలిచివేస్తున్నాయి. ఇంతలో బస్సు ఒక ఊర్లో ఆగింది. డ్రైవరు, కండక్టరు కాఫీలకోసం దిగారు. కొంతమంది ప్రయాణీకులు కూడా దిగారు. దిగాలని లేకపోవటంవల్ల చంద్రం కూర్చున్న చోటునుంచి కదలలేదు. సాలోచనగా బస్ స్టాండ్‌ని కలయచూశాడు. అతని దృష్టి షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఒకచోట నిలిచింది.

పోస్టాఫీస్!

తళుక్కుమని మెరిసింది ఫ్లాష్‌లాంటి ఆలోచన.

తొందరగా బస్సు దిగాడు. గబగబా నడిచి పోస్టాఫీసు చేరి ఏదో అడిగాడు. డబ్బులు ఇచ్చి ఒక పుస్తకం తీసుకున్నాడు. తిరిగి వచ్చి బస్సులో కూర్చున్నాడు. తను తెచ్చిన పుస్తకాన్ని తెరిచాడు.

అది పిన్‌కోడ్ బుక్.

అందులో KAN ప్రారంభంతో ఎన్ని ఊర్లు వున్నాయో చూశాడు. పాతిక పేర్లు వరకూ వున్నాయి. నాలుగు సంవత్సరాల క్రితం మోహన్ వ్రాసిన ఉత్తరంమీద పోస్టల్ స్టాంపుపై కనిపించిన అక్షరాలు అవి. KAN అక్షరాలతో వున్న పేర్లు క్రింద పెన్‌తో అండర్‌లైన్ చేశాడు.

పోస్టల్ స్టాంప్ మధ్యలో 11 అనే అంకెలు చూసాడు తారీఖు క్రింద వున్నాయి కనుక పిన్‌కోడ్‌కి చెందినవని అప్పుడే గుర్తుపట్టాడు. అండర్‌లైన్ చేసినవాటిలో 11 అనే చివరి నెంబరుతో ఎన్ని ఊర్లు వున్నాయో చూశాడు.

ఆశ్చర్యం!

ఒకే ఒక్క ఊరు వుంది.

అది కన్నాపురం!

534 311

ఆ ఊరు ఏ జిల్లాలో వుంది? మళ్ళీ ప్రశ్న. కాసేపు ఆలోచించాడు. ఈలోపు కాఫీకి దిగినవాళ్ళు తిరిగొచ్చారు. బస్సు బయలుదేరింది.

చంద్రం పిన్‌కోడ్ బుక్ పేజీలు తిరగేసి, ముందుపేజీలో సమీక్ష చదివాడు. తరువాత పేజీలు తిప్పి ఆఖరిపేజీ తెరిచాడు. అక్కడ వ్రాసివున్న హెడ్‌లైన్ చదివాడు.

Three Digit Pin Chart of Revenue
Districts in Andhra Pradesh

దాని క్రింద ప్రతి జిల్లాకి కేటాయించబడిన మొదటి మూడు నెంబర్లు వ్రాసి దాని కెదురుగా జిల్లా పేరు వుంది.

అతనికి కావాల్సిన జిల్లా చివరలో వుంది.

534 - West Godavari

ఊరు, జిల్లా కనుక్కోగలిగాడు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళి కొంత సమాచారం సేకరించాలి.

అంతే!

క్షణాలమీద పథకం సిద్ధమయింది.

◆ ◆ ◆

హెడ్ పోస్టాఫీస్‌లో ప్రవేశించాడు చంద్రం. కాసేపు అక్కడి వాతావరణం పరిశీలించి, ఒక పోస్ట్‌మాన్‌ని ఎంచుకుని అతన్ని సమీపించాడు. రెండు మూడు విషయాలు అతని ద్వారా తెలుసుకుని తనకి కావాల్సిన సమాచారం సేకరించాడు. ఆ పోస్ట్‌మాన్ మరొక పోస్ట్‌మాన్‌ని చూపించాడు. చంద్రం అతని దగ్గరకు వెళ్ళి కొద్దిసేపు మాట్లాడి బయటికి వచ్చాడు.

అక్కడనుంచి రిక్షా మాట్లాడుకుని తిన్నగా ఊరు చివరికి వెళ్ళాడు. వరుసగా కట్టిన క్వార్టర్స్‌ని పరిశీలించాడు. తనకి కావాల్సిన క్వార్టర్‌ని సులువుగానే కనుక్కున్నాడు. ఆ క్వార్టర్ ముందు ఒక జీప్, రెండు స్కూటర్లు, నాలుగైదు సైకిళ్ళు వున్నాయి. మామూలుగా దానికి ఏ విధమైన ప్రాముఖ్యత కనిపించదు.

స్పెషల్ బ్రాంచ్ ఆఫీస్!

నెమ్మదిగా సమయం గడుస్తోంది. చంద్రం కొద్ది దూరంలో నిలుచుని గమనిస్తున్నాడు. క్రమేపి సాయంకాలం అయింది. నెమ్మదిగా చీకట్లు ముసురుకుంటున్నాయి. వాచీ చూశాడు చంద్రం. టైమ్ ఏడు గంటలయింది.

ఒక లావుపాటి వ్యక్తి బయటికి వచ్చాడు. అతని వెనుక మరో నలుగురు వున్నారు. లావుపాటి వ్యక్తి జీప్ ఎక్కాడు. జీప్ కదిలింది. ఆయనతోపాటు బయటకి వచ్చిన నలుగురూ సెల్యూట్‌చేశారు. జీప్ వెళ్ళిపోయిన వెంటనే రెండు స్కూటర్లు కదిలాయి. మిగిలిన ఇద్దరూ సెల్యూట్‌చేశారు. ఇంతలో మరో ఇద్దరు లోపలనుండి బయటికి వచ్చారు. వాళ్ళు వచ్చేసరికి అక్కడ వున్న ఇద్దరూ సైకిళ్ళమీద వెళ్ళిపోయారు. చివరలో వచ్చిన ఇద్దరూ సైకిళ్ళు నడిపించుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

వారి వెనుక బయలుదేరాడు చంద్రం.

వాళ్ళిద్దరూ సెంటర్‌లో మిక్చర్ పొట్లాలు కట్టించుకుని సైకిళ్ళు ఎక్కారు. చంద్రం రిక్షా పిలిచి వాళ్ళ వెనుక నీడలా అనుసరించాడు.

కొంత దూరం వెళ్ళిన తరువాత వాళ్ళిద్దరూ ఒక బార్ ముందు సైకిళ్ళు స్టాండ్‌వేసి లోపలికి వెళ్ళారు. చంద్రం రిక్షాకి డబ్బులు ఇచ్చి పంపించేసి తనూ లోపలికి ప్రవేశించాడు. వాళ్ళిద్దరూ ఒక టేబుల్ ముందు కూర్చునివుండటం చూసి, వాళ్ళ కెదురుగా ఖాళీ కుర్చీలో కూర్చున్నాడు. వాళ్ళు చంద్రాన్ని పట్టించుకోకుండా తమ విషయాలు చర్చించుకుంటున్నారు.

"ఏం తీసుకురమ్మంటారు సార్!" వాళ్ళిద్దరినీ బేరర్ అడిగాడు.

"హాఫ్ మెకడోల్ విస్కీ, టూ ప్లేట్స్ చికెన్ రోస్ట్..." చెప్పాడు ఇద్దరిలో ఒకడు.

"బ్లాక్ లేబుల్ కళ్యాణి, ప్లేట్ గ్రీన్ పీస్..." చెప్పాడు చంద్రం.

సిగరెట్ పాకెట్ ఓపెన్‌చేసి ఒక సిగరెట్ నోట్లో పెట్టుకుని "మాచ్ బాక్స్ వుంటే ఇస్తారా?" అడిగాడు చంద్రం.

విస్కీకి ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి అగ్గిపెట్టి అందించాడు.

చంద్రం సిగరెట్ వెలిగించుకుని అగ్గిపెట్టి తిరిగి ఇస్తూ "మిమ్మల్ని ఎక్కడో చూసినట్టు వుంది..." అన్నాడు.

"ఉద్యోగరీత్యా ఊరంతా తిరుగుతుంటాం..." చెప్పాడు రెండవ వ్యక్తి. వాళ్ళిద్దరి మధ్యా చాలా తేడా వుందని వాళ్ళ సంభాషణబట్టి గ్రహించాడు చంద్రం. మొదటి వ్యక్తి మెత్తగాను, రెండవ వ్యక్తి గడుసుగాను కనిపిస్తున్నారు.

"మీరేం చేస్తారు?"

"బిజినెస్!" చెప్పాడు చంద్రం. ఆ తరువాత వాళ్ళ సంభాషణ రాత్రి రెండు గంటలవరకూ సాగింది. అప్పటివరకూ చంద్రం విస్కీ తెప్పిస్తూనేవున్నాడు. వాళ్ళ మధ్య సంభాషణ విభిన్న విషయాలమీద నడిచింది.

త్రాగుబోతులతో స్నేహం చెయ్యటం చాలా తేలిక. అది నిలబడటం మాత్రం కష్టం. మిగతా సంభ్య ప్రపంచంలో మనుషులు స్నేహం చెయ్యటానికి కావాల్సిన విలువలు త్రాగుబోతులకి అవసరంలేదు.

అందుకే చంద్రం తనకి కావాల్సిన అత్యంత కీలకమైన సమాచారాన్ని ఆ ఇద్దరి వ్యక్తుల నుండి సేకరించగలిగాడు. మత్తు దిగిన తరువాత తాము మాట్లాడిన మాటలు తమకే గుర్తుండని స్థితిలో వాళ్ళు సమాచారం అందించారు.

అదేరోజు మధ్యాహ్నం స్టేట్ ఇంటిలిజెన్స్ బ్యూరో నుండి ఒక మెసేజ్ వచ్చింది. అందులో చంద్రమనే వ్యక్తి హంతకుడని, కొంతమంది వ్యక్తులను హత్య చెయ్యటానికి తిరుగుతున్నాడని అతన్ని పట్టుకోమని దాని సారాంశం. చంద్రంతో మాట్లాడిన ఇద్దరూ దాన్ని చదివారు.

దేశ రక్షణకోసం తయారుచెయ్యబడిన ఆయుధాలతో, రక్షించవలసిన సెక్యూరిటీ సిబ్బంది ప్రధానిని కాల్చగలిగిన మన దేశంలో ఇద్దరు స్పెషల్ బ్రాంచ్ సబార్డినేట్‌ల ద్వారా సమాచారం లీక్ కావడం వింత కాదు.

# 8

రాత్రి పన్నెండు దాటింది సమయం.

వాతావరణం ప్రశాంతంగా వుంది. ఆకాశంలో ఎక్కడా చుక్కల జాడ కనిపించటంలేదు. నిశీధి నిశ్శబ్దం పోటీపడుతున్నాయి. గాలికి కదులుతున్న చెట్ల ఆకులు అప్పుడప్పుడూ గలగలమంటున్నాయి.

బాల్కనీలో నిలుచుని చీకట్లోకి చూస్తున్నాడు చంద్రం. అతను చికాకుగా వున్నాడు. వారం రోజుల క్రితం ఆ ఊరు వచ్చాడు. అతని దగ్గర చాలా వివరాలు వున్నాయి. కాని అక్కడనుండి ఒక్క అడుగు కూడా ముందుకి పడలేదు.

కన్నాపురం అనే ఊరు ఏజన్సీ ప్రాంతానికి సెంటర్ కావడంవల్ల అదృష్టవశాత్తూ అక్కడొక లాడ్జి వుంది. అందులో దిగాడు చంద్రం. మస్తిష్కంలో తిరుగుతున్న ఆలోచనలు ఒకపట్టాన నిద్రపోనివ్వడంలేదు. ఎప్పటికో నిద్రపట్టినా మధ్యలో మెలుకువ వచ్చేస్తోంది. ఆ రాత్రి ఆ కారణంగా మెలకువ వచ్చి బాల్కనీలో నిలుచుని ఆలోచిస్తున్నాడు.

అక్కడనుండి గెద్దపల్లి అనే కోయదొరల గ్రామం వెళ్ళాలి. అది ముప్ఫై కిలోమీటర్ల దూరంలో వుంది. అక్కడికి ప్రయాణ సౌకర్యాలు లేవు. పేపరు మిల్లుకి వెదురు తీసుకువచ్చే ప్రభుత్వ లారీలు మాత్రం లోపలికి వెళతాయి. లోపలికి వెళ్ళాలంటే వాటిలో ప్రయాణం చెయ్యాలి. వానాకాలం వస్తే అవికూడా లోపలికి వెళ్ళవు. అప్పుడు కాలినడకనే వెళ్ళాల్సివుంటుంది.

అక్కడికి వెళ్ళడం సమస్య కాదు. గెద్దపల్లిలో వందకు మించి జనాభా వుండదు. వాళ్ళంతా కోయదొరలు. ఎప్పుడూ విల్లంబులు ధరించి తిరుగుతూ ఉంటారు. అక్కడికి ఎవరైనా క్రొత్త వ్యక్తి వెళ్ళివుండటమనేది జరగని పని. ఆ ఊర్లో తెలిసిన వ్యక్తి వుంటే వెళ్ళివుండటం సాధ్యపడుతుంది. ముప్ఫై కిలోమీటర్ల దూరంలో, భయంకరమైన అడవి గ్రామంలో, మృగాల మధ్య తిరిగే మనుషుల్లో తెలిసిన మనిషి ఎక్కడ దొరుకుతాడు?

ఆ గ్రామంలోనే తరచూ సమావేశాలు జరుపుతూవుంటుంది రాజన్న దళం.

అందులో వున్నాడు మోహన్ సజీవంగా!

కావాల్సిన వివరాలు మొత్తం సేకరించగలిగాడు. ఆ గ్రామంలోకి ప్రవేశించి కొంతకాలం వుండటానికి మార్గం దొరకటంలేదు. చిన్న ఆధారం దొరికితే చాలు.

చిన్న ఆధారం.

ఆలోచనలతో తల పగిలిపోయినట్లుగా వుంది. ఎంతసేపు గడిచిందో అతనికే తెలియదు. పడుకుందామనే వుద్దేశ్యంతో గదిలోకి వెళ్ళటానికి వెనక్కి తిరిగాడు.

"వదులు..."

ఆ మాటలు గాలితోపాటు కదిలివచ్చి అస్పష్టంగా చెవులను తాకాయి. చంద్రం ఆగాడు. చుట్టూ చూశాడు. ఊరు చివర వుందా లాడ్జి.

చుట్టూ బీడుపడిన పొలాలున్నాయి ఎక్కువగా. ఏం కనిపిస్తుంది? పంచేంద్రియాలు పరిసరాల మీద కేంద్రీకరించి నిలుచున్నాడు.

ఐదు నిముషాలు భారంగా గడిచాయి.

"అమ్మో..."

ఈసారి స్పష్టంగా వినగలిగాడు. అది ఎటునుండి వచ్చిందో కనుక్కోగలిగాడు. వేగంగా గదిలోకి వెళ్ళి బట్టలు వేసుకుని వచ్చాడు. వస్తూనే గమనించాడు.

గేటుకి తాళంకప్ప వ్రేలాడుతోంది.

అయినా చంద్రం నడకలో ఏమాత్రం వేగం తగ్గలేదు. కొద్దిగా అడుగులు ప్రక్కకివేసి గోడమీద రెండు చేతులూ ఆన్చి ఒక్క క్షణంలో అవతలకి దూకాడు. ముందుకి చూసుకుంటూ కేక వినిపించిన దిక్కుకి చకచకా నడిచాడు. కొద్ది దూరం నడిచేసరికి లీలగా ఒక దృశ్యం కనిపించింది.

నాలుగడుగుల దూరంలో రెండు ఆకారాలు పెనుగులాడుతున్నాయి. అవి ఆయాసంతో ఒగురుస్తున్నాయి. క్రింది ఆకారాన్ని పైనున్న ఆకారం తన స్వాధీనంలోకి తెచ్చుకోవటానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

ఒక్క క్షణం ఆలోచించాడు చంద్రం.

క్రింది ఆకారంలో పెనుగులాడే శక్తి అయిపోయిందో, స్పృహ తప్పిందో అచేతనంగా వుండిపోయింది. పైనున్న ఆకారం తన పొజిషన్ సర్దుకొని ముందుకు వంగబోతోంది.

అప్పుడు కదిలాడు చంద్రం. రెండు అంగల్లో ఆకారాన్ని సమీపించి ఏమాత్రం ఆలోచించకుండా ఎడంకాలితో తన్నాడు పైనున్న ఆకారం కణతమీద.

తన పనిమీద దృష్టి లగ్నంచేసిన ఆకారం ఒక్కసారిగా తగిలిన దెబ్బకి త్రుళ్ళిపడి లేచి కూర్చుంది. సరిగ్గా అప్పుడు తన్నాడు గుండెల నిండా ఊపిరి పీల్చుకుని భుజంమీద. ఆ దెబ్బకి అదిరిపోయి ఆకారం లేచి పరిగెత్తింది చీకట్లోకి.

మోకాళ్ళమీద కూర్చుని క్రింద పడివున్న యువతి బుగ్గలమీద రెండు మూడుసార్లు తట్టాడు చంద్రం.

"వదిలేయ్... నన్ను వదిలేయ్..." భయంతో అరిచింది. కాళ్ళు ఒకదానితో ఒకటి పెనవేస్తూ.

"భయంలేదు... వాడు పారిపోయాడు" చెప్పాడు చంద్రం అనునయంగా.

"అన్నయ్యా... అమ్మ..." అంది కలవరిస్తున్నట్టు. ఇంకా షాక్ నుండి తేరుకోలేదు.

"ఎక్కడ వున్నారు?" అడిగాడు గట్టిగా.

ఒకవైపు చేయెత్తి చూపించింది. చంద్రం ఆమెని బలవంతంగా లేపి నిలబెట్టాడు. ఆమె ఒకమారు పరిసరాలను పరికించి చూసి నడవడం ప్రారంభించింది. కొంతదూరం నడిచిన తరువాత మూడు ఆకారాలు కనిపించాయి. రెండు ఆకారాలు చెట్టుకి కట్టేసి వున్నాయి. ఒక ఆకారం విడిగా నిలబడివుంది. మొదటివాడు పని పూర్తిచేసుకొని వచ్చేవరకూ రెండవవాడు కాపలా కాస్తున్నాడు.

చంద్రం ఆ యువతిని నిలబడమని సైగచేసి, వాళ్ళకి పదడుగుల దూరంలో నిలుచుని చప్పట్లు చరిచాడు. విడిగా అటువైపు తిరిగి నిలుచున్న ఆకారం వెనక్కి తిరిగింది.

అంతే!

కదిలాడు చంద్రం చిరుతలా. ఆరడుగుల దూరం వేగంకోసం పరిగెత్తి అప్పుడు లేచాడు గాలిలో. రెండు కాళ్ళతో ఆకారం గుండెలమీద తన్నాడు. గాలికెగిరిన ఎండుటాకులా ఆకారం ఎగిరిపడింది. పడీపడటంతో లేచి పరిగెత్తింది.

వాళ్ళ కట్లు విప్పి తన వెంట రూమ్‌కి తీసుకువచ్చాడు చంద్రం.

అరగంటకి కాని వాళ్ళు తేరుకోలేకపోయారు.

"నేను గిరిజన అభివృద్ధి సంస్థ ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్ని. నిన్న బ్యాంక్ పనిమీద ఇక్కడికి వచ్చాను. అమ్మ, చెల్లాయి సినిమాకి వెళదామంటే కొయ్యలగూడెం తీసుకెళ్ళాను సెకండ్ షోకి. ఈ ఊరు నుండి జనం ఎప్పుడూ కొయ్యలగూడెం సినిమాలకి వెళుతూవుంటారు. సినిమా వదిలిన తరువాత నడుచుకుంటూ వచ్చేస్తారు. సినిమా వదలటానికి గంట ముందు అమ్మకి వాంతులు అయ్యాయి. ఇక్కడికి వచ్చేద్దామని బయలుదేరాం. మధ్యలో వాళ్ళు కత్తులు చూపించి మమ్మల్ని లాక్కుపోయారు..." చెప్పాడు జాన్ తనని పరిచయం చేసుకున్న తరువాత.

లాడ్జి కుర్రాడితో రెండు మడత మంచాలు వరండాలో వేయించాడు చంద్రం. ఆడవాళ్ళిద్దరూ రూమ్‌లో పడుకున్నారు. చంద్రం, జాన్ మడత మంచాల మీదకు చేరారు.

"మీరేం చేస్తారు?" అడిగాడు జాన్.

"నేను చాలా దూరంనుండి ఇక్కడికి వచ్చాను. జీవితంలోని నిరాశ, నిస్పృహలు మర్చిపోయి తిరిగి మామూలు మనిషిని కావటంకోసం స్నేహితుల సలహామీద వచ్చాను..."

"ఈ వయసులో నిరాశ నిస్పృహలా?" అడిగాడు ఆశ్చర్యంగా.

"అవును. ఊహ తెలిసిన దగ్గరనుండి నాకంటూ బంధువులు ఎవరూ లేరు. ప్రాణంలాంటి మనిషి గుండెజబ్బుతో చనిపోయాడు. విధి నామీద కక్ష గట్టింది..."

"బాధపడకండి. అన్నయ్య కళ్ళముందు చెల్లెల్ని మానభంగం చెయ్యటం వంటి సంఘటనలు మనకి ఎదురవుతూవుంటాయి... తప్పదు భరించాలి"

చంద్రం గ్రహించాడు ఆ మాటల్లో వున్న బాధని. చెల్లెల్ని రక్షించటంకోసం రౌడీల కాళ్ళమీద పడి ప్రాధేయపడటం తాలూకు దృశ్యం కళ్ళముందు కదలాడింది. పళ్ళు కొరుకుతూ మనసులో అనుకున్నాడు. అటువంటి మృగాల్ని సజీవంగా కట్టేసి, ఒకొక్క కండ చీలుస్తూ మాంసం విక్రయించాలి. తన తల్లి, భార్య, చెల్లి పవిత్రులు అనుకుంటే చాలు. మిగతా ప్రపంచంలోని ఆడవాళ్ళు మొత్తం విలాస వస్తువులే!

"ఏ ఊళ్ళో పనిచేస్తున్నారు?" అడిగాడు చంద్రం తన ఆలోచనలు కట్టిపెట్టి.

"గెద్దపల్లి"

◆ ◆ ◆

"ఏమిటి తీవ్రంగా ఆలోచిస్తున్నారు?"

తిరిగి చూశాడు చంద్రం. జయ నిలబడి వుంది.

పది నిమిషాలయింది ఆమె వచ్చి. ఎంతకీ చంద్రం తిరిగి చూడకపోవడంతో తనే పలకరించింది. ఆ ఊర్లో వాళ్ళ బంధువులు వున్నారు. ఎప్పుడొచ్చినా అక్కడే బస చేస్తారు. ఉదయాన్నే చంద్రం వద్ద శెలవు తీసుకుని జాన్ కుటుంబం వెళ్ళిపోయింది. జాన్ ఆహ్వానంమీద చంద్రం వాళ్ళ బంధువుల ఇంటికి వెళ్ళి కొంతసేపు గడిపివచ్చాడు. అప్పుడే జయతో కాస్తంత చనువు ఏర్పడింది.

"జీవితం గురించి" చెప్పాడు ఆలోచన్ల నుండి తేరుకుంటూ. చాలాసేపటి నుండి ఆలోచిస్తున్నట్టు అతని మొహం అలసటగా కనిపిస్తోంది.

"జీవితం గురించా?"

చంద్రం సమాధానం చెప్పకుండా లోపలికి వెళ్ళి రెండు కుర్చీలు పట్టుకొచ్చి వేసి చెప్పాడు తను కూర్చుంటూ.

"కూర్చోండి"

"ఇందాక జీవితం అంటున్నారు..." కూర్చున్న తరువాత అంది జయ.

"అవును... జీవితం గురించే! ప్రపంచంలో తనకి ఎవరూ లేరన్న భావం మనిషిని పిచ్చివాడ్ని చేస్తుంది. ఆ స్థితి చాలా దయనీయమైనది. బాల్యంలో సగానికి పైగా అటువంటి పరిస్థితిలో పెరిగిన మనిషి సంఘంలో సాఫీగా బ్రతకగలడా?"

"ఎవరి గురించి చెబుతున్నారు?" అడిగింది జయ.

చంద్రం నిదానంగా జయ వంక చూసి చెప్పాడు.

"నా గురించే!"

"మీ గురించా?" ఆశ్చర్యపోయింది ఆమె.

"పది సంవత్సరాల వయసులో ఒంటరిగా రోడ్డుమీద మిగిలాను. నా వెంట నేను సాధించాల్సిన ఒక కార్యం వుంది. ఆ వయసుకే నా చుట్టూ రాతిగోడలు నిర్మించుకుని వాటి మధ్య ఏకాకిలా పెరిగాను. నన్ను పెంచి తీర్చిదిద్దిన మనిషికి కూడా నా గురించి చెప్పలేదు. నా ప్రపంచంలో నేను చేసిన కృషి, కష్టపడి సంపాదించుకున్న తెలివితేటలు నా ప్రయాణంలో ఎంతవరకూ ఉపయోగపడతాయో తెలియకపోయినా ఆత్మవిశ్వాసంతో..." అంటూ చప్పున చెప్పడం ఆపేశాడు. కర్తవ్యాన్ని నెరవేర్చడంకోసం పది సంవత్సరాల సుదీర్ఘకాలం సాధనలో గడిపిన చంద్రం మేలుకున్నాడు.

"చెప్పండి..." రెట్టించింది ఉత్సాహంగా.

పూర్తిగా స్పృహలోకి వచ్చాడు చంద్రం. జీవితంలో తల్లిదండ్రుల ఆత్మీయత రుచిచూసి దానికి దూరం కావడంతో దానికోసం తపించే అతని హృదయం తనతో చనువుగా మాట్లాడుతున్న జయని చూసి క్షణకాలం తన పట్టు కోల్పోయి హృదయకవాటాలు

తెరుచుకున్నాయి. పది సంవత్సరాల కాలం ఆలోచనలతో గడిపి ఒక విధమైన అదుపుకి అలవాటుపడిన మెదడు హెచ్చరించటంతో తిరిగి మామూలు మనిషయ్యాడు.

"నాకు అశాంతిగా వుంది. పిచ్చి పిచ్చి ఆలోచనలు వస్తున్నాయి ఎక్కువగా. గాలి మార్పుకోసం ఇక్కడికి వచ్చినా ఏమాత్రం ప్రయోజనం కనిపించలేదు" చెప్పాడు విచారంగా.

"మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్పగలరా?" అడిగింది జయ చంద్రం విచారం పోగొట్టాలనే ఆలోచనతో.

"తెలిస్తే చెబుతాను"

"ఒన్ ఫోర్ త్రీ అంటే ఏమిటి?" అడిగింది చంద్రం మొహంమీద తదేకంగా చూస్తూ, తనలో తానే నవ్వుకుంటూ.

"నూట నలభై మూడు?"

"కాదు. 1-4-3?" తిరిగి చెప్పింది.

"143"

"అది కూడా కాదు. అంకెల రూపంలో ఒకదానితో మరోదానికి ఎటువంటి సంబంధం లేదు"

"1--4--3..... దేనికి సంబంధించినవి?" అడిగాడు చంద్రం.

"జీవితానికి"

"ప్రశ్న చాలా విచిత్రంగా వుంది..." సాలోచనగా అన్నాడు. తాత్కాలికంగా తను ఆలోచిస్తున్న విషయంమీద నుంచి మనసు ఆమె ప్రశ్నమీద లగ్నమయింది. ఆలోచిస్తూ ఆమె వంక చూశాడు.

"అది ప్రతి యువకునికి, యువతికి తెలిసిందే!" చెప్పింది.

జయ మొహంలో సన్నపాటి చిరునవ్వు కాస్త సిగ్గుతో కలిసిమెలిసి మాయమయింది. ఆ నవ్వు చూసిన తరువాత ఫ్లాష్‌లాంటి ఆలోచన వచ్చింది చంద్రానికి.

"నిన్న రాత్రి మీరు చూసిన సినిమా పేరేమిటి?"

"ప్రేమ కానుక" చెప్పింది. తను అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పకుండా సంభాషణ మరో అంశంవైపు మళ్ళించాడని అనుకుంది.

"ఆ సినిమా చూడాలని మీరు పట్టుబట్టి మీ వాళ్ళని తీసుకెళ్ళారు కదూ?"

"అవును" చెప్పింది విస్తుపోతూ. అమ్మకి ఇష్టంలేకపోయినా తన బలవంతంమీద అయిష్టంగా సినిమాకి వచ్చిన తల్లి మొహం ఆమెకి గుర్తొచ్చింది. చంద్రంతో అన్నయ్య చెప్పివుండడు. మరి అతనికి ఎలా తెలిసింది?

"సినిమామీద మీ అభిప్రాయం!"

చంద్రం తన ప్రశ్నకి చెప్పాల్సిన సమాధానం చెప్పలేక ఆ విషయాలు అడుగుతున్నాడనే నమ్మకం స్థిరపడిపోయింది. దానితో ఆమెకి నిరుత్సాహం కలిగింది. అయినా అది బయటికి కనపడకుండా జాగ్రత్తపడుతూ చెప్పింది.

"చక్కటి గొప్ప సినిమా"

"మీరు ఇంతవరకూ చూసిన సినిమాల్లో, చదివిన నవలల్లో ఒక్కొక్కటి నచ్చినవి చెప్పండి" అడిగాడు నిశితంగా చూస్తూ. ఆమె మొహంలో కదులుతున్న భావాలు, ఆమె వయసు, అభిప్రాయాలు ఒకదానితో మరోటి కలుపుతూ.

"దేవదాసు నాకు నచ్చిన సినిమా. నవల్స్‌లో..." అంటూ క్షణం ఆలోచించి, 'మేఘమాల" చెప్పింది.

"ఆ పుస్తకంలో కథ ఏమిటి?" అడిగాడు చంద్రం. నవల చదవకపోయినా కథ ఊహించగలిగాడు.

"ఒక అమ్మాయికోసం అబ్బాయి వెతుకుతూవుంటాడు. ఆమె అతనికోసమే ఎదురుచూస్తూవుంటుంది. ఒకరోజు వరకూ ఎదురుచూసి ఆరోజు తరువాత అతని గురించి ఎదురుచూడకూడదని నిర్ణయించుకుంటుంది. అతను ఆమె గురించి వెదుకుతూ ఆమె అనుకున్న రోజు పది నిమిషాలు ఆలస్యంగా కలుసుకుంటాడు. అప్పటికే ఆమె మరొకర్ని వివాహం చేసుకుంటుంది. అందులో ముగింపు చాలా గొప్పగా వ్రాశాడు రచయిత" చెప్పింది ఉత్సాహంగా. ఆ నవలమీద ఆమెకి అభిమానం ఎక్కువ. ఎన్నిసార్లు చదివిందో ఆమెకే తెలియదు.

అది గుర్తించాడు చంద్రం.

"మీ ప్రశ్నకి సమాధానం చెప్పనా?" అడిగాడు.

చంద్రం వంక విస్మయంగా చూసింది జయ. అతను సమాధానం చెప్పలేడని భావించింది. ఏదో మాసపత్రిక చదువుతూ అందులో వ్రాసివున్న ఆ అంకెలు గుర్తుపెట్టుకుంది. ప్రత్యేకంగా వాటిని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం లేకుండా అర్థం తెలిస్తే అవే గుర్తుంటాయి. చంద్రం మూడ్ మార్చే ప్రయత్నంలో వాటిని అతనికి చెప్పింది.

"ఒక వాక్యాన్ని మూడు భాగాలు చేసి ఒక్కొక్క భాగంలో అక్షరాలు ఎన్ని వున్నాయో అవే 1--4--3" ఆగి జయ మొహం వంక చూసి, "ఆ వాక్యం I Love You " చెప్పాడు.

"కాదు..." తన మొహంలోని భావాలు దాచుకోవడానికి ప్రయత్నిస్తూ బింకంగా అంది.

"కాకపోవచ్చు, కాని మీ వయస్సుని, ఆలోచనల్ని, అభిరుచుల్ని దృష్టిలో వుంచుకుని ఆలోచిస్తే అంతకంటే గొప్ప సమాధానం వుండదు..." చెప్పాడు చంద్రం స్థిరంగా.

"ప్రేమ పట్ల మీకు సదభిప్రాయం లేదా?" అడిగింది జయ కాస్తంత నిరాశను వ్యక్తంచేస్తూ.

"ప్రేమ గురించి నాకేమీ తెలియదు. దేనిగురించైనా తెలుసుకోవడానికి సమయం, ఆసక్తి కావాలి. దానికితోడు వివరించి చెప్పగలిగేవాళ్ళు వుండాలి. మీరు చెప్పండి ప్రేమంటే ఏమిటో?"

"పదిహేను సంవత్సరాల వయసు దాటని యువతీ యువకులకి అర్థమవుతున్న విషయం మీకు తెలియదన్నమాట..." ఎలా చెప్పాలా అని కొన్ని క్షణాలు ఆలోచించి, "కోరుకోవడం, ఇష్టపడటం వంటి పదాలకే ప్రేమ అంటారు" చెప్పింది.

"ఇష్టపడటం లేదా కోరుకోవడమే ప్రేమయితే చాలావాటిని ప్రేమిస్తాం కదా?"

"వస్తువుల విషయంలో కాదు. స్త్రీ మీద పురుషునికి, పురుషుని మీద స్త్రీకి ఇష్టం కలగడం, ఒకరినొకరు కోరుకోవడం"

"స్త్రీలయితే తల్లిని, చెల్లిని ప్రేమిస్తాం. పురుషులయితే తండ్రిని, సోదరుడిని ప్రేమిస్తాం. ఆ ప్రేమ గురించేనా మీరు చెప్పేది.

ఆమె గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టయింది. ప్రేమ గురించి చదవడం, వినడం వరకూ తెలుసు. దానికి సరియైన నిర్వచనం చెప్పడం మాత్రం తెలియదు. నిస్సహాయంగా చూసింది చంద్రాన్ని.

"ప్రేమ గురించి పుస్తకాలు చదివి సినిమాలు చూసి ఒక అభిప్రాయం ఏర్పరుచుకోవడం సరికాదు. ప్రతి విషయం గురించి క్షుణ్ణంగా ఆలోచించే తెలివితేటలు కావాలి. ఒక పదం తెలుసుకదా అని ఇష్టంవచ్చినట్టు ఉపయోగిస్తే దానికి సమాధానం చెప్పలేక ఇబ్బందిపడతాం. ఎవరినైనా ఒకసారి చూసిన వెంటనే వాళ్ళమీద ఇష్టం ఏర్పడితే దానిని ప్రేమ అనకూడదు. ఆకర్షణ అనాలి. నిజానికి ప్రేమకి ఆకర్షణకి పోలికలు వున్నా వాటి మధ్య చాలా వ్యత్యాసం వుంది. ప్రేమకి చావు లేదు. ఆకర్షణకి స్థిరమైన గుణం లేదు" చెప్పాడు.

"ఒక వ్యక్తిమీద నాకు ఇష్టం ఏర్పడిందనుకోండి. అది ప్రేమ కాకపోతే, ప్రేమ యొక్క స్వరూప స్వభావం చెప్పండి" అడిగింది చంద్రం వంక ఆసక్తిగా చూస్తూ.

"ఏది ప్రేమ కాదో చెప్పగలను. ప్రేమ ఏమిటో చెప్పలేను. మీ ఊరు వచ్చి పది రోజులు వుంటాను కదా! తిరిగి వచ్చేటప్పుడు అడగండి చెప్పడానికి ప్రయత్నిస్తాను..."

"మా అడవిలో మీకు బోర్ కొట్టదా?"

"చూద్దాం..." అని నవ్వాడు.

"ఇక్కడ నుండి రేపు ఉదయం లారీ బయలుదేరుతుంది. అది చెప్పడానికే వచ్చాను"

"ప్రయాణానికి నేను సిద్ధంగా వున్నాను"

కొద్దిసేపు వుండి వెళ్ళిపోయింది జయ. చూడటానికి అందంగా బాగుంటుంది. కొంచెం చదువుకున్నా అడవి ప్రాంతంలో నివసించడంవల్ల కొద్దిపాటి అమాయకత్వం వుంది. ఒక్కటి మాత్రం నిజం. చంద్రం మాత్రం ఆమె గురించి ఆలోచించడంలేదు. తన దగ్గిర వున్న ఆయుధాలు గెడ్డపల్లి పట్టుకెళ్ళాలా వద్దా అనేది నిర్ణయించుకోలేకపోతున్నాడు. అవి వుండటం మంచిదే కాని వాటివల్ల తనకి ప్రమాదం వచ్చే అవకాశం ఎక్కువగా వుంది. ఆలోచన్లు పూర్తయ్యేసరికి చీకటిపడింది. లాడ్జి వెనుక ఖాళీ స్థలంలోకి వెళ్ళి అక్కడ చిన్న గొయ్యితీసి ఆయుధాలు అందులో దాచాడు.

నక్సలెట్లు చాలా జాగ్రత్తగా వుంటారు. ఒకవేళ అనుమానంతో తనని సోదా చెయ్యడం జరిగితే ఆయుధాలు చూసి పోలీసు మనిషనుకుని భ్రమపడగలరు. మామూలు మనిషి వెంట ఆయుధాలు వుండవు. అనవసరంగా చిక్కులు కొని తెచ్చుకోదల్లలేదు చంద్రం.

◆ ◆ ◆

ఉదయం ఐదు గంటలు దాటింది సమయం.

ఇంకా వెలుగురేఖలు విచ్చుకోలేదు. పొగమంచువల్ల పది అడుగుల దూరంలో ఏముందో కనిపించటంలేదు. అప్పుడే సెంటర్‌లో నెమ్మదిగా మనుష్య సంచారం ప్రారంభమయింది. సూర్యుడు కర్తవ్య నిర్వహణకు ఆయత్తమవుతున్నాడు కాబోలు! తూర్పు దిక్కు కాస్త తెల్లబడింది. చీకటి తన అధికారాన్ని వదులుకొని చెదిరిపోతున్న తెల్లవారుఝాము.

సెంటర్ నుండి బయలుదేరింది లారీ.

కాబిన్ డ్రైవర్ కాకుండా మరో నలుగురు ఇరుక్కుని కూర్చున్నారు. జాన్ అతని తల్లి, చెల్లెలు జయ, చంద్రం కూర్చున్నారు. హెడ్ లైట్ల కాంతిలో దారి చాలా ఇరుగ్గా కనిపిస్తోంది. అది మట్టిరోడ్డు కావటంవల్ల రాళ్ళు లేచిపోయి గోతులతో దారుణంగా వుంది. లారీ ఎగిరెగిరి పడుతోంది.

చుట్టుప్రక్కల పరీక్షగా చూస్తున్న చంద్రం అడిగాడు జాన్ని. "అడవి పెద్దగా కనిపించటంలేదేం?"

"ఇదివరకు అడవి కన్నాపురం వరకూ విస్తరించుకుని వుండేది! రానురాను అడవి నరికి వ్యవసాయం చేయడం ప్రారంభించారు కోయ దొరలు. అందువల్ల ముందున్న పులిరాముడు గూడెం దాటేవరకూ అడవి కనిపించదు" చెప్పాడు జాన్.

"ఈ అడవిలో జంతువులు వున్నాయా?"

"చాలా రకాల జంతువులు వున్నాయి. సింహం, ఏనుగు, ఖడ్గమృగం వంటి అరుదైన జంతువులు లేవు. ఉన్నవాటిలో గొబ్బి గేదెలు ఎక్కువగా వున్నాయి"

"వాటి ఉపయోగం ఏమిటి?"

"ఉపయోగం లేదు. దాని మాంసం ఎవరూ తినరు. అవి అప్పుడప్పుడు దారికి అడ్డంగా నిలుచుంటాయి. వాటికి కోపంవస్తే లోడుతో వున్న లారీని కూడా ఎత్తిపారేస్తాయి తలల్తో. అవి బలమైన జంతువులు కావటంవల్ల చంపటం చాలా కష్టం"

"మీకు భయం వుండదా?"

ఆ ప్రశ్నకి నవ్వుతూ చూశాడు డ్రైవర్ చంద్రం వంక. కనీసం నాలుగైదు సంవత్సరాల నుండి ఆ ప్రాంతంలో లారీ నడుపుతున్నాడు. అటువంటి సంఘటనలు ఎన్నో ఎదుర్కొని వున్నాడు. అడవి ప్రాంతంలో పరిచయం లేని వ్యక్తి అడిగిన ప్రశ్నకి నవ్వువచ్చింది అతనికి.

పులిరాముడు గూడెం ఎత్తు ఎక్కి క్రిందికి దిగటం ప్రారంభించింది లారీ. హెడ్ లైట్స్ వెలుగులో ఒక కుందేలు లారీ ముందు పరిగెడుతోంది ఏదో పెద్ద పని వున్నట్టు.

"కారు ప్రయాణంలో బ్రేక్ ఫెయిల్ అయితే ప్రాణానికి ముప్పు, రోడ్డమీద నడుస్తున్న వాడిని వాహనం గుద్దితే ప్రమాదం, నడుస్తున్నవాడు ఎంత జాగ్రత్తగా వున్నా కరెంటు షార్టు సర్క్యూట్, గ్యాస్ సిలెండర్ ప్రేలటం, కిరోసిన్ స్టౌవ్ పగలటం, యాక్సిడెంట్ వంటివి నిజమైన ప్రమాదాలు. వాటిని చూసి భయపడాలి. నాగరికత పెరుగుతున్నకొద్దీ మనిషి ప్రమాదానికి దగ్గరగా జీవనం సాగిస్తున్నాడు. మనిషిని మనిషి దోచుకోవడం, ఒంటరిగా వస్తున్న ఆడదాన్ని బలవంతం చెయ్యటం, నైతిక విలువలు మరిచి ప్రవర్తించే మానవుడు – సాధారణంగా ఎవరి జోలికి రాని మృగాల్ని చూసి భయపడతాడు. నిజమైన మృగాలు నాగరికతా జీవితంలో మన మధ్యే తిరుగుతున్నా ఆ జీవితంకోసమే ఎగబడుతున్నారు. నిజానికి మీ టౌన్లోని కలుషిత వాతావరణం మా గ్రామాల్లో మచ్చుకైనా కనిపించదు. పది సంవత్సరాల నుండి మా గ్రామంలో ఒక్క గొడవ కూడా లేదు. అక్కడ వీచే గాలిలో, కదిలే ఆకుల్లో, ఉదయంపూట చెట్ల మీదనుండి జారిపడే మంచు బిందువుల్లో ఎక్కడ చూసినా నిర్మలత్వం, ప్రశాంతం..." లారీ ఆగిపోవడంతో జాన్ మాటలు కూడా ఆగిపోయాయి.

అందరూ దారి వంక చూశారు.

నల్లగా బలిష్టంగా వున్న గేదె దారి కడ్డంగా నిలబడివుంది. అది తల తిప్పి లారీ వంక చూసింది.

దాని నాసికా రంధ్రాలు వుబ్బివున్నాయి. కాలి గిట్టలకి, తోక చివర, నుదుటిమీద తెల్లటి మచ్చలు వున్నాయి. మంచు కురవడంవల్ల తడిసి నల్లటి దాని దేహం తళతళ మెరుస్తోంది.

డ్రైవర్ ఇంజను ఆపి, లైట్లు తీసేసి మౌనంగా చూస్తూ కూర్చున్నాడు. పొగమంచులో గేదె అస్పష్టంగా కనిపిస్తోంది.

"అదేనా గొబ్బి గేదె?"

"అవును" చెప్పాడు నెమ్మదిగా, గట్టిగా మాట్లాడటం మంచిది కాదన్నట్టు.

"ఇంజన్ ఆన్చేసి లైట్ల వెలిగించి వుంచితే ఏమవుతుంది?"

"దానికి అనుమానం, కోపం ఎక్కువ. వాటిలో ఏది వచ్చినా పెద్ద పెద్ద వృక్షాలను కూడా పెళ్ళగించేస్తుంది. మన లారీని సులువుగా తిరగేస్తుంది" చెప్పాడు డ్రైవర్ ముందుకి చూస్తూనే.

కొద్దిసేపు ఆగి లైట్లు వెలిగించాడు డ్రైవర్.

మరోసారి తల తిప్పి లారీ వంక తీక్షణంగా చూసింది. అలా కనిపించింది వాళ్ళకి. ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా లైట్లు ఆర్పేశాడు.

ఒకటి... రెండు... మూడు... నాలుగు... ఐదు... ఆరు నిమిషాలు బరువుగా గడిచాయి. ఎవరూ మాట్లాడలేదు. అంతా నిశ్శబ్దంగా చూస్తున్నారు.

డ్రైవర్ మళ్ళీ లైట్లు వెలిగించాడు.

ఆశ్చర్యం!

రోడ్డు ఖాళీగా వుంది. అప్పుడు వినిపించింది ఏదో పరిగెడుతున్న శబ్దం భూమి కంపించినట్టు.

తిరిగి లారీ బయలుదేరింది. అప్పటికి పూర్తిగా తెల్లవారిపోయింది. చుట్టుప్రక్కల ప్రదేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అటు ఇటు లోయల మధ్య లారీ నెమ్మదిగా వెళుతోంది. ప్రకృతి కంటికి నిండుగా శోభాయమానంగా కనిపిస్తోంది. వెదులుబొంగులు తాడిచెట్టు ఎత్తు పరిమాణంలో పెరిగి గాలికి వింతగా వూగుతున్నాయి. దారి కిరువైపులా మొలిచిన చెట్లు ఒకదానితో ఒకటి కలిసిపోయి గుడారంలా అల్లుకుపోయాయి. ప్రయాణంలో ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా లారీ లోయలో పడి నామరూపాలు లేకుండాపోతుంది.

"దారిలో చాలా వాగులు వున్నాయి" చెప్పాడు చంద్రం లారీ అప్పటికే చాలా వాగులు దాటడం చూసి.

"దానిని వాగు అనకూడదు, గెడ్డ అనాలి. మనకి ఎదురైన గెడ్డలన్నీ ఒక్కటే! అది పాపికొండల నుండి ప్రవహిస్తుంది. మెలికలు తిరిగి మనకి దారిలో చాలాసార్లు కనిపిస్తుంది. ఇదే గెడ్డపల్లిలో ప్రవహిస్తుంది..." చెప్పాడు జాన్.

"దీనిని ఏడాకుల మర్రి అంటారు" చంద్రానికి చూపించాడు జాన్.

చంద్రం ఆసక్తిగా చూశాడు. పెద్ద మర్రి వృక్షమొకటి రోడ్డు ప్రక్క వుంది. దాని వూడలు దారికి రెండవవైపు భూమిలో దిగి వున్నాయి. వాటిలో కాండం ఏదో గుర్తుపట్టడం కష్టం. చాలా భయంకరంగా వుందక్కడ. అడవి మరీ చిక్కగా వుండటంవల్ల అక్కడ చీకటిగా వుంది.

"దానికి ఆ పేరు ఎలా వచ్చింది?"

"ఎప్పుడో ఈ ప్రాంతం నీటితో నిండిపోయిందట. అప్పుడు అన్నీ మునిగిపోయినా, ఈ చెట్టు ఆకులు ఏడు మాత్రం పైకి కనిపిస్తున్నాయట! మా పెద్దలు చెబుతారు. నాకు తెలిసిన ముఖ్య విషయం ఏమిటంటే ఆ చెట్టుదగ్గిర పులి వుంది..."

"పులా?"

"అవును పులే!" చెప్పాడు జాన్.

మూడు గంటలు ప్రయాణంచేసిన తరువాత లారీ ఒక గ్రామంలో ప్రవేశించింది. అక్కడ చిన్న చిన్న గుడిసెలు కనిపిస్తున్నాయి. అవి మొత్తం పాతిక కూడా వుండవు. అక్కడ మనుష్య సంచారం కనిపిస్తోంది. అప్పుడు గుర్తొచ్చింది చంద్రానికి దారిలో ఒక్క మనిషి కూడా కనిపించలేదని.

విశాలమైన స్థలంలో నాలుగు పాకలు వున్న చోట లారీ ఆగింది. వాటి చుట్టూ వెదురుకర్రలతో ఫెన్సింగ్ కట్టబడివుంది. లోపల చిన్నపిల్లలు తిరుగుతున్నారు.

చుట్టుప్రక్కల పదిహేను గ్రామాలకి అదే హాస్టలు మరియు పాఠశాల.

◆ ◆ ◆

ఎత్తయిన గుట్టమీద వుంది గెడ్డపల్లి గ్రామం. దానికి కాస్త దూరంలో వుంది హాస్టల్. గ్రామానికి మధ్యలో పెద్ద పెద్ద చింతచెట్లు నిలిచివున్నాయ్. రెండు పాకల మధ్య ఖాళీస్థలముంచి నిర్మించబడివున్నాయి. వాటి చూరులు బాగా క్రిందికి దించి కట్టారు. ఒంగోని లోపలికి ప్రవేశించాలి. ఊరు మొత్తానికి దూరంగా నుయ్యి వుంది. దాని కెదురుగా ఒక గెడ్డ ప్రవహిస్తోంది.

ఆ గ్రామ ప్రజలు ఎప్పుడూ ఏదో పనిలో మునిగి వుండటం కనిపిస్తుంది. మగవాళ్ళు పంచె మాత్రమే కట్టుకుంటారు. వాళ్ళ మెడలో కొద్దిపాటి పూసల దండలు వుంటాయి. ఇళ్ళ వెంట జాతకం చూస్తానని తిరిగే కోయదొరల మాదిరి వుండరు. వాళ్ళు ప్రత్యేకంగా వేషం వేసుకుని తిరుగుతూ వుంటారు. ఆడవాళ్ళు చీర ధరిస్తారు. జాకెట్ మాత్రం వుండదు. తెలుగు మాట్లాడతారు. అయినా వాళ్ళకి ప్రత్యేకంగా కోయ భాష వుంది.

ఉక్కుతో తయారుచేసిన మొనగల బాణాలు వేటకి ఉపయోగిస్తారు. అవి ఎంత వాడిగా వుంటాయంటే ఒకే బాణంతో మనిషిని చంపవచ్చు. అది లోపలికి ప్రవేశిస్తుందే తప్ప వెనక్కి లాగినా రాదు. సంవత్సరంలో నాలుగైదు సార్లు సామూహిక వేట కొనసాగిస్తారు. రెండు బృందాలుగా విడిపోయి ఒక బృందం బాణాలతోను, మరొక బృందం డప్పులతోను వెళ్ళి వేటాడతారు. ఈ కార్యక్రమం పండగ రోజుల్లో చేస్తారు.

కోయ దొరలకి భూమి పండగ ముఖ్యమైనది. ఆరోజు ఆడ మగ పిల్ల పాప అనే బేధం లేకుండా సారా త్రాగుతారు. అది ఒక్కటే వాళ్ళల్లోని అవలక్షణం. వాళ్ళ మధ్య వున్న ఐకమత్యం మనకి ఎక్కడా కనిపించదు. కాలిబాటలో ఎప్పుడైనా నరికి పడేసిన పచ్చటి చెట్టుకొమ్మ కనిపిస్తే ఎవరైనాసరే ఆ దారినుండి తప్పుకుని వెళ్ళిపోతారు. ఆ ప్రాంతంలో భార్యాభర్తలు దాంపత్య సుఖం అనుభవిస్తున్నారనే దానికి గుర్తు అది.

ఇది వాళ్ళ ఆచారం.

చంద్రం వచ్చి మూడు రోజులయింది. మూడు రోజుల్లో చాలా విషయాలు తెలుసుకున్నాడు.

సాయంకాలం నాలుగు గంటలయింది సమయం.

జయతో షికారుకి బయలుదేరాడు చంద్రం. పాకల ప్రక్కనుండి నడుస్తూ హఠాత్తుగా ఆగిపోయాడు. అతని దృష్టి పాకల మధ్య తిరుగుతున్న ఒక యువకునిమీద పడింది. ఆ యువకుడు తచ్చాడుతున్నాడు.

ఎందుకో చంద్రానికి అతనిమీద అనుమానం కలిగింది.

ఆ యువకుడు పాకల వంక చూసుకుంటూ చివరివరకూ వెళ్ళి మళ్లీ వెనక్కి తిరిగాడు. అలాగే చూసుకుంటూ వస్తున్నాడు.

చంద్రంతోపాటు జయ కూడా నిలబడి చూస్తోంది.

ఒక పాక నుండి పద్నాలుగు సంవత్సరాల అమ్మాయి చీపురు పట్టుకుని బయటికి వచ్చింది వాకిలి తుడవటానికి. అనుమానంగా తిరుగుతున్న యువకుడు ఆ అమ్మాయిని పరీక్షగా చూసి మెరుపులా కదిలాడు. క్షణకాలంలో ఆ అమ్మాయి చెయ్యి పట్టుకుని అడవిలోకి వెళుతున్న కాలిబాటవైపు నడిచాడు తొందరగా.

చంద్రం మొహం కోపంతో జేవురించింది. అతను అటువైపుకు వేగంగా కదలబోయాడు. చంద్రం చెయ్యి గట్టిగా పట్టుకుంది జయ.

“వాడు అమ్మాయిని లాక్కుపోతున్నాడు...” చెప్పాడు ఆ దృశ్యాన్ని జయ చూడలేదనుకుని.

“తీసుకుపోనివ్వండి...” చెప్పింది పెదాలు బిగబట్టి నవ్వు ఆపుకుంటూ.

“మీకేమన్నా మతిపోయిందా? ఆడపిల్లని బలవంతంగా తీసుకుపోతుంటే!” కోపంగా అన్నాడు, చెయ్యి విడిపించుకుంటూ.

“చంద్రం మహాశయా! ఇది మీ టౌన్ కాదు, మా గెడ్డపల్లి. ఇక్కడ వయసొచ్చిన కుర్రవాడు తన జోడీకోసం వెతుక్కోవటంలో తప్పులేదు. తనకు నచ్చిన పెళ్ళికాని పిల్ల కనిపించగానే అలా చెయ్యి పట్టుకుని తన ఇంటికి తీసుకుపోవచ్చు. సాధారణంగా ఎవరూ అడ్డు వెళ్ళరు, వెళితే... వెళ్ళినవాడు అతనితో పోరాడి గెలిచి అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలి...” చెప్పింది.

మతిపోయింది చంద్రానికి. తను ఎంత ప్రమాదంలో ఇరుక్కునేవాడో అర్థమయ్యేసరికి ముచ్చెమటలు పోసాయి.

“అలా తీసుకువెళితే అదే పెళ్ళా?”

“కాదు. రేపు ఉదయం కుర్రవాడి తండ్రి కొందరు మనుషులను వెంటబెట్టుకుని వచ్చి పిల్ల ఇంటివద్ద సారా కుండ, ఒక మేకపోతు వ్రేలాడగట్టి వెళ్ళిపోతారు. రెండు రోజుల తరువాత వచ్చి చూస్తారు. కుండలో సారా, కట్టిన మేకపోతు లేకపోతే పెళ్ళి జరగటానికి ఇష్టపడినట్టు...”

“అవి వుంటే?”

“పెద్దమనుషులు వచ్చి సంప్రదించాల్సి వుంటుంది”

“సారా, మేకపోతు ఏం చేస్తారు?”

“గ్రామ పెద్ద కుర్రవాడి గురించి వివరాలు సేకరిస్తారు. ఆ పెళ్ళి ఇష్టమైతే గ్రామప్రజలు పండుగ జరుపుకుంటారు వాటితో...”

“ఈలోపు కుర్రవాడు అమ్మాయిమీద అఘాయిత్యం చేస్తే...?”

“అది జరగని పని. తిన్నగా ఇంటికి తీసుకుని వెళతాడు. ఇళ్లు పవిత్రమైన స్థలాలు వాళ్ళకి. భార్యాభర్తలు కూడా ఇంటిలో కలసి పడుకోరు”

వాళ్ళ నమ్మకం లేదా ఆచారంలో ఎంత పవిత్రత వుందో తెలుసుకునేసరికి చంద్రం మెచ్చుకోకుండా వుండలేకపోయాడు. ఈమధ్య దేవాలయంలో దేవుని విగ్రహం ముందు పూజారి ఒక అమ్మాయిని మానభంగం చేశాడట. అందుకే జాన్ చెప్పాడు, నిజమైన మృగాలు మన మధ్యే తిరుగుతున్నాయని.

“బాగుంది” సాలోచనగా అన్నాడు చంద్రం.

“కుంకుళ్ళు, చింతపండు, తేనె వంటి వాటిమీద ఆదాయమేనా మరేదయినా ఆదాయం వుందా ఇక్కడి ప్రజలకి?” అడిగాడు నడుస్తూ.

“దుప్పి కొమ్ములు, జంతు చర్మాలు, చెట్ల జిగురుమీద కూడా ఆదాయం వస్తుంది” చెప్పింది. వాళ్ళు అలా మాట్లాడుకుంటూ అడవిలో కొంత దూరం నడిచారు. ఒకచోట ఆగింది జయ.

చంద్రం కూడా ఆగి పరీక్షగా చూశాడు చుట్టూ. అది చిన్న మైదానం. దాని చుట్టూ అడవి వృక్షాలు పెరిగివున్నాయి. మైదానానికి మధ్యలో ఒక మామిడిచెట్టు వుంది. భూమ్మీద రెండంగుళాల ఎత్తులో చిక్కగా గడ్డి మొలిచివుంది. అక్కడి ప్రకృతి రమణీయంగాను,

ఆహ్లాదకరంగను వుంది. అప్పుడు గ్రహించాడు చంద్రం అడవిలో చాలా దూరం నడచివచ్చామని. ప్రశ్నార్థకంగా జయ మొహంలోకి చూశాడు.

చిన్నగా నవ్వి తల దించుకుంది. ఆమె కళ్ళల్లో క్షణకాలంపాటు సిగ్గు కదలాడింది.

అనుభవం లేకపోయినా ఎదుటి మనిషిని అంచనా వెయ్యలేనంత పిచ్చివాడు కాదు చంద్రం. తామున్న చోటులో, ముడుచుకున్న ఆమె శరీరంలో సిగ్గుతో క్రిందకి వాలిన కనురెప్పల్లో – కావాలని అందించిన అవకాశం ప్రతిఫలిస్తోంది.

ఒక నిర్ణయానికొచ్చినట్టు ఆమెవైపు రెండడుగులు వేశాడు.

ఆ కదలికే అతన్ని రక్షించింది.

కాస్త దూరంలో మొక్కలు కదిలిన చప్పుడు. గాలిలో ఏదో దూసుకుపోతున్న సవ్వడి, ఆలోచించటానికి సమయం తీసుకోలేదు చంద్రం. మెరుపులా ప్రక్కకి తిరుగుతూ తన కుడిచెయ్యి పిడికిలి బిగించి బలంగా విసిరాడు గాలిలోకి.

ఆ పిడికిలి దేనికో తగిలింది. చెయ్యి తగలటంవల్ల అది "దబ్"మని శబ్దంచేస్తూ ప్రక్కన పడింది.

చంద్రం ఆటోమేటిక్‌గా ఎటాక్ పొజిషన్‌కి వచ్చాడు. రెండు కాళ్ళు విడిగా వేసి, మోకాళ్ళు వంచి నిలుచున్నాడు. ఒక చెయ్యి ముందుకి మరో చెయ్యి పైకి లేపి క్రింద పడిన దానివంక చూశాడు.

పడినట్టే పడి వెనక్కి తిరిగి, ముందుకాళ్ళు వంచి మీదకి దూకటానికి సిద్ధంగా నిలబడింది.

పులి.

అప్పటికే చెట్టు వెనక్కి పరిగెత్తింది జయ. చెట్టు మొదలు గట్టిగా పట్టుకొని భయంతో వణికిపోతోంది చంద్రం వంక చూస్తూ.

జయకి పులికి మధ్యలో వున్నాడు చంద్రం.

చంద్రం విసిరిన పిడికిలి గూబమీద తగలటంతో పులికి మతిపోయింది. అది విపరీతమైన కోపంతో చంద్రం వంక చూస్తోంది.

చంద్రం కదల్లేదు. సూటిగా పులి కళ్ళల్లోకి చూస్తున్నాడు. తను నిలుచున్న పొజిషన్‌లో ఎటువంటి ఎటాక్‌నైనా ఎదుర్కోగలడు. కావాల్సిన విధంగా తిరగగలడు.

పులి స్థిరంగా నిలుచుని చంద్రం వంక కసిగా చూస్తోంది. మామూలు సమయంలోనే భయంకరంగా కనిపించే దాని కళ్ళు కోపంతో మరింత పెద్దగా, రెండు ఎర్రటి బల్బులు వెలుగుతున్నట్టుగా కనిపిస్తున్నాయి. నిలుచున్న స్థలం నుంచి కదిలి ఒక అడుగు ముందుకి వేసింది దృష్టి మరల్చకుండా.

అది తనని కవ్విస్తోందని గ్రహించాడు చంద్రం. అతను మాత్రం కదలలేదు. అతనికి తెలుసు. అది తనమీద తిరగబడితే ఎక్కువసేపు దానితో పోరాడలేనని.

ఆ విషయం పులికి తెలియదు.

అతి కష్టంమీద రెండు నిమిషాలు గడిచాయి.

పులి రెప్ప వెయ్యడంలేదు. చంద్రం కదలటంలేదు.

మరో నిమిషం గడిచింది.

చెమటపట్టి చంద్రం బట్టలు మొత్తం తడిసిపోయాయి.

ఒక్కసారిగా గాండ్రించి దూకింది ప్రక్కకి. కన్ను మూసి తెరిచేంతలో కలసిపోయింది అడవిలో.

చంద్రం గుండెల నిండా ఊపిరి పీల్చుకుని వెనక్కి తిరిగాడు. జయ బలహీనంగా నవ్వింది చంద్రాన్ని చూసి. ఆమె కళ్ళల్లో ఒక గొప్ప వ్యక్తిని చూస్తున్న భావం.

"ముందు ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి. మనం దొరకలేదన్న కోపంతో మాటువేస్తుంది..." చెప్పాడు. ఆపైన గ్రామం చేరేవరకూ ఇద్దరూ మాట్లాడుకోలేదు.

◆ ◆ ◆

ఊరికి ఒక ప్రక్కన దట్టమైన చెట్ల మధ్యనుండి ప్రవహిస్తోంది గెడ్డ. చిన్న చిన్న బండరాళ్ళని తప్పించుకుని మందంగా సాగిపోతోంది. చరిత్ర ప్రసిద్ధమైన పాపికొండల్లో గిరిజనులకోసమే పుట్టినట్టు దీర్ఘప్రయాణం చేస్తుంది అది. స్వచ్ఛంగా తెల్లగా కనిపించే ఆ గెడ్డనీటిలో మలేరియా కలిగించే క్రిములు వుంటాయి. ఐదు సంవత్సరాల క్రితం మలేరియా జ్వరం సోకి ఆంధ్రప్రదేశ్‌లో వందలకొద్ది గిరిజనులు ప్రతియేటా మరణిస్తూవుండేవారు. ప్రభుత్వం యుద్ధప్రాతిప్రదికమీద నివారణాచర్యలు తీసుకోవడంవల్ల ప్రస్తుతం మలేరియా చాలావరకూ నిర్మూలించబడింది. ఇప్పటికి కూడా చాలామంది ఆ నీరు త్రాగడానికి భయపడుతూవుంటారు. నాగరికులు అక్కడికి రావల్సిన అవసరం

ఏర్పడితే తమ వెంట సీసాలతో నీళ్ళు తెచ్చుకుంటారు. గెడ్డనీరు కాచి చల్లార్చి త్రాగితే మలేరియా జ్వరం రాదు. అయినాకూడా ఏదో భయం.

గెడ్డ ప్రక్కన ఎత్తైన స్థలాన్ని శుభ్రపరుచుకుని చెట్టు క్రింద చాప పరుచుకుని పడుకున్నాడు చంద్రం. మిట్టమధ్యాహ్నమైనా చల్లగా వుందక్కడ. గుబురుగా పెరిగిన అడవి వృక్షం ఆకుల సందుల్లోంచి సన్నటి సూర్యకిరణాలు మీదపడి గిలిగింతలు పెడుతున్నాయి.

అక్కడి ప్రజల్ని చూస్తూవుంటే జీవితమంతా అక్కడే గడిపేయాలన్నంత కోరిక పుడుతోంది అతనికి. మాయా మర్మం తెలియని గిరిజనులకి వ్యవసాయంకోసం అడవి బాగుచేసుకోవడం, ఆహారంకోసం జంతువుల్ని వేటాడటం ముఖ్యమైన పనులు. ఎప్పుడూ పనిలో మునిగిపోయి కనిపిస్తారు. వాళ్ళ నిర్మలమైన జీవనవిధానం చంద్రాన్ని ఆకర్షించింది. వర్షాకాలంలో ఎత్తైన ప్రాంతంలో ఇల్లు కట్టుకుని తమ సంసారాలతో వెళ్ళిపోయి అక్కడే నాలుగు నెలలూ నివసిస్తారు. దానినే వాళ్ళు పోడు అని పిలుస్తారు. ఇల్లు నిర్మించుకోవడం నాగరిక ప్రజలకి అత్యంత ప్రయాసతో కూడిన పని. కాని ముగ్గురు గిరిజనులు రెండు రోజుల్లో ఒక ఇల్లు నిర్మిస్తారు అక్కడ. కూలీలతోను, వస్తువులు కొనుక్కోవడంతోను వాళ్ళకి పని వుండదు. అడవిలో లభించే వెదురు, వృక్షాలు కలప క్రింద ఉపయోగించి ఇంటిని మట్టితో నిర్మిస్తారు. ఇంటి లోపల వెదురుబద్దలతో పడుకోవడానికి అనుకూలంగా భూమిలో కర్రలు పాతి ఎత్తుగా మంచెలు మాదిరి నిర్మించుకుంటారు.

కాస్తంత చదువుకుని ఉద్యోగంకోసం తిరుగుతూ, బట్టలు తొడుక్కోవడం, భూమ్మీద తాము పుట్టడమే గొప్పగా భావించే యువకులు పరీక్షహాలు చుట్టూ గుమిగూడి తమ మనిషికి స్లిప్ అందించటానికి ప్రయత్నించే మనుషులు, సినిమా విడుదల రోజున నటుడి బొమ్మకి యాభై రూపాయల ఖరీదు గల పూలదండ వేసి సినిమా హాలు గేటువద్ద ఆరోజు కలెక్షన్స్ లెక్కవేసుకునే విద్యార్థులు, దేవుడు సర్వాంతర్యామిగా నమ్ముతూ కొన్ని వందల రూపాయల ఖర్చుతో దైవదర్శనానికి కొనఊపిరితో బయలుదేరిన ముసలివాళ్ళు, రెండు నెలల పసికందుని భుజాన వేసుకుని గంటల తరబడి ఎండలో సినిమా హాలువద్ద క్యూలో నిలుచునే గృహిణులు, నాగరికులమని బ్రతుకుతున్నా ఆత్మవంచన తప్ప నిజమైన అనాగరికులు వాళ్ళే. చంద్రానికి అక్కడ తనొక నూతన ప్రపంచం చూస్తున్న భావం కలగడంలో ఆశ్చర్యం లేదు.

అన్నీ మర్చిపోయి అక్కడే వుండిపోతే ఎంత బాగుంటుంది. మనసులో అనుకున్నాడు చంద్రం కళ్ళు మూసుకుని, మొహానికి చెయ్యి అడ్డుగా పెట్టుకుని.

“ఏయ్! లే…” ఓ గొంతు పిలిచింది కటువుగా.

మొహం మీదనుంచి చెయ్యి తప్పించి చూశాడు చంద్రం.

ఎదురుగా డేవిడ్ నిలబడివున్నాడు.

అతని చేతిలో ఈటె వుంది. ఆరడుగుల పొడవుగల కర్రకి ఒక చివరి కవచం మాదిరి తొడిగి వుంది ఇనుపముక్క. దానిని వేటలో ఉపయోగించడంకోసం తయారుచేసుకుంటారు గిరిజనులు. అడవిపంది వంటి బలమైన జంతువుని బాణాలతో వేటాడినపుడు దానికి దెబ్బ తగిలిన వెంటనే తనమీద ఆయుధం ప్రయోగించిన దిక్కుకి దూసుకునివస్తుంది. ఆ సమయంలో వేటగాడి ప్రక్కనున్న మనిషి ఈటెతో దానిని ఎదుర్కొంటాడు. తుపాకీతో కాల్చినపుడు కూడా అది అలాగే తిరగబడుతుంది. అందుకే వేటగాడు మాటువేసి కొడతాడు.

జయకి చిన్నన్నయ్య డేవిడ్. వాళ్ళ కుటుంబంలో అందరూ కాస్తో కూస్తో చదువుకున్నా డేవిడ్‌కి మాత్రం చదువు అబ్బలేదు. అతను గిరిజనులకు సారా అమ్ముతూ కాలం గడుపుతుంటాడు. సారా వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంకంటే ఖర్చు ఎక్కువ అతనికి. అతని తాగుడికి సరిపోదు అది. భార్యతోపాటు అన్న జాన్‌మీద ఆధారపడి జీవిస్తున్నాడు.

సన్నగా వుండే డేవిడ్ క్రూరంగా చూస్తున్నాడు చంద్రం వంక.

“ఏమిటి?” అడిగాడు చంద్రం లేచి కూర్చుంటూ. జాన్ కుటుంబంలో చంద్రంతో మాట్లాడని మనిషి డేవిడ్ ఒక్కడే. మిగతా వాళ్ళు ఆత్మీయంగా పలకరిస్తున్నా డేవిడ్ అదోలా చూస్తాడు చంద్రం వంక. మొదటి చూపులకే అతని పట్ల అపోహ ఏర్పడింది చంద్రానికి. ఒకటి రెండుసార్లు మాట్లాడటానికి ప్రయత్నించినా సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు. ఇప్పుడు ప్రత్యేకంగా వచ్చి ఎందుకు పలకరిస్తున్నాడు?

“నిన్న నా చెల్లితో ఎక్కడికిరా వెళ్ళావ్?” అడిగాడు పెద్దగా.

చివ్వున చూశాడు చంద్రం డేవిడ్ సంబోధన అతనికి కోపం తెప్పించింది. అయినా తమాయించుకున్నాడు. ఆమెతో కలిసి వెళ్ళినదాంట్లో ఎటువంటి ప్రత్యేకత లేకపోయినా ఎందుకు అడుగుతున్నాడో అర్థంకాలేదు. ఎవరికీ తెలియని ఆ విషయం అతనికి తెలియడం కాస్త ఆశ్చర్యాన్ని కలిగించింది.

“షికారుగా అలా తిరిగి రావడానికి వెళ్ళాం” చెప్పాడు సౌమ్యంగా మాట్లాడే ప్రయత్నంచేస్తూ.

“పెళ్ళికాని ఆడపిల్లని అమాయకురాలిని మాయమాటలు చెప్పి మభ్యపెట్టి అడవిలోకి తీసుకుపోయి షికారుకని చెబితే నమ్మడానికి నేను పిచ్చివెధవని కాదు. మా ఊరులో ఇటువంటి ఘనకార్యమేదో చేస్తావని నాకు తెలుసు…” చెప్పాడు తీవ్రంగా. ఆవేశం తట్టుకోలేకపోతున్నట్టు వూగిపోతున్నాడు.

డేవిడ్ చేతులు ఈటెమీద బిగుసుకోవడం గమనించాడు చంద్రం. అతనికి అంత కోపం ఎందుకు వచ్చిందో బోధపడలేదు. పనిగట్టుకుని గొడవకి వచ్చినట్టుంది వాలకం. జయ తనతో షికారుకి బయలుదేరితే వాళ్ళ ఇంట్లో ఎవరూ అభ్యంతరం పెట్టలేదు. ఒకవేళ అడగదల్చుకున్నా డేవిడ్ అంతగా ఆవేశపడాల్సిన అవసరం లేదు.

"ఎందుకిలా గింజుకుపోతున్నావ్ నేనేదో అన్యాయం చేసినట్టు. నన్ను ప్రశ్నించే బదులు నీ చెల్లెల్ని ప్రశ్నిస్తే నీకు సరియైన సమాధానం చెప్పేది కదా!" అన్నాడు లేచి నిలుచుంటూ ముందుజాగ్రత్తచర్యగా.

"నీకెన్ని గుండెలు... నా చెల్లెని అడగమంటావా?" అంటూ ఈటెని చంద్రం గుండెలకు తిన్నగా పట్టుకుని ముందుకి వచ్చాడు.

చంద్రం నిశితంగా అతని కదలికలు గమనిస్తూ కదలకుండా నిలుచున్నాడు. ఈటె తన ఛాతిని సమీపించేవరకూ ఆగి చివరి క్షణంలో ఒక కాలు ప్రక్కకి వేసి తప్పుకుని ఈటె మధ్యభాగాన్ని ఒక చేత్తో పట్టుకుని రెండవ చెయ్యి దేవిట్ గుండెలమీద వేసి అతన్ని వెనక్కి త్రోసి చెప్పాడు.

"నీమీద నాకు కోపం లేదు. ఊరికినే నన్ను రెచ్చగొట్టకు. నీలాంటివాడు నా ముందు నిలవలేడు..."

వికటంగా నవ్వాడు డేవిడ్.

"ఈ ఊరు నాదిరా! నేను కేకవేస్తే పదిమంది వచ్చి నిన్ను ముక్కలుగా నరికేస్తారు. ఎక్కడో పుట్టిన నువ్వు ఈ ఊరు మట్టిలో కలిసిపోతావ్. నీలాంటి అనామకుడ్ని చూసి నేనెందుకు భయపడాలి? మరోసారి నా చెల్లెలుతో తిరగకుండా ఈరోజు నీ అంతు చూడటానికే వచ్చాను. దమ్మొంటే ఈసారి తప్పించుకో..." అంటూ వేగంగా చంద్రం మీదకి వచ్చాడు.

చంద్రం మెరుపులా కదిలాడు. వేగంగా మీదకి వచ్చిన డేవిడ్ తిన్నగా చంద్రం ప్రక్కనుంచి దూసుకుపోయాడు. అతని చేతిలోని ఈటె చెట్టుకి గుచ్చుకుంది. దానిని వెనక్కి తీసుకుని మరోసారి చంద్రాన్ని పొడవాలనుకున్నాడు డేవిడ్. అతని ఆలోచన ఆచరణలోకి రాకుండానే చంద్రం కుడికాలెత్తి డేవిడ్ ప్రక్కటెముకల మీద తన్నాడు. ప్రాక్టీస్ సమయంలో చెట్టుని తన్నడానికి ఉపయోగించే బలంలో మూడో వంతు మాత్రమే ప్రయోగించాడు.

ఆ దెబ్బకే ఎగిరిపడ్డాడు డేవిడ్. అసలైన దెబ్బ తగిలివుంటే అక్కడికక్కడే అతని ఊపిరి ఆగిపోయివుండేది.

"నన్ను రెచ్చగొట్టవద్దని ముందే చెప్పాను. చెల్లెలుమీద ప్రేమ వుండి నీవు అడగడానికి రాలేదు. త్రాగి ప్రత్యేకంగా గొడవ పెట్టుకోవడానికి వచ్చావ్. నిజంగా నేను నీ చెల్లెలితో తిరిగినా నువ్వేమీ చెయ్యలేవు. తెలివితక్కువగా మాట్లాడి నీ చెల్లెలి జీవితానికి మచ్చ తెస్తున్నావ్. మరోసారి అటువంటి మాటలు వినడం సంభవిస్తే – నిన్ను ఆ భగవంతుడు కూడా నా నుండి రక్షించలేడు..." చెప్పాడు డేవిడ్‌ని సమీపించి రెండు చేతులతో కాలర్ పట్టుకుని పైకి లేపుతూ. డేవిడ్ భయంగా చూశాడు చంద్రం వంక, అప్పటివరకూ తనని ఆవరించిన మైకం వదలిపోయినట్టు.

డేవిడ్‌ని పూర్తిగా గాలిలోకి లేపి,

"ఇది నీ ఊరు కావచ్చు. కాని భారతదేశంలో ఎక్కడైనా సంచరించే హక్కు నాకుంది. అజ్ఞానంతో కళ్ళు మూసుకుపోయివుంటే తెరిచి ప్రపంచాన్ని చూడు. ఈ ఊరు ఒక్కటే ప్రపంచం కాదు..." చెప్పి బలంగా గెడ్డలోకి విసిరేశాడు.

గాలిలో దూసుకెళ్ళి గెడ్డలో పడ్డాడు డేవిడ్. గెడ్డ లోతుగా వుండదు. నీటిలో పడిన డేవిడ్ మునగలేదు. తడిసిన బట్టలతో అవతల ఒడ్డుకి గబగబా వెళ్ళి, నేలమీద నుండి ఒక రాయి అందుకుని బలంగా చంద్రం మీదకి విసిరాడు.

సూటిగా తలమీదకి వస్తున్న రాయిని గమనించి చటుక్కున కుడిచెయ్యి అడ్డుపెట్టాడు. అరచేతికి తగిలి రాయి క్రింద పడింది. ఒళ్ళు తెలియని కోపంతో విసిరింది కావడంవల్ల అది చాలా వేగంగా వచ్చింది. పొరబాటున తలకి తగిలితే వారం రోజులు లేవాల్సిన పని వుండదు.

చంద్రం ఆవేశంగా చెట్టుకి గుచ్చుకుని వున్న ఈటెని అందుకుని డేవిడ్‌వైపు తిరిగాడు.

అది చూసి గాలిలో ఎగిరిపోతున్నట్టుగా పరిగెత్తి గుబురుగా పెరిగివున్న చెట్ల గుంపులో కలిసిపోయాడు డేవిడ్.

చంద్రం తన చేతిలోని ఈటెని కసిగా విసిరాడు ఒక వృక్షంమీదకి. అది తిన్నగా వెళ్ళి చెట్టులో దిగబడింది. ఒకసారి నిట్టూర్చి తిరిగి చాపమీద పడుకున్నాడు తీవ్రంగా ఆలోచిస్తూ. ఎంత ఆలోచించినా డేవిడ్ తన మీదకి రావడానికి గల కారణం అర్థంకాలేదు.

అతనికే కాదు. డేవిడ్‌కి కూడా తెలియదు.

నక్సలైట్ దళంలోని ఒక సభ్యుడు ఊరులోకి ప్రవేశించి విశేషాలు తెలుసుకున్నాడు. కొత్తగా వచ్చిన చంద్రం గురించి తెలిసింది. చంద్రం గురించి తెలుసుకునే ప్రయత్నంలో ఒక గిరిజనుడి ద్వారా డేవిడ్‌చేత త్రాగించి, రెచ్చగొట్టి చంద్రం మీదకి పంపించాడు. ఆ సమయంలో వాళ్ళ మధ్య జరిగే గొడవలో చంద్రం కోపంతో నోరుజారి తన వివరాలు వెల్లడించవచ్చుననే ఆలోచనతో మొదటి పరీక్ష పెట్టబడింది.

ఆ సభ్యుడు చంద్రానికి డేవిడ్‌కి మధ్య ఘర్షణ జరుగుతున్నప్పుడు యాభై గజాల దూరంలో చెట్టు చాటున నిలుచుని గమనిస్తున్నాడు. అతను నిలబడిన చెట్టుకే చంద్రం విసిరిన ఈటె గుచ్చుకుంది.

నక్సలైట్ దళం ఒక గ్రామంలో మీటింగ్ జరపాలనుకుని నిర్ణయించుకుంటే ముందుగా ఒక సభ్యుడు వచ్చి గ్రామాన్ని పరీక్షిస్తాడు.

తుఫాన్ వచ్చేముందు ప్రశాంతతలా!

# 9

"... వ్యాపారస్తులు మిమ్మల్ని నిలువునా దోపిడీ చేస్తున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మీరు మోసపోతూనేవున్నారు. గిరిజన కోపరేటివ్ సేల్స్‌మేన్‌లు కూడా వ్యాపారస్తులు మాదిరి మిమ్మల్ని మోసం చేస్తున్నారు. ఇది సహించకూడని విషయం. మీరు ఎందుకు భయపడతారు? మోసాన్ని ఎదుర్కోండి. మీ వెనుక మా మనుషులు వుంటారు. ఇంతవరకూ ఉపేక్షిస్తూవచ్చాం. మిమ్మల్ని మోసం చేస్తున్న వ్యక్తులకి సరియైన గుణపాఠం నేర్పాలని నిర్ణయించాం. ప్రభుత్వం కబుర్లు చెబుతుంది. ఓట్లు వేయించుకుంటుందే తప్ప మీ జీవితానికి ఏ విధంగానూ సహాయం చెయ్యటంలేదు. పోలీసులని చూసి భయపడకండి. మీ సమస్యలు మీరే పరిష్కరించుకోండి. సంపద పెంచుకోవటానికి పెట్టుబడిదారులు మీ చుట్టూ కుక్కలు మాదిరి తిరుగుతారు. మీ అమాయకత్వమే వాళ్ళ పెట్టుబడి. మీరు సమస్యని అర్థం చేసుకోండి. మా సిద్ధాంతాలు నచ్చిన యువకులు, ఉత్సాహవంతులు సమసమాజంకోసం మా ఉద్యమంలో చేరండి..." ఉపన్యాసం సుదీర్ఘంగా సాగుతోంది. ఉపన్యసిస్తున్న నాయకుడు కుర్చీలో కూర్చుని వున్నాడు. తుపాకి కుర్చీకి చేరవేసివుంది.

అతని ముందు ఆ గ్రామవాసులు గుంపుగా కూర్చునివున్నారు. కొంతమంది నేలమీద కూర్చుంటే, మరి కొంతమంది గొంతుకి కూర్చుని ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటున్నారు. ఇదివరకు వాళ్ళకి చాలా విషయాలు అర్థమయ్యేవి కావు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. తమకి జరుగుతున్న అన్యాయాలని గుర్తించగలుగుతున్నారు. సమస్యల్ని అర్థంచేసుకోగలుగుతున్నారు. తూకంవేసి పట్టుకెళ్ళిన పది కేజీల వస్తువు ఏడు కేజీలని చెబితే – ఎంత అమాయకునికైనా జరిగినదేమిటో బోధపడుతుంది. ఆపాటి తెలివితేటలు మీటింగ్‌లు పెడుతున్న వ్యక్తులవల్లనే కాకుండా, మోసం చేస్తున్న వ్యక్తులవల్ల కూడా అబ్బుతాయి. ఎన్నో సంవత్సరాల నుండి తాము దోపిడీకి గురిఅయ్యామేనే భావం వాళ్ళకి కలిగింది. వాళ్ళకి ఉద్యమం గురించి కనీస పరిజ్ఞానం లేదు. అయినా ఆ మనుషులు మీటింగ్ పెడుతున్నారంటే క్రమం తప్పకుండా హాజరవుతారు. వాళ్ళవల్ల తమకి మేలు తప్ప కీడు జరగదనే నమ్మకం మనసుల్లో ప్రబలంగా పాతుకుపోయింది.

ఆ మీటింగ్ జరుగుతున్న స్థలానికి చుట్టూ కొద్ది దూరంలో ఉద్యమకారులు తుపాకులు పట్టుకుని కాపుకాస్తున్నారు. నాయకుని ఉపన్యాసం మంద్రస్థాయిలో జలపాతంలా సాగిపోతున్నది.

నాయకుడు ఉపన్యాసం ఆపి చేతిలోని చుట్ట ప్రక్కకి విసిరేసి, కుర్చీకి ప్రక్క నేలమీద పెట్టిన సంచి అందుకుని "రామన్నా!" పిలిచాడు.

పహరా తిరుగుతున్న మనుషుల్లోంచి ఒకతను వచ్చి సంచి అందుకున్నాడు. తన తుపాకి భుజానికి తగిలించుకుని, సంచి తెరచి ఒక్కొక్కరికి అందులోంచి చిన్న చిన్న కట్టలు తీసి ఇవ్వవడం ప్రారంభించాడు.

"మీ వల్లనే సంపద పెంచుకున్న ఒక వ్యాపారిని దోచి తెచ్చిన డబ్బు అది. తను సంపాదించి మీకు వదిలి తనువు చాలించాడు..." చెప్పాడు నాయకుడు. అందరినీ ఉద్దేశించి తాము సాధించిన ఘనకార్యం మాదిరి గర్వంగా చెప్పాడు.

అది జాన్ ఇంటివద్ద ఏర్పాటుచెయ్యబడిన మీటింగ్. అందులో జాన్ కూడా పాల్గొన్నాడు. అతని ద్వారానే ఉద్యమకారులకి రేషన్ అందుతూ వుంటుంది. పరోక్షంగా ఉద్యమానికి సహాయంచేసే వ్యక్తి అతను. అతను ఒక్కడే కాదు, ప్రతి గ్రామంలో ఉద్యమాన్ని బలపరిచే వ్యక్తులు వున్నారు, వాళ్ళు పైకి కనిపించరు. వాళ్ళవల్లనే ఎప్పటి సమాచారం అప్పుడే అందిపోతుంది.

"జాన్! మీ ఇంటికి ఒక మనిషి వచ్చాడట. ఏడి?" గంభీరంగా ప్రశ్నించాడు నాయకుడు. అతని కంఠంలో కమాండింగ్ వుంది. అది తను నమ్మిన సిద్ధాంతంకోసం ప్రాణాలు సహితం లెక్కచెయ్యని స్వభావంవల్ల వచ్చింది.

తృళ్ళిపడ్డాడు చంద్రం. అంత తొందరగా తన ప్రసక్తి వస్తుందని ఊహించలేదు. చాలాసేపటి క్రితమే మెలుకువ వచ్చింది. నిద్రపోతున్నట్టు నటిస్తూ వాళ్ళ మాటలు వింటున్నాడు. ఆ మీటింగ్‌కి పదిహేను అడుగుల దూరంలో పందిరి క్రింద మంచంమీద పడుకొని వున్నాడు.

జాన్ వచ్చి తట్టి లేపాడు. అప్పుడే మేలుకున్నట్టు ఆవులించి, "ఏమిటి?" అడిగాడు.

"నాయకుడు రాజన్న పిలుస్తున్నాడు" చెప్పాడు జాన్.

చంద్రం వచ్చి రాజన్న ముందు నిలుచున్నాడు.

"మా జాన్ కుటుంబాన్ని రక్షించినందుకు కృతజ్ఞతలు. పులి ముందు నిలబడి దానినే సవాల్ చేసినందుకు అభినందనలు..."

అన్నాడు తన సహజధోరణిలో.

చంద్రం మౌనంగా నిలుచున్నాడు. తన విషయాలు నాయకునికి అప్పుడే తెలిసిపోయాయని గ్రహించాడు.

"రామన్నా! ఇతని సూట్‌కేస్ చెక్‌చెయ్యి..." గంభీరంగా ఆజ్ఞాపించాడు.

"ఎందుకు?" అడిగాడు చంద్రం తీవ్రంగా.

అడగటం పూర్తయిన మరుక్షణం "ఫట్"మని పడిందొక బలమైన దెబ్బ. రైఫిల్ తిరగేసి బట్‌తో మొహంమీద కొట్టాడు రామన్న. చంద్రం తూలి క్రిందపడి, స్ప్రింగులా లేచాడు. వెంటనే బట్‌తో కొట్టిన దెబ్బకంటే బలమైన దెబ్బతో రాజన్న మొహం పగిలివుండేది.

"ఆగు..." వినిపించింది భీకరంగా. "ఎన్నిసార్లు నీకు చెప్పాను. చేతిలో ఆయుధం వుందికదాని ఇష్టంవచ్చినట్టు ప్రవర్తించవద్దని. అమాయకులను రాక్షసంగా హింసించే పోలీసులకి మనకి తేడా కనిపించని నీ ప్రవర్తన ఉద్యమానికే ద్రోహంగా పరిగణించబడుతుంది. వెళ్ళు... వెళ్ళి అతని సూట్‌కేస్ జాగ్రత్తగా చెక్‌చెయ్యి" రామన్నతో చెప్పాడు నాయకుడు. చంద్రాన్ని సమీపించి "సారీ" అన్నాడు.

"నీవు ప్రభుత్వ మనిషివేమోనని నా అనుమానం. వాళ్ళు మా ముఠాలో చేరటానికి తీవ్రంగా ప్రయత్నిస్తూ వుంటారు. ప్రతి ప్రభుత్వ మనిషి వద్ద ఐడెండిటీ కార్డు వుంటుంది. అది లేకపోతే మిగతా ప్రభుత్వ ఉద్యోగులు అతనికి సహాయం చెయ్యరు. అలాగే ప్రయాణం చెయ్యటానికి ప్రభుత్వంచేత ఇవ్వబడ్డ వారంట్లు వుంటాయి. ఇవి మాకు సాధారణంగా వాళ్ళని పట్టిఇస్తాయి. అవి లేకపోతే డైరీలోని ఎడ్రస్సులు, పాత ఉత్తరాలు, కాగితాల ద్వారా మేము పసిగడతాం. అందుకని నీ సూట్‌కేస్ చెక్ చెయ్యమన్నాను. నువ్వు గుర్తించాలి, మా జీవితాలకి అటువంటి జాగ్రత్త చాలా అవసరమని" చెప్పాడు నాయకుడు.

రాజన్న బ్రీఫ్‌కేస్ పరీక్షించటం పూర్తిచేసి చంద్రం వద్దకు వచ్చి అతని శరీరం, బట్టలు తడిమి చూశాడు. ఏమీ లేవని నిర్ధారించుకుని నాయకునివైపు తిరిగాడు.

ఆయుధాలు లాడ్జి వెనుక దాయటంవల్ల ఎంత మేలు జరిగిందో తెలిసొచ్చింది చంద్రానికి.

"ప్రతి సాధారణ పౌరునికి ధైర్యసాహసాలు వుండటం అవసరం. నీ గురించి విని ట్రైనింగ్ పొందిన గూఢాచారివని అనుకున్నాను. నీ బోటి యువకులు సమసమాజ స్థాపనకి మా ఉద్యమంలో చేరటం చాలా అవసరం. నేను ఇంతవరకూ వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్యమంలోకి ఆహ్వానించలేదు. నీలోని నాయకత్వ లక్షణాలు చూసి నిన్ను ఉద్యమంలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాను" చెప్పాడు నాయకుడు చంద్రం వంక చూస్తూ.

"నాకు ఉద్యమం గురించి, మీ సిద్ధాంతాల గురించి తెలియదు. మనశ్శాంతికోసం కొంత కాలం తిరగటానికి వచ్చినవాడిని" చెప్పాడు చంద్రం.

"బాగా ఆలోచించు. మాకోసం చేరనవసరంలేదు. దేశ సేవ చెయ్యాలనుకుంటే చేరు"

"మీ వెంట కొన్ని రోజులు తిరిగి కష్టనష్టాలు తెలుసుకుంటాను. మీ విధానాలు నాకు నచ్చితే చేరతాను..." అన్నాడు చంద్రం ఒక నిర్ణయం తీసుకున్నట్టుగా.

నాయకుడు తన మనుషులతో కాసేపు సంప్రదించాడు, ఆ తరువాత తన అంగీకారాన్ని తెలియజేశాడు.

చంద్రం ఇంట్లోకి ప్రవేశించాడు. బట్టలు మార్చుకోవటానికి. ఎప్పుడు నిద్రలేచిందో తెలియదు. జయ పిల్లిలా అనుసరించింది.

"వద్దు... వాళ్ళతో వెళ్ళొద్దు" చంద్రానికి మాత్రం వినిపించేటట్టు నెమ్మదిగా చెప్పింది జయ.

"జయా! నా గమ్యం వేరు. ఒకరికోసం ఆగిపోయే వ్యక్తిని కాను. నా గురించి నీకు చాలా తెలియదు" చెప్పాడు సున్నితంగా.

వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించింది.

"పిచ్చిదానిలా ఏడవద్దు. కొన్ని కారణాలవల్ల ఇక్కడికి వచ్చాను. అదృష్టవశాత్తూ గమ్యంవైపు సాగుతున్నాను..." అని ఒక్క క్షణం ఆగి అన్నాడు. నీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఎడారి వంటి నా గుండెలో సంతోషమనే చినుకులు చిలకరించినందుకు... గుర్తుంచుకుంటాను జీవితంలోని విషాదం మర్చిపోయి, ఆత్మవిశ్వాసంతో గమ్యంవైపు సాగటంకోసం"

జయ మాట్లాడలేదు. దుఃఖం దిగమ్రింగి మౌనంగా చూస్తోంది. చంద్రం చకచకా తయారయి బ్రీఫ్‌కేస్ తీసుకుని బయటికి రాబోతూ ఆగి నెమ్మదిగా అన్నాడు "నా ఉద్దేశ్యంలో ప్రేమ కొన్ని భావాల సముదాయం. తల్లిని ప్రేమిస్తాం మాతృమూర్తి కనుక. అది ఆత్మీయతతో కూడి వుంటుంది. చెల్లిని ప్రేమిస్తాం రక్తం పంచుకు పుట్టినందువల్ల. అందులో అనురాగం వుంటుంది. తండ్రిని ప్రేమించాలి జన్మ ఇచ్చినందుకు అభిమానంతో. ఆత్మీయత, అనురాగం, అభిమానాలు కలసి దానికి మరో సంబంధం కలిపితే అది మనం చెప్పుకున్న ప్రేమ అవుతుంది. ప్రేమలో అన్ని భావాలు కలసివున్నాయి కనుకనే అది చాలా తీవ్రంగా వుంటుంది"

మౌనంగా వింటోంది జయ.

"ఆ సంబంధం ఏమిటో చెప్పగలవా?" అడిగాడు.

తల అడ్డంగా ఊపింది జయ. మాటల్లో పడి మస్తిష్కంలో ఆలోచనలోల మునిగిపోవటంవల్ల దుఃఖం కాస్త తగ్గింది.

"సెక్స్..." చెప్పాడు.

◆ ◆ ◆

చీకట్లో దెయ్యాల మాదిరి కదులుతున్నాయి కొన్ని ఆకారాలు. కన్ను పొడుచుకున్నా కనిపించని కటిక చీకటి కదులుతున్న ఆకారాలకి దారి సుపరిచతం కావటంవల్ల సుశిక్షితులైన సైనికుల మాదిరి ముందుకి సాగుతున్నారు. ప్రతి వ్యక్తి వీపుమీద అవర్ షాక్‌లు (సామానులు పెట్టుకునే సంచివంటి వస్తువు) కట్టుకుని వున్నారు. అందులో వాళ్ళకి అవసరమైన వస్తువులతో పాటు రేషన్ వుంది.

వాళ్ళు మొత్తం గుంపులా ఇష్టంవచ్చినట్టు నడవటంలేదు. ఒకరి వెనుక ఒకరు వరుసలో నడుస్తున్నారు క్యూ మాదిరి. మనిషికి మనిషికి మధ్య నాలుగు అడుగుల దూరం వుంది. ఆ లైనుకి వంద గజాల దూరంలో ఒక మనిషి పరిసరాలని నిశితంగా చూస్తూ ముందుకి సాగుతున్నాడు. అతను నిశితపరిశీలనాశక్తి అపారమైనది. తన వెనుక వస్తున్న వారికి అతను గుండెకాయవంటివాడు. మిగతావాళ్ళు అతని సిగ్నల్స్ ప్రకారం నడుస్తున్నారు.

యుద్ధభూమిలో సైనికులు అనుసరించే సెక్షన్ ఫార్మేషన్ విధానమది.

నిజానికి వాళ్ళు అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం లేదు. చుట్టుప్రక్కల ఎక్కడ పిట్ట కదిలినా వాళ్ళకి తెలిసిపోతుంది. ఆ విధమైన జాగ్రత్తలు తీసుకోబడ్డాయి. అయినా పద్ధతి పద్ధతే. అటువంటి కఠిన క్రమశిక్షణ లేకపోతే, చిన్న తప్పుకి ప్రాణాలు మూల్యంగా చెల్లించాల్సివుంటుంది.

ఆ పద్ధతులు, వాళ్ళ కదలికలు చూసి నాయకుని వెనుక నడుస్తున్న చంద్రానికి ఆశ్చర్యం కలిగింది. వాళ్ళ జీవితాలు క్షణక్షణం ప్రాణంతో చెలగాటమే. వాళ్ళతో పోల్చుకుంటే తన జీవితం సూర్యుని ముందు దివిటీ వంటిదని గ్రహించాడు.

"ఇన్ని కష్టాలు పడి, జీవితాన్ని పణంగా పెట్టి ఏం సాధించాలని?" నెమ్మదిగా అడిగాడు నాయకుడ్ని చంద్రం. వాళ్ళతో కొన్ని రోజులు పరిచయంవల్ల చాలా విషయాలు తెలుసుకున్నాడు. కాని ముఖ్యమైన సిద్ధాంతాల గురించి మాత్రం అంతవరకూ ప్రస్తావించలేదు. వాళ్ళ పరిస్థితులు చూసి అడగకుండా వుండలేకపోయాడు.

"సమ సమాజం"

"మీకు బలగం తక్కువ. అది రోజురోజుకి తగ్గిపోతున్నది. మీ లక్ష్యాన్ని ఎప్పటికి సాధించేరు?"

"మా సిద్ధాంతం తాత్వికమైనది. పోరాటం దృఢమైనది. ఈ సమాజంలో పేదరికానికి ఊపిరి వున్నంత కాలం, పేదవాడికి తిండి లేనంత కాలం, పెట్టుబడిదారుడి సంపద పెంచటానికి ఈ సమాజం పేదవాడి జీవితంతో ఆడుకున్నంత కాలం... మా ఉద్యమం బ్రతికివుంటుంది. ఆలోచించు నీకే తెలుస్తుంది మా ఉద్యమం అజరామరమైనదని"

"మీ ఉద్యమం గొప్పది కావచ్చు. కాని దానికి కావాల్సిన ప్రజాభిమానం సంపాదించటంలో మీరు విఫలం చెందటంలేదా? తిండి లేక కష్టాలుపడుతూ ప్రతిక్షణం ప్రాణంకోసం పరిగెత్తే మీలో ఓపిక ఎంత కాలం వుంటుంది?" అడిగాడు చంద్రం. దళంలోని ఏ వ్యక్తి ఆరోగ్యంగా అనిపించడంలేదు. వాళ్ళ ఆహారంలో పోషక పదార్థాలు వుండవు. భయం భయంగా ఏదో ఉడకబెట్టుకుని తినటం లేకపోతే అడవి జంతువుని చంపి కాల్చుకుని తింటారు. వాళ్ళ వద్ద ఎప్పుడూ మందులు వుంటాయి. అయినా ఒక డాక్టరు జాగ్రత్తగా పరీక్షించి ఇచ్చిన మందులతో సాటిరావు కదా!

"ప్రజల్లో ఎక్కువ శాతం విద్యావంతులు కారు. దానికి తగినట్టు రాజకీయ నాయకులు, అధికార్లు ప్రజల్లో మూఢనమ్మకాలని, మతపిచ్చిని కులగజ్జిని రెచ్చగొడుతున్నారు. ప్రజలు విజ్ఞానవంతులు కాకుండా వుండటమే వారికి కావాలి. అందుకే వాళ్ళు మతాలకి చెందిన దేవాలయాలు దర్శిస్తూ నమ్మకాలకి మరింత బలం చేకూరుస్తున్నారు. మతం గురించి దేవుడు గురించి పురిటిబిడ్డ నుండే బ్రెయిన్ వాష్ చెయ్యటంవల్ల సమాజ విశ్లేషణచేసి మేము చెప్పిన మాటలు మతాన్ని ఖండిస్తూ కులాన్ని వ్యతిరేకించటంచేత – మా మాటలు కఠినంగా వుండడంచేత అవి ప్రజల్ని ఆకర్షించలేకపోతున్నాయి.

యాభై కేజీల చింతపండు ముప్ఫై కేజీలు మాత్రమేనని గిరిజనులని మోసం చేస్తున్న వ్యాపారస్తుల సంగతి ఏమిటి? మనిషిగా పుట్టి సాటి మనిషిని దోచుకోవటానికి ఉపయోగపడుతున్న ఈ సమాజం మనకెందుకు? ఒక వర్గానికి అనుకూలంగా తయారైన ఈ సామాజిక న్యాయాన్ని మార్చి రాజకీయ నాయకుల ఆస్తులు ప్రోగుచేస్తే ముప్ఫై సంవత్సరాల క్రితమున్న భారతదేశాన్ని కొనవచ్చు. పెట్టుబడిదారుల ఆస్తులతో రెండు భారతదేశాలని నిర్మించవచ్చు. వాళ్ళు ఆ విధంగా సంపద పెంచుకున్నారంటే దానికి కారణం ప్రభుత్వ విధానాలు కావా? చూడు మిస్టర్ చంద్రం! ఈరోజు మేము శారీరకంగా శిధిలం కావచ్చు. కాని మానసికంగా ఉన్నతులం. మాకు సంపదమీద ఆశ, ప్రాణంమీద తీపి లేవు. సమసమాజ స్థాపనకి నా జీవితం సరిపోకపోవచ్చు. కాని మా భావ ఉధృతిలో, రక్తతర్పణంతో పుట్టిన వేడి ఒకరోజు సాయుధ ప్రజా పోరాటాన్ని సిద్ధింపజేస్తుంది..."

అపారమైన ఆత్మవిశ్వాసమే వాళ్ళకి పెట్టుబడి. దోపిడీకి గురి కాబడిన బీద జనమే వాళ్ళ బలం. శరీరం నుండి ప్రాణాలు కదిలిపోయే వేళ వేసే కేక సమ సమాజ స్థాపనకి జయసంకేతం.

కొద్దిసేపటికి వాళ్ళు ఒక ప్రదేశాన్ని చేరారు. చుట్టూ దట్టమైన పొదలున్న ఖాళీ స్థలమది. అక్కడ ఆగారు మొత్తం. సామాను దించి పక్కలు సర్దుకున్నారు. ఇద్దరు తుపాకులు పట్టుకుని పహరా తిరగటం ప్రారంభించారు.

"రేపు మావాళ్ళు కొంతమంది వస్తారు. వాళ్ళు వచ్చిన తరువాత కొరుటూరులో ఒక వ్యాపారస్తునికి బుద్ధి చెప్పాలి" చెప్పాడు నాయకుడు.

"వాళ్ళు ఎక్కడికి వెళ్ళారు?" అడిగాడు చంద్రం.

"ఆమునిషన్‌కోసం"

"మీకు ఆయుధాలు ఎలా వస్తాయి"

"ఒక రాష్ట్రంలో మతోన్మాదుల వద్ద విదేశీ ఆయుధాలు గుట్టలుగా దొరికాయి ప్రభుత్వానికి. కొన్ని ప్రశ్నలకి జవాబు మా దళంలో చేరిన తరువాత తెలుస్తుంది" చెప్పాడు చేతిలోని చుట్ట విసిరేసి ప్రక్కకి తిరిగి పడుకుంటూ.

చంద్రం పైకి చూశాడు. ఆకుల సందుల్లోంచి నక్షత్రాలు మసకమసగ్గా కనిపిస్తున్నాయి. మనసులో అనుకున్నాడు ఆయుధాల గురించి తను ప్రశ్నించకుండా వుండాల్సిందని.

◆ ◆ ◆

"కొరుటూరులో కోమటి సుబ్బయ్య ఇల్లు ఊరు మధ్యలో వుంది. అతను గత ఇరవై సంవత్సరాలుగా గిరిజనుల నుండి సరుకులు కొని వాటిని రాజమండ్రి వంటి తదితర టౌన్‌లకు సరఫరాచేసి బాగా డబ్బు సంపాదించాడు. అతని దగ్గిర ఎప్పుడూ డబ్బు వుంటుంది. ఈ రాత్రికి అతన్ని దోచుకోవాలి..." చెప్పాడు నాయకుడు. అతను ఒక రాయిమీద కూర్చుని వున్నాడు. అతని చుట్టూ తలొక చోట కూర్చుని పదిహేనుమంది వ్యక్తులు వున్నారు. గెడ్డాలు పెరిగిపోయి, బట్టలు మాసిపోయి కొన్ని చోట్ల చిరిగిపోయి, తైల సంస్కారం లేని జుట్టుతో బికారుల మాదిరి వున్నారు. చంద్రం దూరంగా కూర్చుని వింటున్నాడు. ఆ దళంలోకి మరో నలుగురు వచ్చి కలవటం గుర్తించాడు అతను.

"సుబ్బయ్య శెట్టి వుంటే హతమార్చాలి. అతని ఇంట్లో ఎటువంటి నగలు వుండకూడదు. సగంమంది ఇంట్లోకి ప్రవేశించాలి. మిగతావాళ్ళు బయట వుండి ఎటువంటి ప్రమాదాన్నైనా ఎదుర్కోవాలి..." చెబుతున్నాడు నాయకుడు. ఆరోజు రాత్రికి చెయ్యాల్సిన దోపిడి గురించి.

"కామ్రేడ్! నాకు ఒకసారి మాట్లాడే అవకాశం ఇవ్వండి..." అడిగాడు చంద్రం.

"చెప్పు"

"మన దళమంతా వెళ్ళి దోపిడీ చెయ్యాల్సిన అవసరం ఏముంది? ఇద్దరు ముగ్గురు వెళ్ళి పని చేసుకువస్తే సరిపోతుంది కదా?"

"మనం చేస్తున్నది దోపిడి. ఇంట్లో వున్న వాళ్ళు ప్రాణాలు ఇవ్వటానికి సిద్ధపడతారు తప్ప తమ సంపదని చూస్తూ వదులుకోలేరు. మొత్తం ఇంటిని దోచుకోవటానికి ఇద్దరు ముగ్గురు చాలరు. ఏదైనా గొడవ జరిగి మన మనుషులకి ప్రమాదం ఏర్పడితే మనవాళ్ళు దొరికిపోతారు"

"అటువంటి పరిస్థితుల్ని ఎదుర్గోగలవాడిని పంపవచ్చు కదా?"

"అంత నైపుణ్యం గల మనిషి ఏడి?"

చంద్రం కాసేపు మౌనంగా వున్నాడు. అతను చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఒక నిర్ణయానికొచ్చినట్టు "నేను" అన్నాడు.

మొత్తం దళసభ్యులు తలలు తిప్పి అతని వంక చూశారు. చంద్రం మొహం భావరహితంగా వుంది. అలా చూసే మనుషుల్ని అంచనా వెయ్యటం చాలా కష్టం. పది సంవత్సరాల ఉన్ని కృష్ణన్ ట్రైనింగ్‌లో చంద్రం నేర్చుకున్న ఎన్నో విషయాలలో అదొకటి.

"ఎలా చెయ్యాలనుకుంటున్నావ్?"

"సమయానుకూలంగా ప్రవర్తించటం ద్వారా"

కొన్ని క్షణాల మౌనం తరువాత "నీకు ఆయుధాలు కావాలా?" అడిగాడు నాయకుడు.

"వద్దు ఒక మనిషిని దారి చూపించటానికి, శెట్టి ఇంటి ముందు కాపలా వుండటానికి నాతో పంపండి"

"ఆ మనిషిని నువ్వే ఎంచుకో..."

"రెడ్డప్ప..." చెప్పాడు చంద్రం.

రెడ్డప్ప పళ్ళు పటపట కొరికాడు. అతను అప్పుడే వచ్చాడు పనిమీద వెళ్ళి. పైగా ఒక అపరిచితునికి తను దారి చూపించటానికి వెళ్ళటం. తన భావాలు పైకి కనిపించకుండా జాగ్రత్తపడ్డాడు.

రాత్రి ఏడు గంటలకి తమ పనిమీద బయలుదేరారు చంద్రం, రెడ్డప్ప.

వాళ్ళు వెళ్ళిన పది నిముషాలకి మరో ఇద్దరికి చెప్పాడు నాయకుడు. "మీరు వాళ్ళ వెనుక దూరంగా వుండి వాళ్ళని గమనించండి..."

చంద్రం, రెడ్డప్ప కొరటూరు చేరటానికి మూడు గంటలు పట్టింది. ఆ ఊరు గోదావరి ఒడ్డున వుంది. అక్కడికి చేరటానికి చాలా కొండలు దిగవలసివచ్చింది. ఎత్తు దిగి నడవాల్సి వుండటంచేత ప్రయాణం వేగంగా జరగలేదు.

ఎదురుగా కనిపిస్తున్న డాబా వంక చూస్తూ రెండు గంటలు గడిపాడు చంద్రం. అప్పటికే రాత్రి పన్నెండు గంటలయింది సమయం.

కూర్చున్న చోటు నుండి కదిలి డాబా సమీపించి కాంపౌండ్ వాల్‌మీద చెయ్యి వేశాడు. దాని నిండా గాజుపెంకులు వున్నాయి. చొక్కా విప్పి మడతపెట్టి గోడమీద వుంచాడు. దానిమీద ఒక చెయ్యి పడుతుంది. కాలినున్న బూట్ విప్పి మడతపెట్టి దానికి రెండవ చెయ్యి ఆన్చి పైకి లేచాడు. బూట్ వున్న కాలు గోడమీద పెట్టి, బూట్ లేని కాలు గోడకి తగలకుండా లోపలికి దూకాడు. బూట్, షర్ట్ తిరిగి తొడుక్కున్నాడు.

గుమ్మం వద్దకు వెళ్ళి తలుపు తోసి చూశాడు. అవి ఏమాత్రం కదలలేదు. చాలా బలంగా వున్నాయి తలుపులు. అక్కడి నుండి చూసుకుంటూ వెనక్కి వెళ్ళాడు. అక్కడంతా చీకటిగా, నిశ్శబ్దంగా వుంది. దూరంగా కీచురాళ్ళు అరుస్తున్న శబ్దం వినిపిస్తోంది. వెనుక తలుపు ముందు నిలబడి ప్రతి అంగుళం పరీక్షించాడు. జేబులోంచి తాళాలగుత్తి తీసి వూసవంటి సాధనం తలుపు సందులో దూర్చి గడియ ఎత్తాడు. నెమ్మదిగా తలుపు తోసి లోపలికి ప్రవేశించాడు.

అది వంటగది. ఆ గది నుండి లోపలికి ప్రవేశించాడు. అది హాలు దానికి రెండువైపులా గదులున్నాయి. వాటి తలుపులు మూసివున్నాయి. ఒక గదికి తాళం వేసివుంది. తాళం వెయ్యని గదిలోంచి ఫ్యాన్ తిరుగుతున్న శబ్దం వినిపిస్తోంది. ఆ గది గొళ్ళెం వేసేశాడు చంద్రం. దానికి ఎదురుగా తాళం వేసివున్న గదిని సమీపించాడు. తన దగ్గిర వున్న తాళాలగుత్తితో తాళం తియ్యటం ప్రారంభించాడు. పది నిముషాల్లో తాళం వూడిపోయింది. లోపలికి వెళ్ళి తలుపులు మూసి లైటు వెలిగించాడు. ఎదురుగా నిలువెత్తు స్టీల్ బీరువా కనిపించింది.

ఆ బీరువా తెరవటానికి అరగంట పట్టింది. లోపల తాళం వేసివున్న మరో అర కనిపించింది. అది కూడా తెరిచాడు. బీరువాలోంచి చీర ఒకటి తీసి క్రింద పరిచాడు. డబ్బు, నగలు అందులో వేసి మూట కట్టుకున్నాడు. యధాప్రకారం తాళాలు, తలుపులు మూసి, మూట పట్టుకుని బయటికి వచ్చాడు.

రెడ్డప్ప కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. దౌర్జన్యంగా దోచుకోవటం, అడ్డు వచ్చినవాళ్ళని చంపటం వాళ్ళ అలవాటు. అంత నీట్‌గా పని పూర్తి చేసుకుని తిరిగి వెళ్ళటం తెలియదు. సంతోషంతో చంద్రం చేతిలోని మూట అందుకున్నాడు రెడ్డప్ప.

అప్పుడు మూడు గంటలు దాటింది సమయం.

ఇద్దరూ తిరిగి ప్రయాణం ప్రారంభించారు. కొంత దూరం నడిచిన తరువాత "కాసేపు విశ్రాంతి తీసుకుని వెళదాం" చెప్పాడు చంద్రం. అయిష్టంగానే ఒక రాయిమీద కూర్చున్నాడు రెడ్డప్ప.

"నీకు విశాలి తెలుసా రెడ్డప్పా?" రెండు నిముషాలు గడిచిన తరువాత అడిగాడు చంద్రం.

"విశాలి ఎవరు?"

"నిన్ను మోహన్ అని పిలిస్తే గుర్తొస్తుందా?"

రెడ్డప్పన్న చెయ్యి తుపాకిమీద పడింది. సుబ్బయ్యశెట్టి ఇంటివద్ద లోడ్‌చేసిన తూటాలు ఇంకా తియ్యలేదు. అది గుర్తువచ్చేసరికి అమాంతంగా రెడ్డప్ప ధైర్యం రెట్టింపయ్యింది.

"నా పేరు ఎలా తెలుసు నీకు?"

"మోహన్! గడ్డిపరక పేనితే బలమైన తాడుగా మారుతుంది. నీలాంటి మృగాల్ని వేటాడటంకోసం పది సంవత్సరాల నుండి తయారవుతున్నాను. నీకోసమే మీ దళంలోకి వచ్చాను. కొద్ది సెకన్లలో నిన్ను చంపుతాను..." తాపీగా చెప్పాడు చంద్రం. అతనికి తెలియదు తుపాకి తూటాలతో నిండి వుందని.

"నీలాంటి అర్భకుని చేతిలో చావటానికి నేను సిద్ధంగా లేను. ముందు నీ ప్రాణాలు దక్కించుకో. తరువాత నన్ను చంపటం గురించి ఆలోచించవచ్చు" అంటూ తుపాకి పైకెత్తాడు రెడ్డప్ప.

అదే అతను చేసిన తప్పు.

అంతవరకూ తుపాకి లోడులో వుంటే తనకి ప్రమాదమనే ఆలోచన రాలేదు. కాని రెడ్డప్పన్న కదలిక చూసిన తరువాత బుర్రకి తట్టింది తుపాకి పేలటానికి సిద్ధంగా వుందని.

ఆపైన ఆలోచించదల్చుకోలేదు. తుపాకి నుండి వెలువడిన తూటాలా కదిలాడు. క్షణంలో రెడ్డప్పన్న జాగ్రత్త పడేలోపు సమీపించి కాలితో తుపాకి ప్రక్కకి తన్ని, ఆ కాలు నేలమీద పడటంతోనే రెండవ కాలితో మొహంమీద తన్నాడు. రెడ్డప్పన్న వ్రేలు ట్రిగ్గర్‌మీద వుండటంతో తుపాకి పేలి తూటా గాలిలో కలిసిపోయింది.

రెడ్డప్పన్న చంద్రం వంక చూస్తూ లేచి నిలుచున్నాడు. చంద్రం ఖచ్చితమైన పద్ధతిలో కదులుతూ రెడ్డప్పన్న మోచేతి మీద తన్నాడు. ఎగిరి క్రింద పడ్డాడు మరోసారి. మోచేతి దగ్గర "ఫట్"మని శబ్దం వచ్చి చెయ్యి విరిగిపోయింది. బాధతో గింజుకున్నాడు రెడ్డప్పన్న. పడినవాడు మరి లేవలేదు.

అతని కదలికే చూస్తున్న చంద్రానికి ఎవరో పరిగెత్తుకువస్తున్న శబ్దం వినిపించింది. ఉపేక్షిస్తే దొరికిన అవకాశం చెయ్యి జారిపోతుందని గ్రహించాడు. వెంటనే ఊపిరితిత్తుల్లోని గాలి బయటకి వదిలేశాడు. నాలుగడుగులు వెనక్కి వేసి ముందుకి పరిగెడుతూ గాలిలో లేచాడు. అక్కడినుండి కూర్చున్న పొజిషన్‌లో సరిగ్గా రెడ్డప్పన్న ఛాతీమీద పడ్డాడు.

"అమ్మా..." అన్న కేక రెడ్డప్పన్న గొంతులో వుండిపోయింది. డెబ్బై కిలోల బరువు అంత ఎత్తునుండి ఛాతిమీద పడటంతో ఎముకలు చిట్లిపోయి, లోపలి అవయవాలు నొక్కుకుపోయి, నోటి నుండి, ముక్కు రంధ్రాల నుండి రక్తం బయటకి వచ్చింది. కాళ్ళు, చేతులు కొట్టుకుంటున్నాయి.

చంద్రం నిలుచుని చూస్తున్నాడు రెడ్డప్పన్న శరీరంలోంచి ప్రాణం పోవటాన్ని. వెనుక నుండి వచ్చిన రాజన్న మనుషులు చంద్రాన్ని గట్టిగా పట్టుకున్నారు.

"మీతో వస్తాను వదిలేయండి..." చెప్పాడు చంద్రం.

చంద్రం మాటలు వాళ్ళు పట్టించుకోలేదు. అడవితీగలతో చేతులు కట్టేశారు. ఒకడు రెడ్డప్పన్న తుపాకి వెతికి పట్టుకొచ్చాడు. ఆ తుపాకిని రెండవ భుజానికి తగిలించుకుని మూట అందుకున్నాడు. రెండో అతను రెడ్డప్పన్న శవాన్ని భుజంమీద వేసుకున్నాడు.

వాళ్ళు తమ స్థావరానికి బయలుదేరారు. చంద్రాన్ని అక్కడికక్కడే కాల్చి చంపాలన్నంత కోపం ఉంది ఆ ఇద్దరికి!

◆ ◆ ◆

"చెప్పు... రెడ్డప్పన్నని ఎందుకు చంపావ్?" అడిగాడు నాయకుడు.

అలా రెండు గంటల నుండి ఏమాత్రం విసుగుచెందకుండా ప్రశ్నిస్తున్నాడు చంద్రాన్ని. క్షణక్షణానికి నిజం తెలుసుకోవాలనే పట్టుదల పెరిగిపోతున్నది.

చంద్రాన్ని ఒక చెట్టుకి కట్టేశారు. దెబ్బలకి చర్మం చిట్లి రక్తం చిమ్ముతోంది. అయినా చంద్రం మొహం ప్రశాంతంగా వుంది. గొప్ప కార్యాన్ని సాధించిన తరువాత మొహంలో కదలాడే తృప్తి ప్రతిఫలిస్తోంది. అందువల్లనే నాయకుని హృదయంలో పట్టుదల పెరిగిపోతుంది.

"నిజం చెప్పు... నిన్ను వదిలేస్తాను" చెప్పాడు నాయకుడు చివరిసారిగా.

నిర్వికారంగా చూశాడు చంద్రం.

"రామన్నా! తుపాకి ఎత్తి తూటా లోడు చెయ్యి..." చెప్పాడు కొద్దిగా తల ప్రక్కకి తిప్పి. అక్కడ రెడ్డప్పన్న శవం పడుకోపెట్టబడి వుంది. మోచేతివరకూ కుడిచెయ్యి విరిగిపోయి, పెద్ద కొండరాయి గుండెలమీద పడినట్టు ఛాతి నొక్కుకుపోయి, ఎముకలు విరిగిపోయి, నోటి నుండి, ముక్కు నుండి రక్తం కారి బీభత్సంగా వుంది. కుడిభుజం వంటి అనుచరుని దిక్కులేని చావు నాయకుని మనసుని కలిచివేస్తోంది.

రామన్న తుపాకి పైకెత్తి బోల్ట్ వెనక్కి లాగి, ఒక తూటాని చాంబర్‌లోకి తోసి, బోల్టుని ముందుకు జరిపి ట్రిగ్గర్‌మీద కుడిచెయ్యి చూపుడువ్రేలు వుంచి నాయకుని వంక చూశాడు.

"నీ ధైర్య సాహసాలు విని నిన్ను ముఠాలోకి ఆహ్వానించాను. దానికి ప్రతిఫలంగా నా అనుచరుడ్ని పోగొట్టుకున్నాను. భవిష్యత్తులో నువ్వు గొప్ప నాయకుడివి కాగలవని ఊహించి దెబ్బతిన్నాను. ఇప్పటికైనా నిజం చెప్పు. రామన్న చేతిలో తుపాకి వుంది. అందులోని తూటా నీ గుండెల్ని చీల్చటానికి ఆత్రతపడుతోంది. నా మనుషులు నీ చావుకోసం ఎదురుచూస్తున్నారు. నేను మూడు వరకు అంకెలు లెక్కబెడతాను... నీ ప్రాణాలు నీ చేతిలోనే వున్నాయి" చెప్పాడు నాయకుడు జేబులోంచి చుట్ట బయటకి తీసి. దాన్ని వెలిగించి రెండు దమ్ములు లాగి, చంద్రం వంక చూడకుండా

"ఒన్..." అన్నాడు.

చంద్రం ఒకమారు చుట్టూ చూశాడు. అక్కడ వున్నవాళ్ళు మొత్తం తనవంకే చూడటం గమనించాడు. కళ్ళు మూసుకున్నాడు.

నాయకుడు లేకుండావుంటే రామన్న తనని ఎప్పుడో కాల్చి చంపివుండేవాడు. తన ఆలోచనకి మనసులోనే నవ్వుకున్నాడు. వీటినే చావు తెలివితేటలంటారు కాబోలు!

"టూ..."

తుపాకి పేలిన శబ్దం వినిపించిన వెంటనే తూటా శరీరంలోకి ప్రవేశిస్తుందా? తూటా ప్రవేశించిన తరువాత శబ్దం వినిపిస్తుందా? తూటా ప్రవేశించిన ఎంతసేపటికి ప్రాణం పోతుంది? తూటా తగిలిన వెంటనే బాధ తెలుస్తుందా? బాధ తెలియకుండా ప్రాణం పోతుందా? ఆలోచిస్తున్నాడు చంద్రం,

"త్రీ..." వినిపించింది భీకరంగా.

చెట్టు మీదనుండి అడవిపక్షి ఒకటి గాలిలోకి ఎగిరింది.

"ఢన్"

తుపాకి పేలింది.

ఎంత నిగ్రహంగా వున్నా చిన్నగా ఉలికిపడింది శరీరం. తూటా దిగిన బాధ తెలియటంలేదు. నెమ్మదిగా కళ్ళు విప్పి చూశాడు. రెండు కన్నీటిబొట్లు బుగ్గల మీదుగా క్రిందికి జారాయి. నాయకుడు సూటిగా తన వంకే చూడటం కనిపించింది.

"భయపడి ఏడుస్తున్నావా?"

"కాదు... బాధతో" మొదటిసారి నోరు తెరిచి చెప్పాడు చంద్రం,

"రెడ్డప్పన్నని ఎందుకు చంపావ్?"

"వ్యక్తిగత కారణాలవల్ల"

"అతను నీకు ముందే తెలుసా?"

"పదకొండు సంవత్సరాల క్రితం ఒకమారు చూశాను"

"అతన్ని చంపటానికే ఇక్కడికి వచ్చావా?"

"అవును. పదకొండు సంవత్సరాలుగా చంపటంకోసమే పెరిగాను. చంపాలన్న లక్ష్యంతోనే అన్నం తిన్నాను. రెడ్డప్పన్న ఒక్కడ్నే కాదు, అతనికి ముందు ఒక డాక్టర్ని చంపాను. ఇంకా ఇద్దర్ని చంపవలసివుంది. ఆ పని పూర్తి చెయ్యకుండా చచ్చిపోతున్నందుకే బాధ"

"ఎందుకు చంపదల్చుకున్నావ్?"

అప్పుడు చూశాడు సూటిగా నాయకుని కళ్ళల్లోకి. శరీరంలోని రక్తమంతా మొహంలోకి చేరుకుంది.

"ప్రేగులు త్రెంచి, రక్తం పంచి జన్మ ఇచ్చిన తల్లిని కొడుకు కళ్ళముందే పైశాచికంగా అనుభవించి ప్రాణం తీసినందుకు..." పట్టి పట్టి ఒక్కొక్క పదం పలికాడు. అతని మాటలు ఆ ప్రదేశంలో మారుమ్రోగాయి.

అందరి దృష్టి చంద్రం వైపు తిరిగింది. అక్కడ సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం పేరుకుంది. కొద్ది నిముషాలు నాయకుడు మౌనంగా వుండిపోయాడు.

"రామన్నా! చంద్రం కట్లు విప్పు. కొంతమంది రెడ్డప్పన్న శవానికి దహనక్రియలకి ఏర్పాట్లు చెయ్యండి. నేను చంద్రంతో కొంత దూరం వెళ్ళివస్తాను..." చెప్పాడు నాయకుడు గంభీరంగా.

"కామ్రేడ్..." ఒక అనుచరుడు పిలిచాడు ఆందోళనగా.

"నా నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడవద్దు. ముందు చెప్పిన పని చెయ్యండి" ఆజ్ఞాపించాడు నాయకుడు.

"మీరెందుకు నాతో రావటం, నేను వెళ్ళిపోగలను" దారిలో నాయకునితో చెప్పాడు చంద్రం. ఆయుధాలు వదిలేసి చంద్రం వెంట వస్తున్నాడు అతను.

"నిన్ను లారీ ఎక్కించేవరకూ నీ ప్రాణాలు ప్రమాదంలో వున్నట్లే"

ఇద్దరూ నడుచుకుంటూ లారీలు తిరిగే దారికి వచ్చారు. ఆ దారి ప్రక్కన రాళ్ళమీద కూర్చున్నారు. ఏదో లారీ వచ్చేవరకూ తీరికే.

"సాటి మనిషిగా నన్ను పరిగణిస్తే నీ గురించి చెప్పు" అడిగాడు నాయకుడు.

చెప్పాలి.

పదకొండు సంవత్సరాలుగా గుండెల్లో దాచుకున్న విషయాన్ని, మానసికంగా అనుభవించిన చిత్రవధని.

అవును చెప్పాలి.

# 10

వి(శాంతిగా కూర్చున్నాడు రాజ్ కుమార్.

అతను బాగా అలిసిపోయాడు. యూనియన్ లీడర్‌గా అతన్ని ఎన్నుకున్న తరువాత ఎంతో భారం అతనిమీద పడింది. దానికితోడు యాజమాన్యం అతని విషయంలో కటువుగా వ్యవహరిస్తోంది. అంతవరకూ కంటినీళ్ళ తుడుపుగా పనిచేస్తున్న యూనియన్ రాజ్ కుమార్‌ని నాయకునిగా ఎన్నుకోవడంతో యూనియన్ స్వభావం పూర్తిగా మారిపోయింది. ఎంతో కష్టంతో కూడిన పనులు అతడు చాలా నేర్పుగా పూర్తి చేస్తున్నాడు.

ఫ్యాక్టరీలో ధర్మయ్య అనే కార్మికుడు వుండేవాడు. అతనికి నలుగురు పిల్లలు. వాళ్ళంతా పదమూడు సంవత్సరాల లోపువాళ్ళు. అందరిలోకి ఆడపిల్ల పెద్దది. ధర్మయ్య ఒకరోజు ఫ్యాక్టరీలో గాయపడ్డాడు. నామమాత్రంగా అతన్ని గవర్నమెంట్ హాస్పిటల్లో ఎడ్మిట్‌చేసింది యాజమాన్యం. గవర్నమెంట్ డాక్టర్ పేషెంట్‌ని మెంటల్ హాస్పిటల్లో జాయిన్ చెయ్యమని రికమండ్ చేస్తూ డిశ్చార్జ్ చేశాడు. ఫ్యాక్టరీ మేనేజర్ పేషెంట్‌ని తీసుకువస్తూ దారిలో కారు ఆపి హోటల్లోకి వెళ్లాడు. అతను తిరిగొచ్చేసరికి పేషెంట్ లేడు.

వెంటనే ఫ్యాక్టరీ యాజమాన్యం డబ్బు ఖర్చుపెట్టి పేషెంట్‌ని మెంటల్ హాస్పిటల్లో జాయిన్ చేసినట్టు, అతను అక్కడనుంచి పారిపోయినట్టు సర్టిఫికెట్ సంపాదించి తమ చేతులు దులుపుకుంది. అది మూడు సంవత్సరాల క్రితం రాజ్ కుమార్ ఫ్యాక్టరీలో జాయిన్ కాకపూర్వం జరిగింది. ఆ విషయం అతనికి తెలియదు. ఒకరోజు జీతం తీసుకొని ఆఫీసునుంచి బయటికి వస్తూ గుమ్మం దగ్గర ఇద్దరు పిల్లలు అడుక్కోవడం చూసాడు. ఆ పిల్లలు బాగా ఎండిపోయి వున్నారు. వాళ్ళ ఆకారాలే చెబుతున్నాయి అంతులేని దరిద్రం వాళ్ళని పట్టుకుందని. వాళ్ళకి రెండు రూపాయిలు ఇచ్చి తోటి కార్మికుడ్ని యధాలాపంగా వాళ్ళ గురించి అడిగాడు. వాళ్ళ వృత్తాంతమంతా ఆ కార్మికుడు చెప్పాడు.

వెంటనే రాజ్ కుమార్ యూనియన్ ఆఫీస్‌కి వెళ్ళాడు.

"ధర్మయ్య కుటుంబం విషయంలో మన యూనియన్ తరపున ఏం చేసారు?" అడిగాడు నాయకుడ్ని.

"కొన్ని నెలలు ఒక్కొక్క కార్మికుని వద్ద రూపాయి చొప్పున వసూలుచేసి ఆ కుటుంబానికి ఇచ్చాం..." చెప్పాడు గర్వంగా. ఆ నాయకుని పేరు ఏసుపాదం. చాలా సంవత్సరాల నుండి ఆ పదవిలో కొనసాగుతున్నాడతను.

"యాజమాన్యం ధర్మయ్యకి ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చిందా?"

"యాజమాన్యం డబ్బు చెల్లించాలంటే ఏడు సంవత్సరాలు ఆగాలి. ఈలోపు డబ్బు రావాలంటే ధర్మయ్య చచ్చిపోయినట్టు సర్టిఫికెట్ తీసుకురావాలి. అంతవరకూ రూల్స్ ప్రకారం డబ్బు ఇవ్వడం కుదరదు"

"అంతవరకూ వాళ్ళు రోడ్డుమీద అడుక్కుని బ్రతకడమేనా?" అడిగాడు రాజ్ కుమార్ తీవ్రంగా.

"మనం ఏం చెయ్యగలం? అప్పటికే కార్మికులు ఇష్టపడకపోయినా చాలాసార్లు డబ్బులు కలెక్ట్‌చేసి ఇచ్చాం..."

"మన ఫ్యాక్టరీలో పనిచేస్తూన్న ఒక కార్మికుని భార్యా పిల్లలు ఫ్యాక్టరీ ముందు అడుక్కుంటుంటే – యూనియన్ నాయకునిగా అసమర్థతకి నేనయితే రాజీనామా చేసి వుండేవాడిని. ఇంట్లో నీ పిల్లలు కడుపునిండా అన్నం తిన్నారా లేదని కాదు యూనియన్ నాయకుడిగా నువ్వు చూసుకోవల్సింది. నీ నాయకత్వంలో కార్మికుల భార్యా పిల్లలు అన్నం తింటున్నారా లేదా అనేది తెలుసుకోవాలి..."

ఐదొందల మంది కార్మికులతో యూనియన్ వుండి ఒక కార్మికుడి భార్యా పిల్లలు తిండి లేకుండా మాడిపోతుంటే అతను భరించలేకపోతున్నాడు. ఆలోచించేకొద్దీ అతనిలో ఆవేశం ఉప్పొంగుతోంది.

"నీ కబుర్లకేంలే! యూనియన్ నాయకునిగా బాధ్యతలు నెరవేర్చడమంటే తమాషా అనుకుంటున్నావ్ కాబోలు. ఇంటికి వెళ్ళి సరిగ్గా అన్నం తినడానికి కూడా నాకు తీరిక వుండదు తెలుసా?" చెప్పాడతను కోపంగా.

"అటువంటప్పుడు యూనియన్ నాయకత్వం నుండి తప్పుకుని ఇంటికెళ్ళి హాయిగా భోంచెయ్యి..." తీవ్రంగా చెప్పాడు రాజ్ కుమార్.

"ఏం మాట్లాడుతున్నావ్?" పేట్రేగిపోయాడు నాయకుడు.

"ఉన్న విషయం మాట్లాడుతున్నాను. జరిగిన దానికి ఒక కార్మికునిగా ప్రశ్నిస్తున్నాను. నువ్వు కూడా ఒక కార్మికుడివేనని, నీ పదవి శాశ్వతం కాదని హెచ్చరిస్తున్నాను" చెప్పి విసురుగా వచ్చేశాడు రాజ్ కుమార్.

ఆ సమయంలో కొందరు కార్మికులు అక్కడ వున్నారు. రాజ్ కుమార్ యూనియన్ నాయకుడ్ని నిలదీస్తున్నా వాళ్ళెవరూ కల్పించుకోలేదు. యూనియన్ నాయకుడు ఏసుపాదం మీద వాళ్ళకి అంతగా విశ్వాసం లేదు. అతనికంటే తెలివైనవాడు లేకపోవడంవల్ల అతన్నే నాయకుడిగా ఎన్నుకుంటున్నారు. అంతేకాకుండా యూనియన్ అనేది ఎంత పటిష్టంగా పని చెయ్యగలదో వాళ్ళకి పూర్తిగా

తెలియదు. దానికి కారణం యూనియన్ గురించి సరియైన అవగాహన లేకపోవడమే! రాజ్ కుమార్ మాటలతో వాళ్ళ కళ్ళు తెరుచుకున్నట్టయింది. సాటి కార్మికుని కుటుంబసభ్యులు రోడ్డుమీద అడుక్కుని బ్రతకడం తరచుగా చూస్తున్నా ఏం చెయ్యలేమనే భావంతోను, తమ వంతు సహాయం చేశామనే తృప్తితోను వెళ్ళిపోయేవాళ్ళు.

ఆ ఫ్యాక్టరీలోని ఒక కార్మికుడు మొదటిసారిగా యూనియన్ నాయకుడ్ని నిలదీసి ప్రశ్నించాడు. అంతేకాదు. అతను నాయకుడికి ప్రత్యర్థిగా మారేడు.

రాజ్ కుమార్ తన తెలివితేటలకు పని కల్పించాడు. పదిమంది కూర్చున్న చోట ధర్మయ్య కుటుంబం గురించి చర్చించడం ప్రారంభించాడు రాజ్ కుమార్. ఆ కుటుంబం విషయంలో కార్మికులు ఏ విధంగా తోడ్పడగలరో వివరించి చెప్పేవాడు. ఆ విధంగా ఫ్యాక్టరీలోని మొత్తం కార్మికులకి చెప్పేడు. కొందరు కార్మికులు రాజ్ కుమార్‌కు వ్యతిరేకంగా మాట్లాడినా, వాళ్ళ మాటల్లో సరుకు లేకపోవడంవల్ల ఎక్కువసేపు నిలవలేకపోయారు. రాజ్ కుమార్ ముందుగా కార్మికుల్లో భావవిప్లవాన్ని సాధించేడు. దీనితో కార్మికుల ఆలోచనలు విస్తరించాయి. మూడొంతుల మంది నిరక్షరాస్యులు గల ఫ్యాక్టరీలో ప్రతి ఒక్కరికి యూనియన్ అంటే ఏమిటి? అది కార్మికునికి ఏ విధంగా ఉపయోగపడుతుంది? అనే విషయాల గురించి తెలుసుకోగలిగారు.

సరిగ్గా అదే యూనియన్ నాయకుడు ఏసుపాదాన్ని పదవి నుంచి దించడానికి కారణమయింది.

రాజ్ కుమార్ యూనియన్ నాయకుడిగా ఎన్నికయిన మొదటి నెలలో యూనియన్ ఫండ్ నుంచి వెయ్యి రూపాయలు డ్రాచేసి, ధర్మయ్య భార్యని హాస్పిటల్‌కి తీసుకెళ్ళే బాధ్యత ఇద్దరు కార్మికులకి అప్పగించాడు. వైద్యపరీక్షలో ఆమెకి క్షయవ్యాధి ఉన్నట్టు ఋజువయింది. ఆ విషయం కార్మికులకి తెలియపర్చి ప్రతిరోజు ధర్మయ్య భార్యకి పాలు, మాంసం, మందులు అందే ఏర్పాటుచేశాడు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో ధర్మయ్య భార్యకి రావాల్సిన డబ్బు గురించి చర్చ ప్రారంభించాడు. అదే సమయంలో రాజ్ కుమార్ ప్రయత్నాలకి మొదటి దెబ్బ తగిలింది.

ధర్మయ్య భార్య హఠాత్తుగా మరణించింది.

అయినా రాజ్ కుమార్ ఏమాత్రం చలించలేదు. కార్మికుల సహాయంతో ఆమెని దహనంచేసి తిరిగొచ్చాడు. అప్పుడే వచ్చింది మరో వార్త.

ధర్మయ్య పెద్ద కూతురు రజస్వలయింది.

రాజ్ కుమార్ విసుగుచెందలేదు. ఆ సమయంలో అతను కాస్తంత చిరాకు ప్రదర్శించినా మొత్తం కార్మికుల్లో వ్యతిరేకభావం ఏర్పడుతుంది. అటువంటి అవకాశం ఇవ్వకుండా తన భార్యని వాళ్ళ ఇంటికి పంపాడు. కొందరు కార్మికులు విసుగు ప్రదర్శించడం కనిపించింది లేనిపోని బరువు నెత్తిన ఎత్తుకున్నామని. కాని రాజ్ కుమార్ పట్టుదలవల్ల ఏ పనీ ఆగలేదు. తమ ఇంట్లో శుభకార్యం మాదిరిగా ఆ కార్యాన్ని పూర్తిచేశారు.

ధర్మయ్య భార్య చనిపోయిన నెల ప్రతి కార్మికుడు జీతం నుండి పది రూపాయలు వంతున సహాయంచేశారు. అది మొత్తం అయిదువేలు ప్రోగయ్యింది. కోపరేటివ్ విధానంలో అవసరమైన కార్మికునికి అప్పు ఇచ్చే పద్ధతిమీద కొందరు సభ్యులను కమిటీగా ఏర్పాటుచేశాడు. దానిమీద వస్తున్న వడ్డీ ధర్మయ్య పిల్లలకు ప్రతి నెల అందించబడుతోంది. అందువల్ల వందకి పది రూపాయల వంతున వడ్డీ చెల్లించే కార్మికునికి అతి తక్కువ వడ్డీకి డబ్బు ముడుతోంది. ధర్మయ్య పిల్లలు ఇద్దరు స్కూల్లో జాయిన్ చెయ్యబడ్డారు.

అంతటితో ఒక దశ ముగిసింది.

ఇప్పుడు కార్మికులు ధర్మయ్య కుటుంబం ఒక దారికి రావడంపట్ల తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు. అసలు యూనియన్ తరఫున అటువంటి పనులు చెయ్యవచ్చని వాళ్ళకి తెలియదు. వాళ్ళకి నాయకత్వం వహించిన మాజీ నాయకులు యాజమాన్యం మోచేతి క్రింద నీళ్ళు త్రాగుతూ, కార్మికుల గురించి పట్టించుకునేవాళ్ళు కాదు. యజమాని ఏర్పాటుచేసిన పార్టీకి యూనియన్ నాయకుడ్ని కూడా ఆహ్వానించేవారు. అదో గొప్ప విషయంగా చెప్పుకునేవారు కార్మికులు. రాజ్ కుమార్ వచ్చిన తరువాత అటువంటి సాంప్రదాయానికి తెర పడింది.

యూనియన్ ఆఫీస్ జూదానికి, వ్యభిచారానికి అనుకూలంగా వుండేది. రాజ్ కుమార్ దానిని ఒక దేవాలయంగా తీర్చిదిద్దేడు. ఆఫీస్ బాగుచేయించడంతోపాటు, అందులో ఫర్నిచర్ ఏర్పాటుచేశాడు. ఇప్పుడు యూనియన్ ఆఫీస్ ప్రతి రోజూ సాయంకాలం కార్మికులు కలిసి చర్చించుకునే వేదికగా మారింది.

రాజ్ కుమార్ ప్రతి చర్యని ఒక వర్గం నిశితంగా పరిశీలిస్తోంది.

ఒకరోజు రాజ్ కుమార్‌ని ఒక యువకుడు కలిశాడు. మాటల సందర్భంలో అతనికి ఎవరూ లేరని ఉద్యోగంకోసం ఫ్యాక్టరీకి వచ్చినట్లుగా చెప్పుకున్నాడు. అయితే వేకన్సీ లేదని చెప్పడంతో తిరిగి వెళ్ళిపోతూ రాజ్ కుమార్‌కి కనిపించాడు. అతన్ని తనతోపాటు ఇంటికి తీసుకొచ్చి భోజనం పెట్టి ధర్మయ్య కుటుంబం గురించి వివరించి చెప్పిన తరువాత అన్నాడు.

"ధర్మయ్య కూతుర్ని చూడు. నీకిష్టమైతే నేను ఉద్యోగం ఇప్పిస్తాను. ఉద్యోగం వచ్చిన తరువాత ఆ అమ్మాయిని నువ్వు పెళ్ళి చేసుకోవాలి. అంతేకాకుండా మిగతా ముగ్గురు పిల్లల బాధ్యత కూడా నీదే!"

ఆ యువకుడు కొంతసేపు ఆలోచించి అంగీకరించాడు. అతన్ని తీసుకెళ్ళి ధర్మయ్య కూతుర్ని చూపించాడు. మొదట్లో తిండి లేకపోవడంవల్ల ధర్మయ్య పిల్లలు ఎండిపోయినట్ట కనిపించేవారు. ఇప్పుడు తిండికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా ప్రతి నెల వడ్డీ రావడంవల్ల వాళ్ళల్లో కళ వచ్చింది. ఆ పిల్లని చూసి అతను తన అంగీకారం తెలిపాడు.

ఒకరోజు యూనియన్ మీటింగ్ ఏర్పాటుచేసి తన ఆలోచన వారికి చెప్పి కుర్రవాడిని చూపించాడు. అందులో కాదనడానికి ఏమీ లేదు కనుక ఏకగ్రీవంగా అంగీకారం కుదిరింది. రాజ్ కుమార్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో ఆ కుర్రవాడి ఉద్యోగం గురించి సంప్రదించాడు. ధర్మయ్య స్థానంలో ఎలాగూ కుటుంబసభ్యునికి ఉద్యోగం ఇవ్వాలి. యూనియన్ లీడర్ ప్రతిపాదనకి అంగీకరిస్తే అతన్ని మంచి చేసుకోవచ్చని భావించి వెంటనే ఆ కుర్రవాడికి ఉద్యోగం ఇచ్చింది.

అయితే వాళ్ళు భావించినట్టు రాజ్ కుమార్ యాజమాన్యానికి అనుకూలంగా మారలేదు. అతని ఆలోచన అతనిది. యాజమాన్యం తను చెయ్యాల్సిన పని చేసింది తప్ప ప్రత్యేకంగా ధర్మయ్య కుటుంబంపట్ల శ్రద్ధేమీ తీసుకోలేదు. వాళ్ళ ధర్మాన్ని వాళ్ళు నెరవేర్చారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడటంలో రాజ్ కుమార్‌ది రాజీ లేని పోరాటం.

అందువల్ల యాజమాన్యం అతనిమీద పగబట్టింది.

ఒక సంవత్సరం తరువాత కార్మికుల ఆధ్వర్యంలో ధర్మయ్య కూతురు పెండ్లి ఘనంగా జరిగిపోయింది. కొందరు పెళ్ళికూతురు తరపున, మిగతావాళ్ళు పెళ్ళికొడుకు తరపున విడిపోయి పెళ్ళిలో పాల్గొన్నారు. అంతమంది బంధువులతో వివాహం జరగటం అపూర్వం. ఆ పనులు పూర్తయ్యేసరికి రాజ్ కుమార్ బాగా అలసిపోయాడు.

అతని భార్య కాఫీ తీసుకొచ్చి భర్తకి ఇచ్చి చెప్పింది.

"మనవాడికి ప్రైవేటు పెట్టిద్దామండి..."

"ప్రేవేటు దేనికి? వద్దు..." చెప్పాడతను కాఫీ త్రాగుతూ

"ప్రైవేటు పెడితే బాగా చదువుతాడు కదా!" అంది భర్తని ఒప్పించే ప్రయత్నంగా.

"పిచ్చిదానా! ప్రైవేటువల్ల మన వాడికి మరో మెదడు ఏర్పడదు. ప్రైవేటులో మాష్టారు శ్రద్ధగా పాఠాలు చెబుతారంతే. అది కూడా చెయ్యలేని మాష్టారు స్కూల్ పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు పట్టుకొచ్చి పిల్లలకి చెబుతాడు, ఎక్కువ మార్కులు వస్తే తల్లిదండ్రులు ప్రైవేటు మానిపించరనే ఉద్దేశ్యంతో. అందువల్ల పిల్లలు ఒక క్రమపద్ధతిలో చదివే అలవాటు లేకుండాపోయి చదువులో అసమర్థులుగా తయారవుతారు. చదువు విషయంలో మనం చిన్న వయసులోనే ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని బోధించాలి. ఫీజు చెల్లించి పని మాలా పిల్లవాడి భవిష్యత్తు ఎందుకు పాడుచెయ్యడం? చదువు గురించి పిల్లలు కష్టపడటం నేర్పాలి" చెప్పాడు శాంతంగా.

ఆమె భర్త వంక చూస్తూ వుండిపోయింది. అదే అతనిలో ఆమెకి నచ్చిన గుణం. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించి చెబుతాడు. అటువంటి ఆలోచన తమకి రానందుకు ఎదుటివాళ్ళు చింతించే విధంగా!

## 11

రాజ్ కుమార్ దారుణంగా చంపబడ్డాడు.

యూనియన్ లీడర్‌గా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని, నిజాయితీకి మారు పేరయిన రాజ్ కుమార్ శవం తెల్లారేసరికి నడివీధిలో కనిపించింది.

అతను పనిచేస్తున్న ఫ్యాక్టరీ ఆరు నెలలుగా మూడపడింది. వర్కర్లు స్ట్రయిక్ చేస్తున్నారు. జీతాలు పెంచమని కాదు. తమకి కావాల్సిన హాస్పటల్ గురించి, క్వార్టర్ల గురించి, ఉన్న క్వార్టర్లకి లేని లావెట్రీలు గురించి స్ట్రయిక్ చేస్తున్నారు. వాళ్ళు అడిగిన వాటికి అంగీకరిస్తే యాజమాన్యం వెంటనే పది లక్షల రూపాయలు ఖర్చు చెయ్యాలి. తరువాత మరో పది లక్షలు ఖర్చుపెట్టాలి.

అప్పటికే ఫ్యాక్టరీ గోడౌన్‌లో సరుకు పేరుకుపోయింది. ఆరు నెలల వరకూ సరుకు తయారుచెయ్యకపోయినా పరవాలేదు. అందుకే యాజమాన్యం స్ట్రయిక్ గురించి పెద్దగా పట్టించుకోలేదు. అప్పుడే మరొక విచిత్రం జరిగింది.

మరో ఫ్యాక్టరీ ఫైర్ యాక్సిడెంట్‌లో కాలిపోవడంతో మార్కెట్‌లో సరుక్కి డిమాండ్ ఏర్పడి పేరుకున్న నిల్వలు రెండు నెలల్లో అయిపోయాయి. తక్షణమే సరుకు తయారుచేసి మార్కెట్‌లో విడుదల చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలిపోయిన ఫ్యాక్టరీ తిరిగి ఉత్పత్తి చేయడం ప్రారంభం కావటానికి సంవత్సరమన్నా పడుతుంది. అంటే డిమాండ్ మరో సంవత్సరం వరకూ కొనసాగుతుంది. అంతకుముందే యూనియన్ లీడర్లతో దురుసుగా ప్రవర్తించటంవల్ల వాళ్ళు గట్టి పట్టుమీద వున్నారు. అందుకే ఆరు నెలలు గడిచిపోయాయి. ఆరు నెలల్లో

మూడు లక్షల వరకూ రావాల్సిన నిఖర లాభం నష్టపోయింది ఫ్యాక్టరీ యాజమాన్యం. తన తప్పు తెలుసుకున్న యాజమాన్యం వర్కర్ల కదలికలు గమనించటం ప్రారంభించింది.

వర్కర్లు ఎప్పటిలానే వున్నారు. జీతాలు లేకపోవటంవల్ల వాళ్ళల్లో ఎటువంటి ఇబ్బంది కనిపించలేదు. దానికి కారణం రాజ్ కుమార్ యూనియన్ ఫండ్ మొత్తం డ్రాచేసి వర్కర్లకి పంచిపెట్టేశాడు. స్వంత ఇళ్ళు వున్న వర్కర్ల గృహాలను, ఆడవాళ్ళ మెడలోని నగలను తాకట్టుపెట్టి డబ్బు తీసుకునివచ్చాడు. యాజమాన్యం సేకరించిన సమాచారం ప్రకారం మరో సంవత్సరం వరకూ వర్కర్లు ఎటువంటి ఇబ్బందీ లేకుండా బ్రతకగలరని తెలిసిపోయింది. వర్కర్లతో జరిపిన సమావేశాలు విఫలం చెందాయి. ఫ్యాక్టరీ గోడౌన్‌లో సరుకు లేదని, మార్కెట్‌లో సరుక్కి డిమాండ్ విపరీతంగా వుందని రాజ్ కుమార్‌కి తెలుసు. అందుకే పట్టిన పట్టు వదల్లేదు.

ఫ్యాక్టరీ యజమాని ఆలోచనలో పడ్డాడు. అప్పటికే పద్దెనిమిది లక్షలు వరకూ నష్టపోయింది. వడ్డీతో కలుపుకుని వర్కర్ల జీతాలు ఇవ్వవలసివస్తే ఎనిమిది లక్షల వరకూ చెల్లించాలి. మరో ఆరు నెలలు ఫ్యాక్టరీ మూసివుంచితే వచ్చే నష్టం దారుణంగా వుంటుంది. పట్టుదలకి పోయి అంత నష్టం భరించటం తెలివిగలవాడి లక్షణం కాదు. మరి ఏం చెయ్యాలి?

ఆ ప్రశ్నకి సమాధానం ఫ్యాక్టరీ యజమాని రాజ్ నారాయణ్ కుమారుడు నారాయణ్ చెప్పాడు.

"ఇప్పటికే రాజ్ కుమార్ తను అడ్డు వుండి కొన్ని లక్షల రూపాయలు వర్కర్లకి ఇచ్చాడు. ఈ సమయంలో ఒక పనిచేస్తే వర్కర్ల యూనియన్ తల తెగిపోయి నిర్జీవంగా తయారై మరి కోలుకోలేదు" అంటూ చిన్న సలహా ఇచ్చాడు.

ఆ సలహా ప్రకారం మాజీ యూనియన్ నాయకుడు ఏసుపాదాన్ని పిలిపించటం జరిగింది.

రాజ్ కుమార్ చేతిలో ఓడిపోయినంత మాత్రాన ఏసుపాదాన్ని బలహీనుడుగా లెక్కించాల్సిన అవసరం లేదు. కార్మికుల్లో ఒక వర్గం ఇప్పటికీ గట్టిగా బలపరుస్తోంది. దానికి తోడు యాజమాన్యం అభిమానాన్ని సంపాదించుకున్న వ్యక్తి అతను. రాజ్ కుమార్ తెలివితేటలు ఏసుపాదాన్ని దెబ్బతీశాయి కాని అతను గత ఆరేడు సంవత్సరాల నుండి యూనియన్ నాయకుడుగా కొనసాగాడు. ఎంత త్రాగుబోతయినా స్పృహలో వున్నప్పుడు త్రాగుడు మనిషికి హాని చేస్తుందని అంగీకరించినట్టే తన వర్గంలోని కార్మికులు రాజ్ కుమార్ చేస్తున్న పనులు పరోక్షంగానే కాకుండా ప్రత్యక్షంగా కూడా సమర్థించడం గమనించాడు ఏసుపాదం.

అతని తల కొట్టేసినట్టయింది!

ఆ విధంగా కొంత కాలం సాగితే తనకి ఒక వర్గమంటూ లేకుండాపోయి చివరికి సాధారణ కార్మికునిగా మిగిలిపోవాల్సి వుంటుందని భయపడ్డాడు. సరిగ్గా అప్పుడే యాజమాన్యం అతనికి కబురుపెట్టింది. యాజమాన్యం పనికి పురమాయిస్తే ఆ పనివల్ల వచ్చే గొడవలు అదే చూసుకుంటుంది ఎంత డబ్బయినా ఖర్చుపెట్టి.

మరునాడు ఏసుపాదం వర్గంలోని ఇద్దరు కార్మికులు రాజ్ కుమార్‌ని ఇంట్లోంచి బయటకి పిలుచుకొచ్చారు. ఏసుపాదం తన మనుషులతో సిద్ధంగా వున్నాడు. రాజ్ కుమార్‌ని నలుగురు మనుషులు కదలకుండా పట్టుకున్నారు. ఏసాపాదం కత్తిని రాజ్ కుమార్ పొట్టలోకి బలంగా దింపాడు. నాలుగైదు పోట్లు వరసగా పొడిచి రోడ్డుమీద పడేసారు. గిలగిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాడు.

రాజ్ కుమార్ తన ప్రాణాలకి ప్రమాదముందని పసిగట్టి యూనియన్‌లోని మరో వ్యక్తి పేరుమీద డబ్బు లావాదేవీలు నడిపాడు. అందుకే యాజమాన్యం భావించినట్టు యూనియన్ దెబ్బతినలేదు. కాని రాజ్ కుమార్ చనిపోవడం యూనియన్‌కి పెద్ద దెబ్బ.

రాజ్ కుమార్ మరణవార్త విని గుండె పగిలి, స్పృహ తప్పి పడిపోయింది విశాలి.

ఆ సమయానికి పెరట్లో కూర్చుని అక్షరాలు కూడబలుక్కుని వదాలు చదవటానికి ప్రయత్నిస్తున్నాడు చంద్రం. అతనికి ఏడో సంవత్సరం వచ్చింది.

◆ ◆ ◆

దుఃఖం శాశ్వతం కాదు. రోజులు గడిచేకొలది దాని తీవ్రత తగ్గిపోయి ఎటువంటి మనిషయినా సర్దుకుంటాడు. వాస్తవ పరిస్థితిని గ్రహించగలవాళ్ళు తమకు ఎదురయిన దుఃఖం నుండి తొందరగా తేరుకోగలుగుతారు.

విశాలి భర్త నుండి చాలా విషయాలు నేర్చుకుంది. అందులో ముఖ్యమైనది వాస్తవ పరిస్థితి గుర్తించి దానికి అనుగుణంగా జీవితాన్ని మలచుకోవడం. అందుకే ఆమె చాలా తొందరగా తేరుకోగలిగింది. ప్రేమించి పెళ్ళి చేసుకున్న రాజ్ కుమార్ చనిపోవటంతో ఆమె జీవితం అంధకారమైపోయింది. తన జీవితం అంధకారమైనా దాని ప్రభావం కొడుకుమీద పడకూడదని గ్రహించింది. తన కొడుకుని పెంచి పెద్దచేసి సంఘంలో ఒక ఉన్నతమైన వ్యక్తిత్వం గల మనిషిగా తీర్చిదిద్దాలి. ఆ ఆశయంతో ఆమె కాన్వెంట్‌లో టీచర్‌గా చేరింది.

"ఈరోజు నన్ను టీచర్‌గారు బుగ్గమీద ముద్దుపెట్టుకున్నారు" చెప్పాడు చంద్రం. సాయంకాలం తల్లితో కలసి ఇంటికి తిరిగివస్తూ.

"ఎందుకట?" అడిగింది విశాలి యధాలాపంగా.

"స్కూల్‌కి ఫస్ట్ వచ్చినందుకు" చెప్పాడు. చంద్రం కంఠంలో క్షణకాలంపాటు గర్వం కదలాడింది.

ఆ విషయం విశాలి కనుక్కుంది.

"అటువంటివి జీవితంలో చాలా చిన్న విషయాలు. ప్రశంసలు బాధ్యతల్ని దెబ్బతియ్యకూడదు. ఈ రాష్ట్రంలో నీతో సాటిరాగల విద్యార్థి వుండకూడదు..." చెప్పింది విశాలి. ఆమె మాటల్లో పట్టుదల ధ్వనించింది.

సరిగ్గా అప్పుడే దుమ్ము లేపుకుంటూ ఆగిందొక కారు.

"విశాలి! బాగున్నావా?" అడిగాడు కిటికీలోంచి తల బయటకి పెట్టి.

అతను కుమార్ నారాయణ్.

సమాధానం చెప్పకుండా తల వూపింది. ఆ కారులో ఇంకా ఐదుగురు వున్నారు.

"రెండు సంవత్సరాల నుండి చూస్తున్నాను. నీలో మార్పు వస్తుందని. ముందుకి నడిచేటప్పుడు వెనుక భాగం ఎలా కదులుతున్నదో అది ఎంతమందిని పిచ్చివాళ్ళను చేస్తున్నదో నువ్వు గుర్తించాలి" నవ్వుతూ అన్నాడు.

విశాలి మొహం కోపంతో ఎర్రబడింది.

కారు కదలి వెళ్ళిపోయింది.

"అంత అందగత్తెని ఇంతకాలం వదిలేశావా?" అడిగాడు మోహన్ కుమార్ నారాయణ్‌ని.

"అటువంటి అందాలు తేలిగ్గా దొరకవు. మీరు గమనించారా? విశాలి నడుస్తున్నప్పుడు కదులుతున్న జఘనాల్ని"

"ఈరోజు నువ్వ ఇస్తున్న పార్టీ రంజుగా వుండదు" పెదవి విరిచాడు డాక్టర్ జీవన్ ప్రకాష్.

"ఏం!"

"జలపాతం వంటి పిల్లని చూపించి విస్కీ త్రాగిస్తే అది జలంలా వుంటుంది"

గొల్లున నవ్వారు మిగతావాళ్ళు.

"డాక్టర్‌గారి మాటతో ఏకీభవిస్తూ నీ పద్ధతి బాగుండలేదని నొక్కి వక్కాణిస్తున్నాను" లోహియా అన్నాడు.

"మీరంతా నామీద పడి విమర్శించకండి. విశాలి అందరికీ నచ్చిందని అర్థమైపోయింది. చాలాకాలం తరువాత మనం కలసి చేసుకుంటున్న పార్టీకి దాన్ని నంజుకుందాం..." చెప్పాడు కుమార్ నారాయణ్ నవ్వుతూ.

వాళ్ళంతా బాల్యస్నేహితులు. వివిధ ఊళ్ళల్లో ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు. వాళ్ళకి కుమార్ నారాయణ్ గురించి బాగా తెలుసు. ఎంత కష్టమైనా అనుకున్నది సాధించితీరతాడు. అందులోను పార్టీ ఇస్తున్నాడంటే దానికి ప్రత్యేకత వుండితీరుతుంది. వాళ్ళ మధ్య అటువంటి పార్టీలు ఎన్నో జరిగాయి. పార్టీ ప్రత్యేకత అమ్మాయిని తీసుకురావటం. అందరూ కలసి అనుభవించటం.

విశాలి అన్యమనస్కంగా ఇంటికి చేరింది. ఎదురైనప్పుడల్లా కుమార్ నారాయణ్ వెకిలిగా మాట్లాడుతున్నాడు. మొగుడు లేని ఆడదంటే తేలిక భావం. భర్త బ్రతికున్న రోజుల్లో కన్నెత్తి చూడటానికి భయపడ్డ ఊరకుక్కలు ఈరోజు నడిరోడ్డుమీద హాస్యమాడుతున్నాయి. విశాలికి దుఃఖం ముంచుకొచ్చింది.

చంద్రానికి కొద్దిగా అర్థమవుతున్నాయి పరిస్థితులు.

ఎవరు ఎన్ని అన్నా తను చంద్రంకోసం బ్రతుకుతున్నది. చదివించి గొప్పవాడిని చెయ్యాలి. అందుకోసం ఎన్ని అవమానాలు ఎదురైనా మౌనంగా భరించాలి. మనసుకి సర్దిచెప్పుకుని చంద్రం వంక చూసింది.

అచ్చు భర్త పోలిక. పైకి అమాయకంగా కనిపిస్తూ లోపల తెలివితేటల్ని కలిగివుండటం. వాటిని చూసే ప్రేమించి పెళ్ళి చేసుకుంది రాజ్ కుమార్‌ని. అవే లక్షణాలు చంద్రానికి సంక్రమించాయి. ఆమె ప్రపంచం చంద్రమే!

రాత్రి పది గంటలకి పనులు పూర్తిచేసి పక్కమీదకు చేరింది విశాలి. అంతవరకూ చదువుతూ కూర్చున్న చంద్రం తల్లి పక్కకి చేరాడు. ఆలోచనలతో విశాలికి నిద్ర పట్టడంలేదు. ఎప్పుడైనా విశాలి ఆలోచించిందంటే అది కొడుకు గురించే!

"టిక్... టిక్... టిక్"

తలుపు కొట్టిన చప్పుడు. విశాలి లేచి కూర్చుంది. ఆ సమయంలో సామాన్యంగా ఎవరూ రారు. ఎవరై వుంటారు? అనుకుంటూ తలుపు దగ్గిరకి వచ్చి అడిగింది "ఎవరు?"

"నేనమ్మా మూర్తిని..."

చాలా విషయాల్లో విశాలికి సహాయపడే భర్త స్నేహితుడు. మాట్లాడకుండా తలుపు తెరిచింది.

విసురుగా తలుపు త్రోసుకుంటూ ముగ్గురు మగవాళ్ళు ప్రవేశించారు.

"ఎవరు మీరు?" భయంతో గట్టిగా అరిచింది.

వచ్చినవాళ్ళు విశాలికి మరోమారు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఒకడు విశాలి నోరు మూశాడు. మిగతా ఇద్దరూ ఎత్తుకుని బయటికి తీసుకెళ్ళి కారు ఎక్కించారు. విశాలి గింజుకుంది. వాళ్ళు పోతుల్లా వున్నారు. విశాలి ప్రయత్నాలు ఫలించలేదు.

"అమ్మా.... అమ్మా..." అని అరుచుకుంటూ పరిగెత్తుకువచ్చాడు చంద్రం.

కారు డోరు మయ్యబోతున్నవాడు ఉలిక్కిపడి చంద్రాన్న చూసి చటుక్కున నోరు మూశాడు. ఒక్క క్షణం ఆలోచించి చంద్రాన్ని కూడా కారు ఎక్కించాడు. ఒకడు విశాలి నోరు ఒక చేత్తో మూసి, మరో చెయ్యి నడుం చుట్టువేసి గట్టిగా పట్టుకుని కూర్చున్నాడు. రెండోవాడు చంద్రాన్ని పట్టుకున్నాడు.

విశాలిని పట్టుకున్న వాడికి ఆమె శరీరం వెచ్చగా తగుల్తోంది.

◆ ◆ ◆

విసురుగా మూలకి పరిగెత్తింది విశాలి. ఆమె శరీరంమీద లంగా, జాకెట్టు మాత్రమే ఉన్నాయి.

చేతిలోని చీర ప్రక్కకి విసిరేసి అన్నాడు కుమార్ నారాయణ్.

"చెప్పినట్టు వింటే జీవితాంతం ఏ లోటూ లేకుండా చూసేవాడిని. నీ మొగుడు తప్పితే ప్రపంచంలో మరొకడు మగాడు లేనట్టు బెట్టుచేస్తున్నావ్"

మిగతావాళ్ళు ఆ దృశ్యాన్ని సంతోషంగా తిలికిస్తున్నారు. అప్పటికే మందుపార్టీ ముగిసింది. తరువాత కార్యక్రమం మొదలైంది.

"ప్రాణాలనైనా వదులుతాను గాని నా శరీరం మీద చెయ్యి వెయ్యనివ్వను" తీవ్రంగా చెప్పింది దూరంగా జరుగుతూ.

"ఏడిశావ్ బెట్టుచేసి నీ మొగుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. నాకు కోరిక పుట్టింది. ఈరోజు ప్రాణం పోయినా నిన్ను అనుభవించకుండా వుండను..." చెప్పాడు నవ్వుతూ.

అది పెద్ద గోడౌన్. ఎటువైపు పరుగెత్తినా గోడ తప్ప మార్గం కనిపించడంలేదు. అప్పటికే మూడుసార్లు చుట్టూ పరుగెత్తి అలసిపోయింది. ఆమె పరుగెడుతుంటే వాళ్ళు నవ్వుకుంటున్నారు. కదులుతున్న అవయవాల వంక చూసి, ఎంత గట్టిగా అరచిన ఎవరైనా వచ్చి రక్షిస్తారనే ఆశ లేదు. ఒకప్రక్క భయంతో స్పృహ తప్పి పడివున్నాడు చంద్రం.

కుమార్ నారాయణ్ విశాలిని సమీపించి ఒక చేత్తో ఆమె జుట్టు పట్టుకుని మరో చెయ్యి జాకెట్టుమీద వేసి చటుక్కున లాగేసాడు. హుక్స్ తెగిపోయి వక్షోజాలు నగ్నంగా బయటపడ్డాయి. అదే చెయ్యి లంగామీద వేసి బలంగా లాగాడు. అది పూర్తిగా ఊడిపోయి క్రిందికి జారిపోయింది. విశాలి లంగా పైకి లాక్కోవటానికి వంగింది. కుమార్ నారాయణ్ నవ్వుతూ లంగామీద కాలువేశాడు. లంగా వదిలిపెట్టి దూరంగా జరిగింది.

అక్కడ వున్న వాళ్ళందరికీ మతులు పోయాయి. పాలరాయి శిల్పంలా తళతళ మెరుస్తున్న నగ్న దేహం దర్శనమిచ్చింది. విశాలి రెండు చేతులతో తొడలు కప్పుకుంది. అలా కప్పుకోవడం వాళ్ళ కళ్ళకి మనోహరంగా కనిపించింది. విరగబడి నవ్వుతున్నారు సంతోషంగా. విశాలి కళ్ళనుండి వస్తున్న నీటితో చెంపలు తడిసిపోయాయి.

కుమార్ నారాయణ్ తన బట్టలు విప్పి నగ్నంగా తయారయ్యాడు. అది చూసి మిగతావాళ్ళు కూడా బట్టలు విప్పేశారు. ఒకే ఒక వ్యక్తి సంశయిస్తూ నిలుచున్నాడు అది కొద్దిసేపే!

వాళ్ళ శరీరాలు చూడవలసివస్తుందని తల తిప్పుకుంది విశాలి. కుమార్ నారాయణ్ ఆమె చెయ్యి పట్టుకుని క్రిందకి తోసాడు. క్రింద పడి, తనని సమీపించిన కుమార్ నారాయణ్ రెండు కాళ్ళూ పట్టుకుని పాదాలకు నుదురు తగిలేటట్టు వాల్చి "నన్ను క్షమించి వదిలేయండి మీకు జీవితాంతం ఋణపడి వుంటాను" గ్రుడ్లనీరు కక్కుకుంటూ అడిగింది ప్రాధేయపూర్వకంగా.

"విశాలి! ఒకమారు నాకు కోరిక పుట్టకూడదు. పుట్టిన తరువాత అనుభవించితీరాలి" అంటూ వెనక్కి తోసాడు.

మిగతావాళ్ళు ఆమెని సమీపించారు. విశాలి చేతులు, కాళ్ళు పట్టుకున్నారు కదలకుండా. కుమార్ నారాయణ్ ఆమె దగ్గరికి చేరాడు.

"భగవంతుడా! నన్ను రక్షించు" శక్తినంతా కూడదీసుకుని అరిచింది.

అప్పుడు కళ్ళు తెరిచాడు చంద్రం. లేచి కూర్చుని అక్కడ జరుగుతున్న దారుణాన్ని చూసాడు.

"ఒరేయ్! మా అమ్మని వదలండిరా..." అని అరుచుకుంటూ పులిపిల్లలా వాళ్ళవైపు దూసుకెళ్ళాడు.

విశాలి చెయ్యి వదిలి ఒకడు లేచాడు చంద్రాన్ని పట్టుకోవటానికి. పుస్తకాల్లోని కాగితాలు తిరగేసి, అక్షరాలు వ్రాసే లేతవ్రేళ్ళు బిగుసుకున్నాయి. బిగిసిన పిడికిలి విసిరాడు ఎక్కడ తగులుతుందో చూడకుండా.

పిడికిలి తగలటం, "ఫట్"మని శబ్దం రావటం, అతను "అమ్మా" అని అరిచి విరుచుకుపడిపోవడం వెంటవెంటనే జరిగింది.

విశాలి శరీరాన్ని ఆక్రమించిన కుమార్ నారాయణ్ కూడా ఉలిక్కిపడి లేచాడు. అతని స్నేహితుడు కిందపడి గిలగిలా కొట్టుకుంటున్నాడు. నిజానికి చంద్రం వంటి కుర్రవాడు కొట్టిన దెబ్బకి అలా గింజుకోవాల్సిన పనిలేదు.

కాని చంద్రం విసిరిన పిడికిలి నగ్నంగా వున్న తగలరాని భాగంమీద తగిలింది.

చూస్తుండగానే అతని ప్రాణం పోయింది.

"మోహన్, లోహియా! వాడిని స్తంభానికి కట్టేయండి!" ఆజ్ఞాపించాడు కుమార్ నారాయణ్.

గింజుకుంటున్న చంద్రాన్ని లాక్కెళ్ళి స్తంభానికి కట్టేసారు.

చంద్రం కళ్ళనుండి నీరు ధారలా కారుతోంది. ఆ నీటినుండి మసగ్గా కదులుతున్న ఆకారాలు కనిపిస్తున్నాయి. అలా నాలుగైదు గంటలు ఒకరు తరువాత ఒకరు వరుసగా అనుభవించారు.

"వీడికి రేపు నువ్వు ఆపరేషన్ చెయ్యాలి..." చెప్పాడు కుమార్ నారాయణ్ త్రాగిన మత్తు, శరీరంలోని వేడి తగ్గిపోయాయి. తెల్లవారుజామున అక్కడనుండి వెళ్ళిపోతూ డాక్టర్ జీవన్ ప్రకాష్‌తో చెప్పాడా మాటలు.

చంద్రం మౌనంగా చూస్తున్నాడు.

అతని కళ్ళల్లో నీళ్ళు ఇంకిపోయాయి. అవి చంపలమీద ఎండిపోయాయి. అక్కడ జరిగిన దారుణ కృత్యానికి ఆ చిన్ని హృదయం తల్లడిల్లిపోయింది. ఆవేశపడిన నరాలు అలసిపోయాయి. శరీరంలోని రక్తం చాలాసేపు వడిగా ప్రవహించడంవల్ల ఒళ్ళు వేడిగా వుంది.

తలుపులు మూసి అంతా వెళ్ళిపోయారు.

చంద్రం నగ్నంగా పడివున్న తల్లి వంక చూశాడు. ఎక్కువగా చమట పట్టడంవల్ల శరీరం నిండా మురికి పేరుకుపోయి వాంతి వచ్చేటట్టుగా వుంది. తల ప్రక్కకి వాలిపోయి నోటినుండి చొంగ కారుతోంది.

తల్లిని చూస్తుంటే గునపంతో సూటిగా గుండెల్లో గుచ్చిన బాధ ఎవరో హృదయాన్ని నలిపేస్తున్న అనుభూతి. తన అశక్తతకి ఏడుపు తన్నుకొస్తోంది.

నెమ్మదిగా కళ్ళు తెరిచింది విశాలి. శరీరం కదల్చకుండా దృష్టిని మాత్రం సారించింది. ఆమె చూపు చంద్రం మీద నిలిచిపోయింది. రెండు మూడుసార్లు నోరు తెరచి నిస్సహాయంగా చూసింది. ఆమెకి దాహంగా వుంది, ఆ విషయం చంద్రం గ్రహించాడు. ఏం చెయ్యాలి? గింజుకున్నాడు. కట్టిన తాళ్ళు తెగవని ఎప్పుడో తెలుసుకున్నాడు. అయినా తల్లికి నీళ్ళు కావాలనే తాపత్రయంతో గింజుకున్నాడు.

తల్లివంక జాలిగా చూసాడు.

ఆమె మరోమారు నోరు తెరిచింది. నోటినుండి ఎక్కిళ్ళు వస్తున్నాయి. ఆమె పడివున్న చోట రక్తస్రావం జరిగినట్టు పైకి కనిపించటంలేదు. రక్తమంతా శరీరానికి అడుగున మడుగుకట్టింది.

ఆమె చంద్రం వంక చూస్తూనేవుంది. ఆ కళ్ళల్లో జీవం లేదని చాలాసేపటికిగాని చంద్రం గుర్తించలేదు. గుర్తించిన తరువాత ఒక్కసారి బావురుమన్నాడు. ఆ రాక్షస ప్రపంచంలో అతన్ని ఓదార్చే నాథుడు లేడు.

అలాగే కళ్ళు మూసుకున్నాడు చంద్రం. ఎంతసేపు గడిచిందో తెలియదు. ఎవరో కదిలిన అలికిడయితే కళ్ళు తెరిచాడు. తల్లి ముందు ఒక వ్యక్తి మోకాళ్ళమీద కూర్చుని వున్నాడు. అటు తిరిగి వుండటంవల్ల మొహం కనిపించటంలేదు. అప్పుడే తలుపు తీస్తున్న శబ్దం వినిపించింది. కూర్చున్న వ్యక్తి చటుక్కున లేచి పరిగెత్తాడు. అతని చేతిలో గ్లాసు వుంది. మొహంమీద నీరు చల్లి, గొంతులో నీరు పోసినట్టు విశాలి మొహం తడిగా కనిపిస్తోంది.

అతను వెంకట్రావ్.

కుమార్ నారాయణ్ కొంతమంది మనుషుల్ని వెంటబెట్టుకుని వచ్చాడు. ఇద్దరు చచ్చి పడివున్న కుమార్ నారాయణ్ స్నేహితుడ్ని మోసుకుపోయారు. మరో ఇద్దరూ విశాలి శరీరానికి బట్టలు తొడిగారు. తడిగుడ్డతో శరీరం తుడిచారు. మామూలుగా బొట్టుపెట్టి, జుట్టు ముడివేసారు. ఆమెని ఎత్తుకుని బయటకి తీసుకుపోయారు.

చంద్రం నిశ్శబ్దంగా చూస్తున్నాడు. ఆ చూపు మామూలుగా లేదు, కత్తి దూసి శతృవుని చంపబోతున్న సైనికుని చూపులా వుంది. మాటువేసి లేడిమీదకు దూకపోతున్న చిరుతపులి చూపులా వుంది.

ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో డాక్టర్ జీవన్ ప్రకాష్ వచ్చాడు. అతనితో ఇద్దరు మనుషులు వున్నారు. వాళ్ళు చంద్రం కట్లు విప్పి గోనెసంచులు క్రింద పరచి వాటిమీద పడుకోబెట్టి కదలకుండా పట్టుకున్నారు.

డాక్టర్ జీవన్ ప్రకాష్ సామాను తీసి ఆపరేషన్ చెయ్యటం ప్రారంభించాడు.

మగతనం లేకుండా వుండటంకోసం ఆపరేషన్.

తన స్నేహితుడ్ని టెస్టికల్స్‌మీద గుద్ది చంపినందుకు ప్రతీకారంగా కుమార్ నారాయణ్ చేయిస్తున్న ఘనకార్యం.

మరో గంటకి చంద్రం నపుంసకునిగా మారేడు.

మూడు రోజులు అక్కడే పడివున్నాడు. నాలుగోరోజు డాక్టర్ వచ్చి కుట్లు విప్పి వెళ్ళిపోయాడు. తిండి లేకుండా వుండటంతో కదల్లేకపోతున్నాడు. ఆ వయసులోనే జీవితం గురించి పోరాటం ప్రారంభించాలని అర్థంచేసుకున్నాడు. ముందు అక్కడనుంచి తప్పించుకోవాలనే ఆలోచన వచ్చిన తరువాత అవకాశంకోసం ఎదురుచూస్తూ వుండిపోయాడు. ఎవరూ అతని గురించి పట్టించుకోవడంలేదు. అతను గోడౌన్‌లో వున్నాడనే విషయం కూడా తెలియనట్టు ప్రవర్తిస్తున్నారు.

రాత్రి పదకొండు గంటలకి గోడౌన్ తలుపులు తెరుచుకున్నాయి.

కూలీలు బస్తాలు తెచ్చి లోపల సర్దటం ప్రారంభించారు. చంద్రం చాటుగా కూర్చుని చూస్తున్నాడు. కొంతసేపు గడిచిన తరువాత కూలీలు రావటం ఆగిపోయింది. అంతా బయటకి వెళ్ళారు. గోడౌన్ తలుపులు మూసి, చంద్రం తలుపు దగ్గరికి వచ్చి నెమ్మదిగా తలుపు తోసి చూశాడు. ఒక రెక్క తెరచుకుంది. ఏర్పడిన ఖాళీలోంచి బయటకి చూశాడు.

దూరంగా లారీ నిలబడి వుంది. కూలీలు మొత్తం లారీ ఎక్కారు. వాచ్‌మేన్ లారీ డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. అంతకంటే మంచి అవకాశం రాదని గ్రహించాడు చంద్రం. మరికొంచెం తలుపు తోసి నెమ్మదిగా బయటకి వచ్చాడు. తిరిగి తలుపు దగ్గరికి లాగాడు. పిల్లిలా గోడౌన్ వెనక్కి నడిచాడు. అప్పుడు పీల్చుకున్నాడు గుండెల నిండా గాలి.

వెనక్కి తిరిగి ఒకమారు గోడౌన్ వంక చూశాడు. అందులోనే తన తల్లి చచ్చిపోయిందనే విషయం గుర్తొచ్చింది. గోడౌన్ మొత్తాన్ని కూలదొయ్యాలనేంత కోపం వచ్చింది. కాని తనకి బలం లేదు. ముందు బలం సంపాదించాలి, తరువాత ఒక్కొక్కడి అవయవాలు నరికి పోగులుపెట్టాలి. మనసులో అనుకుంటూ చీకటిలో తన ఇంటివైపు వేగంగా పరిగెత్తాడు.

తన ఇల్లు వున్న ప్రదేశం చేరాడు. అదురుతున్న గుండెలతో ముందుకి చూశాడు. అనుమానంతో పరీక్షగా చూశాడు. తను చూస్తున్నది కలో నిజమో అర్థంకాలేదు. అటుప్రక్క ఇటుప్రక్క ఇళ్ళు సరిగ్గానే వున్నాయి. తన ఇల్లే పోలిక దొరకటంలేదు. ఇంటిమీద కప్పు, తలుపులు, కిటికీలు లేవు. మొండి గోడలు మాత్రమే బోసిగా కనిపిస్తున్నాయి. తండ్రి నిజాయితీగా కూడబెట్టిన డబ్బుతో కట్టిన ఇల్లు నామరూపాలు లేకుండా వుంది. నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి మూర్తి ఇంటి తలుపు తట్టాడు.

"ఎవరు?" అని అడుగుతూ తలుపు తెరిచాడు మూర్తి.

ఎదురుగా చంద్రం నిలబడివున్నాడు. అతని మొహం నిర్వికారంగా వుంది. గొప్ప జీవితసత్యం అర్థంచేసుకున్నవాడిలా, రక్తమంతా ఎవరో తోడేసినట్టు మొహం పాలిపోయి, కళ్ళు చుట్టూ నల్లటి గీతలు ఏర్పడి, కళ్ళు లోతుకు పోయాయి. అప్పుడే మట్టిలో పొర్లి వచ్చినట్టు వున్నాడు.

"చంద్రం! ఇన్ని రోజులూ ఎక్కడికి పోయావ్. నీకోసం చాలాచోట్ల వెతికాం. మీ అమ్మ చచ్చిపోయింది తెలుసా?" అన్నాడు చంద్రం కనిపించాడన్న ఆతృతతో వున్నాడు. చంద్రం మూడ్ ఎలా ఉందో గమనించలేదు.

"తెలుసు. మా అమ్మ శవం ఏమయింది?"

ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి, "మున్సిపాలిటీవాళ్ళు దహనంచేశారు" చెప్పాడు.

సూటిగా మూర్తి మొహంలోకి చూశాడు చంద్రం. ప్రపంచంలో ద్వేషమంతా అతని కళ్ళల్లో ప్రతిఫలిస్తోంది.

"మా అమ్మ శవాన్ని దహనంచేస్తే డబ్బు ఖర్చయిపోతుందని అనుకున్నావా అంకుల్?"

మూర్తి మొహం కళ తప్పింది. చంద్రం వంటి కుర్రవాడు అటువంటి ప్రశ్న సూటిగా అడుగుతాడనే విషయం అతను ఊహించనిది.

"ముందు లోపలికి రా..." తబబడుతూ అన్నాడు.

"నా తండ్రికి స్నేహితుడివి. మీకోసం ప్రాణాలు పోగొట్టుకున్న స్నేహితుని భార్య చచ్చిపోయి, మున్సిపాల్టీవాళ్ళు దహనంచేస్తుంటే చూస్తూ ఊరుకున్నావ్. నీలాంటివాడి ఇంట్లోకి అడుగుపెడితే నా తల్లిదండ్రుల ఆత్మలు శాంతించవు..." చెప్పాడు కటువుగా.

మూర్తి అచేతనంగా ఉండిపోయాడు.

తన ఇంటికి వచ్చి అంకుల్ అంటూ ఆడుకునే పది సంవత్సరాల కుర్రవాడు చంద్రమేనా? అతనికి నమ్మకం కలగటంలేదు.

గిరుక్కున వెనక్కి తిరిగాడు చంద్రం. అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చాడు. స్నేహితుడు చనిపోయిన తరువాత అతని కుటుంబం కష్టాల్లో వుంటే ఆదుకోని మనిషి ప్రవర్తనలోని ఔచిత్యం అర్థంకాలేదు. డబ్బుకోసం తల్లిని, తమ్ముడ్ని, తండ్రిని చంపేవాళ్ళు వున్నారని, డబ్బు తేలేదని భార్యమీద కిరోసిన్ పోసి అంటించే మనుషులు ఉంటారంటే అర్థంకాని వయస్సు.

"బాబూ! చంద్రం!" పిలిచాడు మూర్తి.

వెనక్కి తిరిగిచూడలేదు చంద్రం. గుండె లోతుల్లో సున్నితమైన ప్రదేశం దెబ్బతింది.

రోడ్డుమీదకి వచ్చాడు.

ఏం చెయ్యాలి?

టీ కొట్టు దగ్గిర లారీ ఆగివుంది. చంద్రం లారీ ఎక్కి టార్పాలిన్ క్రింద ముడుచుకుని పడుకున్నాడు.

## 12

లారీ వచ్చి ఆగింది. డ్రైవర్ డోరు తెరిచి క్రిందకి దిగి గబగబా వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"వీరిని జాగ్రత్తగా కన్నాపురంలో దించు..." చెప్పాడు నాయకుడు చంద్రాన్ని చూపించి.

డ్రైవర్ వినయంగా తల వూపాడు.

చంద్రం తడికళ్ళతో నాయకుని వంక చూశాడు. తల వూపాడు వెళతానన్నట్టు. మాట్లాడటానికి గొంతు పెగలటం లేదు.

"నీవు అనుకున్న పనులు పూర్తిచేసి రావాలనుకుంటే యిక్కడికి వచ్చేయ్. పేద ప్రజల కష్టాలతో, కన్నీళ్ళతో కలసి బ్రతుకుదాం... చెప్పాడు చంద్రం కళ్ళవంక చూసి. తరువాత అన్నాడు "విష్ యూ బెస్టాఫ్ లక్".

చంద్రం లారీ ఎక్కాడు. నాయకుడు చెయ్యి వూపుతుండగా లారీ కదిలింది. అక్కడనుండి వెళ్ళాలంటే చాలా బాధగా వుంది చంద్రానికి. ఆత్మీయుడ్ని వదలి శాశ్వతంగా వెళ్ళిపోతున్నట్టు మనసంతా శూన్యంతో నిండిపోయింది. దారిలో కనిపిస్తున్న ఎత్తయిన వృక్షాలు, గుబుర్లు, పక్షులు, కొండలు, లోయలు అతనికి ఆనందాన్ని ఇవ్వలేకపోయాయి. ఏదో లోకంలో వున్నట్టు కూర్చుండిపోయాడు.

"ఫట్" మని శబ్దంచేస్తూ ఆగిపోయింది లారీ.

క్లీనరు కుర్రవాడు క్రిందకు దిగి చూశాడు. టైర్ పంక్చర్ అయింది.

డ్రైవర్ కూడా క్రిందకు దిగాడు. వాళ్ళిద్దరూ కలిసి టైర్ మార్చటంతో మునిగిపోయారు. క్రిందకు దిగి ఒక రాయిమీద కూర్చుని చూస్తున్నాడు చంద్రం. ఆ లారీమీద ఎత్తుగా పేర్చి కట్టి వున్నాయి వెదురుకర్రలు. ఒక సైజు ప్రకారం నరకబడ్డాయి అవి. అవి పేపరు మిల్లుకి వెళుతున్నాయి. వాటిని కోయలు నరుకుతారు. వంద కర్రలకి పది రూపాయలు చొప్పున చెల్లిస్తారు. కోయలు వాటిని నరికి లారీ తిరిగే దారి ప్రక్కన వేస్తారు. వాళ్ళే లారీలకు ఎక్కిస్తారు. లారీ వచ్చిన వెంటనే సరుకు ఎటుప్రక్క వుందో వాళ్ళే చూపిస్తారు.

రోజుకి ఒక లారీ రెండుసార్లు కంటే ఎక్కువ తిరగదు. అది కూడా కష్టంతో కూడి వుంటుంది. దారి మొత్తం కొండరాళ్ళతో నిండి వుండటంవల్ల టైర్లు ఎప్పుడు పంక్చర్ అవుతాయో తెలియదు. అందులోను తిరిగే లారీలు తుక్కు తుక్కు అయిపోతాయి. అడవిలోకి వచ్చిన లారీ ఎప్పుడు లోడు అవుతుందో ఖచ్చితంగా తెలియదు. అడవుల్లో "కూపు"లని వుంటాయి. సరుకు సప్లయిచేస్తున్న కాంట్రాక్టరు అడవిలో ఒక చోట నివాసంలాంటిది ఏర్పాటుచేస్తాడు. అక్కడ ఒక గుమాస్తా కొంతమంది మనుషులు వుంటారు. వాళ్ళు సరుకుని కొట్టించడం, పంపిన సరుకుని వ్రాసుకోవటం చేస్తారు. లారీ డ్రైవర్, క్లీనర్‌లకు అక్కడే భోజనాలు ఏర్పాటుచెయ్యబడతాయి. ఆలోచిస్తున్నాడు ఖాళీగా కూర్చుని.

గంట తరువాత టైర్ ఎక్కించటం పూర్తయింది. చంద్రం ఎక్కి కూర్చున్నాడు లారీ బయలుదేరింది. సాయంకాలం ఐదు గంటల ప్రాంతంలో దూరంగా కన్నాపురం వూరు కనిపించింది. చంద్రం మనసు కీడు శంకిస్తోంది. ఏదో జరగకూడనిది జరగబోతున్నదనే భావం మనసులో ప్రవేశించింది.

"ఇక్కడ దిగిపోతాను..." చెప్పాడు చంద్రం. లారీ ఆగింది. చంద్రం దిగిపోయాడు. లారీ వెళ్ళిపోయింది. రోడ్డు ప్రక్క ఒక చెట్టుకి జారబడి కూర్చుని కళ్ళు మూసుకున్నాడు చంద్రం. దాదాపు పదిహేను రోజులు దాటింది లాడ్జీ వదిలిపెట్టి. ఇప్పుడు అక్కడ పరిస్థితి ఎలా వుందో, చీకటి పడిన తరువాత వెళ్ళి ఆయుధాలు తీసుకోవాలి. అదీ అతని ఆలోచన.

బాగా చీకటి పడిన తరువాత కళ్ళు తెరిచాడు చంద్రం. లేచి నెమ్మదిగా పొలాల మధ్య నడిచాడు. అప్పటికే లాడ్జికి ఎటు వెళ్ళాలో అంచనా వెయ్యటంవల్ల పెద్ద యిబ్బంది అనిపించలేదు చుట్టూ తిరిగి లాడ్జికి వెనుకప్రక్కకి చేరాడు. ఆ ప్రదేశాన్ని జాగ్రత్తగా పరీక్షించాడు. ఎక్కడా అలికిడి లేదు. గోడ ప్రక్క నేలమీద చూసుకుంటూ నడిచాడు. ఒక చోట చిన్న రాయి కనిపించింది. పదిహేను రోజుల క్రితం గుర్తుకోసం వుంచిన చిన్న రాయి అది.

రాయి తీసి గొయ్యి తవ్వటం ప్రారంభించాడు. కావాల్సినంత లోతు త్రవ్వాడు. తరువాత మరికొంచెం త్రవ్వాడు. లేచి మరికొంత దూరం నేలని పరీక్షించాడు. ఎక్కడా రాయి కనిపించలేదు. మరోసారి గొయ్యిలో చెయ్యి పెట్టి మట్టి తీశాడు.

అక్కడ దాచిన ఆయుధాలు లేవు.

# 13

సబ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ పోలీస్ డిపార్ట్‌మెంట్లో చేరి రెండు సంవత్సరాలే అయింది. పోలీస్ డిపార్ట్‌మెంట్లో చేరాలనే ఆసక్తి లేని అతనికి అనుకోకుండా ఆ వుద్యోగం వచ్చింది. కష్టపడి పనిచేసే తత్వం అతనిది. మిగతావాళ్ళ సంగతి ఎలా వున్నా తన పనిని నిజాయితీగా పూర్చి చెయ్యటానికి ప్రయత్నిస్తాడు. చాలామంది పై అధికార్లకి అతను అంటే గిట్టదు. దానికి కారణం ముక్కుసూటిగా పోవడం.

అతని దగ్గిరకి వచ్చిన ఏ కేసూ అతనికి అపజయాన్ని తెచ్చిపెట్టలేదు. తన వంతు పనిని చాలా ఖచ్చితంగా పూర్తి చేస్తాడు. సాధారణంగా పై అధికార్లు అతనికి మొండి కేసులు అప్పగిస్తూవుంటారు. ప్రతి పనిని పూర్తి చెయ్యగలననే ఆత్మవిశ్వాసంతో పూర్తి చేస్తాడు. అందుకే అతను అపజయం ఎరుగడు. అందుకే అతని పేరు చెబితే డిపార్ట్‌మెంట్లోనే చాలామంది జడుస్తారు.

ఆ సబ్ ఇన్‌స్పెక్టర్‌కే డాక్టర్ జీవన్ ప్రకాష్ ఫోన్ చేసింది.

చంద్రం డాక్టర్‌ని చంపి వెళ్ళిపోయిన తరువాత వార్డ్‌బాయ్ కొంతసేపు చూసి డాక్టర్‌తో ఇంటర్‌కమ్‌లో మాట్లాడటానికి ప్రయత్నించాడు. లోపలి నుండి జవాబు రాలేదు. సతీష్ డోరు తెరచి లోపలికి ప్రవేశించాడు. అక్కడ జీవన్ ప్రకాష్ శవం కనిపించింది. డాక్టర్ శరీరం ముట్టుకుని చూశాడు. వేడిగా వుంది. వెంటనే స్టేషన్‌కి ఫోన్‌చేసి విషయం చెప్పాడు. అప్పుడే టేబుల్ మీదున్న చీటీ కనిపించింది. దానిమీద పేరు, వయసు వ్రాసి వుంది. వాటిని డైరీలో వ్రాసుకున్నాడు.

అక్కడనుండి చకచకా పరిశోధన ముందుకు సాగింది. మధ్యాహ్నానికి రైల్వే స్టేషన్‌లో కొన్ని వివరాలు తెలిశాయి. స్టాండ్‌కి వచ్చిన మోటార్ సైకిల్ నిముషం గడవకముందే మరో వ్యక్తి వచ్చి తీసుకుపోవడంతో స్టాండ్ కుర్రవాడు దాని నెంబరు వ్రాసి పెట్టుకున్నాడు. సతీష్‌కి అది దొరికింది. ఆ మోటార్ సైకిల్ ఎక్కడిదో తెలుసుకుని, చంద్రానికి సహాయపడిన వ్యక్తిని పట్టుకున్నాడు. అతని ద్వారా మరికొన్ని వివరాలు తెలిశాయి.

డాక్టర్ ఇంట్లో వెంకట్రావ్ దగ్గిర నుండి వచ్చిన ఉత్తరాలు దొరికాయి. వెంటనే వెంకట్రావ్‌ని కలుసుకోవటానికి వెళ్ళాడు. వెంకట్రావ్‌తో మాట్లాడిన తరువాత హంతకుడు అప్పుడే వచ్చి వెళ్ళాడని తెలుసుకున్నాడు. అతన్ని అనుసరించటానికి మరో నాలుగు గంటల వరకూ బస్ లేదని తెలిసింది. వెంకట్రావ్‌వల్ల మొత్తం కేసు యొక్క స్వరూపం అర్థమయింది సతీష్‌కి. చంద్రానికి చూపించిన ఉత్తరం సతీష్‌కి కూడా చూపించాడు వెంకట్రావ్.

ఆ ఉత్తరాన్ని హెడ్ పోస్టాఫీస్‌కి తీసుకువెళ్ళాడు. వాళ్ళు ఒకరోజు కష్టపడి ఉత్తరం పోస్టు చెయ్యబడ్డ ఊరు కనుక్కున్నారు. తరువాత డిపార్ట్‌మెంట్‌కి తనకి తెలిసిన సమాచారం పంపించాడు సతీష్. అతను కన్నాపురం బయలుదేరాడు. చంద్రమనే వ్యక్తి నాలుగు రోజుల క్రితం రూమ్ ఖాళీచేసి వెళ్ళిపోయాడని లాడ్జిలో తెలిసింది. లాడ్జి కుర్రవాడిని జాగ్రత్తగా ప్రశ్నించిన మీదట చీకటి పడిన తరువాత చంద్రం లాడ్జి వెనక్కి వెళ్ళటం గురించి చెప్పాడు. సతీష్ లాడ్జి వెనక్కి వెళ్ళి అక్కడ పరిశీలించాడు. ఒక చోట గొయ్యి తీసినట్టు మట్టి కనిపించింది. దానిమీద ఒక రాయి వుంది. చురుకైన సతీష్ బుర్రకి అక్కడ ఏదో వుందనే ఆలోచన వచ్చింది. రాయి తీసి అక్కడ మట్టి త్రవ్వాడు. అందులో రివాల్వర్, కత్తి కనిపించాయి.

ఊళ్ళో ఎంక్వయిరీచేసి చంద్రం గెడ్డపల్లి జాన్‌తో కలసి వెళ్ళాడని తెలుసుకున్నాడు. వెంటనే తను కూడా ప్రయాణమయ్యాడు. కాని అతనికి లారీ దొరకలేదు. దానికోసం ఒకరోజు ఆగవలసివచ్చింది. మరునాడు మధ్యాహ్నం గెడ్డపల్లి చేరాడు.

జాన్‌ని కలుసుకున్నాడు సతీష్. అతనితో పాటు గెడ్డపల్లి వచ్చిన వ్యక్తి గురించి ప్రశ్నించాడు. ఎన్ని రకాలుగా ప్రశ్నించినా చంద్రం గురించి జాన్ చెప్పలేదు. అక్కడే రెండు రోజులు వుండిపోయి చంద్రాన్ని నక్సలైట్లు తీసుకెళ్ళినట్టు తెలుసుకున్నాడు. ఆపైన ఏం చెయ్యాలో తోచలేదు. చంద్రం తన లక్ష్యాన్ని చేరుకున్న విధానం సతీష్‌కి ఆశ్చర్యం కలిగించింది. జీవితంలో మొదటిసారి అనిపించింది తను అతన్ని పట్టుకోగలనా అని. తిరిగి కన్నాపురం వచ్చి లాడ్జిలో ఇద్దరు కానిస్టేబుల్స్‌ని వుంచే ఏర్పాటుచేశాడు.

కేసు గురించి రిపోర్ట్ తయారుచేసి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ముందు వుంచాడు.

సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మూడు రోజుల తరువాత సతీష్‌ని పిలిచి కేసు గురించి అడిగి తెలుసుకున్నాడు. చివరలో సతీష్ తన మనసులోని ఆలోచన బయటపెట్టాడు.

దానికి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అంగీకరించలేదు.

పోలీస్ డిపార్ట్‌మెంట్లో ఎంతటి తెలివిగలవాడైనా అతను సబార్డినేట్ అయితే అతను తన పై అధికారికి తప్పనిసరిగా తల వంచాల్సివుంటుంది. పై అధికారి ఉత్తర్వులు అమలుపరచాల్సివుంటుంది. ఆ నిర్ణయం తప్పని తెలిసి కూడా తప్పనిసరిగా దాన్ని ఆచరణలో పెట్టాలి. అధికారంవల్ల తెలివితేటలు వస్తాయనుకునే డిపార్ట్‌మెంట్స్‌లో పోలీస్ డిపార్ట్‌మెంట్ మొదటిది.

ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచంలో తనకి ఎదురు లేదన్న నమ్మకం పాతుకుపోయివుంటుంది. అధికారి ఏది కోరినా క్షణాలమీద అందించబడుతుంది. గుడికెళ్ళినా దైవదర్శనం ఉచితంగానే జరుగుతుంది. దేవుడికి కొట్టే కొబ్బరికాయ కూడా ఉచితంగా

వచ్చిందనే వాస్తవం అధికార్లకే తెలియదు. తెలిసినా తప్పుగా భావించరు వాళ్ళు. అధికారికి ఏర్పాటు చెయ్యబడిన ఫోన్ నుండి పది కాల్స్ చెయ్యబడితే అందులో తొమ్మది పర్సనల్ పనులకు వుద్దేశించినవే!

నిజానికి సతీష్ తన పద్ధతి ప్రకారం ముందుకు సాగితే చంద్రాన్ని పట్టుకోవడానికి అవకాశాలు లభించేవి. కాని ఎటువంటి పరిస్థితిలోను తన అధికారికి రిపోర్టు ఇచ్చి ఆయన అనుమతితో పని చెయ్యాలి. కనుక వెనక్కి తిరిగివచ్చాడు. యస్.పి. ని కలుసుకునే ప్రయత్నంలో సమయం వృధా కావడమే కాకుండా అధికారి సూచన్ల ప్రకారం పని చెయ్యాల్సివచ్చింది.

అది డిపార్ట్‌మెంట్‌లో గొప్ప అవలక్షణం!

అప్పటికప్పుడు వాతావరణం చంద్రానికి అనుకూలంగా మారిపోయింది!

# 14

విదేశాలకి వెళ్ళాలంటే అమెరికన్ డాలర్లు కావాలి. కలకత్తా నగరంలో డాలర్లు ఎటువంటి శ్రమ లేకుండా దొరుకుతాయి. ఒక బిజినెస్‌మాన్ అమెరికన్ డాలర్లు అమ్ముతాడు. అతను బొంబాయి వంటి ముఖ్య నగరాలతో వ్యాపార సంబంధాలు కలిగి వున్నాడు. విదేశాల నుండి దొంగతనంగా వచ్చే డాలర్లను కొంటాడు. విదేశాలకి వెళ్ళేవారికి కొంత కమీషన్ తీసుకుని అమ్ముతాడు. ఇది చాలా తేలిగ్గా కనిపిస్తున్నా ఎంతో రహస్యంగా నడపాల్సిన వ్యాపారం.

అతని ఏజంట్లు విదేశాల నుండి వచ్చే వారికోసం గాలం వేస్తూవుంటారు. వారి వద్దనుండి డాలర్లు కొనేందుకు విశ్వప్రయత్నాలు చేస్తూవుంటారు. విదేశాల నుండి వచ్చేవారు జాగ్రత్తగా దాచి తెచ్చిన డాలర్లలో అధిక శాతం అతని వద్దకే చేరుతుంటాయి. విదేశాలకి వెళ్ళే వారికి మన దేశం చట్టబద్ధంగా ఇచ్చే విదేశీ మారకద్రవ్యం సరిపోకపోవడంవల్ల, వాళ్ళు అక్కడి నుండి స్మగుల్డ్ వస్తువులు తెచ్చుకోవాలంటే వేరే మార్గం లేక అతని వద్దనుండి డాలర్లు కొంటారు. ఈ డాలర్‌లు ఎక్కడ దొరుకుతాయో ఏ ట్రావెలింగ్ ఏజంటుని అడిగినా చెబుతాడు.

ఖరీదైన ఫర్నిచరు, స్మగుల్డ్ వస్తువులు, టెలిఫోన్, టెలివిజన్ వంటి అన్ని హంగులతో వున్న ప్రత్యేకమైన ఆఫీస్ గదిలో కూర్చుని వున్నాడా బిజినెస్‌మాన్. అతని సంపాదన నెలకి లక్ష రూపాయల నుండి మూడు లక్షల వరకూ వుంటుంది. ఆ బిజినెస్‌మాన్ పేరు కుమార్ నారాయణ్.

తలుపు తెరిచి ప్రవేశించి బాస్ ముందు టెలిగ్రామ్ వుంచి చేతులు కట్టుకుని నిబడ్డాడు సెక్రటరీ.

అతను బాస్‌కి బాడీగార్డ్ కూడా! ఈ మధ్యకాలంలోనే అతన్ని నియమించాడు కుమార్ నారాయణ్. అతను హత్యలు చేస్తాడు. గాలిలో ఎగురుతున్న విమానాన్ని పేల్చివేయగలడు. అతనికి కావాల్సింది డబ్బు. అనధికార లెక్కల ప్రకారం అతను ఇంతవరకు సుమారు పది హత్యలు చేసాడు. కొన్ని గంటల్లో ఒక వ్యక్తిని గుర్తులు లేకుండా మాయం చెయ్యగలడు. బర్త్ సర్టిఫికెట్ కూడా దొరక్కుండా! అతనికి నెలకు ఐదు వేల రూపాయలు జీతం. నెల రోజుల క్రితం కుమార్ నారాయణ్‌కి జాగ్రత్తగా వుండమని హెచ్చరిక రావటంతో అప్పుడప్పుడూ కిరాయికి ఉపయోగించుకునే అతన్ని సెక్రటరీగా పెట్టుకున్నాడు.

కుమార్ నారాయణ్ చట్టబద్ధంగా రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేస్తున్నాడు. దాని ముసుగులో డాలర్ల వ్యాపారం సాగుతోంది. ప్లాట్‌ఫామ్ మీద దర్శనమిచ్చే రెడీమేడ్ దుస్తులు అతని షాపునుండే వస్తాయి. ఆంధ్రాలోని చాలామంది వ్యాపారులు అతని వద్దనుండే రెగ్యులర్‌గా సరుకు పట్టుకెళుతూ వుంటారు.

సెక్రటరీ టేబుల్‌మీద పెట్టిన టెలిగ్రామ్ చదివాడు.

ఫాదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియెట్లీ.

వెంకట నారాయణ్.

మరోసారి చదివి తారీఖు చూసాడు. నిన్న ఇవ్వబడిందా టెలిగ్రామ్ తమ్ముడు స్వగ్రామం నుంచి ఇచ్చాడు. అలా ప్రతీదీ క్షుణ్ణంగా పరిశీలించటం వ్యాపారపరంగా అతనికి వచ్చిన అలవాటు.

"ఈవినింగ్ ఈస్ట్ కోస్ట్‌కి ఫస్ట్ క్లాస్ టిక్కెట్ బుక్‌చెయ్యి..." చెప్పాడు సెక్రటరీ కమ్ బాడీగార్డ్‌తో.

సెక్రటరీ తల వూపాడు.

ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్...

టేబుల్ మీదున్న ఫోన్ మ్రోగింది. సెక్రటరీ వంగి అందుకుని "హల్లో!" అన్నాడు.

కుమార్ నారాయణ్ కాగితాలు చూసుకుంటున్నాడు.

"కుమార్ నారాయణ్ కావాలి" అటునుంచి వినిపించింది హిందీలో.

"మీరెవరు?"

"నీలాంటి కిరాయి మనుషులకి వివరాలు అనవసరం."

ఆ ఫోన్‌కి మామూలు వ్యక్తులు రింగ్ చెయ్యరు. అటువంటి వాళ్ళకోసం రెడీమేడ్ షాపులో ఫోన్ వుంది. చాలా ముఖ్యమైన వ్యక్తులు మాత్రమే రింగు చేసే ఫోన్ అది. ముందు సెక్రటరీ రిసీవ్ చేసుకుంటాడు ఫోన్.

"మీరెవరో చెప్పండి..." విసురుగా అన్నాడు.

అప్పుడు చూసాడు కుమార్ నారాయణ్ తల యెత్తి. కళ్ళతో సైగచేసి ఫోన్ అందుకున్నాడు.

"నమస్తే కుమార్ నారాయణ్" వినిపించింది. బహుశా ఫోన్ చేతులు మారటం అవతల వ్యక్తి పసిగట్టి వుండాలి.

"నమస్తే! ముందు పరిచయం చేసుకోవటం సంస్కారవంతుల లక్షణం."

"బాగున్నారా? పది సంవత్సరాలు దాటింది నిన్ను చూసి..."

కుమార్ నారాయణ్ మాటలు అవతల వ్యక్తి పట్టించుకున్నట్లు లేదు.

"పది సంవత్సరాలా? నీ పేరు?" అడిగాడు ఆశ్చర్యంగా.

"దారిలో ఎన్నో చీమలు మన కాళ్ళ క్రింద నలిగిపోతుంటాయ్. వాటికి పేర్లు ఉంటాయా? ఒక్కటిమాత్రం నిజం. నీకోసం పెరిగిన మృత్యువుని."

"సంతోషం. నీతో సరదాగా మాట్లాడే టైమ్ లేదు."

"తేలిగ్గా తీసుకుంటే నీ ఖర్మ. ఈ రాత్రికే నిన్ను చంపుతాను..."

"ఒక్కసారి ఇక్కడికి రాకూడదూ" అన్నాడు బాడీగార్డ్ వంక చూసి.

"ముందు అలాగే అనుకున్నాను. నీ దగ్గరికి వచ్చి నీ బాడీగార్డ్ సంగతి చూసి నిన్ను చంపాలని. కాని మిస్టర్ కుమార్ నారాయణ్ సులువుగా చంపే అవకాశం వదులుకుని కావాలని ఎందుకు కష్టపడటం. పైగా నీ బాడీగార్డ్‌మీద నాకు శతృత్వం లేదు."

"అంటే నన్ను చూసి భయపడుతున్నావన్నమాట!"

"అలా అనుకోవటం తప్పు. ప్రాణాలకి తెగిస్తే చెయ్యలేని పనంటూ లేదు ప్రపంచంలో. ఈరోజు రాత్రికి నువ్వు ఎక్కడున్నా చంపుతాను."

"అంత నమ్మకం వున్నవాడివి నీ వివరాలు చెప్పవేం?"

"నీ స్నేహితులు ఇద్దరు చచ్చారు. నీవు ఈరోజు చావబోతున్నావ్. సుమారు పదకొండు సంవత్సరాల క్రితం ఒక ఘోరం చేసావ్. అప్పుడే త్రాచుని తట్టి లేపావ్. ఆరోజు నీవల్ల మగతనం పోగొట్టుకున్న కుర్రవాడు ఈరోజు నిన్ను ఛాలెంజ్ చేస్తున్నాడు ప్రాణాలు తీస్తానని."

కళ్ళ ముందు పదకొండు సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన లీలగా కదిలింది. ఒక్కసారి అతని గుండెలు జలదరించాయి. ఇప్పటికి ఇద్దర్ని చంపానని చెబుతున్నాడు. అది నిజమైనా కాకపోయినా తను మాత్రం జాగ్రత్తగా ఉండాలి.

"నీలాంటి నపుంసకుడు సవాల్ విసురుతుంటే భయపడడానికి నేను అనామకుడ్ని కాను. నీకోసం ఎదురుచూస్తుంటాను" చెప్పి ఫోన్ పెట్టేశాడు.

అతని నమ్మకం అతనిది. అఫీస్ రూమ్‌లో ఉన్నంతవరకూ తనని ఏమీ చెయ్యలేడు. తనని చంపాలనుకుంటే తప్పనిసరిగా ఇంటికి వస్తాడు. ఇంటి వద్ద బాడీగార్డ్ వుంటాడు. వచ్చేవాడి సంగతి అతను చూసుకుంటాడు. ఈరోజు తను ఎలాగూ ఊరు వెళుతున్నాడు. తను వెళుతున్నట్టు ఎవరికీ తెలియదు. తనకోసమంటూ వస్తే వాడికి చావు ఖాయం. ఆ ఊహకి పెదవుల మీద సన్నపాటి చిరునవ్వు కదలాడింది.

◆ ◆ ◆

హౌరా రైల్వే స్టేషన్ నుంచి ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. అది సికింద్రాబాద్ వరకూ వెళ్ళే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్. కలకత్తా నుండి హైదరాబాద్ వెళ్ళాలనుకొనే ప్రయాణీకులకి అనుకూలమైన ట్రైన్. మామూలు ఎక్స్‌ప్రెస్ ఆగే చాలా స్టేషన్లలో అది ఆగదు.

ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్లో వున్నాడు కుమార్ నారాయణ్. బ్రీఫ్‌కేస్ మాత్రమే వెంట ఉంది. భోజనంచేసి బయలుదేరాడు. ఆ ప్రయాణం చెయ్యటం అతనికి అంత ఇష్టంగా లేదు. తండ్రి పరిస్థితి సీరియస్‌గా ఉండటంవల్ల వెళ్ళక తప్పటంలేదు. పెద్ద పెద్ద నగరాలకి వెళ్ళాలంటే విమానంలో ప్రయాణంచేస్తాడు. కాని తన స్వంత ఊరు వెళ్ళటానికి అటువంటి సౌకర్యం లేదు. తప్పనిసరిగా ట్రైన్‌లో

ప్రయాణం చెయ్యాలి. ఉదయం పది గంటల వరకూ సమయాన్ని ఏదో విధంగా గడపాలి.

బ్రీఫ్‌కేస్ తెరచి కొన్ని కాగితాలు బయటకి తీసాడు. వాటిని చూడటం ప్రారంభించాడు. ప్రతి నిమిషాన్ని తనకి అనుకూలంగా మల్చుకోవటం తండ్రి దగ్గరనుండి నేర్చుకున్నాడు. ఇప్పుడు తండ్రికి చాలా విషయాలు నేర్పే స్థితిలో వున్నాడు. అందుకే రెండు చేతులా సంపాదిస్తున్నాడు. తనకు కావాల్సింది పొందటంకోసం ఏం చెయ్యటానికైనా వెనుదియ్యడు. అతని జీవితంలో అతనికి ఎదురైన వాళ్ళంతా తలలు వంచిన వాళ్ళే. అలా వంచకపోతే తల తీసి లొంగదీసుకుంటాడు.

అతని ఆలోచనలు తన వ్యాపారం చుట్టూ తిరుగుతున్నాయి. తనకి వచ్చిన ఫోన్ గురించి ఎప్పుడో మర్చిపోయాడు. బాడీగార్డ్‌ని ఇంటివద్ద వుంచిన తరువాత దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని అతని ఉద్దేశ్యం. వ్యర్థమైన విషయాలకి సమయం వెచ్చించటం అలవాటు లేదు. కాగితాలు బ్రీఫ్‌కేస్‌లో పడేసి పడుకున్నాడు. పదిహేను నిముషాలకి నిద్రలోకి జారుకున్నాడు. మరో ఐదు నిముషాలకి గుర్రుపెట్టడం ప్రారంభించాడు.

నిజమైన సమసమాజవాదిలా ట్రైన్ దూసుకుపోతోంది చీకట్లని చీల్చుకుంటూ ముందుకి. తనతో ఎవరు ప్రయాణం చేసినా దానికి అవసరం లేదు. రాజకీయ నాయకులు, సగటు మనుషులు, ఉద్యోగస్తులు, స్మగ్లర్‌లు ప్రయాణం చేసినా!

ఒక హంతకుడు ప్రయాణం చేసినా కూడా!

నిద్ర నుండి మెలుకువ వచ్చింది కుమార్ నారాయణ్‌కి. బాత్‌రూమ్‌కి వెళ్ళాలి. అందుకే మెలుకువ వచ్చింది, అనుకుంటూ లేచి కాబిన్ నుండి బయటికి వచ్చాడు. ఎక్కడా అలికిడి వినిపించటం లేదు. ట్రైన్ నడుస్తున్న శబ్దం తప్ప. కంపార్ట్‌మెంట్ చివరికి వచ్చి లావెట్రీ తలపు తెరచి లోపలికి అడుగుపెట్టి తలుపు మూసి బోల్ట్‌మీద చెయ్యివేసాడు.

భళ్ళున శబ్దంచేస్తూ విసురుగా తెరుచుకుంది తలుపు. ఎవరో వ్యక్తి దౌర్జన్యంగా లోపలికి ప్రవేశించాడు. అతను ఎవరు అనేది పట్టించుకోలేదు కుమార్ నారాయణ్. బలవంతంగా ప్రవేశించాడంటే హాని చెయ్యటానికే!

మెరుపులా కత్తి తీసి బలంగా పొడిచాడు. అతను పొడుస్తున్నట్టు కాస్త ఆలస్యంగా గుర్తించాడు చంద్రం. కదలటానికి వీలుకాని ఇరుకైన ప్రదేశం. కత్తికి తన ఎడమచెయ్యి అడ్డుగా ఉంచాడు. చేతిలో సగానికి పైగా దిగిపోయింది. రక్తం పైకి చిమ్మింది.

చంద్రం పళ్ళ బిగువున బాధ భరిస్తూ చెయ్యిని వెనక్కి లాక్కుంటూ కుడిచెయ్యి పిడికిలి బిగించి కొట్టాడు కణతమీద. ఆ దెబ్బలోని వేగానికి మరోప్రక్క లావెట్రీ గోడకు గుద్దుకున్నాడు కుమార్ నారాయణ్. అదే వేగంతో మరో దెబ్బ పడింది. ఆ చెయ్యి ఆగలేదు. అందిన చోటల్లా దెబ్బలు పడ్డాయి. ఎడమచేతి నుండి విపరీతంగా రక్తం కారుతోంది. దాన్ని లెక్కచెయ్యలేదు చంద్రం.

క్రింద స్పృహతప్పి పడిపోయాడు కుమార్ నారాయణ్. అతని కత్తి ఎప్పుడో జారిపోయింది. ముందు కుమార్ నారాయణ్ చేతులు విరచి కట్టేసాడు చంద్రం. అతని పాకెట్లు తడిమాడు. బాక్ పాకెట్‌లో రివాల్వర్ కనిపించింది. దాన్ని తీసుకుని ఫాంట్ జేబులో పడేసుకున్నాడు.

అతన్ని అలాగే వదిలి లావెట్రీ గోడకి ఆనుకుని కాసేపు విశ్రాంతి తీసుకున్నాడు. లావెట్రీ లోపలి భాగాన్ని కళ్ళతో పరిశీలించాడు. క్షణాల్లో ఏం చెయ్యాలో నిర్ణయించుకున్నాడు. కుమార్ నారాయణ్‌ని అతి కష్టంమీద తీసి వెస్టన్ లావెట్రీ మీద కూర్చోబెట్టాడు. నడుముకి చుట్టుకున్న తాడు తీసి ఒక కొసతో కట్టేశాడు. రెండు కొసని పంపు గొట్టం నుంచి తీసి లాగటం ప్రారంభించాడు. కుమార్ నారాయణ్ శరీరం తల్లక్రిందులుగా పైకి లేచింది. షర్టు క్రిందకి దిగి పొట్ట పైకి కనిపిస్తోంది. ఒకసారి సరిచూసుకుని తిరిగి క్రిందకి దించేశాడు.

కాళ్ళకి కట్టిన కొస విప్పి మోకాళ్ళ వద్ద ముడివేశాడు. తిరిగి పంపు గొట్టానికి తగిలించి లాగాడు. అలా లాగటానికి అతడు చాలా కష్టపడుతున్నాడు. ఒక చెయ్యి పూర్తిగా సహకరించడంలేదు. ఒక చేత్తో తాడుని లాగుతున్నాడు కాలుని గోడకి తన్నిపెట్టి. లావెట్రీ మూత తెరిచాడు. కుమార్ నారాయణ్ తలని లావెట్రీకి తిన్నగా పట్టుకుని తాడుని వదిలాడు. నెమ్మదిగా క్రిందకి దిగింది శరీరం. తల మొత్తం వెస్టన్ లావెట్రీలోకి వెళ్ళిపోయింది. అప్పుడు తాడు ముడివేశాడు.

క్రింద పడిన కత్తి అందుకుని కుమార్ నారాయణ్ చేతుల్ని పరీక్షించాడు. కత్తితో గాయంచేసి రెండు నరాల్ని కట్ చేశాడు. చప్పున రక్తం బయటికి వచ్చింది. కత్తి క్రింద పడేసి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. మొత్తం కార్యక్రమం పూర్తికావటానికి అరగంట పట్టింది. బట్టలు మొత్తం చమటతో తడిసిపోయాయి. పంపు నొక్కి నీళ్ళతో గాయపడిన చెయ్యి కడుక్కుని, దానికి ఖర్చీఫ్ చుడుతూ కుమార్ నారాయణ్ వంక చూశాడు. చేతుల నుండి కారుతున్న రక్తం వెన్నుమీదుగా పాకి మెడమీద నుండి జుట్టు తడుస్తోంది.

లెక్కప్రకారం వలలో పడ్డాడు కుమార్ నారాయణ్.

కుమార్ నారాయణ్ వంటి వ్యక్తిని అతని స్థావరానికి వెళ్ళి చంపటం కష్టంతో కూడిన పని. అందుకే కుమార్ నారాయణ్ ఊరు నుండి అతనికి టెలిగ్రాం వచ్చే ఏర్పాటు చేశాడు. టెలిగ్రాం వచ్చిన వెంటనే పథకం ప్రకారం ఫోన్‌చేశాడు చంద్రం. చంద్రంకోసం ఇంటివద్ద బాడీగార్డ్‌ని కాపలా వుంచి, తండ్రిని చూడటానికి బయలుదేరాడు కుమార్ నారాయణ్.

తనని చంపాలనుకుంటున్న వ్యక్తి ముందుగా ఫస్ట్ క్లాస్ టిక్కెట్ బుక్‌చేసి తన మనిషికి అమ్ముతాడని ఊహించటానికి కుమార్

నారాయణ్‌కి అవకాశం లేదు.

ట్రైన్ వేగంలో మార్పు రావటం గుర్తించాడు చంద్రం.

కుమార్ నారాయణ్ శరీరం కదులుతోంది ఊపిరి అందక. చంద్రం తలుపు తెరిచి తల బయటపెట్టి చూశాడు. నిర్మానుష్యంగా వుంది. బయటికి వచ్చి తలుపుకి గుమ్మానికి మధ్యలో సన్నటి ప్లాస్టిక్ ముక్కలు పెట్టి గట్టిగా లాగాడు "టక్" మని మూసుకుంది. తలుపు తోసి చూశాడు. గట్టిగా వుంది బిగుసుకుపోయి. తోసి రాకపోతే రెండవ లావెట్రీకి వెళతారు ప్రయాణికులు. జేబులోంచి చాక్‌పీస్ తీసి "క్లోజ్డ్" అని ఇంగ్లీషులో తలుపుమీద వ్రాశాడు.

ట్రైన్ ఆగింది. కంపార్ట్‌మెంట్లోని సి.సి.ఎ. రెండవవైపు కూర్చుని నిద్రపోవటం చంద్రానికి తెలుసు. తలుపు తెరుచుకుని ప్లాట్‌ఫాంమీద కాలు మోపాడు. చకచకా నడిచి ఒక సిమెంట్ బెంచీమీద కూర్చున్నాడు. కొద్ది నిముషాలలో ట్రైన్ కదిలి వెళ్ళిపోయింది. అప్పుడు చూశాడు స్టేషన్ బోర్డ్.

పలాస.

అంతవరకూ బనియన్‌లో దాచిన డైరీ బయటకు తీసి, లైటు వెలుగులో పేజీలు తిరగేశాడు. ఒకచోట వ్రాసివున్నది చదివాడు.

K.S. లోహియా – V.S.P. – 65718.

# 15

V.S.P. – 65718.

ఊరు పేరు వ్రాయాల్సిన చోట V.S.P. అనే పొడి అక్షరాలు వున్నాయి. ఫోన్ నెంబర్ వ్రాసే కాలమ్‌లో 65718 నెంబరు వుంది. ముందు V.S.P. అంటే ఏ ఊరో తెలుసుకోవాలి. డాక్టర్ తనకి అర్థమయ్యేటట్టు వ్రాసుకున్నాడు. ఇప్పుడు తను ఎలా తెలుసుకోవడం? ఆలోచిస్తున్నాడు. అది అతని ప్రత్యేకత. సమస్యల్ని ఒక్కసారిగా పరిష్కరించటానికి ప్రయత్నించకుండా, ఒక్కొక్కటి సాధించుకురావటం. ఒక పని చేసేటప్పుడు మరో పని గురించి ఆలోచించకపోవడం.

స్టేషన్ బయట టీ కొట్టు వద్ద కూర్చుని ఆలోచిస్తున్నాడు. అతని మెదడు ఆలోచించటానికి సహకరించటంలేదు. నిద్ర లేకపోవడంవల్ల కళ్ళు మండుతున్నాయి. స్నానం చెయ్యకపోవడంవల్ల ఒళ్ళు చిరాగ్గా వుంది. ముందు ఎక్కడన్నా నిద్రపోవాలి. తరువాత తీరిగ్గా ఆలోచించవచ్చు అనుకుంటూ లేచి నడిచాడు. ఒకచోట అతనికి లాడ్జి కనిపించింది. అది హోటలు కూడానూ. అప్పుడే దానిని తెరిచేసారు.

లోపలికి ప్రవేశించాడు చంద్రం.

"రూమ్ కావాలి" అడిగాడు కౌంటర్ ముందు కూర్చున్న అతనిని.

చంద్రం వంక ఎగాదిగా చూసాడు. రూమ్‌కోసం వచ్చిన మనిషి చేతిలో కనీసం సంచి కూడా లేదు. గెడ్డం పెరిగి, బట్టలు నలిగిపోయి వున్నాయి. ఎడమచేతికి కట్టు వుంది. దానిమీద రక్తం మరకలు కనిపిస్తున్నాయి.

"మూడొందలు అడ్వాన్స్ కట్టాలి. రోజుకి పాతిక రూపాయలు సింగిల్ రూమ్" చెప్పాడు నిర్లక్ష్యంగా. మామూలుగా తీసుకునే అడ్వాన్స్‌కి నాలుగు రెట్లు ఎక్కువ చెప్పాడు. మొదటి చూపులోనే చంద్రంమీద సదభిప్రాయం కలుగలేదు. అసలు రూమ్ ఇవ్వటం ఇష్టంలేదు. వస్తున్న డబ్బుని పోగొట్టుకొనడమూ ఇష్టంలేదు. ఖచ్చితంగా నిర్ణయించుకోలేక అలా అన్నాడు.

చంద్రం మాట్లాడకుండా ఐదు వందల నోట్లు తీసి కౌంటర్‌మీద పెట్టాడు. కౌంటరులోని వ్యక్తితో వాదించే ఓపిక లేదు. బాగా బడలికగా వుంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. దానికితోడు రక్తం బాగా కారిపోవడంవల్ల నీరసంగా వుంది. చెయ్యి నొప్పితో సలుపుతోంది.

"మీ పేరు!" అడిగాడు కౌంటర్ వ్యక్తి.

"చంద్రరావ్."

"వృత్తి?"

"వ్యాపారం."

తను వ్రాయడం పూర్తిచేసి రిజిష్టర్ చంద్రం ముందుకి తోసి సంతకం తీసుకున్నాడు. రూమ్ తాళాలు తీసుకుని మేడమీదకు నడిచాడు చంద్రం. రూమ్ నెంబర్ చూసి తాళం తీసి గదిలోకి ప్రవేశించి తిరిగి తలుపు మూశాడు. బాత్‌రూమ్‌లోకి ప్రవేశించి పంపు తిప్పి, చేతికి కట్టిన ఖర్చీఫ్ విప్పి గాయాన్ని శుభ్రంగా కడిగాడు. అదే ఖర్చీఫ్ పిండి చేతికి చుట్టుకుని వచ్చి పడుకున్నాడు. క్షణాల్లో నిద్ర పట్టేసింది. మూడు రోజుల నుండి శరీరానికి విశ్రాంతి లేదు.

ఆ సమయానికి...

◆ ◆ ◆

ట్రైన్ విజయనగరం స్టేషన్ దాటి వాల్తేరు వైపు దూసుకుపోతోంది.

సి.సి.ఎ.

క్యారేజ్ కోచ్ ఎటెండర్.

ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోని ప్రయాణీకుల అవసరాలు చూడడంకోసం నియమించబడ్డ నాలుగవ తరగతి రైల్వే ఉద్యోగి క్యారేజ్ కోచ్ ఎటెండర్. అతను ఒక చివర కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. అతనికి ఆరోజు నీర్సంగా వుంది. అందుచేత కూర్చున్న చోటునుండి లేచి తిరగడంలేదు. ఏదైనా స్టేషన్‌లో రిజర్వేషన్ ప్రయాణీకులు ఎక్కితే వాళ్ళకి బెర్త్ చూపించి వచ్చి కూర్చుంటున్నాడు.

అతను సెన్సిటివ్ కావడంవల్ల జీవితంలో బాధపడిన సంఘటనలు చాలా ఎక్కువగా వున్నాయి. బయట విషయాలు ఎలా వున్నా ఇంట్లో భార్యవల్ల వారానికి నాలుగు సార్లయినా బాధపడే సందర్భాలు ఎదురవుతాయి. అతను ఎంత సెన్సిటివ్ అంటే దారిలో చచ్చి పడివున్న కుక్క కళేబరాన్ని, ఒక్క పైసా కూడా లేని ముష్టివాడి చేతిలోని పాత్రని చూసినపుడు కూడా బాధపడిపోతాడు. అంతేకాదు. అటువంటి సంఘటనలు చాలా కాలం గుర్తుండిపోతాయి. అవి గుర్తొచ్చినప్పుడల్లా మనసు వికలమైపోతుంది.

ఉద్యోగరీత్యా నాలుగవ తరగతి ఉద్యోగస్తుడు కావడంవల్ల అతనికి అదనపు ఆదాయం వుండదు. పూర్తిగా జీతంమీద ఆధారపడి బ్రతకాలి. రైల్వేలో ఉద్యోగస్తుడయిన టి.టి.ఇ. ఒకసారి డ్యూటీకి బయలుదేరి తిరిగి ఇంటికి వచ్చేసరికి కనీసం రెండు వందల రూపాయలు సంపాదిస్తాడు. రూపాయికి కేటాయించాల్సిన సీటు ఐదు రూపాయలు, పన్నెండు రూపాయల బెర్త్ ఇరవై రూపాయలు, కంపార్ట్‌మెంట్లో సీటింగ్ కెపాసిటీకి మించి ఎక్కిన ప్రయాణీకులకు రసీదు యివ్వకుండా డబ్బు వసూలుచెయ్యటం, లగేజీతో వెళుతున్న ప్రయాణీకుల వద్ద డబ్బు తీసుకోవడం వంటి పనుల ద్వారా అతనికి ఆదాయం చేకూరుతుంది.

పేరుకి ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ ఎటెండర్ అయినా పైసా ఆదాయం ఉండదు. సి.సి.ఎ.కి దిగిపోతున్న ప్రయాణీకులు దయదలచి కాఫీ త్రాగమని అప్పుడప్పుడూ డబ్బులు యిస్తూవుంటారు. అదికూడా ఎప్పుడో జరుగుతుంది. అలా ఎవరయినా తనకి యివ్వడానికి ప్రయత్నిస్తే అతను తిరస్కరిస్తారు. ప్రయాణీకుడు ఎంతో బలవంతపెడితేతప్ప తీసుకోడు. అతనికి అదనపు ఆదాయం లేకపోవడమనే విషయం అతనిమీద ఏమాత్రం ప్రభావం చూపించకపోయినా, అతని భార్య మాత్రం అదో చేతకానితనంగా భావిస్తుంది.

అతనికి ఒక స్నేహితుడు టి.టి.ఇ. వున్నాడు. అతని భార్య కాలక్షేపంగా అతని యింటికి వచ్చి కబుర్లు చెబుతుంది. తన భర్త డ్యూటీ నుండి తిరిగొచ్చేటప్పుడు ఎంత డబ్బు యింటికి పట్టుకొచ్చాడో లెక్కలతోసహా చెప్పడమే కాకుండా ఏయే నోట్లు ఎన్ని పట్టుకొచ్చాడో ఆ డబ్బు ఏం చెయ్యాలనుకుంటున్నారో పూసగుచ్చినట్టు చెబుతుంది. ఆరోజు భర్తమీద విరుచుకుపడుతుంది. సి.సి.ఎ. భార్య!

"పిల్లలకి తినడానికేమయినా తెచ్చావా? నాకు కట్టుకోవడానికి చీరెలు కొంటున్నావా? ఎప్పుడయినా ఒక్క నగ చేయించావా? ఊరికి వుపకారంలా కడుపుకి కాస్త తిండి పెడుతున్నావ్. నీలాంటి వాడితో కాపురం చేసేకంటే పిల్లల్ని తీసుకుపోయి అడుక్కుని బ్రతకడం మంచిది..."

ఆ మాటలు అతని గుండెల్లో శూలాల మాదిరి దిగబడతాయి. తనకి వచ్చే ప్రతి పైసా యింటికోసం వినియోగిస్తూ వుంటాడు. హోటల్‌కి వెళ్ళి టిఫిన్ కూడా తినడు ఖర్చు చెయ్యడం ఇష్టంలేక. ఆమె మాటలకి అతను రెచ్చిపోతాడు. బూతులు తిడతాడు, బాగా కోపం వచ్చినప్పుడు. అంతకంటే పై స్థాయికి వెళ్ళినప్పుడు నిర్లిప్తంగా వూరుకుంటాడు మాట్లాడకుండా. సంపాదిస్తున్నదానితో గంజి త్రాగినా తృప్తిపడే మనిషి అతను. పది సంవత్సరాలుగా కాపురంచేసినా భార్య తనని అర్థం చేసుకోలేదని బాధపడతాడు.

అది పూర్తిగా తప్పు!

భర్త గురించి ఆమెకి క్షుణ్ణంగా తెలుసు. అతని బలహీనత కనుక్కుని ఏ విధంగా మాట్లాడితే బాధపడతాడో ఆ విధంగా మాట్లాడుతుంది. తనకి కలిగిన బాధకి తనని తనే శిక్షించుకుంటున్న భావంతో తిండి తినడం మానేస్తాడు. చివరికి ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు తిరిగి అన్నం తింటాడు. అందుకే ముప్పై ఐదు సంవత్సరాల వయసులో కండరాలు కరిగిపోయి, గడ్డం నెరిసిపోయి, నెత్తిమీద జుట్టు వూడిపోయి హఠాత్తుగా యాభై సంవత్సరాల వయసు మీద పడినట్టు కనిపిస్తాడు.

అతనికి బాగా ఆశ్చర్యం కలిగే విషయం ఏమిటంటే, అతను అన్నం తినడం మానేస్తే అతని భార్య తినమని బ్రతిమాలుతుంది. అతనిమీద గొప్ప ప్రేమ వున్నట్టు మాట్లాడుతుంది. అది ఆమెకి ఒక ఆట. అతను మాత్రం గిలగిలా కొట్టుకుంటాడు ఆమె మాటలు మనసులో సుడులుతిరిగి ఆమె బాధపెట్టడం, అతను బాధపడిపోవటం వాళ్ళ జీవితాల్లో తప్పనిసరి పనిలా మారిపోయింది. ముందురోజు అటువంటి సంఘటన జరిగి అతను భోజనం మానేశాడు. అందుకే నీర్సంగా కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

జరిగిన ఆలస్యం కవర్ చెయ్యాలనే ప్రయత్నంతో వేగంగా వెళుతున్న ట్రైన్ సిగ్నల్ యివ్వని కారణంగా స్లో అయింది. ఆ కుదుపుకి ఎటెండర్ తల కంపార్ట్‌మెంట్ గోడకి గుద్దుకుంది. నెమ్మదిగా కళ్ళు తెరిచి తిన్నగా కూర్చున్నాడు అతను. కాళ్ళు తిమ్మిరి

ఎక్కినట్టు అనిపించింది.

లేచి అడుగులు జాగ్రత్తగా వేసుకుంటూ బాత్‌రూమ్ వైపు నడిచాడు.

బాత్‌రూమ్‌లో ప్రవేశిస్తూ ఎదురుగా రెండవ బాత్‌రూమ్ మీద వ్రాసివున్న "క్లోజ్‌డ్" అనే అక్షరాలు చదివాడు. బహుశా బాత్‌రూమ్ చెడిపోయి వుంటుంది. మనసులో అనుకుంటూ లోపలికి ప్రవేశించాడు. తలుపు మూసి వెనక్కి తిరిగిన పది సెకన్లకి అతని బుర్ర పనిచేసింది. అతను ఖరగ్‌పూర్‌లో డ్యూటీ ఎక్కాడు. అప్పుడోసారి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ఆ సమయంలో అక్షరాలు బాత్‌రూమ్ మీద వ్రాసి లేవు. మధ్య స్టేషన్స్‌లో రైల్వే సిబ్బంది వ్రాసే అవకాశం లేదు. ఒకవేళ వ్రాస్తే అతనికి తప్పనిసరిగా తెలుస్తుంది.

మరి దానిమీద అక్షరాలు ఎలా వచ్చాయ్?

ఆలోచిస్తూ బాత్‌రూమ్ నుండి బయటికి వచ్చాడు. తలుపు వంక క్రింది నుండి పైకి పరీక్షగా చూసాడు. ప్రత్యేకత ఏమీ కనిపించలేదు. బోల్ట్ తప్పించి తలుపు త్రోసి చూసాడు బిగుసుకుపోయి వుండి తెరుచుకోలేదు. మరోమారు నిశితంగా పరిశీలించాడు. అప్పుడు కనిపించాయి సందుల్లో పెట్టివున్న ప్లాస్టిక్ ముక్కలు. ఎవరో కావాలని తలుపు రాకుండా చేసివుంటారనే అనుమానం మనసులో ప్రవేశించింది. మరోమారు బలంగా త్రోసి చూశాడు అయినా రాలేదు.

కొద్దిగా వెనక్కి వెళ్ళి భుజంతో తలుపుని గుద్దాడు.

అప్పటికి ట్రైన్ వాల్తేర్‌కి యిరవై కిలోమీటర్ల దూరంలో వుంది.

భళ్ళున తెరుచుకుంది తలుపు. ఆ శబ్దానికి వులిక్కిపడ్డాడు అతను. విసురుగా లోపలికి వెళ్ళి ముందుకి వచ్చింది తలుపు. ఆ ఖాళీ నుంచి తలక్రిందులుగా వేలాడుతున్న మనిషి కనిపించాడు. ఆ మనిషి తల పూర్తిగా లావెట్రి హోల్‌లోకి వెళ్ళిపోయి మొండెం మాత్రం కనిపిస్తోంది. ఒక్క క్షణం ఎటెండర్ గుండె కొట్టుకోవడం మానేసింది. ఊపిరి పీల్చడం మర్చిపోయి బొమ్మలా వుండిపోయాడు. కొన్ని క్షణాల తరువాత అతనిలో చలనం వచ్చింది. ఒక్క గంతులో లోపలికి ప్రవేశించాడు. చేతులనుండి కారిన రక్తంతో షర్టు తడిసి భయంకరంగా కనిపిస్తోంది. తల్లక్రిందులుగా వ్రేలాడుతున్న శరీరం వణుకుతున్న చేత్తో ముట్టుకుని చూసాడు. వెచ్చగానే వుంది.

కాని ప్రాణం పోయింది.

ఇప్పుడేం చెయ్యాలి?

ఆలోచించాడు. పావుగంటలో ట్రైన్ వాల్తేర్ స్టేషన్ చేరుతుంది. ఈలోపు చెయిల్ లాగి ట్రైన్ ఆపినందువల్ల ఒరిగే ప్రయోజనం ఏమీ లేదు. మనసులో అనుకుంటూ బయటికి వచ్చాడు. తిరిగి తలుపు మామూలుగా మూసి వచ్చి తన సీటులో కూర్చున్నాడు. అతనికి తెలియకుండానే శరీరం భయంతో వణుకుతోంది.

ఇరవై నిమిషాల తరువాత ట్రైన్ వాల్తేర్ స్టేషన్‌లో ఆగింది. అప్పటికి యింకా పూర్తిగా తెల్లవారలేదు. ఎటెండర్ వెళ్ళి రైల్వే పోలీసులకి విషయం చెప్పాడు. హెడ్ కానిస్టేబుల్ ఒక కానిస్టేబుల్‌ని వెంట తీసుకుని కంపార్ట్‌మెంట్లోకి ప్రవేశించాడు. గేదెలు కాసేవాడి చేతిలో వుండే కర్రముక్కల్లాంటి వెదురుకర్రలు వాళ్ళ చేతుల్లో వున్నాయి. హెడ్ కానిస్టేబుల్ సీరియస్‌గా తల పంకిస్తూ బాత్‌రూమ్‌ని పరీక్షించాడు. ఆ సమయంలో ఆఫీసర్లు సాధారణంగా స్టేషన్స్‌లో వుండరు. స్టేషన్ బాధ్యత హెడ్ కానిస్టేబుల్‌కి అప్పగించబడుతుంది. అందుచేత తనో ఆఫీసర్ మాదిరి ఫీలవుతూ పరీక్షిస్తున్నాడు. అతనికి ఎంతవరకూ అర్థమయిందో తెలియదు కాని అతనితో వచ్చిన కానిస్టేబుల్ మాత్రం దిక్కులు చూస్తున్నాడు. తనమీద అధికారి వున్నప్పుడు సబార్డినేట్ వాటి గురించి పట్టించుకోడు. ఒకవేళ పట్టించుకున్నా అతని అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటే డిపార్ట్‌మెంట్ పరువు పోయినట్టుగా బాధపడతాడు. అటువంటి ప్రమాదం కలిగే పనిచేసే ఉద్దేశ్యం తనకి ఎంతమాత్రం లేనట్టు సదరు కానిస్టేబుల్ ఒకసారి శవం వంక చూసి తల తిప్పుకున్నాడు.

హెడ్ కానిస్టేబుల్ తను పరీక్షించడం పూర్తిచేసిన పిదప ఇన్‌స్పెక్టర్‌గారికి కబురు చెయ్యాలనే నిర్ణయం తీసుకున్నాడు. ముందు చేసినా వెనక చేసినా చివరికి చెయ్యాల్సింది అదే. ముందే ఇన్‌స్పెక్టర్‌గారికి కబురుచేసివుంటే సబార్టినేట్స్‌కి తన పట్ల తేలికభావం ఏర్పడుతుందేమోనని భయం!

ఇన్‌స్పెక్టర్ రాత్రి బాగా పొద్దుపోయేవరకూ పార్టీలో గడిపి ఆలస్యంగా యింటికి తిరిగొచ్చాడు. అందుకని అరగంట పట్టింది నిద్రలేపి వార్త చెప్పడానికి. విషయం తెలుసుకుని వార్త తెచ్చిన మనిషిని పంపించేసి లోపలికి వెళ్ళాడు. ఇన్‌స్పెక్టర్ నిండుగా దుప్పటి కప్పుకుని పడుకున్న భార్యవైపోసారి చూసి బాత్‌రూమ్ వైపు వెళ్ళబోతూ ఏదో ఆలోచన వచ్చినట్టు వెనక్కి తిరిగాడు. మంచం దగ్గరికి వచ్చి మంచం ఎక్కాడు. తను కూడా దుప్పటిలోకి దూరిపోయి భార్యని వెనకనుంచి గట్టిగా కౌగలించుకున్నాడు.

చచ్చిపోయిన మనిషి ఎలానూ తిరిగిరాడు. ఒక గంట ఆలస్యంగా వెళ్ళినా అడిగేవాళ్ళు లేరు. ఒకవేళ అడిగినా సర్దిచెప్పుకోవచ్చు. అటువంటి పరిస్థితిలో దుప్పటి క్రింద నగ్నంగా వున్న భార్య దేహాన్ని వదిలిపెట్టి వెంటనే వెళ్ళిపోవడానికి అతనేం పిచ్చివాడు కాదు!

సరిగ్గా ఏడుగంటల ప్రాంతంలో ఇన్‌స్పెక్టర్ వచ్చి హత్య జరిగిన స్థలాన్ని సందర్శించాడు. అప్పటికి ఆ కంపార్ట్‌మెంట్‌ని ట్రైన్ నుండి తప్పించి ఒకప్రక్క ఆపి వుంచారు. డాక్టర్‌కి, ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌ఫర్ట్‌కి ఫోన్ చేసాడు ఇన్‌స్పెక్టర్. రిజర్వేషన్ ఛార్ట్ తీసుకుని

దానిద్వారా కంపార్ట్‌మెంట్లో ఎంతమంది ప్రయాణంచేస్తున్నారో కనుక్కున్నాడు. మొత్తం పదిహేను మంది ప్రయాణీకులు వున్నారు. వాల్తేర్ స్టేషన్ వచ్చేసరికి అందులో ముగ్గురు లేరు. వాళ్ళు ప్రయాణంచేసిన బెర్త్‌లు పరీక్షిస్తే ఒక బ్రీఫ్‌కేస్ దొరికింది. ఆ బెర్త్‌మీద కుమార్ నారాయణ్ అనే వ్యక్తి ప్రయాణం చేస్తున్నాడు. బ్రీఫ్‌కేస్‌లో కుమార్ నారాయణ్ ఎడ్రస్సు వుంది. శవం జేబులో వెదికితే పర్సు దొరికింది. అందులో కూడా కుమార్ నారాయణ్ ఎడ్రసు వుంది. కనుక చనిపోయిన వ్యక్తి కుమార్ నారాయణ్‌గా గుర్తించబడింది. వెంటనే హత్య వార్త ఉన్నతాధికారులకు తెలియపర్చబడింది.

డాక్టర్, ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్ వచ్చారు. డాక్టర్ శవాన్ని పరీక్షించి రాత్రి రెండూ మూడు మధ్య ప్రాణం పోయి వుంటుందని చెప్పాడు. నాలుగైదు కోణాల్లో హత్యాస్థలం ఫోటో తియ్యబడింది. ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్ వేలిముద్రలు సంపాదించడానికి ప్రయత్నించాడు. కొన్ని వందల వేలిముద్రలు అలక్కుపోయి వున్నాయి. వాటిని సేకరించడం సాధ్యం కాలేదు. శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కి పంపించాలనుకుంటున్న సమయంలో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, హైదరాబాదు వారినుండి ఫోన్ వచ్చింది. తను ఉన్నతాధికారులకి చెప్పిన హత్యవార్త ఎంత వేగంగా హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్‌కి చేరిపోయాయో ఫోన్‌లో మాట్లాడిన తరువాత తెలిసి ఆశ్చర్యపోయాడు ఇన్‌స్పెక్టర్.

కుమార్ నారాయణ్ హత్య కేసు ఒక ఆఫీసర్‌కి అప్పగించమని ఆ ఫోన్‌లో ఆర్డర్స్ యివ్వబడ్డాయి.

అతను సబ్ ఇన్‌స్పెక్టర్ సతీష్!

అప్పుడు ఉదయం పదయింది సమయం.

చంద్రంకోసం వలపన్ని ఎదురుచూస్తున్న సతీష్ మధ్యాహ్నం ఒంటి గంటకల్లా వాల్తేర్ రైల్వే స్టేషన్‌కి పిలిపించబడ్డాడు. అతనికోసం శవాన్ని కదల్చకుండా కంపార్ట్‌మెంట్లో వుంచేశారు. కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి వావెట్రీని పరీక్షించాడు సతీష్. శవాన్ని చూసి అతను ఆశ్చర్యపోయాడు. ఆ కాస్త ప్రదేశాన్ని హంతకుడు ఉపయోగించుకున్న విధానం తిలకించి అతనికి మతిపోయింది.

సతీష్ ఆలస్యం చెయ్యకుండా శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కి పంపించి స్టేషన్‌లోకి వచ్చాడు. బ్రీఫ్‌కేస్‌ని పరీక్షించి చూశాడు. రిజర్వేషన్ ఛార్ట్ అడిగి తీసుకున్నాడు. ఎటెండర్‌ని పిలిచి కొన్ని ప్రశ్నలువేశాడు.

అదంతా చాలా ఓర్పుగా చూస్తున్నాడు స్టేషన్ ఇన్‌స్పెక్టర్. సుపీరియర్ ఆఫీసర్ చెప్పాడు కనుక తనకంటే చిన్న అధికారయిన సబ్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కి సహకరిస్తున్నాడు. కాని మామూలు సమయంలో అయితే అతన్ని పట్టించుకునేవాడు కాదు.

సతీష్ మాత్రం తన పనిలో పూర్తిగా లీనమైపోయాడు. తనకి అప్పగించిన బాధ్యతని సక్రమంగా పూర్తి చెయ్యాలనే సిద్ధాంతం అతనిది. తన ముందున్న రిజర్వేషన్ ఛార్టుని పరీక్షగా చూశాడు సతీష్. అందులో వున్న పదిహేను పేర్లలో కుమార్ నారాయణ్‌ది రెండవది. కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం ప్రారంభించిన ప్రయాణికుల్లో ముగ్గురు లేరు. ఒకతని రిజర్వేషన్ విజయనగరం వరకే కావడంతో అతను అక్కడ దిగిపోయి వుంటాడు. వాళ్ళిద్దరిలో చనిపోయిన వ్యక్తి పేరు కుమార్ నారాయణ్. మూడో వ్యక్తి పేరు జాన్సన్. కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేస్తున్నవారిని ప్రశ్నించి వాళ్ళ వివరాలు ఇన్‌స్పెక్టర్ వ్రాసుకున్నాడు. అందులో జాన్సన్ లేడు.

అంటే జాన్సన్ కాని ఆ పేరుమీద ప్రయాణం చేసిన వ్యక్తి కాని కుమార్ నారాయణ్‌ని చంపి వుండాలి. విజయనగరంలో దిగిపోయిన ప్రయాణికుడికి కూడా హత్య చెయ్యడానికి అవకాశం వుంది. అయితే విజయనగరంలో దిగిన ప్రయాణికుడు అక్కడ పెద్ద వ్యాపారస్తుడు. ప్రస్తుతం అతన్ని అత్యవసరంగా కలవాల్సిన పనిలేదు. ముందు జాన్సన్ అనేవాడిని పట్టుకుంటే చాలావరకు కేసు తేలిపోతుంది.

చంద్రం మారుపేరుతో ప్రయాణంచేసి కుమార్ నారాయణ్‌ని చంపి వుంటాడని సతీష్ వూహించాడు. వెంకట్రావ్‌వల్ల చాలా విషయాలు తెలుసుకుని వుండటంతో ఆ హత్య గురించి వూహించడం కష్టం కాలేదతనికి. కలకత్తా వంటి మహా నగరంలో నివసిస్తున్న కుమార్ నారాయణ్ లాంటి వ్యాపారస్తుడ్ని చంపటం చంద్రానికి అసాధ్యం అనే నమ్మకంతో అతన్ని ఒకేసారి హెచ్చరించి వూరుకున్నాడు.

సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యీ కేసులో కల్పించుకుని చంద్రాన్ని పట్టుకోవడానికి సలహా యివ్వకుండావుంటే చంద్రాన్ని సతీష్ పట్టుకుని వుండేవాడు. ఒకేచోట కదలకుండా మాటువేసి వుండటంతో చంద్రం తన పనిని నిరాటంకంగా పూర్తిచేశాడు.

చంద్రం తన పని పూర్తిచేసిన వెంటనే ట్రైన్ దిగిపోయి వుంటాడు. ఎక్కడ దిగి వుంటాడు? రెండు మూడు గంటల మధ్య ప్రాణం పోయి వుంటుందని డాక్టర్ చెప్పాడు. ఆ సమయంలో ట్రైన్ పలాస స్టేషన్‌కి శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌కి మధ్యలో వుంది. అంటే పలాస స్టేషన్ దాటిన తరువాత కుమార్ నారాయణ్ ప్రాణం పోయివుంటుంది. కుమార్ నారాయణ్ ప్రాణం పోవడానికి ముందు దానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలి కనుక పలాస స్టేషన్‌కి ముందే ప్రయత్నాలు ప్రారంభించి వుండాలి. అంటే హంతకుడు తొంభై శాతం పలాస స్టేషన్‌లో దిగడానికి అవకాశం వుంది. తప్పితే శ్రీకాకుళం రోడ్ దిగి వుండాలి.

మందుగా శ్రీకాకుళం రోడ్ వెళ్ళి అక్కడ నుంచి పలాస వెళ్ళాలి.

సతీష్ తన పర్సు నుంచి చిన్న ఫోటో తీసి దానిని ఎన్‌లార్జ్‌కి పంపించాడు. ఉన్ని కృష్ణన్ తనతోపాటు చంద్రాన్ని ఒక సంబరానికి తీసుకెళ్ళి అక్కడ తీయించిన ఫోటో అది. డాక్టర్ జీవన్ ప్రకాష్ హత్య జరిగిన తరువాత చంద్రం వుపయోగించిన మోటార్ సైకిల్‌ని

తీసుకెళ్ళిన వ్యక్తిని పట్టుకుని, అతని ద్వారా చంద్రం అడ్రసు సంపాదించి ఆ యిల్లు వెతికినప్పుడు సతీష్‌కి దొరికింది అది. అయితే చిన్నతనంలో తీసింది కనుక పెద్దగా వుపయోగపడదనే వుద్దేశ్యంతో దానిని తన దగ్గిరే వుంచుకున్నాడు.

ఇప్పుడు దాని ద్వారానే చంద్రాన్ని పట్టుకోవాలి.

ఎన్‌లార్జ్ చెయ్యబడిన ఫోటో సతీష్ చేతికి వచ్చింది. ఆ ఫోటోలో వున్న ముసలివాడు తనని చూసి నవ్వుతున్నట్టుగా కనిపించాడు సతీష్‌కి. ఆ ప్రక్కనే వున్న కుర్రవాడు మాత్రం నిర్వికారంగా చూస్తున్నాడు జీవితాన్ని వడబోసిన మనిషిలా!

ఆ ఫోటో పట్టుకుని చంద్రాన్ని వెతకటానికి సతీష్‌కి తీరికలేదు. వలపన్ని వుంచిన చోటు వదిలిపెట్టి వచ్చాడు. నిజానికి ఇప్పుడే అతను మరింత జాగ్రత్తగా వుండాలి. గుహ నుండి బయటకి వచ్చిన పులి సంచరిస్తోంది. తన ఆహారం సంపాదించుకోకుండా అది తిరిగి గుహలోకి ప్రవేశించదు. ఇప్పుడే దానిని పట్టుకోవాలి. అందుకని చంద్రం దిగి వుంటాడని ఊహించని ఊళ్ళల్లోని పోలీస్ స్టేషన్స్‌కి వెళ్ళి అక్కడ స్టాఫ్‌కి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి వాళ్ళని చంద్రాన్ని పట్టుకోవడానికి పంపించాలని అతని ఆలోచన. అక్కడి వ్యవహారం ఇన్‌స్పెక్టర్‌కి వదిలి అక్కడి నుంచి బయలుదేరాడు.

ఎప్పటికయినా చంద్రం తను పన్నిన వ్యూహంలో చిక్కుకుంటాడనే నమ్మకం వున్నా!

అప్పుడు సాయంకాలం నాలుగు గంటలయింది సమయం.

◆ ◆ ◆

సాయంకాలం నాలుగు గంటలకి మెలుకువ వచ్చింది. రూమ్‌బాయ్‌ని పిలిచి టవల్, సోపు తెప్పించుకున్నాడు. స్నానం చెయ్యటం పూర్తిచేసి మళ్ళీ అవే బట్టలు తొడుక్కుని బయటకి వచ్చాడు. తిన్నగా నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళి గాయాన్ని డాక్టర్‌కి చూపించాడు. గాయానికి కట్టుకట్టి రెండు ఇంజక్షన్లు చేసి, టాబ్లెట్స్ వ్రాసి ఇచ్చాడు. డాక్టర్ మెడికల్ షాపులో మందులు కొనుక్కుని లాడ్జికి వచ్చాడు. కాఫీ త్రాగి సిగరెట్ వెలిగించి బాల్కనీలో నిలుచుని చూస్తున్నాడు.

ఎదురుగా బస్ స్టాండ్ కనిపిస్తోంది. జనంతో హడావిడిగా వుందక్కడ. బస్‌స్టాండ్ చుట్టూ చెక్కలతో కట్టిన షాపులు వున్నాయి. బస్‌స్టాండ్‌లో బస్సులు ఆగి వున్నాయి. చంద్రం దృష్టికి అక్కడే ఏదో తేడా వున్నట్టు కనిపించింది. కాని అది స్పష్టంగా బుర్రకి తట్టడం లేదు. అరగంటసేపు చూసినా ఆ తేడా గుర్తించలేకపోయాడు.

ఇంతలో ఒక ఆర్.టి.సి. బస్ రావటం కనిపించింది. అది స్టాండ్‌లోకి వెళ్ళి నిలబడింది. అప్పుడు కనుక్కున్నాడు ఆ తేడా. ప్రభుత్వంవారు జాతీయం చెయ్యనందువల్ల అక్కడ అన్నీ ప్రైవేటు బస్సులే వున్నాయి. ఆర్.టి.సి. బస్సులు చూడటానికి అలవాటుపడిన తన కళ్ళకి ఏదో తేడా వున్నట్టు కనిపించిందని గ్రహించాడు.

బస్‌స్టాండ్ నుండి ఆర్.టి.సి. బస్ తిరిగి బయలుదేరి రోడ్డుమీదకి వచ్చింది. చంద్రం కుతూహలంగా ఊరు బోర్డు చూడటానికి ప్రయత్నించాడు. రంగు వూడిపోవడంవల్ల ఊరు పేరు కనిపించలేదు. బస్సు దాటి వెళ్ళిపోతున్నపుడు వెనకప్రక్క చూసాడు. అక్కడ అసలు బోర్డే లేదు. కాని టాప్‌కి దగ్గరలో నల్లటి అక్షరాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి.

V. S. P.

చంద్రం వేగంగా మేడ దిగి బస్‌స్టాండ్‌కి వచ్చాడు. బస్‌స్టాండ్‌లోని ఎంక్వయిరీ కౌంటర్‌లో అడిగాడు. అది కూడా ప్రైవేట్ కౌంటర్.

“ఇప్పుడు వచ్చిన ఆర్.టి.సి. బస్ ఎక్కడికి వెళుతున్నది?”

“ఇచ్ఛాపురం”

“ఎక్కడ నుండి వచ్చింది?”

“విశాఖపట్టణం”

“ఏ డిపోది?”

“విశాఖపట్టణం” చెప్పి చంద్రం మొహం వంక చిరాగ్గా చూశాడు. నాకు సంబంధం లేకపోయినా నీ ప్రశ్నలకి సమాధానం చెప్పాను. ఇంకా నన్ను వదలవా అన్నట్టు.

ఏ.పి.యస్.ఆర్.టి.సి. వారి బస్సులమీద డిపోకి చెందిన పేరు ప్రతి బస్సుమీద వ్రాసి వుంటుంది. V. S. P. అంటే విశాఖపట్టణమా? పది సంవత్సరాలు అక్కడ వున్నా తనకా విషయం తెలియదు. చాలామందికి వూరు పేరుకు బదులు పొడి అక్షరాలు వుపయోగించటం తెలియదు. ఆ విధానం డాక్టర్ జీవన్ ప్రకాష్‌కి తెలిసివుండాలి. ఆలోచిస్తూ లాడ్జివైపు నడుస్తున్నాడు.

అతనికి ఎదురుగా ఒక ముసలమ్మ నడుచుకుని వస్తోంది. ఆమెకి అరవై సంవత్సరాలకి మించి వుంటుంది వయసు. ఒంటిమీద ఎక్కడా కండ కనిపించటంలేదు. ఎముకలకి చర్మం అంటుకుపోయి వ్రేలాడుతోంది. నడుము కొద్దిగా వంగి వుంది. తలమీద గంప

పెట్టుకుని వస్తోంది. అడుగులు చాలా కష్టంగా పడుతున్నాయి. కాసేపట్లో క్రింద పడిపోయేటట్టు కనిపిస్తోంది. చంద్రం అడుగులు వేయటం మర్చిపోయి ఆమె వంకే చూస్తున్నాడు.

ఒకటి... రెండు... మూడు అడుగులు వేసింది. ఆ తరువాత నెమ్మదిగా క్రిందకు ఒరిగింది. చటుక్కున పట్టుకున్నాడు క్రింద పడకుండా చంద్రం. ఆమెని జాగ్రత్తగా నడిపించుకుంటూ తీసుకెళ్ళి బెంచిమీద కూర్చోబెట్టాడు.

కిళ్ళీకొట్టు దగ్గరికి వెళ్ళి షోడా పట్టుకొచ్చాడు. ఆమె మొహంమీద కొంత జల్లి, మిగతాది త్రాగించాడు.

"అంత వయస్సు వచ్చిన తరువాత బ్రతక్కూడదు. అటువంటివాళ్ళు చస్తే దేశ జనాభా తగ్గుతుంది."

తల తిప్పి కంటి చివర్ల నుండి చూసాడు చంద్రం. పదడుగుల దూరంలో యిద్దరు యువకులు నిలబడి వున్నారు. వాళ్ళ వేషాలు ఆధునికంగా వున్నాయి. ఒక యువకుడు మరొక యువకునితో అన్నడా మాటలు.

"ప్రభుత్వమే అటువంటి వాళ్ళని కాల్చిపడేయాలి" రెండో యువకుడు అన్నాడు.

"అప్పుడుగాని మన ప్రయోజనాలు పెరగవు..."

ఆ సంభాషణ చంద్రం చెవులను తాకుతూనేవుంది. షోడా త్రాగేసరికి ముసలమ్మ తేరుకుంది. చంద్రం వంక కృతజ్ఞతతో చూసింది. తన తట్ట ఎక్కడ వుందో చూసి దాన్ని తీసుకుని బస్సువైపు సాగిపోయింది.

చంద్రం ఆ యువకుల ప్రక్కకి చేరాడు. అప్పుడు వాళ్ళ సంభాషణ రిజీజయిన క్రొత్త సినిమా గురించి సాగుతోంది. అది వాళ్ళ అభిమాన నటుడు నటించినదట. అది తప్పకుండా బాగుంటుందనీ, కనీసం వంద రోజులయినా ఆడుతుందనే నమ్మకంతో వున్నారు. తల్లిదండ్రులను పీడించి తెచ్చిన డబ్బులు ఖర్చుపెడుతూ, సమాజం పట్ల ఏమాత్రం అవగాహన లేని వ్యర్థ నిరుద్యోగ యువకులు వాళ్ళు.

"పనీ పాటా లేకుండా తిరుగుతూ, సినిమాల వంటి బేవార్సు విషయాల గురించి ఆలోచిస్తూ సమాజానికి చీడపురుగుల్లా దాపురించిన మీలాంటి యువకులు చస్తే దేశం బాగుపడుతుంది. శరీరంలో ఓపిక లేకపోయినా పొట్టకోసం చచ్చేవరకూ కష్టపడేవాళ్ళని కాదు కాల్చి చంపాల్సింది... మిమ్మల్ని" అన్నాడు చంద్రం తాపీగా.

వాళ్ళిద్దరూ చంద్రం వంక తీక్షణంగా చూశారు, పెద్ద అవమానం జరిగిపోయినట్టు. వాళ్ళ కన్నీళ్ళకి అతనొక బికారిలా కనిపించాడు. కాళ్ళకి చెప్పులు కూడా లేకుండా!

"ఏం కూశావ్!" అంటూ ఒకడు చెయ్యి విసిరాడు. చంద్రం చెయ్యి దానిని గాలిలోనే ఆపింది. మరోసారి కొట్టడానికి ప్రయత్నించాడు. ఆ దెబ్బ తగలకుండా ప్రక్కకి కదిలాడు చంద్రం. ఈసారి యిద్దరూ చంద్రం మీద చెరో వైపునుండి దాడిచేశారు. కొద్దిసేపు వాళ్ళని ఆపాడు. ఆ హడావిడిలో చేతిగాయం రేగింది. ఆపైన సహనం చచ్చిపోయింది.

కుడికాలు ఎత్తి ఒకడ్ని గుండెలమీద తన్నాడు. రెండో అతని మొహంమీద చేత్తో చరిచాడు. జనం వింతగా చూస్తున్నారు ఆ కొట్లాట. ఆ యువకులకు అక్కడ నుండి పారిపోదామనే ఆలోచన వచ్చింది.

అప్పుడే పోలీస్ కానిస్టేబుల్ వాళ్ళని సమీపించాడు.

◆ ◆ ◆

రాత్రి పది గంటలు దాటింది సమయం.

పోలీస్ స్టేషన్ నిశ్శబ్దంగా వుంది. స్టేషన్ సెంట్రీ తుపాకి గోడకి ఆన్చి సిగరెట్ కాలుస్తున్నాడు. లాకప్ రూమ్‌లో చంద్రం తప్ప ఎవరూ లేరు. అతనితోపాటు స్టేషన్‌కి తీసుకురాబడ్డ యువకులు వెంటనే వెళ్ళిపోయారు. చంద్రాన్ని మాత్రం లాకప్ రూమ్‌లో పడేశారు.

పది రూపాయలతో ఇండియన్ పీనల్‌కోడ్ (భారతీయ శిక్షాస్మృతి) నుండి తప్పించుకోవడం తెలియక కాదు. ఎందుకో అతనికే తెలియదు. ఎదురు చెప్పకుండా వూరుకున్నాడు.

"సెంట్రీగారూ..." పిలిచాడు చంద్రం.

సెంట్రీ దగ్గిరకి వచ్చాడు. తుపాకి అక్కడే వుంది.

"మీరు ఎంతవరకూ డ్యూటీలో వుంటారు?" అడిగాడు.

"ఉదయం వరకు. ఏం?"

"తెల్లవార్లు మీరొక్కరే చేస్తారా?" అడిగాడు ఆశ్చర్యంగా.

"అవును."

"ఇప్పుడు స్టేషన్‌కి ఎవరూ రారా?"

"రారు."

"మీకు ఎంతమంది పిల్లలు సార్!"

"నలుగురు ఒక అమ్మాయికి పెళ్ళి చేశాను. మొన్ననే పండక్కి తీసుకువచ్చాను. అల్లుడు టూ-ఇన్-వన్ అడుగుతున్నాడు" చెప్పాడు. ఆమాత్రం సానుభూతితో తమ విషయాలు పట్టించుకునేవాళ్ళు వుండరు. తమ కష్టాల గురించి ఆలోచించేవాళ్ళు వుండరు. కష్టాల గురించి చెప్పుకోవటానికి మంచి మనసుతో మాట్లాడే మనిషి దొరకడు. వాళ్ళ వుద్యోగాలు అటువంటివి.

"మిగతావాళ్ళు చదువుకుంటున్నారా?"

"ఇద్దరు కుర్రాళ్ళు చదువుకుంటున్నారు. మరో అమ్మాయి పెళ్ళికి సిద్ధంగా వుంది"

"అబ్బ మీ సంసారం పెద్దది. ఎలా నెట్టుకొస్తున్నారండి బాబూ!"

నవ్వాడు సెంట్రీ. ఆ కాసేపు మాట్లాడటంవల్ల చంద్రంమీద సదభిప్రాయం ఏర్పడింది.

"మీకు కూడా కట్నాలు, కానుకలు తప్పవా?"

"మొన్ననే మెజిస్ట్రేట్‌గారు యాభై వేలు కట్నం యిచ్చి కూతురు పెళ్ళి చేశారు."

అతను చెప్పిన దాంట్లోనే సమాధానం వుంది. చెయ్యాల్సిన పనిమీద చిత్తశుద్ధి, నిజాయితీ లేకపోతే చట్టాలు ఎలా అమలుచెయ్యబడతాయి. దురాచారాలను ఎదుర్కోవలసినవాళ్ళే వాటికి వూడిగం చేస్తుంటే!

"మీరు చిన్న సాయం చెయ్యాలి సార్!"

"ఏమిటి?"

"కోపం తెచ్చుకోవద్దు ఒకసారి ఫోన్ చేస్తాను..."

కోపం ఎందుకు వస్తుంది? ప్రతివాళ్ళు తమమీద కోప్పడేవాళ్ళే. పాతిక రూపాయలు తీసుకుని యిద్దర్ని వదిలిపెట్టి మిగిలినవాడ్ని లాకప్ రూమ్‌లో పడేసిన స్టేషన్లో సానుభూతితో సహాయం చెయ్యటం తప్పు కాదనుకున్నాడు. స్టేషన్‌కి తీసుకొచ్చిన చాలామంది ఫోన్ వుపయోగించటం, విడుదల కావడం సర్వసాధారణం.

ఫోన్ తెచ్చి, "తొందరగా మాట్లాడు..." చెప్పాడు యధాస్థానానికి వెళ్ళిపోతూ.

చంద్రం రిసీవర్ తీసి నెంబరు చెప్పాడు. అటువైపు రిసీవర్ తీసిన శబ్దం విని చెప్పాడు.

"నేను రూమ్ నెంబర్ సిక్స్‌లో దిగిన కస్టమర్‌ని. అర్జంటు పనిమీద వూరు వెళుతున్నాను. పది రోజుల వరకు రాను. అంతవరకూ రూమ్ నా పేరమీదే వుంచండి."

సెంట్రీ ఫోన్ యధాస్థానంలో వుంచేశాడు.

వాళ్ళిద్దరూ కబుర్లలో పడ్డారు.

మరునాడు ఉదయం పది గంటలకు చంద్రాన్ని కోర్టులో హాజరుపర్చే నిమిత్తం స్టేషన్‌లోంచి బయటకి తీసుకెళుతున్నారు. వాళ్ళ కెదురుగా ఒక వ్యక్తి స్టేషన్‌లోకి వచ్చాడు. అతను లోపలికి వస్తూ యధాలాపంగా బయటకి తీసుకెళుతున్న చంద్రాన్ని చూశాడు. చంద్రం మాత్రం అతన్ని గమనించలేదు.

అతను సతీష్!

చంద్రాన్ని సతీష్ చూసికూడా గుర్తుపట్టలేదు. అంతవరకూ అతన్ని ఎప్పుడూ చూసివుండకపోవడంతో. అంతేకాకుండా మూడు నెలల నుండి నిర్విరామంగా తిరుగుతున్న చంద్రం గెడ్డం బాగా పెరిగి వుంది. మనిషి బాగా నలిగిపోయి, బట్టలు మాసిపోయి అతనొక బికారిలా వున్నాడు. సతీష్ దగ్గిర ఫోటో వున్నా అది చిన్నప్పటిది కావటంవల్ల ఏమాత్రం పోలిక దొరకలేదు. మరో ముఖ్య విషయం ఏమిటంటే, చంద్రం తిన్నగా పోలీసులకి దొరికి తనకి ఎదురవుతాడని ఎంతటి మేధావి అయినా వూహించలేడు. అందుకే వెంట్రుకవాసి తేడాలో చంద్రం దాటిపోయాడు.

స్టేషన్‌లో వున్న రైటర్‌కి తను ఎందుకు వచ్చాడో తెలియపర్చి ఏం చెయ్యాలో అతనికి యిన్‌స్ట్రక్షన్స్ యిచ్చాడు సతీష్. ముందుగా రైల్వే స్టేషన్‌లోను, స్టేషన్‌కి బయట వున్న టీ కొట్లలోను, లాడ్జీల్లోను, బస్‌స్టాండ్‌లోను వెతకమని చెప్పాడు. తెల్లవారుఝామున మూడు గంటలలోపు ట్రైన్ స్టేషన్‌కి వచ్చివుంటుంది. ఆ సమయంలో చంద్రం దిగితే చూసినవాళ్ళు అతన్ని తప్పనిసరిగా గుర్తుపెట్టుకుంటారని సతీష్ నమ్మకం.

తన తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు ఉపయోగించి చంద్రాన్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న సతీష్ ఒక విషయం విస్మరించాడు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరి తక్కువ కాలం అయినందువల్ల ఆ పొరబాటు జరిగింది.

డిపార్ట్‌మెంట్‌ని ఆమూలాగ్రం పరిశీలిస్తే, ఒక పని చెయ్యడం ద్వారా ఖచ్చితమైన ఫలితం సాధించాలనే పట్టుదలతో పని చెయ్యడం

కనిపించదు. అటువంటి వైఖరి పాతుకుపోవడానికి ఎన్నో కారణాలున్నాయి. వాటి గురించి చర్చించుకుంటూపోతే అదో గ్రంథమవుతుంది.

అదేరోజు ఆ జిల్లా పోలీస్ సూపరిన్‌టెండెంట్ మధ్యాహ్నం స్టేషన్ విజిట్‌కి వస్తూండటంతో సతీష్ ఎంతో శ్రద్ధ తీసుకుని అంత దూరం వచ్చి కేసు గురించి చెప్పి యిచ్చిన ఫోటో అతను వెళ్ళిన పది నిమిషాలకి రైటర్ సొరుగులోకి చేరింది. స్టేషన్ సర్దుతున్న హడావిడిలో చెత్తలో కలిసిపోయి, ఒక కానిస్టేబుల్‌చేత చెత్తతో పాటు కాల్చివేయబడింది. స్టేషన్ రైటర్ సతీష్ చెప్పిన విషయం వెంటనే మర్చిపోయాడు.

స్టేషన్ విజిట్‌కి యస్.పి. వస్తుంటే దానికోసం తయారుకావడం కంటే గొప్ప విషయం మరోటి వుండదు కదా!

# 16

వారం రోజుల తరువాత బయటికి వచ్చాడు చంద్రం. తిన్నగా లాడ్జికి వెళ్ళి రూమ్ తెరిచాడు. రివాల్వర్, డబ్బు దాచి వుంచిన చోటే వున్నాయి. బస్‌స్టాండ్‌కి వెళ్ళి టైమింగ్స్ కనుక్కుని వచ్చాడు. హోటల్లో అడిగి వారం రోజుల తాలూకు పేపర్లు తీసుకువచ్చాడు.

పేపర్లు చదవటం ప్రారంభించాడు కుమార్ నారాయణ్. హత్య జరిగిన రెండవ రోజు ఆ వార్త పేపరులో పడింది. కుమార్ నారాయణ్ వివరాలు ప్రచురింపబడ్డాయి. అందులో డాక్టర్ జీవన్ ప్రకాష్ హత్య కూడా ప్రస్తావించబడింది. సబ్ యిన్‌స్పెక్టర్ సతీష్ దర్యాప్తు చేస్తున్నట్టు, త్వరలోనే హంతకుడ్ని సతీష్ పట్టుకోగలడనే ఆశాభావాన్ని ఎడిటర్ వ్యక్తపరిచాడు.

తనకి రెండుసార్లు ఎదురయిన సబ్ యిన్‌స్పెక్టర్ తెలివైనవాడని చంద్రం గ్రహించాడు. తనని పట్టుకుంటాడనే నమ్మకం వెలిబుచ్చిన ఎడిటర్ సతీష్‌ని కలుసుకుని వుండాలి. మిగతా వివరాలు అతని కోరికమీదే వ్రాసి వుండరు. తనని అతను ఎలా పట్టుకుంటాడు? ఎప్పుడు ఎక్కడ తిరిగేది తెలియకుండా జాగ్రత్తపడుతూ వస్తున్నాడు. అటువంటప్పుడు పట్టుకోవటానికి ఎటువంటి అవకాశాలు వున్నాయ్? చివరి వ్యక్తిని చంపేవరకూ పట్టుబడే వుద్దేశ్యం లేదు. ఇంతవరకూ సాధించిన వాటికంటే యిప్పుడు సాధించాల్సింది చాలా కష్టంతో కూడి వుంది.

అతనికి తెలుసు కుమార్ నారాయణ్ హత్యలో చెలరేగిన హడావిడి వెంటనే సద్దుమణగటానికి వారం రోజులన్నా పడుతుందని, నేరం జరిగిన వెంటనే పోలీస్ డిపార్ట్‌మెంట్ ఎక్కడలేని జాగ్రత్తలూ తీసుకుంటుంది. ఆ జాగ్రత్తలన్నీ కొద్ది రోజులే మళ్ళీ నేరం జరిగే వరకూ మామూలే.

టిక్... టిక్... టిక్...

చటుక్కున మెలకువ వచ్చింది చంద్రానికి. వారం రోజులుగా సరియైన తిండి లేదు, నిద్ర లేదు. ఖైదీల జీవితం ఎంత దుర్భరంగా వుంటుందో చవిచూశాడు. జైల్లో వున్న దోమలు శరీరంలోని రక్తం సగానికి పైగా త్రాగేశాయి. ఉన్ని కృష్ణన్ బ్రతికున్న రోజుల్లో చాలా రాత్రి వరకూ మేలుకుని వుండి ప్రాక్టీస్ చేసేవాడు. మిగతా సమయంలో చాలావరకు ఆలోచనలు చోటుచేసుకునేవి. అందుచేత తక్కువ సమయం నిద్రపోయేవాడు.

ఉన్ని కృష్ణన్ ట్రైనింగ్‌లో వుండే గొప్పతనం మెదడుకి పదునుపెట్టడం. తను చూసిన వ్యక్తుల రూపాలు చంద్రానికి ఎప్పుడూ గుర్తుండేవి. అయితే వాళ్ళని పట్టుకోవడం కష్టమని ఏనాడూ అనుకోలేదు. ఆ విధమైన ఆత్మవిశ్వాసం వచ్చేసింది. అనుకోకుండా చమన్ లాల్ బ్యాగ్‌లో డాక్టర్ జీవన్ ప్రకాష్ వివరాలు లభించటంతో తేలికైన మార్గం దొరికింది. పదకొండు సంవత్సరాల తరువాత జీవన్ ప్రకాష్‌ని చంపిన రోజున హాయిగా నిద్రపోయాడు. జైలు నుండి వచ్చి శుభ్రంగా స్నానంచేసి కడుపునిండా తిని ఫ్యాన్ క్రింద పడుకుంటే చాలా కాలం తరువాత రాత్రి ఏడు గంటలకే నిద్ర పట్టేసింది. ఎవరో తలుపు కొట్టడంతో అంత నిద్ర నుండి కూడా మెలుకువ వచ్చేసింది.

టిక్... టిక్... టిక్...

తిరిగి వినిపించింది తలుపు తట్టిన శబ్దం. ఎవరై వుంటారు? తనకోసం వచ్చేవాళ్ళు ఎవరూ లేరు. మధ్యలో లేపవద్దని రూమ్ సర్వీసింగ్ బాయ్‌కి ముందే చెప్పాడు. మరి ఎవరై వుంటారు?

టిక్... టిక్... టిక్...

చంద్రం మంచం మీదనుండి లేచి లుంగీ సర్దుకుని తలుపు దగ్గిరికి వెళ్ళాడు. వంటిమీద బనియన్ లేదు. శరీరం కండలు తిరిగి కనిపిస్తోంది. నల్లటి వెంట్రుకలతో ఛాతీ విశాలంగా వుంది. ఆ స్థితిలో చంద్రాన్ని ఎవరు చూసినా జంకుతారు.

చంద్రం తలుపు తెరిచాడు.

గుమ్మం అవతల ఒక వ్యక్తి నిలుచున్నాడు. అతను నల్లగా, లావుగా వున్నాడు వైట్ షర్ట్, పాంట్ వేసుకున్నాడు.

అతన్ని చూసి ఆశ్చర్యపోయాడు చంద్రం.

అతను హెడ్ కానిస్టేబుల్.

"నా పేరు వడ్డీ కాసులు. నీతో పనుండి వచ్చాను" చెప్పాడు కరుకుగా.

"రండి..." అన్నాడు చంద్రం. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ప్రతి వ్యక్తి గొంతు అలానే వుంటుంది కాబోలు అని మనసులో అనుకున్నాడు చంద్రం. అతని మస్తిష్కం తీవ్రంగా ఆలోచిస్తున్నది. వేళకాని వేళలో ఒక హెడ్ కానిస్టేబుల్ తన రూమ్‌కి రావటంలోని ఆంతర్యం ఏమయి వుంటుంది.

"నీకు తెలుసుననుకుంటా! నేను తలజవాన్ని" కుర్చీలో కూర్చుని అన్నాడు.

"తలజవానా?" ఆశ్చర్యపోయాడు చంద్రం దాని అర్థం తెలియక.

"హెడ్ కానిస్టేబుల్‌కి తెలుగు అనువాదం. ఈమధ్య మన ముఖ్యమంత్రిగారు తెలుగులోనే మాట్లాడమంటున్నారు కదా! నేను ఆయన అభిమానిని..."

"అభిమానమా?"

"అదే చెప్పబోతున్నాను, పార్టీ అభిమానం. మాకు రాజకీయ పార్టీతో సంబంధాలు వుండకూడదనే ఆలోచన రానివ్వకు. ఎందుకంటే, మాకు కూడా ఓటు హక్కు వుంది. అందుచేత అవసరమైనప్పుడు అధికార పక్షం ప్రముఖుల సహాయం తీసుకుంటాం."

"ఇంతకీ మీరు వచ్చిన పని..." అడిగాడు చంద్రం. అప్పటికే నిద్రమత్తు పూర్తిగా ఎగిరిపోయింది. ఈ రోజన్నా హాయిగా పడుకోవాలని అనుకుంటే మధ్యలో వచ్చి చెడగొట్టేసాడు.

"అదే చెప్పబోతున్నాను... నీకు భారతీయ శిక్షాస్మృతి గురించి తెలుసా?"

"తెలియదు" మనసులో ప్రవేశించిన విసుగు పైకి కనిపించకుండా జాగ్రత్తపడుతూ అన్నాడు.

"దానినే ఇండియన్ పీనల్‌కోడ్ అంటారు ఇంగ్లీషులో. అందులో ఐదు వందల పదకొండు సెక్షన్లు వున్నాయి. మొన్న నువ్వు ఇండియన్ పీనల్‌కోడ్ సెక్షన్ 153 ప్రకారం జైలుశిక్ష అనుభవించావు."

"అవును."

"సాధారణంగా ఇండియన్ పీనల్‌కోడ్‌లోని సెక్షన్లు మొత్తం తెలిసిన పోలీస్ డిపార్ట్‌మెంట్ వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కడే వున్నాడు"

"ఎవరు?" అనాలోచితంగా ప్రశ్నించాడు చంద్రం.

"నేనే" చెప్పాడు చిద్విలాసంగా నవ్వుతూ. అతను మాట్లాడుతుంటే కళ్ళు సగానికి పైగా మూతపడి ఎదుటి వాడికి చెప్పటంలో అతనికి గల ఉత్సాహాన్ని తెలియజేస్తున్నాయి.

"ఇంతకీ మీరు నా దగ్గరికి ఎందుకు వచ్చారు?" సాధ్యమైనంత సౌమ్యంగా అడిగాడు చంద్రం.

"అదే చెప్పబోతున్నాను... నాకు అర్జంటుగా వంద రూపాయలు కావాలి." చెప్పి చిన్నగా నవ్వాడు.

చంద్రం మనసులోకి కోపం ప్రవేశించింది. దానిని పైకి కనిపించకుండా అన్నాడు.

"ఇవ్వకపోతే?"

"అదే చెప్పబోతున్నాను. ఇండియన్ పీనల్‌కోడ్ సెక్షన్ 353 ప్రకారం నిన్ను అరెస్టు చేస్తాను. సెక్షన్ 353 ఏం చెబుతున్నదంటే, ఒక ప్రభుత్వ ఉద్యోగిపై దౌర్జన్యంచేసి అతని విధులకు ఆటంకము కలుగజేసిన యెడల 2 సంవత్సరముల జైలుశిక్ష లేక జరిమానా లేక రెండూ."

"అన్యాయం. నేను మీ విధులకు అడ్డువచ్చానా?" అడిగాడు చంద్రం అమాయకంగా.

"నిజం మన యిద్దరికే తెలుసు కనుక మనం అన్యాయం అనుకుంటాం. కాని నాలుగు గోడల మధ్య వున్న న్యాయస్థానానికి తెలియదు కదా! దానికి సాక్ష్యం కావాలి. ఆ సాక్ష్యం నేను సృష్టించగలను. ఒకవేళ నువ్వు తెలివి గలవాడవైతే శిక్ష పడకుండా తప్పించుకోవచ్చు. దానికి ప్లీడరు ఖర్చులు ఐదు వందలు. పది రోజులు సమయం పడుతుంది" చెప్పాడు పెదవులమీద నవ్వు చెరగకుండా.

చంద్రం రెండు క్షణాలు అతని వంక చూస్తూ వుండిపోయాడు.

ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా లేచి షర్టు పాకెట్ నుండి వందనోటు తీసి అందించాడు. హెడ్ కానిస్టేబుల్ దాన్ని అందుకుని జేబులో పెట్టుకుని వెళ్ళటానికి గది బయటకి నడిచాడు.

"మీకు డబ్బు అంత అవసరం ఏమొచ్చింది?" తలుపు మూయ్యటానికి సిద్ధపడుతూ చివరగా ప్రశ్నించాడు.

"అదే చెప్పబోతున్నాను. నా పెళ్ళం గయ్యాళి. అనవసరంగా డబ్బు ఖర్చుపెడతానని నా జేబులో ఒక్క పైసా కూడా వుండకుండా జాగ్రత్తపడుతుంది. చాలా కాలంనుండీ బస్‌స్టాండ్‌లో అడుక్కుంటున్న బిచ్చగాడి భార్యకి నొప్పులువస్తే గంట క్రితం హాస్పటల్‌లో జాయిన్‌చేశాను. డాక్టర్ మందులు తెమ్మని చీటీ యిచ్చాడు. సమయానికి నువ్వు గుర్తొచ్చి వచ్చాను..."

"నేను ఇక్కడ వున్నానని మీకు ఎలా తెలుసు?"

"అదే చెప్పబోతున్నాను. నువ్వు జైలు నుండి ఈరోజు విడుదల అవుతావని మాకు తెలుసు. రేపు నీమీద మరొక కేసు బనాయించటానికి మా యస్.ఐ. నీ ఎడ్రసు తెలుసుకున్నాడు. ఇప్పటికే ఆలస్యమయింది. వస్తాను..." అని వెళ్ళిపోయాడు.

చంద్రం ఆలోచిస్తూ బాల్కనీలోకి వచ్చి నిలుచున్నాడు. తను వీలైనంత తొందరలో ఇక్కడనుండి బయట పడకపోతే మరోసారి జైలు జీవితం రుచి చూడాల్సొంటుంది మనసులో అనుకున్నాడు. బయటికి చూస్తూ అప్పటికే బస్‌స్టాండ్‌లో చాలావరకూ సందడి తగ్గిపోయింది. షాపులు కూడా మూసేస్తున్నారు. చకచకా నడుచుకుని వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ వడ్డీ కాసులు కనిపిస్తున్నాడు.

అతను మందులషాపు ముందున్న మెట్లు ఎక్కి లోపలికి వెళ్ళాడు. జేబులోంచి చీటీ తీసి షాపు అతనికి ఇచ్చాడు.

◆ ◆ ◆

తెల్లవారుఝామున ఐదు గంటలయింది సమయం. ఇంకా మసకచీకట్లు పరుచుకొని వున్నాయి ప్రకృతిని. చంద్రం లాడ్జి బాల్కనీలో నిలుచుని బస్‌స్టాండ్ వంక వాల్తేరు బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు. నాలుగు గంటలకే లేచి పనులు ముగించుకొని సిద్ధంగా వున్నాడు. ఇప్పుడు అతని రూపం పూర్తిగా మారిపోయింది. మాసిపోయిన బట్టల స్థానంలో స్నో కలర్ వైట్ డ్రస్ వుంది. కళ్ళకి గాగుల్స్ వున్నాయి. నీట్‌గా వున్నాడు. చేతికి కట్టు మాత్రం యధాప్రకారం వుంది. వారం రోజులు జైలులో వుండటంవల్ల దానికి మందు వెయ్యకపోవడంచేత అది మానలేదు.

మలుపు తిరిగి బస్సు రావటం కనిపించింది.

చంద్రం మేడ దిగి కౌంటర్ వద్దకు వచ్చాడు. అతని చేతిలో బ్రీఫ్‌కేస్ వుంది. ఎటువంటి సామాను లేకుండా లాడ్జికి వెళితే అనుమానిస్తారని దానిని కొన్నాడు. మొదటిసారి రూమ్‌కోసం వచ్చినపుడు వున్న వ్యక్తే కౌంటర్‌లో వున్నాడు. అతని కళ్ళల్లో ఆశ్చర్యం ప్రత్యక్షమయింది. అదేమీ పట్టించుకోకుండా రూమ్ తాళాలు కౌంటర్ మీద పెట్టాడు చంద్రం.

అతను రిజిష్టర్ తీసి బ్యాలెన్స్ తిరిగి చంద్రానికి ఇచ్చేసాడు. చిన్న నవ్వొకటి అతని వైపు విసిరి బయటకి వచ్చాడు. తిన్నగా బస్‌స్టాండ్‌లోకి ప్రవేశించి బస్సు ఎక్కబోతున్నపుడు వినిపించింది.

"టిక్కెట్ తీసుకుని ఎక్కండి..."

తల తిప్పి చూశాడు చంద్రం. ఒకప్రక్క కండక్టరు నిలబడివున్నాడు. అతని దగ్గిర టిక్కెట్ తీసుకొని బస్సెక్కాడు. ముగ్గురు కంటే ఎక్కువ లేరు లోపల. కొన్ని సీట్లలో బ్యాగ్‌లు పెట్టివున్నాయి. ఖాళీగా వున్న టూ సీటర్‌లో కూర్చుంటూ ప్రక్క నున్న త్రీ సీటర్‌లో ఒక ఎయిర్ బ్యాగ్ పెట్టి వుండటం చూశాడు. సీట్లు బుక్ చేసుకుని కొంతమంది క్రిందకు దిగివుంటారని చంద్రం గ్రహించాడు.

తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు.

ఒక్కొక్కరు బస్సు ఎక్కుతున్నారు. కళ్ళు తెరవకుండా శబ్దాన్ని బట్టి గ్రహిస్తున్నాడు చంద్రం. కొంతసేపటికి చాలామంది ఎక్కారు. చంద్రం ప్రక్క నున్న సీట్లో కూడా ఎవరో వచ్చి కూర్చున్నారు.

అంతలో ఒక కుర్రవాడు గబగబా బస్సు ఎక్కాడు. అతనికి పదిహేను సంవత్సరాలు కంటే ఎక్కువ వుండవు. అతను ఒకమారు ప్రయాణీకుల్ని పరీక్షించి చంద్రం ప్రక్క నున్న త్రీ సీటర్‌లో కూర్చున్న యువకుడ్ని అడిగాడు.

"ఇందాక కొబ్బరిబొండం తాగింది నువ్వేనా?"

"అవును." అన్నాడు అతను. అతనికి పద్దెనిమిది సంవత్సరాలు వుండవచ్చును. సన్నగా వున్నాడు. కాస్త అమాయకంగా కనిపిస్తున్నాడు.

"నీకు చిల్లర ఎంతిచ్చాను?"

"పద్దెనిమిది రూపాయలు."

"కాదు. ఇంకా ఎక్కువ ఇచ్చాను."

"లేదు." చెప్పాడతను. అతని గొంతు పీలగా వుంది.

"అబద్ధం ఆడకు... నీకు ఇచ్చాను." చెప్పాడు గట్టిగా, నమ్మకంగా.

"లేదు."

"నువ్వు క్రిందికి దిగు నా కొడకా! నీ అంతు చూస్తాను..." ఆవేశంతో వూగిపోతూ ఆ యువకుడిమీద చెయ్యి వేశాడు.

"లెక్క చూసుకుంటే తెలుస్తుంది కదా! ఎందుకు పోట్లాటకి దిగుతారు. ఒకసారి నీ దగ్గిర డబ్బులు లెక్కచూడు..." చంద్రం ప్రక్కన కూర్చున్న ప్రయాణీకుడు చెప్పాడు మధ్యలో కలుగజేసుకుని.

ఆ యువకుడు వెంటనే జేబులో చెయ్యిపెట్టి కొంత డబ్బు, బస్సు టిక్కెట్టు తీసి చెప్పాడు.

"ఊరు వెళ్ళటానికి మా ఇంట్లో యాభై నోటు ఇచ్చారు. నా దగ్గిర కొంత చిల్లర వుంది. పదమూడు రూపాయలతో బస్ టిక్కెట్టు తీసుకున్నాను. దారిఖర్చులకి చిల్లర కావాలని ఇరవై రూపాయల నోటు ఇచ్చి కొబ్బరిబొండం త్రాగాను." చెప్పాడు.

గొడవలో ఆ యువకుడికే సానుభూతి ఎక్కువగా వుంది. అతని మాటలతో మరింత పెరిగిపోయింది అది. బస్సులోని వారంతా అతనికే సపోర్టు చేస్తున్నారు పరోక్షంగా మనసులో. ఒక స్టూడెంటువంటి యువకుడ్ని బస్‌స్టాండ్‌లో కొబ్బరి కాయలు అమ్ముకునే కుర్రవాడు దబాయిస్తుంటే వూరుకోవటానికి సిద్ధంగా లేరు బస్సు ప్రయాణీకులు.

వీటన్నిటిని చూసిన తరువాత అన్నాడు చంద్రం ప్రక్కన కూర్చున్న ప్రయాణీకుడు.

"నువ్వు ఎవరికో ఇచ్చేసి అతనిమీద పడతావేం. ఇంకెవరికో ఇచ్చివుంటావ్ పో..."

"ప్రొద్దున్నే నేను ఎవరికీ అమ్మలేదండి. ఇతను వచ్చి నన్ను లేపాడు. నిన్న అమ్మిన డబ్బు మొత్తం నిక్కరు జేబులో దాచాను. నిద్రకళ్ళతో అతనికి పద్దెనిమిది రూపాయలు ఎక్కువ ఇచ్చేశాను" అని చెప్పి ఆ యువకుడు వంక తిరిగి "రోజుకి నాలుగు రూపాయలు సంపాదించే నాలాంటి వాడి సొమ్ము తిని బాగుపడదామనుకున్నావ్ రా! క్రిందకి దిగరా నాకొడకా!" అని అరిచాడు. అతని కంఠం నుండి దుఃఖం తన్నుకు రాబోతున్నదని మాటల్లో తెలిసిపోతున్నాయి.

అప్పుడు కళ్ళు తెరిచాడు చంద్రం ఎవరో తన తపస్సుకి భంగం కలిగించినట్టు.

"మిస్టర్..." సీట్లో కూర్చున్న యువకుడ్ని పిలిచాడు చంద్రం. అతని కంఠం బస్సులో మారుమ్రోగింది. ప్రయాణీకులు చంద్రాన్ని చూడటం ప్రారంభించారు.

ఆ యువకుడు చంద్రంవైపు దృష్టి తిప్పి ఏమిటన్నట్టు చూశాడు.

"నీ పేరేమిటి?" సూటిగా అనతి కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు. అది కత్తిలాంటి చూపు కళ్ళనుండి దూసుకెళ్ళి మెదడులో ప్రవేశించి అక్కడ ఏం జరిగిందో తెలుసుకుంటున్నట్టు ఎదుటవాడిని కట్టిపడేసే చూపు.

"రాధాకృష్ణ"

"ఏం చదివావ్?" వెంటనే ప్రశ్నించాడు ఆలోచించటానికి వ్యవధి ఇవ్వకుండా. చంద్రం ప్రక్కన కూర్చున్న ప్రయాణీకుడు ఆసక్తిగా చూస్తున్నాడు.

"ఇంటర్..."

"మీరు లక్షాధికారులా?" నిజానికి ఆ ప్రశ్న అడగాల్సిన పనిలేదు. అతన్ని చూస్తుంటేనే తెలుస్తోంది, మధ్యతరగతి వాడని. కండక్టర్‌తో సహా అందరూ చంద్రాన్నే చూస్తున్నారు. వాళ్ళలో టెన్షన్ పెరిగిపోయింది. ఏదో జరుగుతుందనేది అందరికీ తెలిసిందే. అదేమిటనేదే ప్రశ్న?

బస్సులోని వ్యక్తుల విభిన్న అభిప్రాయాలమీద బాంబ్ పడినట్టు దూసుకువచ్చాయి మాటలు చంద్రం నోటినుండి.

"అతను నీకు ఎక్కువ ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేయ్..."

"అది... ..."

"సమాధానం చెప్పొద్దు నువ్వు ఎక్కువ మాట్లాడటంవల్ల ఉపయోగం ఏమిటంటే సాక్ష్యాలతోసహా ఇంతమందిలో నిరూపించబడటం." ఖంగుమంది చంద్రం గొంతు.

అతను రెండు క్షణాలు తటపటాయించి జేబులోంచి డబ్బులు తీసి ఆ కుర్రవాడికి ఇచ్చాడు. వాటిని చూడగానే కుర్రవాడి మొహం వికసించింది. రోజంతా కొబ్బరిబొండాలు అమ్మితే ఐదు రూపాయలు రావటం కష్టం, అటువంటి స్థితిలో పద్దెనిమిది రూపాయలు అతనికి భరించలేని బరువు.

చంద్రం తిరిగి కళ్ళు మూసుకున్నాడు తపస్సులోకి వెళ్ళిపోయినట్టు.

అక్కడ ఏర్పడిన గందరగోళం సర్దుకుని బస్సు బయలుదేరటానికి పావుగంట పట్టింది. చంద్రం మాత్రం కళ్ళు విప్పలేదు. ఒక ఊరులో బస్సు దిగి కాఫీ త్రాగి వచ్చి తిరిగి కళ్ళు మూసుకున్నాడు.

బస్సు విశాఖపట్టణం చేరేసరికి పన్నెండు దాటిపోయింది. కాంప్లెక్స్‌లో బస్సు దిగి జనాన్ని తప్పించుకుని బయటకి వచ్చాడు చంద్రం.

"ఏమండీ..." ఎవరో పిలిచినట్టయి వెనక్కి తిరిగాడు చంద్రం. చంద్రం ప్రక్కన కూర్చున్న ప్రయాణీకుడు.

"ప్రొద్దుట ఆ యువకుడు అబద్ధం చెప్పాడని ఎలా తెలుసుకున్నారు?" చంద్రాన్ని సమీపించి అడిగాడు. ఆ సంఘటన జరిగిన తరువాత చాలామంది అతన్ని అడిగి తెలుసుకోవాలని అనుకున్నారు. కాని తపస్సులోకి వెళ్ళిపోయినట్టు అతను కళ్ళు మూసి మరి

తెరువలేదు. ప్రక్క ప్రయాణీకుడు అవకాశంకోసం చూసి చివరకు అక్కడ పట్టుకున్నాడు చంద్రాన్ని.

"చాలా సింపిల్. అతనికి ఇంట్లో యాభై నోటు ఇచ్చారని అన్నాడు. ఇరవై రూపాయల నోటు మార్చడానికి కొబ్బరిబొండాల కుర్రవాడి దగ్గరికి వెళ్ళాడు. అంటే అప్పటికే పదమూడు రూపాయలతో టిక్కెట్ తీసుకునివుండాలి. అటువంటప్పుడు చిల్లర మార్చాల్సిన పనేమిటి ముప్పై ఏడు రూపాయలు దగ్గిర వుండగా? తన దగ్గిర యింకా డబ్బులున్నాయని అంటున్నాడు తప్ప ఎంత వున్నాయో చెప్పలేదు. మధ్యతరగతి కుర్రవాడికి తన జేబులో ఎంత వుందో తెలియని స్థితిలో వుంటాడా?" చెప్పి ఆగకుండా వెళ్ళిపోయాడు.

అది అర్థంచేసుకునేసరికి చంద్రం చాలా దూరం వెళ్ళిపోయాడు. నిశ్చయంగా అతను చాలా తెలివైనవాడు. తనలో తను అనుకుంటూ కదిలాడా ప్రయాణీకుడు.

చంద్రం దగ్గిరలోని లాడ్జికి వెళ్ళి రూమ్ తీసుకుని అందులో కొంతసేపు ఆలోచిస్తూ కదలకుండా వుండిపోయాడు.

అతను తెలివైనవాడు కదా!

మధ్యాహ్నం మూడు దాటిన తరువాత రిసెప్షన్ నుండి డైరెక్టరీ తెప్పించుకుని 65718 నెంబరు ఎవరిదో చూడటం ప్రారంభించాడు. మహాసముద్రం వంటి డైరెక్టరీలో ఆ నెంబరు పట్టుకునేసరికి గంట పట్టింది. ఆ నెంబరు ఒక పోలీస్ క్వార్టర్‌ది.

ఫోన్ అందుకుని ఆ నెంబర్‌కి రింగ్ చేశాడు.

"హల్లో!" వినిపించింది అటునుంచి.

"లోహియాగారున్నారా?" అడిగాడు చంద్రం.

"ఇది యిన్‌స్పెక్టర్‌గారి క్వార్టర్..."

"ఆయన పేరు లోహియా కాదా?"

"కాదు."

"లోహియా పేరుగల వాళ్ళు ముందు లేరా?"

"లేరు."

రెండు క్షణాలు ఆలోచించి, "ఇప్పుడున్న యిన్‌స్పెక్టర్‌గారు ఎంత కాలంనుండి వుంటున్నారు?" అడిగాడు.

"నెల రోజులు."

"ముందున్న యిన్‌స్పెక్టర్‌గారి పేరేమిటి?"

"సుధీర్. ప్రమోషన్‌మీద వెళ్ళారు."

ఏ వూరు వెళ్ళారని అడగలేదు చంద్రం. ఆ యిన్‌స్పెక్టర్ సుధీర్‌కు తను రెండు నెలల క్రితం ఫోన్‌చేసి చమన్‌లాల్ విషయం చెప్పానని తెలుసు. ఆ కేసువల్లనే ప్రమోషన్ వచ్చివుండాలి. ఫోన్ పెట్టేశాడు.

మళ్ళీ డైరెక్టరీ తిరగేసి ఒక నెంబరు తిప్పాడు.

"పి.ఎ. టు యస్.పి. మాట్లాడుతున్నాను."

"నేను ఈ వూరికి కొత్తగా వచ్చాను. లోహియాగారు ఎక్కడ వుంటారో చెబుతారా?"

"ఏ లోహియా?"

"కె.ఎస్. లోహియా."

"పోలీసు ఆఫీసరా?"

"తెలియదు. నేను యింట్లో లేనప్పుడు మా అమ్మమ్మకి చీటి వ్రాసి యిచ్చారట. అందులో వూరు, ఫోన్ నెంబరు మాత్రమే వున్నాయి. ఆ ఫోన్ నెంబర్ యిన్‌స్పెక్టర్ క్వార్టర్‌ది. అందులో లోహియాగారు లేరు."

"కాసేపు లైనులో వుండు కనుక్కుని చెబుతాను."

రెండు నిముషాల తరువాత వినిపించింది.

"కె.ఎస్. లోహియానే అందరూ సుధీర్ అని పిలుస్తారు. ప్రమోషన్‌మీద శ్రీకాకుళం వెళ్ళారు."

"సుధీర్ అనేది అతని మారుపేరా?"

"కాదు. అతని పేరులో ఒక ముక్క. సెంటిమెంట్ కోసం దానినే చెప్పుకుంటాడు." చెప్పాడు పి.ఎ.

"థ్యాంక్స్." చెప్పాడు చంద్రం.

నాలుగు గంటలు పూర్తిగా గడవకముందే రూమ్ ఖాళీచేశాడు చంద్రం. తిన్నగా సూపర్ బజార్‌కి వెళ్ళి ఒక వస్తువు కొనుక్కుని బస్‌స్టాండ్‌కి వచ్చాడు. అక్కడ నుండి గంట గంటకి నాన్ స్టాప్ బస్సులు వున్నాయి శ్రీకాకుళానికి.

కౌంటర్‌లో టిక్కెట్ తీసుకుని బస్సెక్కి కూర్చున్నాడు. ఎవరూ చూడకుండా తను తెచ్చిన వస్తువు భద్రంగా దాచాడు.

◆ ◆ ◆

విశాలమయిన స్థలంలో నిర్మించబడిందా బంగళా. దాని చుట్టూ నాలుగడుగుల ఎత్తులో ప్రహరీగోడ. లోపల నానారకాల చెట్లు విచ్చలవిడిగా పెరిగివున్నాయి. అవి ఒక క్రమంలో పెంచినట్టు కనిపించటంలేదు. ప్రహరీకి లోపల బంగళాకి మధ్య యాభై గజాల దూరం వుంది. ఆ దూరానికి మట్టితో రోడ్డు నిర్మించబడి వుంది.

బంగళా చుట్టూ చీకటి నాట్యమాడుతోంది. ఊరు చివర కట్టిన గవర్నమెంటు బంగళా అది. బంగళాలో ఒక లైటు కూడా వెలగటంలేదు. ఎక్కడా అలికిడి వినిపించటంలేదు. ఆ బంగళా ఊరికి రెండు వందల గజాల దూరంలో వుంది. అక్కడ నుండి ఊళ్ళోని దీపాల కాంతి కనిపిస్తోంది.

దాదాపు మూడు గంటల నుండి దాని వంక చూస్తున్నాడు చంద్రం. మూడు గంటల కాలంలో ఒక జీప్ వచ్చి వెళ్ళింది. తనకి కావల్సిన వ్యక్తి లోపలే వున్నాడని చంద్రానికి తెలుసు. కాని అక్కడి వాతావరణం చంద్రానికి అనుమానం కలిగించింది. అందుకే కదలకుండా నిలబడి చూస్తున్నాడు చెట్టు చాటునుండి. ఎంతసేపు చూసినా తన అనుమానానికి ఆధారం లభించలేదు.

బంగళా ప్రశాంత వాతావరణంలో ఏదో అపశృతి. తుఫాన్ ముందు ప్రశాంతతలా!

చెట్టు చాటునుండి కదిలి కాంపౌండ్ వాల్ సమీపించాడు. కొంతసేపు అక్కడ నిలబడి చెవులు రిక్కించి విన్నాడు. ఎటువంటి అలికిడి వినిపించలేదు. నెమ్మదిగా గోడమీద చేతులువేసి లోపలకి దూకాడు.

గుండె ఝల్లుమంది. పద్మవ్యూహంలోకి ప్రవేశిస్తున్న అనుభూతి. అయినా తప్పదు. ఇప్పటికే కావాలని చాలా ఆలస్యంచేశాడు. ఇంకా సమయంకోసం ఎదురుచూసే ఓపిక లేదు. రెండు అడుగులు వేశాడు. కాళ్ళ క్రింద ఎండుపుల్ల "ఫట్" మని విరిగింది నిశ్శబ్దంగా మోకాళ్ళమీద కూర్చుండిపోయాడు. కొంతసేపు చూశాడు. ఏ విధమైన చప్పుడు వినిపించలేదు. ఈమధ్య తనకి అనుమానాలు ఎక్కువయ్యాయి. మనస్సులో అనుకుంటూ లేచి అడుగులు వెయ్యటం ప్రారంభించాడు. బంగళా తలుపులు దగ్గిరికి వెళ్ళాలి. తలుపులకి పదడుగుల దూరం వరకూ నడిచాడు.

ఒక్కసారి ఆ ప్రాంతమంతా వెలుగుతో నిండిపోయింది. ఆ కాంతికి చప్పున కళ్ళు మూసుకున్నాడు చంద్రం. కొన్ని క్షణాల తరువాత నెమ్మదిగా తెరిచి చూశాడు. బంగళా ఆవరణ మొత్తం ఫ్లడ్‌లైట్లు అమర్చబడి వున్నాయి. రెండు గజాలకి ఒకరు చొప్పున తుపాకులతో పోలీసులు నిలబడి వున్నారు. చంద్రానికి అర్థమయింది సతీష్ తొందరలోనే హంతకుడ్ని పట్టుకోగలడనే నమ్మకం వ్యక్తపరిచిన ఎడిటర్ వ్రాతలోని మర్మం. ఇంకో విషయం కూడా అర్థమయింది. లోహియా ఎడ్రస్సు అడిగితే వెంకట్రావ్ తనకి చెప్పివుండేవాడని. ఇప్పుడు తను నిజంగానే పద్మవ్యూహంలో చిక్కుకున్నాడు.

"చంద్రం! చేతిలోని రివాల్వర్ వదిలేసి చేతులు ఎత్తు..."

వెనక్కి తిరిగాడు చంద్రం. రివాల్వర్ పట్టుకుని వున్నాడు సతీష్. అతని వంక గౌరవపూర్వకంగా చూశాడు చంద్రం. రెండు నెలల పరిశోధనచేసి తను ఎక్కడికి వస్తాడో వూహించి అక్కడ విసుగు విరామం లేకుండా తనకోసం ఎదురుచూడటం సామాన్య విషయం కాదు. కొందరుంటారు కర్తవ్యంకోసం అన్నీ వదులుకునే వాళ్ళు. అతనికున్న నిజాయితీ మిగిలిన వాళ్ళకుంటే కన్నాపురం లాడ్జిలోనే పట్టుకుని వుండేవాళ్ళు.

"నాకోసం శ్రమపడనక్కర్లేదు. నేనే లొంగిపోతాను..." చెప్పాడు చంద్రం చేతిలోని రివాల్వర్ వదలకుండా.

తన ముందున్న యువకుని శక్తి సామర్థ్యాలు సతీష్‌కి తెలుసు. అతని గురించి వెంకట్రావ్ ద్వారా వినటంచేత మనసులో కాస్త సానుభూతి వుంది.

"నాకు తెలుసు మిష్టర్ చంద్రం! ఎప్పటికయినా యిక్కడికి వచ్చి మాకు దొరికిపోతావని. పెద్దపులికోసం వేటగాడు అడవిలో తిరగడు. అది ఎక్కడికి వస్తుందో జాడ తెలుసుకుని అక్కడ మాటువేస్తాడు..." కేసులో విజయం సాధించిన సంతోషం కొన్ని నిమిషాలు అజాగ్రత్తని తెచ్చిపెట్టింది.

బంగళా తలుపులు తెరుచుకున్నాయి. గుమ్మంలో వచ్చి నిలుచున్నాడు కృష్ణ సుధీర్ లోహియా. అతను నైట్ డ్రెస్‌లో వున్నాడు. అప్పుడే నిద్రలేచినట్టు మందంగా కనిపిస్తున్నాడు. ఎర్రగా, లావుగా వున్నాడు. అతని పొట్ట ఎత్తుగా కనిపిస్తోంది.

"మిష్టర్ సతీష్! నన్ను చంపటానికి వస్తాడనుకున్న వ్యక్తి ఇతనేనా?" అధికారపూర్వకంగా అడిగాడు.

"యస్ సార్!"

"గుడ్ జాబ్" సతీష్ వంక ప్రశంసాపూర్వకంగా అన్నాడు. మృత్యుముఖం నుండి తప్పించుకున్నవాడిలా మోహంలో సంతోషం వచ్చి చేరింది. గత కొద్ది రోజులుగా అతనికి మనశ్శాంతి లేదు. ఎటునుండి వచ్చి పడుతుందో తెలియని మృత్యువు ఒక్కసారిగా తప్పిపోయినట్టు తృప్తిగా ఊపిరి పీల్చాడు. చంద్రానికి చుట్టూ నిలుచున్న మనుషుల్లో కూడా ఆనందం కనిపిస్తోంది. నెల రోజుల నుండి అతి జాగ్రత్తగా కాపలా కాస్తున్నందువల్ల వాళ్ళకి విశ్రాంతి లేదు.

ఆ వాతావరణాన్ని చిన్నాభిన్నంచేస్తూ అప్పుడు వినిపించింది. చంద్రం కంఠం ఉరిమినట్టు.

"మిస్టర్ లోహియా! నిన్ను చంపకుండా నన్ను ఇక్కడనుంచి ఒక్క అంగుళం కూడా కదపలేరు. నీలాంటి మృగాలు మనుషుల మధ్య వుండకూడదు. నీ చరిత్ర ఈ నిముషంలో ముగిసింది..."

అక్కడున్న వాళ్ళంతా ఉలిక్కిపడ్డారు సతీష్‌తో సహా. తమకి దొరికిపోయిన వ్యక్తిలోని నమ్మకం ఏమిటో అంతుచిక్కలేదు.

"చంద్రం! కదలొద్దు..." హెచ్చరించాడు సతీష్ రివాల్వర్ గురిపెడుతూ, మిగతా వాళ్ళుకూడా తుపాకులు ఎత్తి సేఫ్టీ క్యాచ్ ముందుకి తోసి, బోల్ట్ వెనక్కి లాగి ముందుకి తోశారు. పాయింట్ త్రీ నాట్ త్రీ రైఫిల్ తూటాలు ఛాంబర్‌లోకి ఆటోమేటిక్ యాక్షన్‌లో కూర్చున్నాయి. ట్రిగ్గర్ నొక్కితే చాలు బారెల్ నుండి వెలువడిన తూటా శరీరాన్ని జల్లెడ మాదిరి చీలుస్తుంది.

ఆ మాటలు, వాళ్ళ కదలికలు చంద్రం పట్టించుకోవటంలేదు. అతడి కుడి చెయ్యి రివాల్వర్‌తో పాటు పైకి లేచింది.

"చంద్రం! చివరిసారిగా హెచ్చరిస్తున్నాను. రివాల్వర్ వదిలేయ్..." అరిచాడు సతీష్. తుపాకులతో నిలబడివుండగా చంద్రం ఏమీ చెయ్యలేడనే నమ్మకం ఎటువంటి పరిస్థితులు సృష్టించబోతుందో గ్రహించేసరికి శరీరం మీద వెంట్రుకలు లేచి నిలుచున్నాయి.

చంద్రం కుడి చెయ్యికి ఎడమ చెయ్యి కలిసింది. రివాల్వర్ తిన్నగా లోహియా గుండెలకి గురిపెట్టబడింది. చంద్రం దృష్టి పథం నుండి చుట్టూ వున్న మనుష్యులు మాయమయ్యారు. చేతిలోని రివాల్వర్ బారెల్ లోహియా గుండెలు మాత్రమే కనిపిస్తున్నాయి. చంద్రానికి తెలుసు తన ప్రాణాలు కొన్ని క్షణాల్లో పోతాయని. ఈ ప్రయత్నంలో లోహియా తప్పించుకుంటే మరో అవకాశమనేది వుండదు. తరువాత ఏం జరిగినా ముందు లోహియా ప్రాణాలు తియ్యగలిగితే చాలు.

అతను తనకంటే ముందు చావాలి.

చంద్రం చేతిమీద కాల్చటానికి సతీష్‌కి అవకాశం లేదు. అతను వెనక్కి తిరిగి వున్నాడు. మిగతా వాళ్ళు తుపాకులు ఎత్తినా స్వంతంగా నిర్ణయం తీసుకుని వాళ్ళు కాల్చరు బ్లడీ డిసిప్లిన్!

"లోహియా! పదకొండు సంవత్సరాల క్రితం నా తల్లిని మానభంగంచేసి ప్రాణం తీసావ్. దానికి మూల్యంగా ఇంతవరకూ క్షోభతో తిరుగుతున్న నా తల్లి, ఆత్మశాంతికి నీ ప్రాణాలు తీసుకుంటున్నాను..."

"ఫైర్!" అరిచాడు సతీష్ కంగారుగా.

చంద్రం చేతిలోని రివాల్వర్ పేలింది. దాని వెంటనే తుపాకులు పేలటం ప్రారంభమయింది.

తూటాలు చంద్రం శరీరాన్ని చీల్చుకుపోతున్నాయి. ఒక్కొక్క తూటా దూసుకుపోతుంటే అతని శరీరం చిన్నగా వణుకుతోంది. అయినా అతను ఒక్కడుగు వెనక్కి వెయ్యలేదు.

రివాల్వర్‌లోని తూటాలు మొత్తం కాల్చేశాడు. రివాల్వర్ పట్టుకున్న చేతులు నెమ్మదిగా విచ్చుకున్నాయి. గుప్పెళ్ళ మధ్యనుంచి రివాల్వర్ జారి క్రింద పడి ఖంగుమని శబ్దం చేసింది. ఆ వెంటనే దబ్బున క్రిందకి జారిపోయాడు చంద్రం.

లోహియా నవ్వుతూ చూశాడు. మొహానికి పట్టిన చమట తుడుచుకుని, చంద్రం రివాల్వర్ పేలేసరికి అతను ముందు కంగారుపడ్డాడు కాని రివాల్వర్ నుండి రావాల్సిన తూటా అతనికి తగలకపోవడమే కాకుండా గోడకి తగిలిన శబ్దం కూడా వినిపించలేదు. అన్ని సంవత్సరాల అనుభవంతో ఎదుటి వ్యక్తి చేతిలోనిది పనికిరాని పిస్టల్ అని తెలుసుకున్నాడు.

నిజం కూడా అంతే!

కుమార్ నారాయణ్ తన తమ్ముడి కొడుకుకోసం తీసుకెళ్ళుతున్నాడా పిస్టల్. అది విదేశాల నుండి వచ్చింది. నిజమైన పిస్టల్‌కి దానికి మధ్య ఎటువంటి తేడా కనిపించదు. దానిలాగే మంట, శబ్దం వస్తుంది. బుల్లెట్ మాత్రం బయటకి రాదు.

చంద్రం నేలమీద బోర్లా పడివున్నాడు, మొహం నిండా దుమ్ము అంటుకుంది. అతను పడివున్న చోట రక్తం మట్టిలో కలిసిపోయి ఎర్రగా కనిపిస్తుంది. ఐదారు తూటాలు చంద్రం శరీరంలోనికి దూసుకుపోయాయి. ఆ రంధ్రాల నుండి రక్తం ధారలా కారుతోంది.

"ఇతని శవాన్ని పోస్టుమార్టమ్ చేయించటానికి హాస్పటల్‌కి తరలించండి. ఎదురుకాల్పుల్లో చనిపోయాడని ప్రకటించండి" లోహియా చెప్పాడు సతీష్‌తో. వాళ్ళు చంద్రం శవానికి నాలుగడుగుల దూరంలో వున్నారు. మిగతావాళ్ళ సంగతి ఎలా వున్నా ముందు వాళ్ళు తేరుకున్నారు.

ఎవరో తట్టి లేపినట్టు చంద్రం నెమ్మదిగా కదిలాడు. శరీరమంతా గునపాలతో పొడుస్తున్నట్టు బాధ. కళ్ళు తెరచి తల ఎత్తకుండా

దృష్టి సారించాడు. ఎదురుగా నిలుచున్న వాళ్ళ ఆకారాలు మసగ్గా కనిపిస్తున్నాయి. కొన్ని క్షణాలు అలా చూసేసరికి లోహియాని గుర్తుపట్టగలిగాడు. శరీరంలో బుల్లెట్లు దిగిన బాధకంటే లోహియా చావలేదన్న వాస్తవం గుర్తించిన తరువాత కలిగిన బాధ మనసుని పిండేస్తోంది. ప్రాణాలు పోతాయని తెలిసి తెగించి లోహియాని చంపటానికి కాల్చిన బుల్లెట్లు ఎటు పోయాయో అర్థంకాకపోయినా, చంద్రం దాని గురించి ఆలోచించటంలేదు. ఎలా జరిగినా లోహియా చావలేదు. తక్షణమే ఏదో చెయ్యాలి.

సతీష్ బంగళా లోపలికి వెళ్ళుతున్నాడు.

చంద్రం తన శరీరం కదల్చటానికి ప్రయత్నించాడు. అది కదల్లేదు. క్షణక్షణానికి ఓపిక తగ్గిపోతోంది. కళ్ళు మసకలు క్రమ్ముతున్నాయి. కళ్ళముందు తల్లి రూపం కదిలింది. అదృశ్యంగా ఎవరో చంద్రాన్ని హెచ్చరిస్తున్నారు. ఎక్కువసేపు అలా వుంటే ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.

పళ్ళ మధ్య నాలిక ఇరికించుకుని గట్టిగా కొరికాడు. ముందుపళ్ళు నాలికలోకి లోతుగా దిగేయి. ఒక్కసారిగా శరీరంలోని నరాలు ఉత్తేజితమయ్యాయి. మెదడును ఆవరించుకుంటున్న మైకం కొద్దిగా సడలింది. కుడి కాలు నెమ్మదిగా ముందుకి జరపటం ప్రారంభించాడు. అది కుడి చేతికి అందుబాటులోకి వచ్చేవరకూ జరిపాడు. ఎడమ చెయ్యి ఛాతీ వరకు తీసుకువచ్చి మోచెయ్యి భూమ్మీద ఆనించాడు.

వేగంగా గాలి తీసుకోవడం ప్రారంభించాడు. చూస్తుండగానే అతని శరీరం కదిలింది. కుడి చెయ్యి తను కొని దాచిన ఆరంగుళాల కత్తిని బూటు నుండి బయటకి తీసింది. ఒక్కసారిగా లేచి ముందుకి పరిగెడుతూ రెండు చేతుల్ని కత్తి పిడిమీద బిగించి పట్టుకుని కన్ను మూసి తెరిచేలోపు లోహియామీద పడ్డాడు. చంద్రం చేతిలోని కత్తి లోహియా కడుపులోకి దూసుకుపోయింది. ఆ కత్తి అలాగే పట్టుకుని క్రిందకి జారిపోయాడు.

“అమ్మా…” అని అరుస్తూ ఎగిరిపడ్డాడు లోహియా.

లోహియా పొట్టని పదంగుళాల మేర చీల్చుకుంటూ క్రిందికి వచ్చింది కత్తి. కడుపులోని ప్రేగులు, రక్తం బయటకి తన్నుకొచ్చాయి.

అంతవరకూ మిణుకుమిణుకుమంటూ కొట్టుమిట్టాడిన ప్రాణం శరీరాన్ని వదలిపెట్టింది తృప్తిగా, పది మాసాలు కని పెంచిన తల్లి ఋణం తీర్చుకున్నట్టు.

అక్కడివాళ్ళు జరిగిన సంఘటన జీర్ణించుకునేసరికే లోహియా ప్రాణాలు పోయి పర్వతంలా దారి ప్రక్క పడి వున్నాడు.

లోపల నుండి పరిగెత్తుకుని వచ్చాడు సతీష్.